


ప్రతీక్ష

— చిత్రకారుడు: జహార్ అలీఖాన్ —

భారతి

సంపుటము 23 | జూలై, 1946 | సంచిక 7
వ్యయ ఆషాఢము

అభ్యర్థన

**

= శ్రీ బొడ్డు బాపిరాజు =

౧

ఆలాపించి భవత్పవిత్రకథ లో యంబా! మధుస్యందినుల్
నాలో లేచు దవాగ్నులన్ హృదయభారం బెల్ల చల్లార్చుకో
జాలన్; నన్ను శతప్రలోభ విషవాంఛల్ దారితప్పింపగా
ఈలో మోహనమూర్తులై దిగిన నిట్టే చిక్కిపోదున్ గదే.

౨

ఏయొకనాటికో తల పొకించుక నీ పదపద్మపీఠులన్
బోయిన సర్వవిఘ్నములు పుట్టునె యాక్షణమందు—స్వామికై
వేయియుగమ్ము లెట్టుల తపించితి వంతటి గాఢదీక్ష కా
త్యాయని! నాకు చిక్కదుగదా తృటినైన మనస్సు కోతినై.

3

బ్రదుకు టెడారి కోరికల బర్వులు మోయుచుఁ బోవు దారిలో
నెదురగు లౌకికవ్యథ లనేకము వేసగివేడిగాడ్పు ల

క్లైద నెరియించు వేళల లభించె సుధాప్రవహోలె నాకు న
య్యది అది యీ కవిత్వ మవునా జననీశ్రవణావతంసమున్?

౪

ప్రాలేయావనిభృత్ప్రశాంత శిఖరావాసంబునన్ స్వామితో
లీలామాధురి నేలు నీ చరణధాత్రిన్ గూర్చి మద్దీన కా
వ్యాలాపామృత వేణికల్ విధృత తీవ్రాశా మరుద్ధూత క
ల్లోలమ్ముల్ పరువెత్తు; నెన్నటికి జేరున్ దూరతద్గమ్యమున్?

౫

అస్థిగముల్ సుఖాదికములందు మన స్సది నిల్చినంత, ని
త్యస్థిరమైన నీ మృదుపదాంబురుహంబున నిల్వ; దెంతదూ
రస్థము లామనోరథము లంతకు నిచ్చిన లెత్తు బుద్ధి వ
క్రస్థితి మాన్ప నీకరుణగాక మహౌషధ మింక నున్నదో!

౬

పాడకొందును శ్రుతిచేసి భావవీణ-మధుమధురమైన నీదు నామమును తల్లి!
గళము గాద్గద్యమున నూగ కనుల నశ్రు-కణములును మేన పులకలు గాగ నెపుడు?



అప్పకవి అఖండయతిని ఒప్పుకొనలేదా?

❀

= శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి =

ఆదిని భీమనయు, నడుమను రామనయు, తుదిని తిమ్మనయు నంగీకరించిన అఖండయతిని అప్పకవి యొప్పుకొనక యనవసరముగా యతుల సంఖ్యను హెచ్చించి, పండ్రెండు విధములైన ఉభయవళులు చెప్పినాఁడనియు, దానిని బురస్కరించుకొని పండితు లఖండయతిని వెలివేసినారనియు నొక ప్రవాదము చిరకాలమునుండి విమర్శకలోకమున నెలకొనియున్నది. కాని యిట్టి యపవాద మా యప్పకవి కంటఁగట్టుట నిర్హేతుకము, నవిచారమూలకమును. ముద్రితములు, నముద్రితములు నగు లక్షణగ్రంథములు పెక్కులు పరిశీలించి లాక్షణికసమ్మతిని సరిజూచుకొనినచో నప్పకవి లేనిపోని యతులను గల్పించినాఁ డనుటగాని, అఖండయతి నంగీకరింపలేదనుటగాని సాహసమాత్రమే యగును.

అఖండయతిస్వరూపము :—పూర్వోత్తరఖండములు గల్గి సమాసాదివృత్తివశమునఁగలుగు సంధ్యాదికార్యములచే నఖండముగాఁ గానవచ్చు పదములలో పరిగణితముగ నచ్చునకు, హల్లునకు యతి చెల్లించిన నది యఖండయతి యగును. ఇట్టి అఖండయతి సార్వత్రికముగాక కొన్నితావులందు మాత్రమే ప్రామాణిక కవులచేఁ బ్రయోగింపఁబడుటచే, నెచ్చట నట్టి యతి గ్రాహ్యమో, యెచట నగ్రాహ్యమో తెలుపుటకే అప్పకవి ఉభయయతులను పరిగణనము చేసినాఁడు. ఇట్టి పరిగణనము విభాగమును గావించినవాఁ డితఁడొక్కఁడే కాఁడనియు, నితనికిఁ బ్రాచీనులగు లాక్షణికులే యీ మార్గము నవలంబించినారనియు, వారి పోకడ ననుసరించియే యీతఁ డిట్టి విభాగమునకుఁ బాల్పడినాఁడనియు, ఇతరలాక్షణికులతోపాటు ఈతఁడును అఖండయతిని సర్వథా అంగీకరించియేయున్నాఁడనియు నీ వ్యాసమునఁ దెలుపఁబూనినాను.

భీమన - అఖండవడి :—తెలుఁగువాఙ్మయమున మొదటి ఛందోగ్రంథ కర్తగా నెన్నఁబడు భీమకవి అఖండయతి నంగీకరించెనా యనునదియే సందేహాస్పదముగఁ గన్పట్టుచున్నది. పరిషత్తువారు ప్రకటించిన కవిజనాశ్రయ మను గ్రంథ మీ భీమనఛందము. దీనికి మాతృకలైన తాటియాకుప్రతు లనేకములు పరిషద్భాండాగారమునఁ గలవు. వానిలో ౩౯౧ సంఖ్య గల ప్రతిలో అఖండవడికి మాఱుగా నిత్యసమాసయతి యుండినట్లు కానవచ్చుచున్నది. అటనున్న క్రమ మిది—

"వ. అందు వళ్ళన్ని స్వరవర్గ సరి ఎక్కటి సంయుక్తాక్షర ప్రాది కాకుస్వర నిత్యసమాస పోలిక అనుస్వార వర్గనంగాఁ బదివిధంబులయ్యె"

అని కలదు. "స్వరవర్గాఖండప్రా" దీత్యాది పద్య మా ప్రతిలో కానరాదు. "మఱియు నిత్యసమాస వళ్లన్ని—

గీ. నాస్తియనఁగ నారాయణానంతబాద
రాయణానేక సిద్ధ రసాయనాదు
లైన నిత్యసమాస పదాఖ్యయతులు
జరుప నీకీర్తిఁ గర్ణరసాయనముగ."

అని యున్నది కాని "మానుగ విక్రమాక్షర సమన్వితమై" ఇత్యాది పద్యము కానరాదు. ఈ విషయమునకు ప్రోద్బలకముగ తాతంభట్టు కవిచింతామణిలో నీ క్రింది వాక్యములు గానవచ్చుచున్నవి:

"భీమన అఖండంబు మొదలైన కొన్నివళులకు లక్షణ లక్ష్యంబులు చెప్పఁడు. ప్రజ్ఞాలవ దుర్విదగ్ధు లసంగతంబుగాఁ జెనచి తగిలించినాఁ; రతని యంకితంబులు లేవుగావున వానిం బ్రమాణింపఁదగదు"

పరిషద్భాండాగారమునందలి కవిజనాశ్రయము వ్రాఁత ప్రతులను బరిశీలింపఁగా నొకదానిని బోలి

చేతొకటి గానరాదు. పెక్కు ప్రతులలో నసంగతంబు లెన్నియో చేరియేయున్నవి. ముద్రితమైన కవిజనాశ్రయములోఁగూడ "మానుగ విశ్రమాక్షర" ఇత్యాది పద్యము కొన్ని వ్రాఁతప్రతులందు మాత్రమే కలదని పుటయడుగున "క. ప. ద. లలో నున్నది" అని సూచించియే యున్నారు. ఇంతియగాక మీఁదఁదెల్పిన ౩౯౧ సంఖ్యగల ప్రతిలో వృత్త లక్ష్యములుదక్క మిగిలిన లక్షణ లక్ష్యములఁ దెలుపు పద్యములన్నియు కందములు, గీతములేగాని వృత్తము లెచ్చటను గానరావు.

మఱియు పొత్తపి వేంకటరమణకవి రచించిన 'లక్షణ శిరోమణి' యను ఛందోగ్రంథమున అఖండయతి ప్రస్తావములో "మానుగ విశ్రమాక్షర..." ఇత్యాది పద్యము పాలుకురికి సోమేశ్వరునిదిగాఁ జేర్కొనఁబడి యీ పద్యమును, దీనితోపాటే క్రింది పాఠాంతరమును నుదాహరింపఁబడినవి.

"మఱి పాఠాంతరమున—

ఉ. మానుగ నింద్రచంద్రగణ
మధ్యమునందు యతిప్రణీతమై
కానఁగఁబడ్డఁ దత్స్వరవి
కల్పముసేయక యక్షరంబ కాఁ
బూన నఖండనామవడి
పాల్పగు నాదికవిప్రణీతమై
భానుసహస్రభాసి నృప
భాధిపుఁ డన్నటు లర్థయుక్తమై."

ఈ పై హేతువులనుబట్టి చూడ భీమన అఖండయతిని చేర్కొనెననుటయే పొసఁగునట్టులు గాన్పింపదు.

ఒకప్పుడు "మానుగ విశ్రమాక్షర" ఇత్యాది పద్యము భీమన కభిమతమైన దనుకొను నఖండయతి స్వరూపమును దెలుపు లక్షణమే యైనచో నందుఁ జేర్కొనఁబడిన 'నృపభాధిప'వంటి యఖండార్థయుక్తములైన పదములందే యీ యతి చెల్లు ననుటచే నట్టి పదము లెప్పుడు నిత్యసమాసములే యగును. ఆ కల్పమున ముందు తెలుపఁబోవు అనంతుఁడు మున్నగు ప్రామాణికలాక్షణికుల లక్షణము లీ పద్యమునకు వివరణరూపములే యగును.

భీమనతరువాతి లాక్షణికులు:— విన్నకోట పెద్దన రచించిన 'కావ్యాలంకారచూడామణి'లోను, కొఱవి గోపరాజకవి 'సింహాసనద్వాత్రింశిక' లోను అఖండయతిని చేర్కొనలేదు. కాని యీ యతికి సంబంధించినవానిని పెద్దన ఆదేశవళి దేశీయవళులలో సంతర్భవింపఁజేసినాఁడు. గోపరాజు నిత్యసమాసవళులనుగా వీనిని చేర్కొనినాఁడు.

అనంతుని మతమున అఖండయతి:— ఇఁక నఖండయతిని చేర్కొనిన లాక్షణికులలో నగ్రగణ్యుఁడగు అనంతామాత్యుఁడు నిత్యసమాసయతినే అఖండయతినిగా వాకొనుచు నిట్లు వివరించియున్నాఁడు:

"నిత్యసమాసయతి—

గీ. పదము విభజించి చెప్పఁ జొప్పడనియవియు
నన్యశబ్దంబు గొని విగ్రహంబుఁ జెప్ప
నవియు నిత్యసమాసమై యతికెయిల్లు
నట్టి సంధుల నచ్చు హల్లైన విరతి.

గీ. నాస్తి యనక మహి ననంతసంపదలు నా
రాయణుం డొసంగు రమ్యముగ ర
సాయనంబు బుధుల కతఁ డన్న నిత్యస
మాసయతులు రెంట నంటియుండు.

వ. ఈ నిత్యసమాసయతియే రఖండయతి.

గీ. అట యజను పోవుటకు నర్థమగుట నట్టి
సంధి నిత్యసమాసోక్తి జరగు వడులు
నసురవీరుల నెల్ల నొక్కట వధించె
భానుకులుఁడు రావణుని దేపఅ ననంగ"

(ఛందోదర్పణము, ౧-౯౯-౧౦౩)

ఈ యుదాహరించిన లక్షణ లక్ష్యములను బరిశీలించినచో సంస్కృత నిత్యసమాసములందును, దేశ్య నిత్య సమాసములందును అచ్చుతోను, హల్లుతోను యతి చెల్లవచ్చుననియు, దానినే అఖండయతి యందురనియు అనంతుని యభిప్రాయమైనట్లు స్పష్టముగఁ దెలియుచున్నది.

ఇఁక నీఛందోదర్పణమున అఖండయతిని ప్రత్యేకముగఁ జేర్కొనిన—

గీ. స్వరప్లుతోభయ వృద్ధ్యనుస్వర వికల్ప
ప్రాద్యభేద సంయుత భిన్న ప్రభువిభాగ
కాకుమాదేశ నిత్యాద్యఖండ వర్గ
చక్కటెక్కటి పోలిక సరసయతులు.
(ఛందో. ౧-౭౧)

ఈపద్యము ప్రక్షిప్తమేగాక యనన్వితము, నలాక్షణికమును. పరిష్కృతనందలి అనంతుని ఛందము తాటియాకుప్రతిలో నీపద్యము లేదు సరిగదా అనంతుఁడొప్పిన యతులు ౧౫ మాత్రమే యనిచూపఁ గలదు. పరికింపుఁడు—

క. స్వరయతులు౧ ప్రాది౨ కాకు
స్వర౩ నిత్యసమాస౪ వర్గ౫ సరసయతులు౬ శ్రీ
ధర! పోలికవడి౭ సంయుత౮
విరతి యనుస్వారయతులు౯ వెస నెక్కటి౧౦ యున్.

క. ప్రభునామాంకిత విరతియు౧౧
విభాగ విరమమును౧౨ భిన్న విశ్రమమును౧౩ కా
స్తుభధర వికల్పయతి౧౪ యన
నభేదవిరమములు౧౫ బదియునైదు తెలియంగన్.

ఈ పద్యము లిట్లుండ ముద్రితమైన ఛందోదర్పణములో పాఠములు మిక్కిలి వ్యత్యస్తములై యున్నవి. అనంతుఁ డంగీకరించిన యతులు పదునైదే యనుట నీక్రింది యముద్రితలక్షణగ్రంథములును స్థిరీకరించుచున్నవి.

"అం బాదిభీమన్నగారి మతంబున యతులు దశవిధము లనఁబడెను. తదనంతరంబ యనంతన్న శ్రీధరాథర్వణాచార్యాదులయిన లాక్షణికదక్షుల లక్షణములఁ బదియేనిరువదినాల్గనఁ జెన్నువహించె" నిత్యాది.
(లక్షణశిరోమణి, యతిప్రకరణము)

"ఈ నలుబదైదుయతులలో పదివే పూర్వం భీమన్నగారు చెప్పిన యతులు ౧౦ న్నీ, అనంతన్నగారు చెప్పినవి ౧౫ న్నీ" ఇత్యాది.
(యతిప్రాసవిలాసము, ౪౦౫-సంఖ్య.)

కావున ననంతుఁ డంగీకరించిన యతులు ౧౫ అనుట నిర్వివాదము. ముద్రితమైన ఛందోదర్పణము నందలి లక్షణములు, లక్ష్యములు నీపదునేనింటికే సరిపడి యున్నవి. ఇది యిట్లుండ అప్పకవి "భీమన పది చెప్పె ననంతామాత్యుఁడు చేసె వెనుక యతు లిరువది నాల్గు" అనుటయు, దాని ననుసరించియే పదునేను యతులను ఇరువదినాల్గుగా విభజించి విమర్శకులు ప్రదర్శించుటయు కడు వింతగఁ దోఁచుచున్నది.

అనంతునిమార్గము ననుసరించిన యితర లాక్షణికులు:—

౧. అథర్వణాచార్యులు—

క. ఆనారాయణ లోకై
కానేకపదమ్ము లచ్చు లక్షరములు రూ
పైన తదక్షరమే వడి
గా నిడిన నఖండనామకం బగుఁ గృతులన్.

౨. వార్త్తికవి రఘునాథయ్యగారు: (లక్షణ) దీపిక—

గీ. ద్వీపవాకనిత్యప్రభుదేశ్యయతులు
వ్యంజనస్వరగూఢస్వరాదియతులు
వృద్ధియతులు నిజాఖ్యల వెలయు నివియు
నగు నఖండము ల్యతులకు హల్లు లిడఁగ.

క. అల నిత్యసమాసములో
పలఁ జావిహ్మ దేశ్యయతులు ప్రభునామయతుల్
తెలుపఁగ నిత్యసమాసమె
యలరు నఖండం బనంగ నర్వైక్యమెదలన్.

౩. చిత్రపు భీమన్నగారు—

ఉ. ఉక్కఱ నాఁగఁ దెమ్మెరన
నొప్పఁగ నేపఱ యోలమాసనా
క్రక్కదలంగ వామటియు
గ్రచ్చఱ నాఁజను నిట్టివన్నియున్
నెక్కొన దేశ్యపున్యతులు
నిత్యసమాసముల న్వచించి నా
రొక్కమతంబునం దివియు
నుర్వి నఖండము లండ్రు సత్కవుల్.

క. ఉక్కఱ తెమ్మెర లేపఱ
క్రక్కదలన నోలమాస గ్రచ్చఱ లనఁగా
నెక్కొ పదము లిరుదెఱఁగుల
నిక్కమని యఖండయతి గణించిరి సుకవుల్.

౪. పొత్తపి వేంకట రమణకవి: లక్షణ శిరోమణి—

గీ. ఉక్కు అన గ్రచ్చు అన చేపతోలమాన
గ్రక్కుదల తెమ్మెరవఁగ నారాయణాఖ్య
నాకలోకైకము లఖండ నామయతుల
కిరవు హల్లులపై స్వరమిడినఁ గృష్ణా!

౫. కాచెన బసవన : కవిసర్పగారుడము—

అనంతుఁడు దెలిపినట్లే "పదము విభజించి చెప్పఁజొప్పడనియదియు" నిత్యాదిపద్యముచే నిత్యసమాసయతి లక్షణమును దెల్పి నారాయణ జనార్దనాది శబ్దములను సంస్కృత నిత్యసమాసములకును, ఉక్కు అ తెమ్మెర మున్నగు పదములను దేశ్యనిత్య సమాసములకు నుదాహరించి "అనంతుఁడు దీనినే అఖండయతి యని నాఁడు" అని తానును అనంతుని మతమునే అంగీకరించి యున్నాఁడు.

౬. నైమిశము తిమ్మకవి : లక్షణమంజరి—

గీ. అద్భుతముగ సమాసంబులందు శబ్ద
యుగము గూడియు ఖండింప కొనరనట్టి
పదముల నఖండమండ్రు సేర్పరులు నచ్చు
హల్లులకు వడి చెల్లుఁ గాత్యాయనీశ!

గీ. అంధకాసురహరణ మార్తాండతేజ
హంసవాహనవినుతజనార్దనాస్త్ర
స్యాంతభవభస్మలిప్తభాస్వరశరీర
గరళపురధామ యనఁగ లక్ష్యంబు లయ్యె.

౭. వెల్లంకి తాతంభట్టు : కవిచింతామణి—

క. ఆదిమకవిపుంగవులకు
నాదరణీయంబులైన యన్వితపదముల్
ప్రాదులగతి నుభయంబున్
మేదిని సంస్కృతులఁ జెల్లు నీరజనాభా!

సీ. ఆరయ శకంధుకర్కంధుసీమంతమ
 సీమలున్ జెరసి హలీమలట్టు
కుల్కులాంగలీషోష్ణీమకులటలు
 చెలియ మంజీరమ త్తమ్ము ములును
పరగంగ కుద్దాలపక్కణాలక్తక
 లాదిగా నివి శకంధ్వాదిగణము
మతియు వేదండము మ్మందారనాకముల్
 ద్వీపాంతరీపప్రతీపములును

గీ. నారికేళము లీయాదిగాఁగ సంజ్ఞ
లన్వితములును నిత్యసమాసములు న
ఖండములు నన వళి కొప్పుఁ; గార్యవశత
దగ్గరించిన స్వర మఖండంబు గాదు.

౮. యతిప్రాసవిలాసము, సంఖ్య. ౪౦౫—

చ. ఉరుతరదేశ్యశబ్దముల
 నుక్కు అతేపఅనోలమానతె
మ్మెర లన, గా నఖండయతు
 లేర్పడు హల్లుల నచ్చులందగన్,
స్వరయుతవిశ్రమార్ణసదృ
 శాకృతి గల్గిన శుద్ధహల్లుగా
ర్తురు వడి నాయఖండము మ
 రొక్కటి వేంకటశైలనాయకా!

దీని నీ గ్రంథకర్త విమతాఖండమని పేర్కొని నాఁడు.

ఈ పై నుదాహరించిన లాక్షణికదత్తుల లక్షణము ననుసరించి, ప్రాచీన కవిప్రయోగములందుఁ దఱచుగఁ జూపట్టి, అన్వితపదములై, ఆయావర్గము లకుఁ జెందిన వైన పదములలో నచ్చునకు, హల్లునకు యతి చెల్లుననియు, అట్టివానిని నిత్యసమాసయతులు, అఖండయతులు అని యందురనియు, ఇట్లు పరిగణిత మైన శబ్దములందుఁ దక్క నితరస్థలముల సంధ్యాది కార్యవశమున దగ్గరించిన స్వరము (అచ్చు) అఖండంబు గాదనియు, నచ్చట నుభయమునకు యతి చెల్లింపరా దనియు ఉద్ఘోషింపఁ బడియున్నది.

అప్పకవి – అఖండయతి:—ఇట్లు ప్రాచీనలాక్షణికు లందఱును నలుగఁగొట్టిన త్రోవనే, లక్షణజ్ఞు లందఱచే నైకకంఠ్యముగ నంగీకరింపఁబడిన పద్ధతినే అప్పకవి అఖండయతి నంగీకరించియున్నాఁడు. కనుఁ డాపరిపాటి:

గీ. ఒక్క సమసనమున శబ్దయుగము గూడి
పదము లేర్పాటుగాఁ గానఁబడని ప్రాణ
సంధులకు నిత్యసమసనక్రాంతులు న
ఖండవిశ్రమములు నన నొండుఁ జెల్లు.
(అప్ప. ౩ - ౧౩౫.)

అని కర్ణాటవసాశోద్వీపాదిశబ్దములను లెక్కించినాఁడు. అనఁగా ఒక్క సమాసమున రెండు శబ్దములు గూడి సంధ్యాదికార్యవశమున వేఱుగాఁ గానరాకుండిన చోటుల అచ్చునకు, హల్లునకుఁగూడ యతి చెల్లు ననియు, అవి నిత్యసమాసములు, అఖండయతులు అని రెండుతెఱఁగులఁ జేర్కొనఁబడుననియు నీతని యభిప్రాయము.

మఱియు నీతఁడు దేశ్యనిత్యసమాసముల లక్షణ లక్ష్యములను నిరూపించుచు "కొందఱు దీనినే దేశ్యాఖండములును, అందురు" అని అఖండయతిమాట వదలకయే వచ్చినాఁడు. అప్పు, అయ్య మున్నగు పదములతోఁ గూడి అచ్చునకు, హల్లునకు యతి చెల్లినచో వానిని సామాఖండయతులనుగాఁ జేర్కొనినాఁడు. ఇట్లు మాటిమాటికి అఖండయతి నుగ్గడించుచు ప్రాచీనలాక్షణికు లందఱు కథితమైన పద్ధతినే పోయిన అప్పకవి శిరమున "అఖండయతి నంగీకరింపలే"దను నపవాదమును విమర్శకు లెట్లు మోపినారో యెఱుఁగరాకున్నది. ఈతఁడు పేర్కొనిన యతులన్నియు లింగమకుంట తిమ్మనసులక్షణసారము, తాతంభట్టుకవిచింతామణి మున్నగు ప్రాచీనలక్షణగ్రంథములందుఁ గానవచ్చుచునే యున్నవి. ఈవిభాగమును క్రొత్తగ నీతఁడు రచించినదియుఁ గాదు. యతుల సంఖ్యను హెచ్చించినవాఁ డీతఁ డొక్కఁడే కాఁడు. ఇతనికిఁ బ్రాచీనులలోను, నర్వాచీనులలోనుగూడ నిట్టి యాధిక్యము గానవచ్చుచునేయున్నది. పదిమొదలు అఱువదివఱకు యతుల నంగీకరించినవారు గానవచ్చుచునేయున్నారు. అట్లు విభజించుట గుణమనికాని, దోషమనికాని యెన్నుట సామాన్యమైన విషయముగాదు. లక్షణగ్రంథము లనేకములు పరిశీలించికాని యిదమిత్థమని నిర్ణయింప వలను పడదు.

లాక్షణికులలోఁ బ్రామాణికులు పెక్కురు సంస్కృతదేశ్యనిత్యసమాస పదములయం దఖండయతిని బాహాటముగా నంగీకరించియున్నారు. ఆపద్ధతి నప్పకవియు విడనాడలేదు. అట్టి వానిని పరిగణనము చేయుటకే ఉభయయతివిభాగ మొనర్చినాఁడు. బాగుగ నాలోచించిచో నప్పకవియుఁ బ్రాచీనలాక్షణికులను సర్వథా యనుకరించినవాఁడే గాని యన్యుఁడుమాత్రము గాఁడని సుస్పష్టమగుచున్నది.

ఇఁక నీ నిత్యసమాసమునకుఁ జెప్పిన—

గీ. పదము విభజించి చెప్పఁ జొప్పడనియదియు
నన్యశబ్దంబు గొని విగ్రహంబు చెప్ప
నదియు నిత్యసమాసమై యతిశయిల్లు
నట్టిసంధుల నచ్చు హల్లైన విరతి.

అను లక్షణము "అవిగ్రహో అస్వపదవిగ్రహో వా" అను సంస్కృతపరిపాటిని దెలిఁగింపఁబడినది. ఇట్టి సమాస మఖండరూపముగనే యుండును గనుక నట్లఁ జెల్లెడి యతి యఖండయతి యనుటలో సౌలభ్య మధికము. కావుననే ప్రామాణికలాక్షణికు లామార్గము ననుసరించియున్నారు.

ఇక్కడ నొక్కమాట చెప్పవలసియున్నది. ముద్రితమైన అప్పకవీయములో నిత్యసమాసయతిప్రస్తావమున "ఉపసర్గసంధికి చంద్రికాపరిణయమునందు" అను వచన మొక్కటి గలదు. ఇందలి 'ఉపసర్గసంధికి' అను పదము అస్థానపతితమని కొందఱి యాశయము. పరిషత్తునందలి తాటియాకుప్రతిలో నీతావున నీపదము లేదు. ఉండినను నంత ప్రమాదము గానరాదు. వసుధ + అధిప = వసుధాధిప అగును. ఈ సంధిలో 'అధి' అను ఉపసర్గ గూడియుండుటచే, ఉపసర్గసంధితోఁ గూడిన నిత్యసమాసమని యుదాహరించె ననుకొనవచ్చును. వృషభాధిపశబ్దము నిట్టిదే.

ముద్దరాజు రామన-అఖండయతి:—కవిజనసంజీవినిలో రామన అఖండయతినిగూర్చి యిట్లు ప్రసంగించియున్నాఁడు:

మ. సుకవిస్తుత్యముగా నఖండపడి ని
ల్చు న్విశ్రుతంబై యొకా
నొక చోటన్ జలజాతజాతకృతమ
న్యత్వ ల్పన్నగు ల్నేయఁగా
సకలోర్వీవలయంబు గాచుటకుఁ గం
సాదిప్రమత్తాభియా
తిపులం జెల్ల వధించినాఁడు జితదై
త్యేంద్రుం డుపేంద్రుండనన్.

ఈ పద్యమున నఖండయతిలక్షణస్వరూపమును జేర్కొనలేదు. శుద్ధహల్లునకును, సమాసములో సంధివశమున నచ్చుతోఁగూడిన హల్లునకును యతి చెల్లించిన యుదాహృతులనుమాత్రము దెల్పినాఁడు.

కొందఱు విమర్శకులు అఖండయతి యనుకొనునదియు, విద్యార్థిలోకమునకు భ్రాంతి నాపాదించుచుండినదియు, బహులాక్షణికసమ్మతికి విరుద్ధమైనదియు నగు అఖండయతి యిదియే.

"...కార్యవశత, దగ్గరించిన స్వర మఖండంబు గాదు" అని తాతంభట్టు తెలిపియేయున్నాఁడు. మఱియు నిట్టి యతులు విషమాఖండము లనియు, వీనిని బ్రయోగించిన కృతిపతికి హాని గూర్చుననియు 'యతిప్రాసవిలాసము' అను లక్షణగ్రంథమువఁ గలదు.

గీ. తగు నఖండంబు దేశ్యపదప్రయుక్త
మగుచు; స్వరయుక్తహ ల్లుద్ధహల్లు వడికిఁ
దవర నది విషమాఖండ మనఁదెలంగు
నృపతి కది గూర్చు హాని నో వృషగిరీశ!

అఖండయతికి ఆనుశాసనికపర్వము—

క. అతిథి నిను గోరనేనియు
మతిఁ గింకిరిపడక యోలమానగొనక...

సర్వదేవుని ఆదిపురాణము—

చ...తె, మ్మెదలు నిరంతరంబు భ్రమియించుచు నుండు వనాంతరంబులన్.

విషమాఖండయతికి అరణ్యపర్వము—

క. మాయం దొక్కరి వరింపుమని యిష్టముతో.

ఆదిపర్వము—

క. చూనె మనంబునఁ దలంచుచుండెద నేనున్.

భాస్కరరామాయణము—

చ...ఏ, మన్నను లెస్సయాను మణిమండనముఖ్యము లైన కానుకల్.

దశకుమారచరిత్రము—

మ. మగపంతంబును దక్కిన న్మనుజులే మం డ్రీభయం బేటికిన్?

వరాహపురాణము—

ఉ. పూ, పావరుపాలికిం జని నిశాటవరేణ్యుల బాధఁ జెప్ప...

ధూర్జటి—.

శా. నీకుంగాని కవిత్వ మెవ్వరికి నే నీనంచు మీఁ దెత్తినన్.

ఇత్యాదిగా నీవిషమాఖండమున కిచ్చిన యుదాహరణములు, ముద్దరాజు రామన యిచ్చిన యుదాహరణములు సజాతీయములు, సమానములు నగుటచే నిట్టివి పరిగ్రాహ్యములు గావని యీలాక్షణికుఁడే తెలిపియున్నాఁడు. కావుననే లక్షణశిరోమణిలో అఖండయతిప్రస్తావమున ముద్దరాజు రామన పేర్కొనిన "సుకవిస్తుత్యముగా"నిత్యాది లక్షణము దెల్పి, తరువాత-

క. అవి కొందఱు మెచ్చరు మే
లవు నని కృతులందు సుకవు లయ్యెయెడలన్
దివిరి రచించిరిగావున
వివరింతున్ దత్క్రమంబు విశ్రుతఫణితిన్.

అని యీ లక్షణము సర్వసమ్మతము గాదని నాఁడు. ఇట్టియతులు ప్రశస్తములు గావని ౩౪౪౮ సంఖ్యగల లక్షణగ్రంథములో నిట్లు ప్రసంగింపఁబడి యున్నది:

"వ. దేశ్యాఖండనామాఖండములు ప్రశస్తములు గాని శుద్ధాఖండములు ప్రశస్తములు గావు. ఏకపదములు గావు గనుక స్వర మున్నది. అల్లా అఖండవడి యని చెప్పితే సారము లేకపోయీని."

చిత్రకవి పెద్దనార్యుఁడు-అఖండయతి:—పెద్దన లక్షణసారసంగ్రహములో—

గీ. ఒక్క వర్ణంబు స్వరమాఁద నొకట స్వరము
గలియకుండంగఁ గూర్తు రఖండయతులు
రామపదపద్మలోలవరాళి యనుచు
భంజితాసురసముదాయ యాంజనేయ!

అని లక్షణమును, ఉదాహరణమును దెలిపియున్నాఁడు.

అచ్చుతోఁగూడిన హల్లునకు, అట్లు కూడని హల్లునకు యతి చెల్లిన నఖండయతి యని యీ

లక్షణోదాహరణములవలనఁ దెలియుచున్నది. కాని యాతఁడే తొలుత—

గీ. ప్రాద్యుభయనిత్యకాకుస్వరములుగాక
యన్యపదములపై స్వర మందెనేని
అదిరొ స్వరయతి యగును కూరార్థ్య యనఁగ
ధ్వంసితాసురసముదాయ యాంజనేయ!

అనఁగా ప్రాదులతోఁ గూడినపుడును, ఉభయయోగములందును, నిత్యసమాసములందును, కాకుస్వరముతోఁ గూడిన పదములందును దక్క మిగిలిన పదములపై అచ్చు గూడినచో నది స్వరయతి యగునని యీతని యనుశాసనము. ఇట్లనుశాసించిన యీతఁడు విరుద్ధముగ నీ యఖండయతిలక్షణము నిట్లేల తెలిపి యున్నాఁడో తెలియఁగరాకున్నది. ఇంతియగాక నిది విమర్శాఖండగ్రంథమునకుఁ జేరినదియే యగును. కూచిమంచి తిమ్మకవియు నిట్టి యతులు పరిగ్రాహ్యములు గావని తన సర్వలక్షణసారసంగ్రహములోఁ దెలిపి యున్నాఁడు.

కూచిమంచి తిమ్మకవి-అఖండయతి:—

గీ. హల్లునకు హల్లు వడి యిడునపుడు దాని
కుదిని స్వరము ఘటిల్లిన నది యఖండ
వడి యనఁగఁ బొల్చు కృతుల దేవాధిదేవ
యనుచుఁ జెప్పిన శైలకన్యాధినాథ!

ఈలక్షణముచొప్పున సంధివశమున అచ్చుతోఁ గూడిన హల్లునకును, శుద్ధహల్లునకు యతి చెల్లిన నది యఖండయతి యగునని తెలియుచున్నది. కాని 'దేవాధిదేవ'వంటి పదములు నిత్యసమాసములే యగును. అట్టి తావులనే యీ యతిని చెల్లించుట యీతనికిని అభిమతము. కనుకనే యీ యతికి నుదాహరణముల నిచ్చి తుదిని "ఇట్టి ప్రయోగములు గలవుగాని త్రికవుల ప్రయోగములు లేవుగనుక ఇది సుప్రయోగము గాదు" అని వాఁడు. కనుఁ డాప్రయోగములు—

ఉ...పే, మన్నఁ గొంత లేదు మణిమండనముఖ్యము
లైన కానుకల్. (భాస్కరరామాయణము)

ఉ...ర, త్నాకరవేష్టితావని వినంబడ దాతఁడు పేరు
పెత్తినన్. (శ్రీరంగమాహాత్మ్యము)

ఉ...ఘం,కారము జేసి నవ్వు నెవకయ్య కృతీశ్వరు
మంచుఁగాపురిన్. (అరుణాచలపురాణము)

చ...శే, లులుకులు గ్రోయ మేవఁ బ్రమదాస్యలు
నొయ్యన గోరమీటుచున్. (మనుచరిత్రము)

ఈ యుదాహరించిన ప్రయోగములలో సైతము రత్నాకరశబ్దమును, నెవకయ్య అను శబ్దమును నిత్యసమాసములే. మిగిలిన రెండు ప్రయోగములందు పాఠములు వేఱొకరీతిగనే యున్నవి. ఇంతకును తిమ్మకవి యిట్టి ప్రయోగము లున్నను సుప్రయోగములు గావనియే యుద్ఘోషించుచున్నాఁడు.

మఱియు నీ క్రింది లక్షణమును మీఁది విషయముతోఁ గలిపి పరీక్షించికొనినచో సంస్కృతదేశ్యనిత్యసమాసములందే అఖండయతిగా నచ్చునకు, హల్లునకు యతి చెల్లించుట యీతని కభిమతమైనట్లు స్పష్టమగుచున్నది.

క. అక్కట తెమ్మెర రూపట
గ్రక్కదలఁగ నోలమాన క్రచ్చుట యను నీ
పెక్కుపదము లిరుదెఱఁగుల
నిక్కముగ నఖండవడి గణించిరి సుకవుల్.

వ. ఈ శబ్దములమీఁద వచ్చినవి అఖండయతు లని కొంద ఱన్నారు. (సర్వ. విక్రమప్రకరణము)

మీఁద నెత్తిఁగించిన లాక్షణికసమ్మతులన్నిటిని సమీకరించిచూచిన అప్పకవి అఖండయతిని ప్రాచీనార్వాచీనలాక్షణికులట్లు అంగీకరించియున్నాఁడని సుస్పష్టముగ విదితమగుచుండ, విమర్శకు లనుకొనినట్లు అఖండయతిని అప్పకవి యంగీకరింపలేదనుట యెట్లు పొసఁగునో పాఠకులు సావధానముగా పరిశీలించుకొని యెదరుగాక.

సమీక్ష ✻ శ్రీ దేశిరాజు కృష్ణశర్మ

ఒకనాటి సాంద్రశరద్విభావరిలో చంద్రికాసవప్లుత ఒక గాఢశిలీహృదయంలో కలిగించిన సంచలనము—

ఈ సర్వస్వ మదేశికో పరుగిడున్ ఏమూల కన్గొన్న బా
ధానర్వ్యంబు లనేకరూపములతో తారాడు - కాలంబె ఏ
దో సంకేతపు డోల ముందువెనుకల్ దోగాడు - జీవించుటే
దోసంబై మరణించుటే కరమై తోచున్ వ్యథాలికిన్.

నే నిక ఏకతన్ బ్రతుకరాని వ్యర్థక నైతి - వినగా
నీ నను వీడిపోదు రమణీ శత. రమ్మని పిల్చు దూరదూ
రానకు - నీ చెవిన్ విపవిగామ మెరుంగక తీవ్రవేదనా
గానము కోడె తాచుల ప్రగాఢపు బుసలు కొట్టు మాటికిన్.

వాడెడి మహావిచిత్ర పరిబంధురజాలరిగాడు ఎప్పుడీ
గాడిన గాటనే తిరుగగా నను గాడిద జేసినాడు - ఎంతగా
ఏడిచి మొత్తుకొన్న కనిపింపడు. సన్నిహిపింప జేడకో
ఈడుచుకొంచు బోవు, ఎటు లీతని దగ్గర జేరి నెగ్గుటల్ ?

ఎక్కడినుంచి వచ్చితి, మరెక్కడి కేగుచునుంటి - ఎన్నియో
చిక్కుల సంశయాల చివికి సిగ్గిలితిన్ - తెలిపావిరా కడల్
ద్రొక్కుచు లేతకౌముదికల కాంతులు వెన్నెలముద్దలౌచు, తా
నెక్కడి కేగు చందురుడు - ఎక్కడి కీవకలంబు యాత్రగా.

ఈ నిశినిశి యొల్ల నాకనులు కింపుగ వాడ్చుతోటి మూర్ఛయున్
పూనిన బాలికామణిని పోలును - దీర్ఘమంబు నాయెదన్
పూనిన పూన్కి - కాంతయు అపూర్వపు రాగము తీసె - గీతికా
మ్లానముగానదస్సుల విలాపము దిప్పల లాస్య మొప్పగన్.

ఓసి! నివృత్తికత్త్వ రమోధృతి! నన్ గ్రహించు - శార్వరీ
శ్రీనిముపేత నిర్మలనిశీథము నాహృదయాన - చంద్రికా
శ్రీసమశీతలాచ్ఛములు చిందుచు రమ్ము - ప్రవృత్తిరాగవి
న్యాసము సల్పు నాయెడద నాటుము అన్యగతత్త్వబీజముల్.

ఈ యసమర్థతాజడత ఎంతకు వీడియు వీడిపోని ఆ
ప్యాతుగలో ఉషాంబరము వచ్చిన లేతవెలుంగు ఛిన్నమై
పోయెను - మాంసాంబరపు ప్రొద్దులలో తొలిబాల సూర్యరే
ఖాయుతినంబునన్ కనులు గానవు విన్నది దేమి చెప్పినన్.

నరబలి నిషేధము

వివిధ మతములలోని కవులు

•

= శ్రీ కపిల వెంకటరావు =

మతసంబంధము గల యుత్సవాదులయందు దేవతా ప్రీత్యర్థము నరబలి యిచ్చు నాచారము కొన్ని యనాగరిక జాతులలో నిప్పటికి నున్నది. చిరకాలము నుండి నాగరకత వహించియున్న మానవసంఘములలో నైతము మొదటి మొదటి దశలలో నరబలి సదాచారముగా మాత్రమే కాదు, విధ్యుక్తకర్మగుకూడ నైయుండెను. నాగరికత హెచ్చినకొలది నరబలి నిషేధింపబడి యితరజంతువులుమాత్రము బలి యీయబడుటయు, కొన్ని సంఘములలో నదికూడ పోయి, జీవహింస మహాపాపముగా లెక్కకువచ్చుటయు గలిగినది.

మన పూర్వులగు నార్యులలో నీ యాచారము మొదటిలో నుండి, యది క్రమముగా గర్హ్యమైనట్లు ఐతరేయబ్రాహ్మణములోని యొక కథవలన తెలియగలదు. హరిశ్చంద్రుడను రాజునకు నూరుగురు భార్యలున్నను కొడు కొక్కడేనియు కలుగలేదు. ఒక ఋషి యుపదేశము ననుసరించి యాతడు వరుణుని నారాధించెను. తన కొక్క మగబిడ్డ బుట్టినయెడల వానినే వరుణుని కర్పించెదనని యాతడు మ్రొక్కుకూడ మ్రొక్కుకొనియెను. వరుణదేవుని వరమువలన రాజునకు పుత్రుడు కలుగగా నాతడు వానికి రోహితుడని పేరుపెట్టుకొని వాని నల్లారుముద్దుగా పెంచుకొనుచుండెను. వరుణుడు వచ్చి తన మ్రొక్కు చెల్లింపుమని యడుగుచుండెను. ఆవంక యీవంక పెట్టి రాజు వ్యవధి బడయుచుండెను. రోహితుడు పెరిగి పెద్దవాడైనతర్వాత తండ్రి యొకనా డాతనితో నీవిషయమంతయు జెప్పి, వరుణునికి బలివగుమని కోరెను. రోహితుడు దాని కియ్యకొనక, యడవులబట్టిపోయెను. వరుణదేవుని కాగ్రహమువచ్చి రాజును జలోదరరోగముచే బాధపడునట్లు శపించెను. అడవులపాలైన రోహితుడు నిరుపేదయు, నిండుముసలియు నగు నజీగర్తుడను బ్రాహ్మణు నొకనిని కలుసుకొనుట తటస్థించెను. ఆకలితో మలమల మాడు నా పేదబ్రాహ్మణునికి రాజపుత్రు డొకయాశ గల్పించెను. "వరుణునికి నాకు బదులు బలియగుటకు నీ మువ్వురు కొడుకులలో నొకని నిచ్చినయెడల నేను నీకు నూరుగోవుల నిచ్చెద" నని రోహితు డజీగర్తునితో చెప్పెను. అజీగర్తు డంగీకరించెను. కాని పెద్దకొడుకునుమాత్ర మీయననెను. అతని భార్య చివరికొడుకు నిచ్చుట కొప్పుకొనలేదు. నడిమివాడైన శునశ్శేపుడు రోహితున కమ్ముడైపోయెను. రోహితు డా బాలుని వెంటబెట్టుకొని తండ్రియొద్దకు బోయెను. రాజపుత్రునికి బదులు బ్రాహ్మణబాలుని బలిగా గొనుటకు వరుణభగవానుడు హర్షముతో నంగీకరించెను. యజ్ఞమారంభమయ్యెను. విశ్వామిత్రుడు దానికి హోత. అన్నియు సిద్ధమైనతర్వాత బలిపశువగు శునశ్శేపుని యూపస్తంభమునకు గట్టువా రెవరును కనపడకపోయిరి. సదస్యులలో నెవ్వరు నాపనికి పూనుకొనలేదు. మరొక్క నూరుగోవుల కజీగర్తుడే బాలుని కట్టుట కొప్పుకొని యట్లు కట్టివైచెను. ఇంక బాలుని ఖండించవలసివచ్చినది. సభ్యులు చూచుచు నూరక యుండిరి. ఇంకొక్కవంద గోవుల బహుమానమున కజీగర్తుడే యందుకుకూడ సిద్ధపడి, కత్తినూరుట మొదలుపెట్టెను. శునశ్శేపుడు దేవతలను ప్రార్థించుకొనుచుండెను. ప్రజాపతిని ప్రార్థించగా నాయన యగ్నిని ప్రార్థించుమనియెను. అగ్నిని మంత్రములచేత స్తుతించగా నగ్ని సవితను స్తుతించుమనియెను. ఆయన వరుణుని వేడుకొమ్మనెను. వరుణుడు తిరిగి యగ్నినే యారా

ధించుమని చెప్పెను. అగ్ని యీవారు విశ్వదేవుల శరణుపొందుమని వాక్రుచ్చెను. వారతనికి "నీ కింద్రుడే దిక్కని చెప్పిరి. ఇంద్రు డశ్వులను చూపెను. అశ్వనీ దేవత లుషస్సును తలచుకొమ్మనిరి. ఇట్లా బాలు డందరిని ధ్యానించి ప్రార్థించగా నాతని కట్లొక్కొక్కటిగా నూడిపోయెను. రాజును వ్యాధినిముక్తుడయ్యెను. యజ్ఞపసువు కావలసిన యీ బాలుడే యీ యజ్ఞమును నిర్వహించవలసినదిగా రాజు కోరెను.

రామాయణములో నీ కథయే కొంచెము భేదముతో చెప్పబడియున్నది. అయోధ్యాపతియైన యంబరీషుడు యజ్ఞము చేయబోవగా యజ్ఞపసువు నింద్రు డెత్తుకొనిపోయెను. అప్పు డాయాజకు డది చాల ప్రమాదమని చెప్పుచు, "నరుడైన పసువుగా జేసి యాగంబుసేయవలయు"నని పలికెను. మిక్కిలి భయపడి రాజు దేశదేశములు తిరిగి రుచికు డను నొక ఋషిని గాంచి "యొక లక్ష యావు లిచ్చెదను. నీ కొడుకును యజ్ఞపసువుగా నాకీయవలసిన"దని యడిగెను. ఋషి యంగీకరించెను. ఆ ఋషికి ముగ్గురు కొడుకులు. ఆయన పెద్దకొడుకు నీయననియు, వాని భార్య చిన్నకొడుకు నీయననియు పట్టుపట్టగా నడిమివాడైన శునశ్శేఫుడే యంబరీషునితో బోవలసివచ్చెను. శునశ్శేఫుడు విశ్వామిత్రునితో తన పాట్లు చెప్పుకొనెను. వానియందు దయగలిగి యాతడు తన కుమారులతో "మీలో నెవరైన రాజుయజ్ఞములో బలియై యీ బాలుని విడిపించు"డని యాజ్ఞాపించగా వారెవ్వరు నందుల కంగీకరించలేదు. వారలను శ్వపచులు గమ్మని శపించి విశ్వామిత్రుడు శునశ్శేఫునికి రెండు మహామంత్రము లుపదేశించెను. ఆత డామంత్రములను మిక్కిలి నిష్ఠతో జపించగా దేవేంద్రుడు స్వయముగా వచ్చి శునశ్శేఫునికి ప్రాణదానము చేసి, రాజునకు యజ్ఞఫల మిచ్చెను.

బ్రహ్మసృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుడీ కథలలో నొక పాత్రయగుట గమనించవలసిన విషయము. రాజు తలపెట్టినది పవిత్రమైన యజ్ఞము, నుద్దిష్టదేవత వరుణుడు నైనను శునశ్శేఫుడు తప్పించుకొనిపోగలిగినాడు.

శైవమతమునకు సంబంధించిన బసవపురాణములో కూడ నిట్టిదే యనదగు నొక యితిహాస మున్నది. కాంచీపురవాసుడగు సిరియాలు డను నొక వైశ్యశిఖామణి యకుంఠిత శివభక్తుడై నిత్యము నైదుగురు జంగముల కిష్టాన్నపానాదు లిచ్చి పూజించుచుండగా నొకనాడు శంకరుడు జంగమవేషమున నేతెంచి నరమాంసముతో నాకు భోజనము పెట్టుమని యర్థించెను. "నా కొక కుమారు డున్నాడు. వానినే తరిగి వండి మీకు పెట్టెద"నని బాసచేసి సెట్టి కపటజంగము నింటికి గొనిపోయి యీ వార్త తన భార్యయైన సంగళమ్మకు వినిపింపగా నామె యేమియు నెదురుచెప్పక, మీదుమిక్కిలి యెక్కువ యుత్సాహముతో తన బాలుని తెచ్చి వధ్యశృంగారము చేసి సిద్ధముచేసెను. తల్లిదండ్రు లిర్వురు నా బిడ్డను ఖండించి, శాకపాకములు చేసి యతిథికి వడ్డించిరి. శంకరభగవానుడు మరియు కొన్ని పరీక్షలకు వారిని లోబరచి, తుదకు "మీరును కూర్చుండి యీ వంటకములు తిను"డని యానతిచ్చెను. వా రందులకును సిద్ధముకాగా, భగవంతుడు పుత్రహీనుల యిండ్ల మాబోంట్లకు భోజనము లేమిటని యీసడించగా సిరియాలు డాతని కాళ్ల బడి "మా కున్నదే యొక్క బిడ్డడు. వానిని మీరు కోరగా తరిగి కూర వండి పెట్టితిమి. మరల నిట్లనుచున్నా రేల?" యని వాపోయెను. కపటజంగము సంగళవ్వతో "తల్లి పిలిచిన రాని తనయుడు లేడు. నాలుగు దిక్కుల నిలిచి నీబిడ్డను నీవు పిలువుము. నాకు వినబడునట్లుగా నెలుగెత్తి పిలువు"మని చెప్పెను. ఆమెయు బోయి "నాబిడ్డా, రమ్మ. ఎక్కడెక్కడికి పోయితివో నాబిడ్డా తిరిగిర"మ్మని కేకవైచి పిలువగా నామెబిడ్డ డెప్పటియట్ల నాడుచు పాడుచు పరుగునవచ్చి యామెయొడిని జేరెను.

'హరవిలాపము'లో నిదియే కథగాని కొద్ది మార్పున్నది. సెట్టిపేరు చిరుతొండ డని, బాలుని పేరు సిరియాలు డని యున్నది. ఈ రెండు కథలలో బలి యడిగిన భగవంతుడు భక్తుని పరీక్షించుటకు మాత్రమే యట్లడిగినాడు. పరీక్ష ముగియగానే బిడ్డను మరల తానే బ్రతికించినాడు.

విష్ణుభక్తుడగు రుక్మాంగద మహారాజు నీమము తప్పక యేకాదశీవ్రతము నాచరించుచు తన ప్రజలు కూడ నాచరించునట్లు చేయుటచేత యమధర్మరాజునకు పనియే లేకుండ బోయినది. అప్పుడు దేవతలందరు నాలోచించి మోహిని నాతనికడకు పంపిరి. ఆమె యాతనిని మోహవార్ధిలో ముంచి తన కనుసన్నల నాతడు మెలగునట్లు కావించుకొని యాతనిచే నేకాదశీ వ్రతమును మానిపించుటకు ప్రయత్నించెను. ఆమె కోరిన దేమయిన నిచ్చెదనుగాని వ్రతము మాత్రము మాననని రాజు నిష్కర్షగా చెప్పివైచెను. "నేను కోరిన దేమైన సరే యిచ్చెదనా, యిచ్చెదవా?' యని యామె యడిగి, "నీ యేకపుత్రుని శిరమి"మ్మనెను. విష్ణుప్రీతికొరకై యాపనికూడ చేయుటకు రాజు సిద్ధపడి కుమారుని తల నరుకుట కుద్యుక్తుడు కాగా దేవతలు వారించిరి.

ఈకథలో నరబలిని విష్ణుదేవు డడుగలేదు.

మనలోవలెనే పురాతనపు గ్రీకులలో నొకప్పుడు నరబలి యాచారముగా నుండెను. మెనిలాస్ భార్యయగు హెలెన్ అను జగదేకసుందరిని పారిస్ హరించి సముద్రము దాటి తన దేశమునకు కొనిపోయినందున గ్రీకులందరు నేకమై పగదీర్చుకొనదలచిరి. ఒకలక్ష సైన్యము, వేయువందల యోడలును సిద్ధపరచబడెను. దీని కేండ్లును పూండ్లును బట్టెను. కొన్ని యంతరాయములు గడచి కొంతదూరము పోయినతర్వాత గాలి స్తంభించెను. ఒక్క యాకైన యల్లాడదు. ఊపిరి తిరుగదు. తెరచాపలు ముక్కచెవులై వ్రేలాడెను. అప్పుడు వారు ప్రశ్నలడిగి, శకునములు చూచిరి. మెనిలాసు సోదరుడు అగామెమ్నాన్ కూతురు ఇఫిగినియాను అర్తెమిస్ దేవతకు బలియీయవలసియుండి యాప్రొక్కు నాతడు చెల్లించనందున నీయగచాట్లు పుట్టెనని జ్యోతిష్కుడు తెలిపెను. మ్రొక్కుదీర్చుటకు అగామెమ్నాను నిరాకరించెను. దినములు గడచిపోవుచుండెను. సైనికుల గోల యెక్కువగుచుండెను. లక్షమంది సైనికులు మడియుటకంటె నొక్కబిడ్డను బలియిచ్చుటే యుత్తమమార్గమని యందరు బోధించి యగామెమ్నాను మెడలువంచిరి. ఆలీస్ అను వీర కుమారునికి ప్రదానము చేయునిమిత్తమైనట్లుగా బిడ్డను తండ్రి పిలిపించుకొనియెను. నిజము తెలిసిన తర్వాత నాబిడ్డయు, తల్లియు నానావిధముల బలిని మాన్పింప యత్నించిరి. ఇది యకార్యమని పోరాడిరి. బిడ్డ యతి కరుణముగ విలపించినది. చేయునది లేక ఇఫిగినియా బలియగుటకు నిశ్చయించుకొని తన నిశ్చయమును తండ్రికి తెలియజేసెను. అది ఔలిస్ (Aulis) అను నాకాశయము. ఆర్తెమిసయొక్క బలిపీఠమును చక్కగా నలంకరించిరి. జ్యోతిష్కుడు కత్తి నూరుచుండెను. బిడ్డ తనమెడను కత్తిదెబ్బకై చాచెను. ఇంతలో నొక మేఘము చాటుగా వచ్చి యర్తెమిసయే యామెను విసఫీకి కత్తుకొనిపోయి టారిస్ అనుచోట తన దేవాలయములో పూజారిణిగా నియమించుకొనెను. బలిపీఠముపై మానవదేహమునకు బదులొక చిన్న జింకపిల్ల—పాలవలె తెల్లని యొడలుగలది—పండుకొని గిజగిజ తన్నుకొనుచుండెను. అర్తెమిస కాజింకపిల్లను బలి యిచ్చిరి. తర్వాతకాలములో నిదియే యాచారమైనది. దేవాలయములోని కొక మనుష్యుని బలిపశువుగా నలంకరించితెచ్చి, యాతని కంఠముపైని కత్తిమొట్టించి యాతనిని విడిచిపుచ్చుచుండిరి. గ్రీసునాటకరచయిత యురిపిడీసు వ్రాసిన "టారిస్‌లో ఇఫిగినియా" అను నాటకములో దేవతలరాణియగు ఎథినా యిట్లు చెప్పుచున్నది:

"...At each high festival,
A sword, in record of thy death undone,
Shall touch a man's throat, and the red (blood run—
One drop, for old religion's sake. In this
Shall live that old red rite of Artemis."


బైబిలులో నబ్రహాము (Abraham) కుమారుడగు నైజాకు (Issac)ను భగవంతుడు బలిగా గోరినట్లు చెప్పబడియున్నది. ఉదయముననే మేల్కాంచి యబ్రహాము కొడుకును వెంటబెట్టుకొని, పూజాద్రవ్యములు తీసుకొని బయలుదేరెను. "బలి కవసరమైన యన్నివస్తువులు నున్నవి. మరి గొఱ్ఱెపిల్ల యేదీ, నాయనా?" యని బాలుడు తండ్రి నడిగెను. "దేవుని బలికి దేవుడే యన్నియు నేర్పరచుకొనగల" డని తండ్రి యుత్త

మిచ్చెను. అప్పుడు బలిపీఠము నాయత్తపరచి, కొడుకును కాలుచేతులు కట్టివైచి, యాబ్రహాము వానిని దానిపై పండుకొనబెట్టి, కత్తికొరకు తన చేయి చాచెను. ఇంతలో నొక దేవదూత యాకాశమునుండి యాతనిని వారించెను. "నీ భక్తికి భగవంతుడు మెచ్చినాడు. నీ బిడ్డనైనను నీవు దేవుని కిచ్చుటకు సంసిద్ధుడవైనట్లు స్పష్టమైనది. బిడ్డనేమియు జేయకు"మని దేవదూత పలికిన పలుకులు విని యాబ్రహాము కన్నులు తెరచెను. ఒక పొదలో కొమ్ములిరుకుకొనిపోగా కొట్లాడుచున్న యొక గొర్రె యాతనికింట బడెను. అబ్రహామా గొర్రెను దేవునికి బలియిచ్చెను.

అబ్రహామునుగురించి కొరానులోకూడ నున్నది. వృద్ధుడైన యాబ్రహామునకు సంతు లేదు. "సన్మార్గుడైన యొక మగబిడ్డను నాకు ప్రసాదించు"మని యాతడు దేవుని వేడుకొనెను. ఆతని కొక మగబిడ్డ పుట్టెను. వాడు పెరిగి పెద్దవాడై తండ్రికి చేదోడుగా నయ్యెను. ఒకనాడు వానిని జూచి తండ్రి "నా బిడ్డా, నిన్ను దేవునికి బలిగా నర్పించవలసినట్లు నేను కలగంటి"నని చెప్పెను. నీ యిష్టమే నా యిష్టమని బాలుడు పలుకగా తండ్రి బాలుని బలియిచ్చుటకై బోరగిల పండుకొనబెట్టెను. ఆతని భక్తికి మెచ్చి దేవుడొక మేకను బలిగా గ్రహించి బాలుని విడిచిపెట్టెను. తాను బలి యయి మనఃజాని విడుదలచేసినందున నా దినము మేక పండుగ యయ్యెను. కీ. శే. మౌలానా మహమ్మదలీ గారి యభిప్రాయప్రకార మీ విడిచిపుచ్చబడిన బాలుని పేరు ఇస్మాయిల్. ఇస్మాయిల్ అబ్రహాముయొక్క పెద్ద కుమారుడు. ఐజాకు రెండవవాడు.

మెట్టమొదట మానవుడు దేవునికి నరబలి యిష్టమను కొని యది యర్పించుచు నది దేవుడే కోరినట్లు కథలు కల్పించినాడు. జ్ఞానము హెచ్చినకాలములో దేవుడే యాబలి మనుష్యుని రక్షించినట్లో, తిరిగి బ్రతికించినట్లో చెప్పుచు తుదకు దేవుడే నరబలిని నిషేధించినట్లు కల్పించినాడు. శతపథబ్రాహ్మణములోని యొక కథవలన జనాభిప్రాయ మెట్లు మారుచువచ్చినది తెల్లముకాగలదు.

"దేవత లాదిలో నరునే యజ్ఞపశువుగా గొనుచుండిరి. నరునిలోనుండిపోయి మేధ యశ్వము నాశ్రయించెను. దేవత లశ్వమును స్వీకరించసాగిరి. క్రమముగా అశ్వమును వీడి మృగమును, మృగమును వీడి గొఱ్ఱెను, దానినివీడి మేకను మేధ యాశ్రయించెను. పిమ్మట నది భూమిలోనికి పోయి, బియ్యము, యవలలో నిలిచెను. పైని చెప్పిన యయిదుపశువులలో నెంత గుణమున్నదో బియ్యము, యవలతో చేసిన హవిస్సునం దంతే గుణమున్నదని ఋషులు గ్రహించెదరు. నలిగిన గింజలే వెంట్రుకలు, పిండిని కలుపుటకై పోసిన నీరు చర్మము, గట్టిపడిన పదార్థ మెముకలు, నేయి మూలుగులలోని మజ్జ—పశువుల ముఖ్యాంగము లీప్రకారముగా హవిస్సులో నిమిడియున్నవి."



అభినవకాళిదాసులు

= శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి =

మహాకవి కాళిదాసు పేరు తమకు బిరుదుగా సంస్కృతకవులలో కొంద ఱున్నారు. వారందఱు రచియించిన కృతులన్నియు నిపుడు వ్యాప్తిలో లేకున్నను వారు స్వకాలమందు దేశమున ఖ్యాతి కెక్కినవారే. యనుట కీ బిరుదొక ప్రమాణము కావచ్చును. ఈ బిరుదు కలవారి సంగతి నొక్కచో చేర్చి పత్రికాపాఠకుల కెఱుకపఱచుచున్నాను.

౧

ఈ బిరుదు అభినవ-నవ-నవీన-కలియుగాది విశేషణములతో పలువిధములుగా నున్నది. ఇది కలవారిలో ప్రసిద్ధభాగవతచంపువు నిర్మించిన కవి యొకఁడు.

ఇతని యింటిపేరు 'వల్లాల'వా రనిమాత్రము ఈ చంపువునకు టీక రచియించిన పెరాతుగుంసం అక్కయ్యసూరి తెలిపియున్నాఁడు. అతనికి కూడా ఇతని యసలుపేరు తెలియలేదు. తల్లిదండ్రులు పెట్టిన పేరుం జెప్పఁడు గాని యీ బిరుదు పేరు చూచి యది మఱుఁగుపడిపోయినది. ఈ కవి కూడా తన చంపువు నందు—

"శ్రీత సాక్షాన్నవకాళిదాసబిరుదః
ష్షష్ఠోఽపి కావ్యామృతే
చంపూభాగవతం ధీమతాం కృతిమను
ల్లాసో విలాసో ఽమలః".

అనుచు వ్రాసినాఁడు కాని తన పుట్టుపేరు వ్రాయలేదు. ఇతని కీ బిరుదు తెచ్చిన ఆఱాశ్వాసముల యీ చంపు వాంధ్రదేశమున పఠనపాఠనవ్యవహారమం దెక్కుడుగా వ్యాపించియుండుటయు, వ్యాఖ్యాత కూడా తెలుఁగువాఁ డగుటయు, ఇతఁడు వెల్లాలవంశములోనివాఁ డగుటయు నితఁ డాంధ్రుఁ డని ధ్రువపఱచుచున్నవి.

ఈ కవి క్రీ. శ. ౧౧౦౦ ప్రాంతమువాఁ డనెడి కొందఱి యూహ సరి యనుటకు తగిన ప్రమాణములు లభింపలేదు గాని, ఎట్లయినా యితఁడు పూర్వులలో గణింపఁదగినవాఁడే. అభినవభారతచంపువు, కలివిడంబనము, భగవత్పాదస్తుతి అనెడి యితని యితరకృతులు దేశమున గణుతి కెక్కలేదు.

౨

మఱియొక భాగవతచంపువు రచియించిన మఱియొక యభినవకాళిదాసు గోపాలశాస్త్రి. ఇతని కాలము కూడా సరిగా తెలియదు గాని సుమారు రెండువందల యేండ్లక్రిందటివాఁడు. ఉదయార్యపేశ్వరం జమీందారు వాస్థానమున నున్నవాఁడు. ఇతని యీ కృతి యిప్పుడు దక్షిణదేశములోఁ గూడా వాడుకలో నున్నట్లు తెలియదు గాని, యితఁడు స్వకాలమున నిరంకుశుఁడై పరపులు కాని స్వకాలరాజులను ధిక్కరించినవాఁ డని వార్త యితని చాటువులు కొన్ని చెప్పుచున్నవి. అందలి దొకటి ఇది. ఇం దితని నాదరించిన ఉంగరాజ స్తుతి కూడ గోచరించును.

"అజ్ఞానా మవనీభుజా మహరహ
స్సవర్ణాక్షీకా దపి
జ్ఞాను శ్రీరుద్రవరంగభూబలరిపోః
శ్లాఘైవ సమ్మాననా,
సారాసారవివేకకూనస్కృతిరుడీ
సంభోగసామ్రాజ్యతః
సారజ్ఞేందుముఖీవిలోకనసము
త్కంఠైవ యూనాం ముదే".

౩

అసలు పేరు తెలియని యింకొక యభినవకాళిదాసు కవికుంజరుని సుతుఁడు. ఈ కవికుంజరుఁడు భోజప్రబంధమువంటి రాజశేఖరచరిత్ర యను నొక కృతి నిర్మించెను. విద్యానగరపాలకుఁ డైన యీ రాజశేఖరుని సభలో చోళదేశమునుండి వచ్చిన సర్వజ్ఞుఁ డను వాఁడు ప్రధానవిద్వత్కవిగా నున్నవాఁ డఁట. అతని నితని గురు వైన నవీనకాళిదా సోడించి యవమానించినాఁ డఁట. ఈ కవికుంజరునిగ్రంథ మిందుఁగూడా బిరుదుగానే కనఁబడుచున్నది. ఎట్లయిన, నీ కృతిలోని విషయము పరదేశీయవిద్వాంసు లను రాజసభలో చేరనీయని చోళదేశ విద్వాంసు నవమానించుట, రాజశేఖరుని సత్కారము లను నవీనకాళిదాసాదులు పొందుట యున్నది. దీనిని బట్టి విద్యానగరమునకుఁ జేరియున్న యాంధ్రకవులం దలివా రీ గురుశిష్యు లని యూహింప నవకాశము కలదు. ఈ నవీనకాళిదాసు కృతు లేవియు కనఁబడవు గాని, యితఁడు స్వకాలమున మిక్కిలి విఖ్యాతుఁడే. పై చరిత్రలోని శ్లోక మొకటి యితని నిట్లు ప్రశంసించుచున్నది.

> “రాజశేఖరభూపస్య
> సభాయాం మధురా గిరః,
> నవీనకాళిదాసాది
> గదితాః శ్రోతు మర్హథ.”

౪

వేఱొక అభినవకాళిదాసు నృసింహకవి. ఇతని యింటిపేరు తెలియదు. ఇతఁడు శివరామకవిపుత్త్రుఁడు. ఆలూరు తిరుమలకవిమిత్రుఁడు. చంద్రకళాపరిణయ మను సంస్కృతనాటకమును, హాలాస్యమాహాత్మ్య మను తెలుఁగువచనకావ్యమును నిర్మించిన యీ తిరుమలకవి అభినవభవభూతిబిరుదాంకితుఁడు. సమవయస్కులును, ఆంధ్రులు నైన వీరిద్దఱును మైసూరుసంస్థానము నాశ్రయించి గౌరవము వొందినవా రని తెలియుచున్నది.

మన నృసింహకవి నంజరాజయశోభూషణ మనెడి లక్షణముల కృతి నిర్మించెను. బరోడా సంస్థానమువారు దీనిని ప్రకటించియున్నారు. ఈ కృతినాయకుఁ డైన నంజరాజు మైసూరుసంస్థానప్రధాన సేనానాయకుఁడై క్రీ. శ. ౧౭౫౦ ప్రాంతమున వన్నెకెక్కినవాఁడు; నవభోజరాజబిరుదాంకితుఁడు. కావున నీ యభినవకాళిదాసు సుమారు రెండువందలయేండ్ల నాఁటివాఁ డనుట విదితము. నాఁటికి నేఁ డితనికృతి బయటికి వచ్చినది.

౫

మొదటిపేరు తెలియని కలియుగ, లేక అభినవకాళిదాసు మఱియొకఁడు. ఇతఁడు శృంగారకోశభాణ మను కృతి నిర్మించెను. విద్యారణ్యమాధవాచార్యుల కంటె వేఱైన మాధవుని సంక్షేపశంకరజయము రచియించెను. ఇతనికిని అభినవకాళిదాసబిరుద మున్నది. యశోల్లాసము గడించియుండిన ఆంధ్రదేశప్రసిద్ధ, శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి అభినవకాళిదాసబిరుదాంకితుఁడు. క్రీ. శ. ౧౭౯౦ లో జన్మించిన యీ విద్వత్కవి ౧౮౭౦ ప్రాంతమున స్వర్గస్థుఁ డయ్యెను. గోదావరీ మండలములో కాకినాడకు దగ్గఱగా నున్న గొల్లపాలె మితని జన్మభూమి. ఆ నాఁటి కాళహస్తి పిఠాపుర రామచంద్రపురరాజుల సత్కారము లందిన యితఁడు వేదశాస్త్రపారీణుఁడు; సంగీతనిధి.

౬

అక్బరీయకాళిదా సను నింకొక కవి కలఁడు. ఇతని నిజమైన పేరు తెలియదు. అక్బరుపాదుషాసంస్థానములోని కవులలో నగ్రగణ్యుఁడై కాళిదాసబిరుద మందిన యితని శ్లోకము లందందు కనవచ్చును గాని యితని కృతియు నిప్పుడు మృగ్యమైనది. ఇతఁ డక్బరును స్తుతించిన పద్య మిది:

> “వీర! త్వం కారుణ్యకంచే
> దకబర కలయ స్త్రీకటంకారఘోషం
> మారే. పద్మాః కలంకా
> ఇవ హరిణదృశో యాంతి కంకాళశేషాః,
> శంకావన్నః కిం కా
> రణమితి మనసా శ్రాంతి సంశ్రాయి కేన
> తత్త్వం హుంకార మంకా
> ద్విసృజతి గృహిణీం కించ లంకాధినాథ

౭

పుట్టుపేర లింభుఁడై కవితాకీర్తిని కాళిదా సని పించుకొన్న లింభుకాళిదా సాకఁడు రామచంద్రకావ్య ము నిర్మించియున్నాఁడు. ఈ పుస్తకము తంజావూరు పుస్తకభాండాగారమున నున్నట్లు గ్రంథపట్టిక తెలుపు చున్నది.

౮

విద్యావినోదనామకుఁడై సరసకవిత్వమున కాళి దాసబిరుద మంది కాళిదాస విద్యావినోదుఁ డనఁబడిన యతఁడు మఱియొకఁ డున్నాఁడు. ఇతఁడు రచియిం చిన కావ్యము శివాజీచరిత్ర.

౯

ఇంక—బిరుదనామ మనుటకు వీలులేకుండ వారి తల్లిదండ్రులచే కాళిదా సను పేరుపెట్టినట్లున్న కాళి దాసులు మఱికొంద ఱున్నారు. జ్యోతిర్విదాభరణము, శ్రుతబోధచ్ఛందశ్శాస్త్రము, శృంగారతిలకము, సేతు బంధము, పుష్పబాణవిలాసము, కుంతేశ్వర దౌత్యము, రాక్షసకావ్యము, కర్పూరమంజరి మొదలగు బహు కృతులు రచియించినవా రందఱును కాళిదాసనామ కులే.

దీని నంతను బట్టి శాకుంతలాది కర్తయైన కాళి దాసు మహత్త్వ మెట్టిదో గోచరించునుగదా! కాళి దాసనామ మంత మహామహిమ కలదనట సత్యము.



దక్షారామము

= శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి =

[ఒకనాడు — శ్రీనాథమహాకవి తన భీమేశ్వర పురాణంలో దక్షిణకాశిగా, వైభవోపేతమైన మహా పట్టణంగా వర్ణించిన నాటి శివక్షేత్రం దక్షారామం ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురానికి మూడు మైళ్ల దూరంలో 'ద్రాక్షారం' అనే పేరుతో ఒక సామాన్య గ్రామంగా ఉంది.

భీమేశ్వరపురాణం గాఢంగా చదివినమీదట ఒకనాడు 'ద్రాక్షారం' వెళ్లి భీమేశ్వరాలయం చూచిన ఒక అనుభూతికి వాగ్రూపం ఇది.]

ఉన్నావో - మరి లేకలేవా ? యిట నోహో ! భీమనాథప్రభూ,
కన్నానించినయంత నాలయపు స్వర్గప్రాయగంభీరతాం
తౌన్నత్యంబులు, దివ్యశోభ లివి యూహాన్ రేచి, సద్భావసం
పన్నత్వంబులు నిల్పి, నన్ బలుకరింపన్ సాగ నిశ్శబ్ది న్.

ఇక్కడ కాలువెట్టగ, నదేమి మహాత్త్వమొ కాని, యూహకున్
రెక్కలు వచ్చినట్లు చననేరని పూర్వయుగాల త్రోవలకున్
ప్రాక్కమనీయకాలనృపవైభవసీమల జీవశక్తి నా
దృక్కులలో వచారు లొనరించి నను౦ బలికించు నేదియో ?

ఈ పట్టణాపణహేమవేదికలందు విశ్రాంతిగొని గంట విబుధు లలసి!
దివరాజు దివినుండి దిగివచ్చి భీమేశు చేజేత నిట ప్రతిష్ఠించె నంట !
భీమయ్య దేవుండు వేంచేయు పండువు సురనరు లేకమై చూచిరంట !
విష్ణువక్షఃశయ్య విడివచ్చి శ్రీదేవి కలయంపి నీపీట చిలికెనంట !
శ్రీపురవైశ్యానలేప సందీప్తి యడర - నగరరాననఝంకారనాద మడర—
గోగులాంబిక తన్ను వీడ్కొలుప, పూని-భీమనాయకు డిట బయల్వెడలె నంట!

శ్రీనాథకవిశేముషీ నృత్యసుందరి ఘల్లని పాదమ్ము కదుపునాడు
అన్నయ్యమంత్రి ప్రాణానిలమ్ములు కళాపరిమళమ్ముకునై మరగునాడు
వీరభద్రారెడ్డి వెలిపట్టుగొడుగు నీడల కావ్యరమ నిల్చి వెలుగునాడు
శ్రీదక్షవాటికా శృంగారదేవతాసేవ కస్తూరి వాసించునాడు
ఆంధ్రరాసిక్యరీతి మిన్నంటునాడు - తెలుగుల యదృష్టరేఖ వర్ధిల్లునాడు
నాడు ధన్యతమమ్మౌ జన్మమ్ముగనక - పుట్టి నే డిట నే నెంత పొరబడితిని !

ఈ తెన్గుచిన్న యూరేనా? మహాగ్రంథ నిర్మాణగరిమ నందించె మునికి -
తొల్లి యీ చిరుతవీథులలోననా? దేవకోటులు భీమేశు గొలువ నడచె -
ఈ పల్వలమ్మునేనా? పరమర్షులు తివిరి గౌతమినుండి తెచ్చినారు -
ఈ మానశివమూర్తులేనా? మహాభారతగ్రంథకవి దయఁదలచినారు -
ఎన్ని వేలేండ్లనుండియో యింతలింతలు తఱిగి, కరగియును, వ్యస్తమగుచు
ఆ మహానుభావమ్ము మాయమయిపోయి-గళితవైభవచిహ్నముల్ నిలిచె మాకు.

ఏవయ్యా? కవిసార్వభౌమ! మును నీవిత్తుస్ఫురన్మాధురీ
కైవల్యమ్ములు చిందఁ జెప్పినవి దక్షారామసౌభాగ్యముల్
ఆ విఖ్యాతరసజ్ఞతల్ శివపద ధ్యానైకవైవశ్యముల్
లేవయ్యా! పరికింపఁగా నిపుడు నిల్చెన్ గ్రామ మేదో యిటన్.

అడుగడ్గున శివాలయమ్ములు విఘ్నేశ నిలయమ్ము లిచట గన్పింపవేల?
నలువలంకుల నిండుకొలు వుండి పురమేలు శక్తుల రక్షాప్రశక్తి యేది?
ద్వాదశక్షేత్రముల్ పంచతీర్థమ్ములు జీర్ణించి యేమూల జేరి నిలిచె?
ప్రమథవర్గము బరాబరులు భైరవమూర్తి ప్రహారి హుంకృతులు విన్పడవదేమి!
సప్తమునిసింధునికట ప్రశస్తవనిక - నీలగళు రక్తి కీర్తించు నెమళులేవి?
శివశివా! నాటి గరిమమ్ము చెరగనేమొ - దక్షిణపు కాశి యన్నట్టి దక్షవాటి.

దక్షారామపురమ్ములో నిపుడు గంధర్వాప్సరోభామినీ
సాక్షాత్కారము లేదు; హృద్యతరతత్సంగీత సాహిత్యకా
లక్షేపమ్ములు, మంజునూపుర చలల్లాస్య ప్రసంగస్ఫుర
ద్వ్యక్షేప క్రమవిభ్రమమ్ములవి యన్వేషించినన్ లేవిటన్.

చంద్రచూడుని దివ్యసన్నిధిసేవకై నృత్యసుందరులు రారేల యింక?
పెద్దగాలపు వేల్పు భీమయ్య మురిపింప ఏతేరరేమి పూర్ణేందుముఖులు?
మొగలిమండప మిట్టె పుల్కరింపగ ఘలుల్ హల్లీసకము రక్తి నాడరేల?
భవు సభాభవనమ్ము పజ్జ లోలాక్షుల లేతనవ్వులు గుబాళింపవేల?
'దక్షపురిసానికూతుల' ధవళనేత్ర - కుసుమవిక్షేపవిభ్రమత్ ప్రసవబాణ
పుష్పకోదండజృంభణ స్ఫూర్తి నేఁడు - భీమనాథుని నగర గన్పింపదేల?
దేవత లీమహాలయము దిద్దిరవా? రను పౌరవృద్ధగా
థావచనమ్ము నాగరిక తర్కవిరుద్ధముగాని - శిల్పను

శ్రీవిభవమ్ము జూడ నరుచేతులు తాకిన జాడ తోచ ద
య్యా, వినుతెన్గుశిల్పి ! యమరాద్భుత మూర్తిని మాదుపాలికిన్.

ఈ కంబంబున చిత్రమేమి ? మృగశిల్పి ! రమ్యా ! వ్యాఖ్యానముల్
వాకొమ్మోయి, శిలాహృదుల్ పులకరింపన్ భావబంధమ్ములన్
నీ కల్యాణకరమ్ము చాచి ఉలితో నిర్మించితన్నా ! నమో
వాకమ్ముల్ గొను మాంధ్రశిల్పకుశలవ్యాపారపారంగతా !

ఇది దక్షాధ్వరకుండమంట అది యెన్నేళ్లయ్యెనో గాని యీ
పదముం జూడగ వీరభద్రకృత దుర్వారాగ్రహోహంక్రియా
స్పదమై క్రాగిన జాడ లిప్పటికి విస్పష్టమ్ములౌ; తోచు మా
మదిలో దక్షుని గండుగర్వితనముల్ మాతండ్రి సౌజన్యముల్.

ఎంత దక్షుడవైన, మహేశమూర్తి - నల్లువాని వచస్సుధల్ జల్లువాని
ఈసడించితి వంట ము న్నిచట, దక్ష!- కాలగతిముందు నీవెంత? గతికపాటి.

ఏవంవిధకథ లెన్నో - భావనలో కదలి రంగుస్వప్నములై బో
ధావిర్భావము గల్గిన - పోవును; నే నంత దెల్లపోయెద నిచటన్.

ఏవేవో తల్లక్రిందులయ్యె, నరె కానీ - సత్కళాబంధుర
ప్రావీణ్యంబులు, దక్షవాటిక మహాభాగ్యానుబంధమ్ములన్
తేవంచుర్ణ విలపింపబో నిట భవానీనాథ ! నీహాగ్మ్యము న్
నీవున్ నిల్పిన చాలు మా కెపుడు, తండ్రీ ! భీమనాథప్రభూ !



రెడ్లు పల్లవులా?

= శ్రీ సి. ఆర్. కృష్ణమాచార్యులు =

రెడ్లను గురించిన చరిత్రలలో వారి తొలిపుట్టుకను గూర్చిన సమస్యలు పెక్కులు పెక్కు విధముల పరిశీలింపబడి యున్నవి. వీరు పూర్వపు రాష్ట్రకూట వంశమునుంచి వచ్చినవారనియు, పలుబిరుదములతో పెక్కుచోట్ల ప్రసిద్ధి వచ్చినదనియు ఊహలు చేయబడినవి. రెడ్లు, రట్టోడ్లు, రట్టకుడ్లు, రట్టగుడ్లు మున్నగు బిరుదములను పూర్వశాసనములలో కానవగును. ఈ బిరుదులన్నియును 'రాష్ట్రకూట' పదమునుంచియే యవతరించియుండవలె నని కొందరి యభిప్రాయము. రాజపుత్రులలో నొక శాఖయైన 'రాష్ట్రోడ్ల'తో పూర్వము రెడ్లకు సంబంధ ముండియుండవలె ననియు, అందువలన రెడ్లు రాజపుత్రాంశు లనియు నొక యూహ యున్నది.

ఇది యిట్లుండ శాసనములవలన మనకు కొన్ని క్రొత్త సమస్యలు ఏర్పడుచున్నవి. ఆంధ్రదేశములోని కొన్ని శాసనములలో రెడ్డిరాజులు 'పల్లవాదిత్య, పల్లవత్రినేత్ర' యను బిరుదములు వహించియున్నారు:—

శకవర్షము ౧౨౮౭ (క్రీ. శ. ౧౩౬౫) లో నిర్మింపబడిన పచ్చనికొండపల్లి రాగిశాసనములో దాతయైన అనవేమప్రభువు శాసనాంతమున 'పల్లవత్రినేత్ర' యని వ్రాలు చేసియున్నాడు (Ep. Rep. 1920, P. 120)

నెల్లూరు జిల్లా కందుకూరుతాలూకాలో మాల కొండ దేవాలయము పూజారికి ఇవ్వబడిన యొక భూదాన తామ్రశాసనములో వేమారెడ్డి 'పల్లవత్రినేత్ర' యను బిరుదమివ్వబడియున్నది. (Nell. Inss. Pt I, Cp No 5) ఈ శాసనముయొక్క కాలము క్రీ. శ. ౧౪౦౬-౭.

ఇదియునుగాక, నెల్లూరు జిల్లా కందుకూరు తాలూకాలోని పాతచుండి గ్రామమున జనార్దనస్వామి దేవాలయమున నొకశాసనమున శ్రీశైలపర్వతమున సోపానాలు నిర్మించి నిష్పిమభూదానమును, హేమాద్రి దానాలును జేసిన వేమారెడ్డి 'పల్లవాదిత్య, పల్లవత్రినేత్ర'యను బిరుదములను వహించియున్నాడు. (Nell. Inss. Kandukur, No. 18.) ఈ శాసనము యొక్క కాలము శకవర్షము ౧౨౬౦ (క్రీ. శ. ౧౩౩౮-౯)

'పల్లవాదిత్య, పల్లవత్రినేత్ర' యను నపరనామ ధేయములు రెడ్డిరాజుల శాసనములలోనే గాక కొన్ని గ్రంథములలోగూడ పేర్కొనబడి యుండుటచేత వీరికి ఆదికాలమున పల్లవవంశముతో రక్తసంబంధ ముండి యుండవలెనని శ్రీ. శ్రీ. రాయ్‌బహదూరు వెంకయ్య గారును అభిప్రాయపడియున్నారు. (Ep. Rep. 190', P. 22, Para 57)

ఆదిమపల్లవులు తాము భారద్వాజగోత్రజుల మనియు, 'బ్రహ్మ - క్షత్ర' వంశజుల మనియు చెప్పుకొని యున్నను కాలక్రమేణ పరిస్థితులు మారి పోయిన కారణమున రెడ్లు వారి ప్రభుత్వకాలమునాటికి వారు చతుర్థాన్వయుల మనియే చెప్పుకొని యున్నారు. మధ్యకాలమున నే విపరీతకారణములవలన తమ గోత్రాదులను మఱచిపోయియుండినను తాము పల్లవాంశజులనిమాత్రము వారు మఱవలేదు. ఈ కారణముల వన్నిటిని బట్టి చూచిన పల్లవుల రక్తము రెడ్లలో నిలిచి యుండెననుటకు గొప్ప యాక్షేపణ లెవ్వియు కానరావు.

వియోగగీతి

శ్రీ త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి

నిను గాంచు భాగ్యమే లేదా!—ఇంక నే
మనియుంట వ్యర్థమే కాదా!

పరిచయము లేని నా ప్రాణాప్తుడ వీవు,
ఎంగవోయీ యెంత పరిచితుడవో నాకు!
ఇన్నాళ్లనుండి నీ వెచట దాగితివోయి,
ఎరుగుదువె నీకొఱకయి నీవిరహవేదనము—

నిను......

ఆకస్మికముగ నీ వవతరించిన వేళ
అదరుతో గంటి నిన్ననిమేషదృష్టిగా,
తిరిగి నీజాడకై దిగ్గగనము లెల్ల
తేరిచూచిన గానరా వెచటి కేగితో!—

నిను......

కలకంఠమును రాతిగూటిలో బంధించి
వెలిగించితిని రత్నపాత్రికల దీపికలు,
ఆవరించిన వేళనో కనులు చీకటులు
అపరిచితుడా! ఎచట నేరీతి నుంటివో!—

నిను......

కూయవిక కోయిలలు, పూయవిక పుష్పములు,
కాయ విక వెన్నెలలు, పాయు విక మేఘములు,
ఉరిమి పిడుగులు రాల్చి మెరపువానలు కురియ,
ఓయి పరిచితుడ! నీ వొంటిగా నుంటివా!—

నిను......

నిర్భాగ్యులు

[కథానిక]

= శ్రీ సీతారాం =

సింహాద్రి చిన్నప్పట్నుంచీ ఒక వర్కుషాపులో పనిచేస్తూవుండేవాడు. రోజుకి గంటెణాల కూలి దగ్గిర్నుంచీ రూపాయిన్నరదాకా వచ్చాడు. ఒక బీడీ, టీ తప్ప వేరే దుర్గుణాలేమీ లేవు. ఎంత డబ్బొస్తే అంతా, తన చేతిఖర్చుకి కొంచెం వుంచుకుని, తీసుకెళ్లి తండ్రి కిచ్చేసేవాడు. తండ్రే యింటిపెత్తనం అంతా చూచేవాడు. తండ్రికి దగ్గరదగ్గర యాభైఏళ్లుంటాయి. ఒక మిల్లులో వాచ్‌మెన్‌పని అతనికి. పోలీసుపని చేసి మానేశాడు. ఓ పదిరూపాయలు పెన్షను వచ్చేది. ఆ పదిరూపాయలు, మిల్లులో తన జీతం పదిహేనురూపాయలు, సింహాద్రిజీతమూ—అదే వారి మొత్తం ఆదాయం. ఇంట్లో నలుగురున్నారు: సింహాద్రి, అతని తల్లీ, తండ్రీ, అప్పలమ్మ. అప్పలమ్మ సింహాద్రి మేనమామకూతురు. ఆపిల్ల తల్లీ, తండ్రీ చిన్నప్పుడే చచ్చిపోయారు. అప్పట్నుంచీ ఆపిల్లని సింహాద్రితల్లే సాకుతూవుంది. వాళ్లకొచ్చే డబ్బు బాగా సరిపోవాల్సిందే. కాని సింహాద్రితండ్రికో చిన్న దురలవాటు వుంది—తాగుడు. దాంతో ఏమొచ్చినా చాలేదికాదు. సింహాద్రి ఇప్పటికాలపు మనిషి. కాకపోవడంమూలాన తండ్రిని ఎదిరించేవాడు కాడు. తల్లితో మెల్లగా చెప్తూవుండేవాడు: వచ్చేనెలనుంచీ తన జీతం యింట్లో యిస్తాననీ, ఏమేమి కావలసినా తనే తెస్తాననీ. కాని ఎప్పటికప్పుడు యిలా అంటూవుండడం, జీతం తెచ్చి తండ్రి కిచ్చేస్తూవుండడం జరుగుతూ వుండేది. తండ్రంటే అదేమిటో విపరీతమైన భయంగా వుండేది సింహాద్రికి తనకి పాతికేళ్లొచ్చినా.

సింహాద్రిపెళ్లి పంధొమ్మిదో ఏట జరిగింది. అప్పటికి అప్పలమ్మకి ఏడోఏడు. ఇద్దరికీ మధ్య తేడాలు పన్నెండేళ్లు వారా. సింహాద్రి కింకా చిన్నప్పుడే పెళ్లికావలసిందికాని సింహాద్రితల్లి తన మేనకోడల్ని చేసుకోవాలని ఆపిల్లకి ఏడోఏడు వచ్చేవరకూ పెళ్లి ఆపింది. మొత్తంమీద తన కోర్కె నెరవేర్చుకుంది. చిన్నప్పట్నుంచీ అప్పలమ్మా, సింహాద్రీ ఒకేచోట వుండబట్టిగాబోలు ఎప్పుడూ గిల్లికజ్జా లాడుకునేవారు.

కాని అప్పలమ్మకు వయస్సు వస్తున్నకొద్దీ బావను చూస్తే చాటుచాటుకి వెడ్తూవుండేది. సింహాద్రి కూడా చనువుగా అప్పలమ్మను పిలిచేవాడు కాదు. తనను చూచి చాటుకి వెడుతూవుంటే కనుకొలకుల్లోంచి ఆమెయువ్వనాన్ని చూచి మురిసేవాడు.

అప్పలమ్మ పెద్దమనిషి అయింది. దసరాదశమికి ఇద్దర్కీ సంధానం చేయడానికి నిశ్చయించుకున్నారు.

విజయదశమి వచ్చింది. ఆరోజు వూరంతా సందడిగా వుంది. ఏఇంటికి చూచినా పచ్చతోరణాలే. పిల్లలు విల్లంబులు పుచ్చుకుని బడిపంతుళ్ల వెనకాల "జయాభిజయీభవా దిగ్విజయీభవా" అని కేకలేసుకుంటూ పప్పుబెల్లాలకు యింటింటికీ తిరుగుతున్నారు. కొందరు పెద్దపులివేషాలు వేసుకుని డప్పులు ముందు రణగొణధ్వని చేస్తూవుంటే వెనకాల తందనాలు త్రొక్కుతున్నారు. జనం-ముఖ్యంగా పిల్లలు-మూకలు మూకలుగా వేషాల వెంట తిరుగుతున్నారు. ఎక్కడ చూచినా కోలాహలమే.

ఆరోజు సింహాద్రికి మహా వుషారుగా వుంది. షావుకారుగారు వర్కుషాపు పనివాళ్లందర్నీ ఆ రోజు వుదయమే వచ్చి మరలన్నిటికీ పసుపుకుంకాలు పెట్టి పూజచేస్తే, కాసేపు వర్కుషాపు వదిలి తర్వాత కట్టేసి వెళ్లిపోవచ్చు నన్నారు. అంతా కొత్తగుడ్డలు కట్టుకుని ముఖానికి కుంకంబొట్లు పెట్టుకుని వర్కుషాపులో వుదయానే చేరారు.

పసుపుకుంకాలు పెట్టారు మరలకి. కొబ్బరికాయ కొట్టారు. అటుకులూ, బెల్లం కలిపి అందరికి పంచిపెట్టారు. వర్కుషాపు వదిలారు.

సిమ్మాద్రి హుషారుగా యంత్రాలమధ్యనుంచి అతి తొందరగా పళ్లచక్రాలకు తన గుడ్డలు తగలకుండా చాకచక్యంగా తప్పించుకుంటూ తను పనిచేసే యంత్రం దగ్గిరికి వచ్చాడు. తనకు కావలసిన పనిముట్టు ఒకసారి సావసట్టి యంత్రానికి బిగించాడు. చక్రం మెల్లిగా తిరుగుతోంది. తనకు సాయం చేసే కుర్రాడు ఆరోజు పండగని అసలు పనిలోకి రాకుండానే ఎగ్గొట్టేశాడు. చక్రం సరిగ్గా తిరగకుండావుంటే చికాకువేసి తనే షాఫ్టుమీది కెక్కి ఒకసారి నూనె వేశాడు బాల్ బేరింగులో. బాల్ బేరింగు అరిగిపోయింది. షాఫ్టు సరిగ్గా తిరగక బెల్టు పుల్లీమీదనుంచి మాటిమాటికీ టపటపమని జారిపోతోంది. అతనికి చికాకువేసింది. వర్కుషాపు కట్టించి ఆ పని చూద్దామంటే అప్పలారోజు ఎంతోసేపు పనిచెయ్యక్కరలేదాయె. ఇది ఆపి మళ్లీ మొదపెట్టి పనిచేస్తే చాలా ఆలస్యమవుతుంది. అందుకని పైకెక్కి ఒక చేత్తో జాగ్రత్తగా దూలానికి ఆన్చిన నిచ్చెన పట్టుకుని రెండోచేత్తో పుల్లీమీదికి బెల్టు లాగి వేశాడు. ఎక్కిందిగాని మళ్లీ టపటపమంటూ జారిపోయింది. ఇంకెవరినయినా పిలవద్దామనుకున్నాడు గాని యీ మాత్రానికే ఎందుకులే అని వూరుకున్నాడు. మళ్లీ గట్టిగా లాగి బెల్టు పుల్లీమీద వేశాడు. బెల్టింకు పూర్తిగా అరిగిపోయింది — చూచుకోలా. పెద్దపుల్లీ తిరిగే తీవ్రంమీద బెల్టు ఫెళ్లున తెగి సిమ్మాద్రికళ్లకు కొట్టింది. సిమ్మాద్రికళ్లు గిర్రున తిరిగిపోయాయి. పట్టుకున్న దూలం విడిచేసి రెండుచేతుల్తో కళ్లు గట్టిగా పట్టుకుని 'బాబోయ్' అని పెద్దకేకేసి నిచ్చెనమీదనుంచి కిందికి దొర్లిపోయాడు. దెబ్బతగలడం, కిందకి దొర్లిపోవడం కన్ను మూసి తెరిచేలోపల జరిగిపోయాయి. కిందికి దొర్లిపోవడంలో, అదృష్టవశాత్తు, ఏ యంత్రంమీదా పడలా. కళ్లవెంట నెత్తురు కాల్వలుకట్టి ప్రవహిస్తోంది. సిమ్మాద్రికి నోట మాట లేదు. అతనికి బాధే తెలియదు. శరీరం కొయ్యబారిపోయింది.

పనివాళ్లంతా పరుగెత్తుకొచ్చారు వర్కుషాపు కట్టేసి. సిమ్మాద్రిని ఆస్పత్రికి చేరవేశారు.

కళ్లు పరీక్షచేసి మళ్లీ వస్తాయో రావో చెప్పలేనన్నాడు డాక్టరు.

ఈ వార్త వూరంతా—ఆ వెంత వూరుగనక!—ఇట్టే పాక్కుపోయింది.

ఈ వార్త తెలిసేటప్పటికి అప్పలమ్మ జడేసుకుని పువ్వు పెట్టుకుంటోంది; ఎప్పుడు చీకటిపడుతుందా, ఎప్పుడు తన బావ తనను తన బాహువుల్లోకి లాక్కుంటాడా అని వేదనపడిపోతోంది—ఈ వార్త చెవినిపడేటప్పటికి ఆమెమనస్సెంత క్షోభించిందో ఎవరు వర్ణింపగలరు?—ఆమె స్పృహలేకుండా నేల కొరిగిపోయింది.

ఆమె అత్తా, మామా ఆమెమాట తలపెట్టకుండా, గుండెలు బాదుకుంటూ సిమ్మాద్రికోసం బయలుదేరారు. కన్నకడుపుతీపి!

ఇరుగూ పొరుగూ అమ్మలక్కలు అప్పలమ్మ చుట్టూ చేరి ముఖాన చన్నీళ్లు కొట్టి సేదదీర్చి ఓదార్పు మాటలు చెప్పనారంభించారు. హృదయంలో రేగిన ఆ శోకదావాగ్నిని ఎన్ని సముద్రాలలోని నీరు చల్లార్చగలదు?—

* * *

కాలం గడిచింది.

కాలానికి ఒకరంటే దయా? అభిమానమా? తను నడిచిపోతుంది. ఎవరయినా బాధపడుతున్నారంటే ఏమయినా ఒక క్షణం నిలబడి ఓదారుస్తుందా? అయినా అసలు తనే నిలబడితే బాధపడేవారి బాధ మరీ ఎక్కువవుతుందేమో? అవును! తనే నిలబడితే బాధపడేవాళ్ల జీవితం ఏంకాను? వాళ్ల బాధ కిక అంతెక్కడుంటుంది?

కొన్ని నెలలు గడిచాయి.

సిమ్మాద్రికళ్లు పూర్తిగా పోయాయి.

అతడికిక యీ ప్రపంచంలో కావలసిందింకే ముంది? ఇక ప్రపంచంలో తనకు కనిపించేదేమిటి? అమ్మ, నాన్న, తన అప్పలమ్మ, తన గుడిసె, ఇరుగూపొరుగూ, తన స్నేహితులు, ప్రపంచానికంత

కూ వెలుగునిచ్చే సూర్యుడూ, పచ్చికబయళ్లు, తనను ఎప్పుడూ ఆకర్షించే ఎత్తయిన కొండలు, చక్కటి లోయలు, మంచిపశువులు, వెన్నెలరాత్రులలో ఆకాశాన మబ్బులచాటున దోబూచులాడే చంద్రుడు, —ఒకటేమిటి, ఇక తనకు ఈప్రపంచంలో ఏవీ కనిపించవన్నమాట! ఇంకా తనకు పాతికేళ్లు దాటలేదే, ఇంకా ఎన్ని సంవత్సరాలు, ఎన్ని యుగాలు తను ఇలా జీవించివుండాలి? ఈ ప్రపంచంతో తన కిక సంబంధమేమిటి? తన నెవరు ప్రేమిస్తారు?—అమ్మ, నాన్న! అవును, నిజమే, అమ్మ, నాన్న ప్రేమిస్తారు, కడుపున పుట్టబట్టి. కాని అమ్మానాన్న ప్రేమతో తృప్తిపడే వయస్సు దాటిపోయిందే!—అప్పలమ్మ తనను ప్రేమించదూ?—చిన్నప్పట్నుంచీ కలిసితిరగలా?—అప్పలమ్మకు తనమీద దయ కలగదూ!—ఏమో—గుడ్డిమొగుడు తన కెందుకనుకుంటుందేమో? అబ్బ! తన కెందుకీ వెధవజీవితం?—తను బాధపడడం, ఇతరులను బాధపెట్టడం? తను బ్రతికివుంటే తన కేమిసుఖం, ఇతరుల కేమిసుఖం? తల్లితండ్రినీ ఇక తను సుఖపెట్టలేడుగదా?— చచ్చిపోతే?— అబ్బ, ప్రాణం ఎంతతీపి!—గుడ్డివాడిదిమాత్రం ప్రాణం కాదూ? గుడ్డివాడికి మాత్రం కోర్కె లుండవూ? చూడకపోతే మానె, తానేమయినా సుఖా లనుభవించలేడూ?—

తనకు కళ్లెందుకు పోయినా యసలు? ఆనాడు తెను పనిలోకి పోకపోతే? పోకుండా ఎలా వుంటాడు? ఎవరికి తెలుసు కళ్లు పోతాయనీ, తన కిక ప్రపంచమే శూన్యమయిపోతుందనీ?

తనకు కళ్లు పోయినాయి? ఎందుకు పోయినాయి?—తన కర్మ! నిజమే, కర్మ!—తన సావుకారు మంచివాడే! అయితే తన పోయిన కళ్లు తెచ్చి పెట్టగలడా? రెండువందల రూపాయలిచ్చాడు. తన కళ్ల విలువ రెండువందల రూపాయలా?—ఒక్కొక్క కన్నుకు ఒక్కొక్క వందా? భగవంతుడిచ్చిన కళ్లకు మనిషి ఎలాటి విలువ కట్టాడు!—ఏదీ రెండువంద లిస్తాను, నీ రెండుకళ్లు నాకిచ్చెయ్—

రెండువందలిచ్చిన ఆ పెద్దమనిషేమనుకుంటున్నాడు? "పాపం, మంచిదెబ్బ తిన్నాడు. ఏం చేస్తాం? మిల్లుల్లో ఇది మామూలే. ఎవరి కర్మ వారిది —రెండువంద లిచ్చానుగా?" ఇష్టం వున్నా లేకపోయినా అసామ్మ ప్రభుత్వమే యిప్పిస్తుంది—కాని అది తనే స్వయంగా దయార్ద్రహృదయుడై యిచ్చాడే! పైగా రెండుమూడునెలల గ్రాసం ఇంటికి పంపించాడు! అతనికి అయిన మందుఖర్చంతా ఇచ్చాడు! నిజమే, అంతకంటే తను చేయగలిగిం దేముంది?

వర్కుషాపులో అందరూ ఆ రెండువందలలో సిమ్మాద్రిమాట మరచిపోయారు. సిమ్మాద్రి పనిచేసే యంత్రందగ్గిరికి యింకొకడు వచ్చాడు. వర్కుషాపు యథాప్రకారం నడచిపోతూనేవుంది.

* * *

సిమ్మాద్రి ఇల్లు కదలడంలా. అప్పలమ్మ అష్టమయిన చాకిరీ చేస్తోంది. అప్పలమ్మమాట తలచుకుంటే సిమ్మాద్రిగుండెలు నీరయిపోతాయి. తనవంటి దౌర్భాగ్యుణ్ణా ఆమెకు మొగుడు? ఎంత చక్కగా కన్పించేది తన కళ్లకు!

అప్పలమ్మకి మొదట్లో తన మొగుడుకళ్ల వంక చూస్తే భయమేసేది—రానురాను భయంతగ్గింది. అతన్ని చూస్తే జాలేసేది. కాని, అతనిమీద వాంఛ మాత్రం కలిగేదికాదు. అత నెప్పుడైనా సరాగా లాడితే ఏవగించుకునేదికూడాను. మనిషి శుభ్రంగా వుండమంటే వుండేవాడు కాదు. సరిగ్గా ఒంటిమీద గుడ్డయినా వుంచుకునేవాడు కాడు. గడ్డం మాసిపోయి ఎప్పుడూ బికారిలా వుండేవాడు. తనెలా వున్నాకో తనకు కనిపిస్తేగా శుభ్రంగా వుండడానికి ప్రయత్నం చేసేందుకు!

ఇలా కొన్ని నెలలు గడిచింది. యుద్ధ మొచ్చింది. దానివెంట కొన్నాళ్లకి కరువు. ఇంట్లో ముసలాడి తాగుడు, బయట కరువు దుంప తెంపేస్తున్నాయ్.

ఒకడు తెచ్చిన డబ్బుతో కరువుకాలంలో నలుగు రెలాగ తినగలరు? కొన్నాళ్లు పస్తుపడుతున్నారు — ఇప్పుడు సిమ్మాద్రితల్లి అప్పలమ్మను దూషించడం మొదలుపెట్టింది. "నిన్ను ఇంట్లోకి తీసుకొచ్చింది మొదలూ దరిద్రమే. పుట్టి తల్లినీ, తండ్రినీ పొట్టపెట్టుకున్నావు. నిన్ను నాకొడుక్కి కట్టుకుని

నాకొడుకుకళ్లు మంటపెట్టుకున్నాను." అని వెక్కి వెక్కి ఏడ్చేది.

నిజంగా తనమూలానే కళ్లు పోయాయా? తనేం కళ్లు పీకేసిందా?—అప్పలమ్మకు చిన్నతనపు వుక్రోషం వచ్చేది. దుఃఖమూ వచ్చేది. వీళ్ల ఇంట్లో పడబట్టిగదా తన కీకర్మ!

రానురాను సిమ్మాద్రినికూడా తల్లిదండ్రులు దూషించడం మొదలుపెట్టారు. కరువుకాలంలో ఎవరు కూర్చోబెట్టి తిండిపెడతారు, పోయి అడుక్కుతినండనేవారు. రోజురోజుకీ సతాయింపు జాస్తీఅయింది, అప్పలమ్మను కొట్టడంకూడా మొదలెట్టారు. సిమ్మాద్రికీ, అప్పలమ్మకీ ఆఇల్లు నరకకూపం అయింది. ఆబాధ వాళ్లు భరించలేకపోయారు—సిమ్మాద్రి, అప్పలమ్మ కూడ బలుక్కున్నారు. నిజమే, వాళ్లన్న మాటలో తప్పేముంది? కరువుకాలంలో ఒకరొకర్ని ఎలా పోషించగలరు? వాళ్లచేత రోజూ తిట్లు తింటూ ఇంట్లో మాడిచచ్చేకంటే ఇల్లు విడిచి ఎక్కడికయినా పోయి అడుక్కుతింటే మేలుకాదూ?

ఒకరోజు రాత్రి ముసిలోళ్లిద్దరూ నిద్రపోగా చూచి సిమ్మాద్రీ, అప్పలమ్మా ఇల్లుదాటేశారు.

ఏవో వెర్రిపదాలు పాడుకుంటూ రైళ్లలో బిచ్చమెత్తుకోవడం ఆరంభించారు. మిలిటరీవాళ్లు వేళాకోళా లాడి చాలుడబ్బులు పారేసేవారు—దానితో కడుపు నింపుకునేవారు.

గుడ్డాడి పెళ్లాన్ని చూస్తే నలుగురికీ అనవుగా వుండేది. వయసులో వున్న యువతి. చక్కటి అవయవాలు, తీరయిన నడక—చూడ ముచ్చటగా వుండేది. రైళ్లలో తిరుగుతూవుంటే మిలిటరీవాళ్లు మీద పడిపోయేవాళ్లు. కొత్తలో కొన్నాళ్లు అసహ్యించుకున్నా అప్పలమ్మకి రాను రాను వాళ్లు వేళాకోళాలాడుతూ వుంటే సరదాగా వుండేది. రకరకాల మనుష్యులు—చక్కటి గుడ్డ లేసుకుని దర్జాగా వుండేవాళ్లు. రోజురోజుకీ తన పక్కని పెద్ద జీబులా మొగుణ్ని చూస్తే అప్పలమ్మకి అసహ్యమేసేది.

ఒకరోజు ఒక మిలిటరీవాళ్ల పెట్టెలో ఎక్కారు—అంతా తెల్లవాళ్లు. గుడ్డాడిని చూచి ముందు తోసెయ్యబోయారుకాని వెనకాల అప్పలమ్మను చూచి రానిచ్చారు. అప్పలమ్మకి అప్పటికి మిలిటరీవాళ్లతో ఎలా సంచరించాలో చేతయింది. ఏవో వెర్రిపదాలు కాసేపు పాడారు. బండి కదిలింది, వీళ్లు బండిలో ఎక్కినప్పట్నుంచీ మిలిటరీవాళ్లకి కోతికి కొబ్బరికాయ దొరికినట్లుంది. బండి కదలగానే ఒకడు కొంగుచ్చుకు లాగాడు అప్పలమ్మని—విదిలించుకుంది. ఇంకొకడు చెయ్యిలాగాడు—ఒళ్లు పులకరించింది. ఒకడు నారింజగింజ మీద తుప్పుక్కున వుమ్మేశాడు — దులిపేసుకుంది. ఒకడు కన్నుగీటాడు—నవ్వుకుంది. ఇన్ని చేసినా నోట కేకయినా వెయ్యలా. మొగుణ్ణి ఓమూల కూచోబెట్టి కొంచెం దూరంగా నంచుంది. ఏం జరిగేదీ మొగుడికి తెలియకూడదని. కాని సిమ్మాద్రికిమాత్రం ఏదో అల్లరి జరుగుతోందని అనుమానంగానే వుంది. "ఏందే అప్పలమ్మా, ఏందే?" అని అడిగాడు. "ఏంలేదు. ఆళ్లల్లో ఆళ్లు దెబ్బలాడుకుంటున్నారు." అంది అప్పలమ్మ.

సిమ్మాద్రికి ఏమిటో ఒంటిమీద తేళ్లూ జెర్రులూ ప్రాకుతున్నట్లనిపించింది. పక్కని తడిమాడు—అప్పలమ్మ వుందేమోనని. అప్పలమ్మ కనపడలా. "అప్పలమ్మా" అని కేకేశాడు.

జవాబు లేదు. మిలిటరీవాళ్లు పకపకా నవ్వడం మాత్రం వినిపించింది.

మళ్లీ కేకేశాడు—"అప్పలమ్మా" అని.

"ఎందు కల్లా గొడ్డులా అరుస్తావ్? వొళ్లో కెళ్లా"నంది అప్పలమ్మ. కాబోలు ననుకున్నాడు.

ఆపెట్టెలోంచి పక్కస్టేషన్లో దిగిపోయారు. అది పెద్ద రేవుపట్టణం. ఎక్కడ చూచినా మిలిటరీ లారీలు, మిలిటరీవాళ్లు—పట్టణం బాగా సందడిగా వుంది.

రైలు దిగిందేగాని అప్పలమ్మ శరీరంలో రక్తం వుడికిపోతూనేవుంది. ఏమిటో వెర్రెత్తినట్లుంది.

చీకటిపడుతోంది. ఒక సందంట నడిచిపోతున్నారు. అంతదూరాన ఓ మిలిటరీవాడు—ఓవొర చేత్తో పిలుస్తున్నాడు. ఎవరినో అని వెనక్కు-

చూచింది. తనవెనక ఎవరూ లేరు. మొగుడు మాత్రమే వున్నాడు. మొగుడు పుచ్చుకున్న కర్ర ఒకవైపు తను పుచ్చుకుని నడిపించుకొస్తూవుంది.

ఆదేపనిగా పిలుస్తూవున్నాడు దొర. జేబులో నోట్లు తీసి చూపిస్తున్నాడు. వెనక మొగుణ్ణి చూచింది —అవతల దొర పిలుస్తున్నాడు—కాళ్ళు పరుగులు తీస్తున్నాయి.

మొగుణ్ణి రోడ్డుపక్కన కూచోబెట్టి "ఉండు, వస్తున్నా"నంది.

సుద్దాడిని కూచోపెట్టడం చూచాడు దొర. అప్పలమ్మ పదిఅడుగులయినా వెయ్యలేదు. దొర పరిగెత్తుకొచ్చి అప్పలమ్మని అమాంతం చేతుల్లోకి ఎత్తేసుకున్నాడు.

సింహాద్రి ఆ రాత్రంతా 'అప్పలమ్మా' అని అరుస్తూ ఆ రోడ్డుపక్కనే కూర్చున్నాడు. "నా అప్పలమ్మ ఎక్కడయినా కన్పించిందా?—నా అప్పలమ్మ" అని ఏడ్చాడు; పెడబొబ్బ లెట్టాడు. ఇంత పట్టణంలో ఎవరో అప్పలమ్మ?

తెల్లవారింది. డొక్కలు మాడుతున్నాయి. దోవపోయేవాళ్లు సుద్దాడిని చూచి జాలేసి కానీ, పరకా పారేశారు. అవి ఏరుకున్నాడు. ఇన్నాళ్లూ తనను అప్పలమ్మ నడిపించుకెళ్లేది, ఎక్కడికి కావాలన్నా. ఇప్పుడిక తన కెవరు దోవచూపిస్తారూ?—

* * *

అప్పలమ్మకి ఇట్టే తెల్లవారిపోయింది. ఇదో ప్రపంచం! సముద్రపొడ్డున ఇసక ఎంత మెత్తగా వుంది!

మళ్లీ మొగుడిదగ్గర కెళ్లాలంటే మనసొప్పలా అప్పలమ్మకి. దొర చేతినిండా డబ్బిచ్చాడు. సముద్ర పొడ్డునే ఒకగది అద్దెకు తీసుకుంది. మిలిటరీ వున్న పట్టణమేమో—కాలక్షేపానికి కొదవలేదు. మంచిమంచి చీరలు కట్టుకున్నప్పుడల్లా అనుకునేది తను ఇంత అదృష్టం చేసుకుంటే సుద్దాడితో కాపురంచేయడం ఎలా జరుగుతుందని. అప్పలమ్మకి యిప్పు డొక దాసీది కూడా.

ఇలా ఒకటి, రెండు సంవత్సరాలు గడిచాయి.

సింహాద్రికి ఇప్పు డొక బిచ్చగాడు స్నేహితుడు. ఆ బిచ్చగాడు రాయిలా వుండడం మూలాన వాడికెవడూ కానీ ఇచ్చేవాడు కాడు. ఏ అమ్మ పెట్టేదు మాదాకబళం పడేసేది కాదు. సుద్దాడి పేరు చెప్పుకు బ్రతకొచ్చని సింహాద్రితో చేరాడు. అలాగే వాళ్లు కాలం గడిపేవారు. సింహాద్రి ఇప్పుడు అప్పలమ్మమాట తలవడమే మానేశాడు. ఏ మిలిటరీలారీకింద పడి చచ్చిపోయిందో అనుకునేవాడు.

* * * *

ఇప్పుడు అప్పలమ్మకు అప్పుడప్పుడు జ్వరం తగులుతోంది. ఒళ్లంతా మంటలు. ఏమిటో తీవ్రమయిన బాధ పట్టుకుంది. కొన్నాళ్లు ఏమీ లేదనుకుని బాధ మరచిపోవాలని చూచింది. కాని వశమా? బాధ నానాటికీ ఎక్కువయిపోయింది. పెద్ద ఆస్పత్రికి వెళ్లింది. అక్కడంతా హాస్యాలాడారు—ఏవో ఇంజక్షన్లు పుచ్చుకోమన్నారు. పుచ్చుకుంది. కాని ఏమీ తగ్గలా.

ఒళ్లంతా బొబ్బలెక్కిన ట్లవుతోంది. తిండి సహించడంలా. ముఖం రానురాను వికారంగా తయారవుతోంది. అద్దంలో ముఖం చూచుకుంటే తనకే భయమేసేది. జుట్టూడిపోవడం మొదలుపెట్టింది. ఎంతలో ఎంత మార్పు! ఎంత ఘోరమయిన మార్పు! విటులు తగ్గిపోయారు—తగ్గిపోవడమేమిటి, అసలు రావడమే మానేశారు. దాసీకి మానేసింది. దాసీ దానికి విటులు రాని కొంపలో లాభమేమిటి? ఎంత జీతమిస్తే రేం, పయిన విటులిచ్చిన బక్షీస్ మాటో?

అప్పలమ్మకి శరీరంలో బాధకు తోడు తన కష్టం, సుఖం చెప్పుకుందామంటే ఎవళ్లూ వినేవాళ్లు లేకపోయారు.

"అమ్మా, సుద్దాణ్ణి తల్లీ, మాదాకబళం" అని వీథిలో మాదాకవళంఅబ్బి కేకేశాడు.

"సుద్దాడుబాబూ, సుద్దాడు. ఇంత కూడెయ్యండి తల్లీ" అని కేక లేస్తున్నాడు సుద్దాణ్ణినడిపిస్తూ యింకొకడు, వీథిదీపంవెల్తుర్న గిన్నెలో అన్నం చూచుకుంటూ.

బాధతో మంచంమీద లేచికూర్చుని పక్కకిటికీలోనుంచి బయటికి చూచింది అప్పలమ్మ.

రోజూ ఆవేళకు ఆకేక తనకు వినబడుతూనే వుంది. ఆ రెండు గొంతుకల్లో ఒక గొంతు తనకు పరిచయమయినదే. తెలిసివుండీకూడా రోజూ ఆకేక వినిపించినప్పుడు కిటికీతలుపు వేసేసుకునేది. కాని ఈరోజు తలుపు వేయ బుద్ధికాలా. ఓసారి ఓమ్మాత్రి ఎలా వున్నాడో చూడాలనిపించింది.

బిచ్చగాళ్లు అలా కేకలేసుకుంటూ వీథి దాటి పోయారు. అకస్మాత్తుగా విపరీతమయిన బాధ బయలుదేరింది అప్పలమ్మ శరీరంలో. చెప్పడానికి వీలులేని బాధ. శరీరమంతా కాలిపోతోంది. కళ్లు మండిపోతున్నాయి. దాహమవుతోంది. ఎవరు మంచినీళ్లిస్తారు? పక్కలోనుంచి లేవలేదు. అలా దాహంతోనే పక్కలో ఒరిగిపోయింది. నిద్రపట్టేసింది.

*　　*　　*　　*

అప్పలమ్మకి రోజురోజుకీ బాధ తీవ్రమయిపోతోంది. భరించడానికి శక్యంకాకుండావుంది. ఒకపూట కొంచెం తగ్గినట్లు కన్పించినా మళ్లీ వెంటనే రెట్టింపుగా ఎక్కువయిపోతోంది బాధ. తనరూపం అతివికారంగా తయారయింది. ఏ ఆస్పత్రికి వెడదామన్నా బయటికి రావాలంటేనే అసహ్యమేసేది. అసలు లేవగలిగితేనా? ఎన్నాళ్లిలా బాధపడటం? ఒళ్లంతా పుళ్లుపడిపోయింది. ఈగలు జుమ్మని ముసురుతూవుండేవి. ఈగల్ని తోలుకునేందుకుకూడా శక్తి చచ్చిపోయింది. ఈగలు ఆపుళ్లమీద కూర్చుని శరీరంలోకి రంధ్రాలు పెట్టి పీక్కుతినేవి—బాధ సహింపరానిదయిపోయింది.

ఆరోజు ప్రొద్దుగూకింది.

ఇంకా వీథుల్లో సందడిగానే వుంది. జనం తిరుగుతూనే వున్నారు. సముద్రపు హోరు నిముషనిముషానికీ చీకటి హెచ్చినకొద్దీ ఎక్కువవుతోంది.

అప్పలమ్మశరీరంలో బాధకూడా హెచ్చిపోతోంది. అప్పలమ్మకు తాపం ఎక్కువయింది. అప్పలమ్మకి సముద్రం "రారమ్మ" ని పిలుస్తున్నట్లు వినిపించింది. తనకు తెలియకుండానే, వస్తున్నానని లేచింది మంచంమీదనుంచి.

అంతవరకూ నడవలేని అప్పలమ్మ తనను ఈ ప్రపంచంలో అంత గారవించి ప్రేమతో తా రమ్మని పిలిచేందుకు ఒక సముద్రమున్నా వున్నదని తెలుసుకోగానే వాలంగడుగులు వేయగలిగింది. నడవలేక నడవలేక వీథిగుమ్మంలోకి వచ్చింది.

సందుమలుపులో ఒక పది అడుగుల అవతల "సుద్దాడు తల్లీ, సుద్దాడు, మాదాకబళం" అని కేక వినిపించింది.

అప్పలమ్మమనస్సంతవరకూ ఎందులోనో లగ్నమయిపోయింది. ఆ కేక వినిపించగానే మళ్లీ ఈ ప్రపంచంలో పడ్డది. సీమ్మాత్రీ, అతన్ని వడిపించుకుంటూ ఓబిచ్చగాడూ ఇళ్లవెంట బిచ్చమెత్తుకుంటూ వస్తున్నట్లుగా దీపాలవెల్తుర్ని కనిపించింది. మనస్సులో ఒకక్షణం లోపలికెళ్లిపోదామా అనిపించింది. వెనక్కు తిరిగితే ఇల్లు మహానరకకూపంలా కన్పించింది. లోపల ఘోరరాక్షసు లున్నట్లుగా కన్పించింది. సన్నదీపపు వెలుగులో కీనీడలన్నీ పెద్దపెద్ద దెయ్యాలులా కన్పించాయి. లోపలికి వెళ్లలేకపోయింది.

సముద్రంలో మళ్లీ ఓ పెద్దకెరటం ఘోరుమని కేకలేసింది. "రావేం? ఇంకెందుకమ్మా ఆలస్యం? నా చల్లటి బాహువుల్లోకి నిన్ను తీసుకుని నీబాధలన్నీ తీరుస్తా రావమ్మా" అని. ఆ కేక ఎంత ప్రేమపూరితంగా వుంది!

గబగబా సముద్రంవైపు నడిచింది అప్పలమ్మ. గుమ్మం దాటి వీథిలో పడిందో లేదో "క్రీగ్" మని మిలిటరీలారీ బ్రేక్ వేసింది—కాని లాభంలేకపోయింది.

గొల్లుమని జనం మూగారు. సుద్దాడు "ఏమిటి?" టన్నాడు. అతన్ని అవతలికి తోసేసి అంతా శవంచుట్టూ మూగారు. పెద్ద రక్తపుమడుగయింది. సరిగ్గా నెత్తిమీదనుంచి పోయింది చక్రం. "ఏమిటేమిటి"టని సుద్దాడు తహతహలాడుతూ అడిగాడు. "సుద్దాడివి, రోడ్డుపక్కనుంచి పోవోయ్. లేకపోతే నువ్వూ అలాగే చస్తా"వన్నా రెవరో.

"ఎవరో బోగంది మిలిటరీలారీక్రింద పడి చచ్చిపోయింది" అన్నాడు సుద్దాడిస్నేహితుడు దగ్గిరకొచ్చి సుద్దాడి చేతిలో కర్రతో రెండోవైపు తను పట్టుకుంటూ.

"పాపం" అన్నాడు సుద్దాడు. తన అప్పలమ్మ ఏమయిందో? ఎంతమంది నడిగాడు? ఒకళ్లయినా చెప్పారూ? ఎవరికి తెలుసు? తన అప్పలమ్మ ఏమైతే ఎవరికి కావాలి?

ధన్యజీవి

కీ. శే. శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు

❀

— శ్రీ విస్సా అప్పారావు —

బ్రహ్మశ్రీ కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు ఈ వ్యయసంవత్సర జ్యేష్ఠ బహుళ తదియనాడు (జూను 17, 1946) కాకరపర్రు గ్రామములో వారి మేనల్లుడయిన పురాణపండ వెంకట దీక్షితులుగారింట స్వర్గస్థులైనారు. వారు ధన్యజీవులు. దేశసేవాతత్పరులు. ప్రజాహిత కార్యములయందు తమ యావజ్జీవమును ధారవోసిన సచ్చరిత్రులు.

లక్ష్మీనరసింహంగారు 1867 సెప్టెంబరు 26 తేదీని మాతామహులయింట ఖండవల్లి గ్రామములో జన్మించినారు. మాతామహులు పురాణపండ భద్రశాస్త్రిగారు, మేనమామగారు మల్లశాస్త్రిగారు గొప్ప పండితులు. మేనమామపోలిక వీరికి చాల హెచ్చు. తద్ద్వారా వీరు సంస్కృతాంధ్రములయందు పండితులైనారు. ఆంగ్లేయవిద్య నభ్యసించి, మెట్రిక్యులేషను పరీక్షప్యాసుచేసినారు. రాజమహేంద్రవరములో నాడు, అనగా 1884-86 ప్రాంతములలో నూతనయుగపురుషుడును, గొప్ప సంఘసంస్కర్తయు నగు కందుకూరి వీరేశలింగముగారు ఆంధ్రదేశమునకు జ్యోతివలె ప్రకాశించుచుండెడివారు. పూర్వాచారములయందు గల చెడుగులను ఎత్తిచూపి గొప్ప సంఘవిప్లవమును లేవనెత్తి మంచివారిని పట్టుపని అనేకరీతుల కార్యరూపమున ప్రబోధించి దేశాభ్యుదయమునకు దారిచూపినవారు వీరేశలింగముపంతులుగారు. ఆంగ్లేయవాఙ్మయములో గల నూతనభావములు ఆరోజులలో తీవ్రముగా వీరేశలింగముపంతులుగారి కారణముచేత క్రొత్తగా రాజకీయరంగములో బైలువెడలిన నేషనల్ కాంగ్రెసుయొక్క ప్రచారముచేత, యువకులను తీక్ష్ణముగా ఆకర్షించినవి. అట్టిసమయమున ఈ నూతనభావములను పూర్తిగా చూరగొన్న వీరేశలింగముపంతులుగారి శిష్యులలో అగ్రగణ్యులు చిలకమర్తి లక్ష్మీనృసింహముగారని చెప్పవచ్చును. అందుచేత భారతీయసంస్కృతితోపాటు పాశ్చాత్యసంస్కృతినికూడ చూరగొన్నవారు లక్ష్మీనృసింహముగారు. పాండిత్యమేగాక వినయము, సంస్కృతి, వైదగ్ధ్యము విశేషముగా గలిగిన ఆదర్శపురుషులు లక్ష్మీనృసింహంగారు. వీరు ఇంగ్లీషులో రాజకీయ, సాంఘికవిషయములను గురించి ధారాళముగా



మాట్లాడగలిగిన సమర్థులు. రాజమహేంద్రవరములో ఈ 60 ఏండ్లలోను వెలసిన సంస్కృతాంధ్రపండితులలోను, ఆంధ్రరచయితలలోను ఈయనకు ప్రత్యేకముగా పాశ్చాత్యసంస్కృతి హెచ్చు. ఇదే ఈయన విశిష్టత. అందుచేతనే ఈయన వీరేశలింగముపంతులుగారు ప్రారంభించిన నవ్యయుగములో పంతులుగారు రాజమహేంద్రవరము విడిచినతరువాతను, వారి తదనంతరమును వారి నూతనోద్యమములను జయప్రదముగా నడపగలిగినారు

పాఠశాల నిర్మాణము

లక్ష్మీనృసింహముగారికి చిన్నతనమునుండియు నేత్రదృష్టి తక్కువగా నుండెను. దీనివలన జీవనోపాధి యథేచ్ఛముగా చేసుకొనుటకు, పుస్తకములు జదువుటకు, వ్రాయుటకు ఇతరుల అపేక్ష కావలసియుండెను. ఇన్ని చిక్కులున్నను ఈయన స్వతంత్రుడుగానే జీవితమును గడిపెను. మనస్స్వాతంత్ర్యమే కాక, వాక్స్వాతంత్ర్యముతో పాటు కార్యసాధనలో కూడ స్వతంత్రుడై యుండెను. ఈయనకు పాఠశాలను నిర్మించి విద్యను దానము చేయుటయందు అభిలాష హెచ్చు. దానికై అనేక ప్రయత్నములు చేసెను. అందులో విద్యాధికారులతోను, ఇతరులతోనూ ఇతరులతోనూ ఆత్మగౌరవమునకై వెనుదీయక, తన కార్యనిరోధమునుకూడ ఆలోచించక పోరాడెను. ఇందులో ధనలోపము వచ్చినప్పుడు తన స్వంతసొమ్ము అప్పుచేసైన తెచ్చి నిగ్రహించుచుండెను. కార్యముపట్ల ఈయనకు గల దీక్ష, పట్టుదల ప్రశంసనీయములు. ఇన్నివిధముల పాటుపడి ఒక పాఠశాలను నిగ్రహించుకొనుచువచ్చెను. దానినే 1908 లో వీరేశలింగముపంతులుగారు స్వాధీనముచేసికొని హితకారిణీసమాజమువారి యాధీనమున నడిపిరి. అదే నేటి వీరేశలింగముపాఠశాలయై చాల వృద్ధిలోకి వచ్చినది.

పత్రికానిర్వహణ

ఇట్లే ఈయన 'సరస్వతీ' పత్రికను, 'మనోరమ', 'దేశమాత' పత్రికలను నడిపించుచు అందు ఆత్మగౌరవమునకు లోటు లేకుండ నిర్వహించుచువచ్చెను. ఇట్టి స్వతంత్రజీవితమునకై ఈయన చాల కష్టములపాలయ్యెను. 'సరస్వతీ' పత్రికవిషయములో పోలవరము జమీందారుగారితో అభిప్రాయభేదము వచ్చి, వారి యధికారమునకు, వారిదర్జాకు తాను లోనుగానవసరము లేదను ఆత్మవిశ్వాసమును వెల్లడించుటచేత జమీందారుగారివలన పొందు లాభమును పోగొట్టుకొనుటయేకాక, వారికి వీరికి నాటితో స్నేహముకూడ చెడిపోయెను.

హరిజనసేవ

విద్యాప్రదానమందు తాము పొందిన చిక్కులను తెలిసికూడ, హరిజనులయెడ గల చిరకాలసానుభూతి రేకెత్తగా, వారి ఉద్ధరణకొఱకై రామమోహనపాఠశాలను ఒకదానిని రాజమహేంద్రవరములో స్థాపించి 13 ఏండ్లు దానిని నిర్విఘ్నముగా నడిపించెను. ఇది గొప్ప సాహసకార్యము. ఊరిమధ్య అట్టి పాఠశాల నిర్మించుట, దానికి తగిన ఉపాధ్యాయులను సమకూర్చుట, అనేక ఈతిబాధలను నిగ్రహించుట చాలా కష్టమైన పని. ఐనను ఈయన ఆ గొప్పకార్యమును దీక్షపట్టి సర్వశక్తులను వినియోగించి చేయగలిగినాడంటే లక్ష్మీనరసింహముగారి విశాలహృదయము, మానవత్వము ఇంతని చెప్ప వీలులేదు. ఈకార్యమువలన హరిజనులకు గొప్ప ఉపకారము జరిగినది. వారిలో వికాసము కలిగినది. వారు సాంఘికముగా కొంతమట్టు కూనగలిగినారు. నిమ్నజాతులవారితో కలసిమెలసి తిరుగుట, వారిని ఇంటికి రానిచ్చి గౌరవించుట, అస్పృశ్యతను విడనాడుట, వారికి చేతనైన ఉపకారమును చేయుట, చేయించుట మొదలగు పనులను జేసి హరిజనజాతికి ఒక వ్యక్తిత్వమును, బలమును చేకూర్చినారు లక్ష్మీనృసింహముగారు. ఈకార్యములో వీరికి వీరేశలింగముగారు, వెంకటరత్నంనాయుడుగారు, శ్రీ పిఠాపురముమహారాజావారు చాలా సహాయము చేసినారు. ఈపాఠశాలనిర్వహణలో లక్ష్మీనృసింహముగారు 4-5 వేలరూపాయలు తమ స్వంతసొమ్ము ఖర్చుపెట్టినారు. పుస్తకములు, పలకలు వగైరాలు ఉచితముగా ఇచ్చి, ఉచితముగా ఇంగ్లీషు, తెలుగు నేర్పించి, నిమ్నజాతుల నుద్ధరించినారు. వీరు చేసిన అన్నికార్యములలోను ఇది అగ్రస్థానమును అలంకరించగలదు. తెనుగునాడులో హరిజనోద్ధరణకు ఇదే పునాది. ఈ కార్యమును ఈయన 1909 నుండి 1922 వరకు కొనసాగించి ధన్యులైనారు.

సంస్కరణోద్యమము

శ్రీ వీరేశలింగముపంతులుగారు సంఘసంస్కరణకు మార్గదర్శకులు. విధవావివాహములు ప్రారంభించిన సాహసులు. ఇంకను సంఘమందలి దురాచారములను ఎత్తిచూపి ఖండించి సంస్కరించినవారు. వారి అడుగుజాడలను నడచి, గా. పంతులుగారు రాజమహేంద్రవరములో ఉన్నప్పుడు, లేనప్పుడు, వారు గతించిన తరువాతనుకూడా ఏ లోటును లేకుండ ఈ ఉద్యమ

ము సాగించి సేవచేసినారు లక్ష్మీనృసింహముగారు. హితకారిణీ సమాజములో ముఖ్యులుగా ఉండి దానికి సంబంధించిన కార్యములను సాగించినారు. పత్రికలలోను, ఉపన్యాసపీఠములనుండి, మిత్రసంభాషణముల ద్వారాను దురాచారములను ఖండించుట, సదాచారములను ప్రోత్సహించుట అవిచ్ఛిన్నముగా సాగించినారు. శ్రీ టంగుటూరి ప్రకాశంగారు సీమకు పోయివచ్చినప్పుడు శంకరాచార్యులవారు వారికి ఆంక్ష విధించినారు. దానిని ఎదుర్కొనటకై స్నేహితులందరు విందుఏర్పాటుచేసిరి. చాలామంది పంక్తిని భోజనము చేసిరి. శంకరాచార్యులవారి అధ్యక్షతను సభ జరిపించి వారితో వాదించిరి. ఆచార్యులవారు రాజమహేంద్రవరమును వదలిపెట్టి పారిపోవలసిన స్థితి ఏర్పాటైనది. ఈ ఆందోళనములో లక్ష్మీనృసింహముగారు ముఖ్యపాత్రను వహించి పనిచేసినారు.

వితంతువివాహములను చేయించి, కర్ణభేదము లేకుండ పంక్తిభోజనము ఏర్పాటుచేసి, అనుష్ఠానిక బ్రహ్మమతము నవలంబించుటలో పట్టుదలతో పని సాగించి అనేక విధములుగా సంఘసంస్కరణోద్యమమునకు చేదోడువాదోడై లక్ష్మీనృసింహముగారు నిలిచినారు.

స్త్రీ విద్య

ఇంతేగాక స్త్రీవిద్యవిషయమై వీరేశలింగము పంతులుగారివలె ఈయన కూడ సహాయపడినారు. స్త్రీలకు, బాలురకు అనువైన పుస్తకములను అనేకములు వ్రాసినారు. మరియు "ఇంట గెలిచి రచ్చ గెలవవలె" నను నానుడిప్రకారము ఈయన తన మేనకోడండ్రను విద్యావతులుగా చేసి మార్గదర్శులైరి. శ్రీమతి రావూరి వెంకటసుబ్బమ్మగారు ఉభయభాషా ప్రవీణ పరీక్ష నిచ్చిరి. ఆమెచెల్లెలుగారు పరీక్ష నీయకపోయినను మంచి ఆంధ్ర, సంస్కృతభాషాజ్ఞానము కలిగినవారు.

దేశీయోద్యమము

లక్ష్మీనృసింహముగారు వీరేశలింగము పంతులుగారివలె సంఘసంస్కరణాది ఉద్యమములలోనే గాక న్యాపతి సుబ్బారావుపంతులుగారివలె రాజకీయ విషయములలోను, దేశీయోద్యమములలోనుకూడ పాల్గొన్నారు. వీరు పండితులేగాక గొప్ప వక్తలు కూడ. వీరి వాగ్ధోరణి ఝంఝామారుతమువలె విసురుగాను, సెలయేటి నీటిప్రవాహమువలె రుచ్యముగాను, సముద్రమువలె గంభీరముగాను, సముద్రతరంగములవలె పొంగి పొరలి మనసోత్సాహజనకముగాను ఉండెడిది. ఈయన సర్వసామాన్యజనుల నాకర్షించు మృదుమధురవాక్కు కలవారు. అందుచేత ప్రజాహితమగు అన్ని ఉద్యమములయందును ఈయనకు ముఖ్యమగు స్థానమేర్పడిపోయినది. అందుచేత ప్రతి ఉపన్యాస వేదికమీదను లక్ష్మీనరసింహముగారి వాక్కు, సందేశము, హితము వినబడుచునే వచ్చినవి. 50-60 ఏండ్లు ఏకరీతిగా రాజమహేంద్రవరములోను, తత్ప్రాంతములయందును లక్ష్మీనృసింహముగారు లేని వేదికగాని, సభగాని, పెండ్లి కార్యముగాని, ఉత్సవముగాని లేదనినచో అతిశయోక్తి కాదు. ఈయననిర్యాణముచేత రాజమహేంద్రవరమునకు, తెనుగువారికి గొప్ప తీరని లోటు సంభవించినది.

1905-6 లలో బెంగాలువిభజన జరిగినది. ఆ యాందోళన తరువాత బిపిన్‌చంద్రపాలు తెనుగుదేశ సంచారము చేసినాడు. 1907 లో రాజమహేంద్రవరము వచ్చినాడు. నేను ట్రెయినింగు కాలేజిలో విద్యార్థిగా ఉన్నాను. గుఱ్ఱపు బండికి తాళ్లుకట్టి రైలు స్టేషనునుండి ఇన్నీసుపేటలోకి విద్యార్థులందరము లాగుకొనివచ్చినాము పాలుగారిని-గొప్ప ఊరేగింపుతో. ఆరోజులలో అచ్చట కలిగిన ఉద్రేక మింతని చెప్ప వీలులేదు. పాలుగారు పురమందిరములో 3-4 దినములుపన్యసించిరి. వారి ఇంగ్లీషు ఉపన్యాసమును లక్ష్మీనృసింహముగారు ధారణపట్టి చివర తెనుగులో తమ సహజ గాంభీర్యముతో చెప్పునప్పుడు చెవులకు పండుగగా ఉండెడిది. ఆరోజులలోనే ఒకనాడు "భరతఖండంబు చక్కని పాడియావు" అను సుప్రసిద్ధమైన పద్యమును ఈయన చెప్పినారు. సభలో కరతాళధ్వనులు నింగిముట్టినవి.

ఈయన గోదావరిజిల్లామండలసభలలో పాల్గొనేవారు. చక్కని పద్యములను వ్రాసి చదివేవారు. అవి జనరంజకముగా ఉండెవి. అందరు విని మెచ్చుకొనేవారు. ఒకసభలో వీరు ఈక్రింది మకుటముతో చెప్పిన కొన్ని సీసపద్యములు చాలా బాగున్నవి:

"కటకటా! ఎట్లు లున్నదో కాపులదశ
సుగుణధనులార జనులార చూడరయ్య."

ఈయన మండలసభలలోనేగాక రాష్ట్రసభలలోను పాల్గొనేవారు. మద్రాసు వెళ్లి ఉపన్యసించినారు. తెలింగానాలో ఉపన్యాసముల నిచ్చినారు. పత్రికలలోగూడ జాతీయోద్యమముపై తీవ్రముగా వ్రాసేవారు. అతివాదు లని పేరుపొందినారు. 1916 లో అనీబీసెంటు హోంరూలుద్యమమును సాగించు రోజులలో రాజమహేంద్రవరము వచ్చినప్పుడు లక్ష్మీనృసింహముగారే సభకు అధ్యక్షులుగా ఉండి ఇంగ్లీషు భాషలో సమర్థముగా మాట్లాడినారు. తరువాత 1917 లో అనీబీసెంటును ఇన్‌టరన్ చేసినప్పుడు గోదావరి జిల్లాకలెక్టరు లక్ష్మీనృసింహముగారిని పిలిచి జాగ్రత్తగా సంచరించుట మంచి దని హితవుచెప్పినారు. కాని వీరు ఆ మాటలను పరకుగొనక సానుభూతికై జరిపిన సభలో మామూలు ధోరణిలోనే మాట్లాడినారు. సహాయ నిరాకరణోద్యమము వచ్చునాటికి దేశమందు ప్రబోధము హెచ్చిపోయినది. పెద్దలు, చిన్నలు అనేకులు రాజకీయరంగములో దుమికి తీవ్రముగా పని సాగించుచు వచ్చినారు. భారతదేశమందలి పెద్దపెద్ద నాయకులు తరచు రాజమహేంద్రవరము వచ్చి ప్రబోధమును జరిపేవారు. అందుచేతను లక్ష్మీనృసింహముగారు ఈ ఉద్యమములో పాల్గొనినను అనేకులలో ఒకరుగా ఉండేవారు. వీరికి గల అవరోధములు కారణముగా ఇతరులవలె ఈ ఉద్యమములో వీరంత ముందంజవేయ లేదు. ఐనను అవసరమైనప్పుడెల్లను పాల్గొనుచుండెడివారు.

సారస్వత సేవ - నాటకసమాజము

1889 లో రాజమహేంద్రవరములో ఇమ్మానేని హనుమంతరావునాయుడుగారు ఒక నాటకసమాజము స్థాపించినారు. హనుమంతరావునాయుడుగారు లక్ష్మీనృసింహముగారిని పిలిచి "మా సమాజమునకు కావలసినట్లు నాటకములను వ్రాసియియ్యవలసిన"దని కోరిరి. ఇదే లక్ష్మీనృసింహముగారి గ్రంథరచనకు ప్రాతిపదిక. 'కీచకవధ' నాటకమును వచనములో వ్రాసి మొదట ఇచ్చినారు. వచనములో నాటకములు వ్రాయుటకు అదే ప్రారంభమని చెప్పవచ్చును. పద్యములు లేకుండుట చేత కథ త్వరగా నడచుట, ఎక్కువ రసవంతముగా నటించుటకు వీలగుట, పద్యములు శ్రావ్యముగా చదువ లేనివారు వాటిని చదివి రసాభాసము కలిగించకుండుట చేత నాటకములు రక్తికట్టును. క్రమముగా 'ద్రౌపదీ పరిణయము', 'శ్రీరామజననము', 'గయోపాఖ్యానము', 'పారిజాతాపహరణము', 'ప్రసన్నయాదవము' మొదలగు నాటకములను రచించిరి. ఈనాటకము లాడు వారిలో ముఖ్యమైన పురుషపాత్ర హనుమంతరావు నాయుడుగారున్నూ, ముఖ్యమగు స్త్రీపాత్ర టంగుటూరి ప్రకాశముగారున్నూ ధరించేవారు. వారిద్దరకు అనుకూలముగ నుండునట్లుగా వచనములోనే నాటకములు వ్రాయుచువచ్చిరి లక్ష్మీనృసింహముగారు. తరువాత తరువాత పాత్రధారులు పద్యములు చదువగలవారు వచ్చుటచేత నాటకములలో పద్యములను వ్రాసినారు. షేక్స్పియరు మొదలైనవారు నాటకరంగములకు చెందిన సుప్రసిద్ధనాటకకర్తలు. అట్లే తెలుగుదేశమందు లక్ష్మీనృసింహముగారు గణనకెక్కిన రంగస్థలనాటకకర్త. నాటకసమాజములో రాజమహేంద్రవరములోని పెద్దలు కొందరు సభ్యులుగా ఉండేవారు. వారు నాటకము లాడకపోయినను, సమాజమును ఒక క్లబ్బులాగ నడిపించి నాటకనిర్వహణకు ముఖ్యముగా తోడ్పడేవారు. ప్రతి సాయంత్రి సమాజములో లక్ష్మీనృసింహముగారు, ఇతర సభ్యులు సమావేశమయ్యేవారు. పాత్రధారులచేత ఆడబోవు నాటకములను ఆడించి, పద్యములను, వచనములను గు, చ, తప్పకుండ చదివించుట, ఉచ్చరించుటలలో కడుశ్రద్ధను జూపేవారు. నటకుల నందరిని తమ పిల్లలవలె చూచుకుని, వారి యారోగ్యమును, శీలమును జాగ్రత్తగా కాపాడేవారు. నాటకసమాజమునందు శిక్షణ హెచ్చుగా ఉండేది. ఇట్టి కార్యములయందు లక్ష్మీనృసింహముగారు ఎక్కువగా పాల్గొనేవారు. హనుమంతరావునాయుడుగారు విరమించుకొన్న తరువాత ఈ నిర్వహణము, సమాజఆధ్యక్ష్యము లక్ష్మీనృసింహముగారే వహించినారు. ఇట్లు ఆంధ్రనాటకరంగమునకు లక్ష్మీనృసింహముగారు గొప్ప సేవ చేసినారు. రాజమహేంద్రవరమువారి నాటకములు మిక్కిలి ప్రఖ్యాతివడసినవి.

సుప్రసిద్ధమైనచిత్రనళీయనాటకకర్తయైన, ఆంధ్రనాటకపితామహు లనిపించుకున్న బళ్లారి కృష్ణమాచార్యులవారి యాధ్యక్షత క్రింద రాజమహేంద్రవరములో నాటకసమాజమువారు చిత్రనళీయము నాడిరి. నాటకము ముగిసిన వెంటనే కృష్ణమాచార్యులవారు నటకుల కౌశలమును గురించి మిక్కిలి ప్రశంసిం

చిరి. నలపాత్రను, బాహుకుని పాత్రనుకూడ కడు సమర్థతతో నిర్వహించిన దుర్గి గోపాలకృష్ణయ్య గారిని మిక్కిలి కొనియాడిరి. కృష్ణమాచార్యులుగారు నాటక కర్తలై యుండి తాము ఏదో ఒక పాత్రను మాత్రమే నిర్వహింప గలిగితిమనియును, రెండును నిర్వహింపలేకపోతిమనియు, అన్ని పద్యములను ధారణపట్టి అంత చక్కగా పాత్రపోషణ చేయుట మిక్కిలి కష్టసాధ్యమనియు చెప్పిరి. తరువాత దమయంతి పాత్రధారియైన ముప్పిడి జగ్గరాజుగారి నటనాకౌశల్యము ఇదివరకు తాము చూచినవారిలో ఎన్నడును లేదని కొనియాడిరి. కిరాతుని వేషము అప్రతిమానముగా ధరించి ఆడిన తాతయ్యనాయుడుగారి పాత్రౌచిత్యము, వేషధారణలో చూపిన లోకజ్ఞానము చాలా బాగున్నదని, అట్టి నటులొక్కరుకూడ తన కిప్పటివరకు లభ్యముకాలేదని, అన్ని విధములచేత నాటకసమాజము వారి కౌశలము ఉత్తమోత్తమముగా ఉన్నదనియు ఆవేశపూరితులై మెచ్చుకొనిరి. ఈ ప్రాశస్త్యమునకు కారకులు హనుమంతరావునాయుడుగారు, లక్ష్మీనృసింహముగారున్ను.

లక్ష్మీనృసింహముగారి నాటకములన్నిటిలోను గయోపాఖ్యాన నాటకము మిక్కిలి ప్రసిద్ధి చెందినది. అది ఒక లక్షకుపైగా ప్రతులు అమ్మియుండును. కొన్ని సంవత్సరములు తెలుగువారు— ముఖ్యముగా రాజమహేంద్రవరములోనివారు . ఆబాలగోపాలము ఇందలి పద్యములను సదా చదువుకొనుచు ఆనందించుచుండెడివారు. 'అల్లుడా రమ్మని', 'పాతాళంబున కేగి నగో' మొదలగు పద్యములు సాధారణులకు బండివాండ్రకుకూడ వచ్చును. పురాణపురుషులును, అత్యంత మిత్రులు నగు కృష్ణార్జునులకు విచిత్రకారణముగా సంఘర్షణ కలుగుట, ఆందలి వైపరీత్యము, నూతనత్వము ప్రజల నాకర్షించుటయే ఈ నాటకముయొక్క పేరునకు కారణమని తోచుచున్నది. నాటకములేగాక లక్ష్మీనృసింహముగారు పలువిధములగు గ్రంథములను వ్రాసి పేరు గాంచినారు. నవలారచనను చాలా వృద్ధిలోనికి తీసుకువచ్చినారు. వీరి నవలలు దేశమందు చాలా ప్రచారములో ఉండినవి. 'రామచంద్రవిజయము', 'హేమలత', 'అహల్యాబాయి', 'సౌందర్యతిలక', 'కర్పూరమంజరి' వీరి నవలలలో పేరు గాంచినవి. వీరు భాసుని నాటకములను తెనిగించిరి. ఇవిగాక 'రాజస్థానకథావళి', 'మహాపురుషుల జీవితములు', 'భారతికథామంజరి' మొదలగు పుస్తకములను వ్రాసినారు. ఇవి సులభశైలిలో ఉండుటచేత సామాన్యజనుల కత్యంతోపయోగకరములై, వారి జ్ఞానాభివృద్ధికి చాలా తోడ్పడినవి. లక్ష్మీనృసింహముగారు హాస్యరసమును బాగుగా పోషించి వ్రాయగలిగినవారిలో ప్రసిద్ధులు. వారి 'గణపతి' తెనుగువారి ఆదరమును చూరగొన్నది. తెనుగుభాషలో అనేకసందర్భములలో వాడబడే 'ఇది' అనే పదమునుగురించి 'గణపతి'లో వ్రాసినదానిని నాడు నేమందరము, జనులందరుకూడ, తిరిగితిరిగి చదువుకొని ఆనందించుచుంటిమి. ఇట్లే ఇంకను అనేక శీర్షికలు గల వ్రాతలు చాలా వినోదకరములుగా నుండి జనరంజకములై యుండెను.

లక్ష్మీనృసింహముగారు సమయోచితముగ మిత్రులతో సంభాషించుట, ఆశువుగా చమత్కారముగా పద్యములను చెప్పుట కలదు. వీరు పూర్వపద్ధతిని అష్టావధానముకూడ చేయగలిగియుండిరి. కాని రానురాను ఆ పద్ధతిని విరమించుకొనిరి. వీరికి నేత్రావరోధము ఉన్నను, కేవలము శ్రవణమాత్రముచేతనే లోకానుభవము సునిశితముగా ఉండెను. అట్టి సూక్ష్మబుద్ధి భగవంతుడు వారి కొరంత లేకుండునట్లనుగ్రహించియుండుటచేతనే వీరట్టి అమూల్యములగు నాటకములు, ఇతర గ్రంథములు వ్రాయగలిగిరి. వీరి జ్ఞాపకశక్తి నిరుపమానమైనది. పోయిన 50-60 ఏండ్లలోను వీరు తెనుగు సారస్వతమునకు చేసిన సేవ ఇంతని చెప్పవీలులేదు. వీరు పాఠశాలలలో అన్నితరగతులకు తగిన వాచకములను చాలాసార్లు వ్రాసియున్నారు. ఈ వివిధపుస్తక రచనవల్ల వీరు చాలాధనము ఆర్జించియున్నారు. అందుచేతనే స్వతంత్రముగా జీవితమును నెట్టుకొనిపో గలిగిరి.

మానవత్వము

లక్ష్మీనృసింహముగారియొక్క విశిష్టగుణము విశాలమైన హృదయము. ఈయన గొప్ప దయాశాలి.

ఆపద్బాంధవుడు. అనాథల బాధలను జూచి మిక్కిలి బాధపడి చేతనైన సహాయము చేయగల సహృదయుడు. రాజమహేంద్రవరములో శవవాహకుల దౌర్జన్య మధికముగా ఉండేది. దుఃఖసముద్రములో మునిగియున్న తలితండ్రాదులను, బంధువులను 16, 20 రూపాయలు ఇమ్మని శవవాహకులు బాధించుచుండేవారు. ఇది బీద సాదలకు చెప్పరాని ఆవేదనకారణమైయుండెను. అందుచేత రాజమహేంద్రవరములో "మిత్రుల ఇండ్లలో మరణములు వచ్చినప్పుడు ఆశవములను, అనాథశవములను మోయవలెనని ప్రతిజ్ఞపట్టి నేనును (లక్ష్మీనృసింహము గారు), కుందూరి వెంకటరత్నముగారును, చెరువు సోమయాజులుగారును, చిలుకూరి వీరభద్రరావుగారును, మరి కొందరు మిత్రులును జట్టుగ నేర్పడితిమి." కంటిదృష్టి మాంద్యముచేత "సమర్థులయినవారిని ముందు నిలిపి, వెనుకప్రక్కనే నుండెడివాడను"—ఇది లక్ష్మీనృసింహముగారు వారి స్వీయచరిత్రలో వ్రాసినది. ఇది 1904 నాటి విషయము. 1916 లో మెట్కాఫ్ హాస్టలు విద్యార్థులు వినాయకచవితినాడు జరిపిన ఉత్సవమునకు లక్ష్మీనృసింహముగారు అధ్యక్షులు. వీరు సకాలము దాటి గంట, గంటన్నర ఆలస్యముగా వచ్చిరి. కారణమెవరికిని తెలియలేదు. వచ్చినతరువాత విషయము తెలిసినది. వీరిస్నేహితుని కుమారుడు - చిన్నవాడు విషూచి జాడ్యముచేత మరణించెను. శవవాహకులు పెద్ద సొమ్ము కావలెనని నిర్దాక్షిణ్యము చూపిరి. ఎంత బ్రతిమాలినను తక్కువసొమ్మునకు వప్పుకోలేదు. అప్పుడు లక్ష్మీనృసింహముగారు కటకటబడి తలితండ్రుల ఆవేదన సహింపలేక స్వయముగ శవమును మోసుకొని, ఒకరు కర్రతో తమకు దారినిచూపి నడువగా ఆపని ముగించుకొని ఇంటికి వచ్చి స్నానానంతరము హాస్టలుసభకు శ్రమచెందివచ్చినట్లు వారే చెప్పగా అచ్చటివారు సంభ్రమాశ్చర్యములను చెందిరి. ఆవిషయము అచ్చటి యువకులలో ఎట్టి హృదయపరివర్తన గలిగించియుండునో, లక్ష్మీనృసింహముగారియెడల ప్రజల కెట్టి గౌరవప్రపత్తులు నాటుకొనిపోగలవో చదువరులే ఆలోచించుకోవచ్చును. ఇట్టి కారణములచేత ప్రజాహృదయములలో లక్ష్మీనృసింహముగారు నాటుకునిపోయినారు.

రాజమహేంద్రవరములో లక్ష్మీనృసింహము గారి స్థానము

లక్ష్మీనృసింహముగారు వీరవాసర కాపురస్థులు. కాని చిన్నతనమునందే - అనగా 1884 లోనే రాజమహేంద్రవరము వచ్చి చేరిరి. నాటినుండియు వీరు రాజమహేంద్రవరమునే కాపురముగా చేసికొని ఆయూరియందు ఎంతో అభిమానము కలిగి జీవితమును అక్కడనే ధారపోసినారు. అనేకసారులు ఆయూరు విడిచివెళ్లిన జీవితసౌకర్య ముండినట్లు తోచినను ఎన్నడును విడువజాలక ఇక్కట్టులను సరకుజేయక అచ్చటనే ఉండిపోయిరి. వీరి జీవితచరిత్ర పైన సూచించిన రీతిని రాజమహేంద్రవరముయొక్క చరిత్రతో అనేక విధముల సమ్మిళితమై అవినాభావమైయున్నట్లు స్పష్టమే. వీరు రాజమహేంద్రవరముతో ఐక్యమైపోయినారు. వీరిని ఒక వ్యక్తిగామాత్రమే పరిగణించరాదు. వీరు ఒక గొప్ప సంస్థయని చెప్పవచ్చును. వీరేశలింగముగారు కట్టించిన పురమందిరములో సాయంత్రి ఊరిపెద్దలందరు వచ్చినప్పుడు వారందరిమధ్య లక్ష్మీనృసింహముగారు కూర్చుని అనేకవిషయములు చర్చించుచుండేవారు. అది చూచితీరవలసినదే. వినువారికి అది గొప్ప వికాసమునిచ్చేది. తరువాత హిందూసమాజములో గంగరావిచెట్టుక్రింద సాయంత్రి వీరిచుట్టును సామాజికులు చేరి ఇష్టాగోష్ఠి సలుపుచుండేవారు. అదియు అట్టి పైమెట్టులోనే ఉండేది. దూరమున గొంతుకను బట్టే లక్ష్మీనృసింహముగారు పేరుపెట్టి పిలిచి స్నేహితులనందరిని చిరునవ్వుతో సాహ్వానించి చమత్కారముగా ఎన్నో విషయములనుగురించి ముచ్చటించేవారు. వీరిని ఆధారముజేసుకుని పురమందిరములలోను, సమాజములలోను చైతన్యము, వికాసము, ఉత్సాహము పురజనుల నాశ్రయించియుండేవి. సాయంత్రమగుసరికి ఒక్కసారి పోయి ఈయనచుట్టు కూర్చుని సంభాషణ వినిరావలెనని ప్రతివారికిని కుతూహలముగా ఉండేది. 1936-1938 లలో నేను రాజమహేంద్రవరములో ఉన్నప్పుడు వడ్డాది సుబ్బారాయడుగారింటికి హిందూసమాజమునకు పోకముందే 4 గంటలకు వచ్చి ఒకగంట, గంటన్నరసేపు వారింట గోష్ఠి సలుపుచుండేవారు. అక్కడకు సాహితీవేత్తలను నిడమర్తి జలదుర్గప్రసాదరాయుడు



దేశోద్ధారకుడు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారి అధ్యక్షతను రాజమండ్రిలో జరిగిన చిలకమర్తి లక్ష్మీనరసింహకవిగారి షష్టిపూర్తి మహోత్సవమునాటి సమావేశము.

గారు వచ్చుచుండేవారు. చెరుకువాడ వెంకటరామయ్యగారు తరుచు వచ్చుచుండేవారు. నేను వీలున్నప్పుడెల్లా అచ్చటకు పోయి ఆ సారస్వతగోష్ఠిని విని అనేక నూతన విషయములను, అపూర్వవిషయములను తెలిసికొనుచుండెడివాడను.

సన్మానములు

లక్ష్మీనృసింహముగారికి 1928 మార్చిలో షష్టిపూర్తి ఉత్సవము రాజమహేంద్రవరములో అమితోత్సాహముతో జరిగినది. అట్టి ఉత్సవము జరుగుటకదే ప్రారంభము. అంతవైభవముగా జరుగుటకూడ దుర్లభము. ఆ ఉత్సవమునకు ఆంధ్రభీష్ములైన న్యాపతి సుబ్బారావుగారు ఆహ్వానసంఘాధ్యక్షులు. తెనుగుదేశమందలి ప్రముఖులందరు ఆహ్వానసంఘసభ్యులు. ఉత్సవమునకు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుగారు అధ్యక్షులు. మునగాల జమీందారుగారు, మోచర్ల రామచంద్రరావుగారు మొదలగు పెద్దలు విచ్చేసిరి. ఆ ఉత్సవమునాటికి ఆహ్వానసంఘమువారు లక్ష్మీనృసింహముగారి గ్రంథములన్నిటిని 10 సంపుటములక్రింద ముద్రించిరి. ఈ పనినంతయు ప్రారంభించి నిర్వహించిన వారిలో ప్రథములు వేమూరి విశ్వనాథశర్మగారు; రెండవవారు పాలకోడేటి గురుమూర్తిగారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయమువారు కళాప్రపూర్ణ బిరుదమిచ్చి వీరిని సన్మానించిరి.

రెండుమూడేండ్ల ఈమధ్య లక్ష్మీనృసింహముగారికి ఆంధ్రరాష్ట్రాభ్యుదయరచయితలసంఘమువారు వీరి స్వీయచరిత్రను ముద్రించి, ప్రకటించి, బెజవాడలో గొప్పసభను ఏర్పాటుచేసి, వీరికి రు. 750 ఇచ్చి గౌరవించి, సన్మానమును జరిపిరి. తరువాత గుంటూరి ప్రజలు గొప్పసన్మానమును జరిపి, పోగుచేసిన ధనమును నెలకు రు. 40 చొప్పున వీరి జీవితపోషణార్థమై, వార్ధక్యమున ఇబ్బందిలేకుండుటకై సదుపాయము చేసిరి. రాజమహేంద్రవరములోని కర్రా మావుళ్లయ్యగారు, వారి మిత్రులు ధనమును పోగుచేసి నెలనెలకు వీరికి పంపుచుండిరి. అంతకుపూర్వము 1-2 ఏండ్లపాటు బాల్యమిత్రులైన రాయసం వెంకటశివుడుగారు లక్ష్మీనృసింహముగారికి సహాయపడుచుండిరి. ఇట్లా అనేకులు లక్ష్మీనృసింహముగారికి ధనసహాయము చేసి వీరికి ఇబ్బంది లేకుండ చేయ ప్రయత్నించుచుండిరి. వీటన్నిటిని మించిన ఒక్కవిషయము చెప్పవలసియున్నది. శ్రీ పిఠాపురము మహారాజావారు లక్ష్మీనృసింహముగారికి చేసిన సహాయము విలువలేనిది. వారు పెన్నిధివలె లక్ష్మీనృసింహముగారిని జీవితాంతమువరకు కాపాడిన మహాపురుషులు. ఇన్నివిధములచేత సన్మానింపబడినవారు లక్ష్మీనృసింహముగారు.

ఎన్నివిధములచేత ధనము వచ్చుచున్నను ఈయన జీవితములో ధనలోపము ఈయనకు తీరినదికాదు. దేహదార్ఢ్యము తప్పినకొలది శరీరమందలి అవస్థతలవలని బాధ హెచ్చి పరాపేక్ష హెచ్చిపోయినది. అందులో భార్యావియోగమైన చివరి 15-16 సంవత్సరములలోను ఈ చిక్కు హెచ్చినది. అందుచేత ఈయనకు సర్వసంరక్షణ చేయుచున్న మేనల్లుని కుటుంబభారము వీరిమీద నుండెను. మరియు మొదటినుండియు బంధువుల యెడ ఆదరము హెచ్చుటచేతను పిల్లలు లేకున్నను ఖర్చు ఎక్కువగా ఉండెను. ఇదియునుగాక విశాలహృదయము గలిగి, మానవసేవాతత్పరులగుటచేత ఎంత వచ్చినను చాలక ఇబ్బందిపడుచునే ఉండెడివారు.

చివరిరోజులు

యుద్ధకారణముగా రాజమహేంద్రవరము విడచి జీవితములోని చివరినాల్గేండ్లపాటు వీరు కాకరపర్రులో నివసించియుండిరి. ఆ యూరివారు వీరికి బ్రహ్మరథము పట్టి చాలా గౌరవించిరి. రాజమహేంద్రవరము వచ్చి స్నేహితులందరిని చూడవలెనని చాలా కుతూహలపడేవారు. రాజమహేంద్రవరములోనే, తన అంత్యదశ నడుపవలెనని కోర్కె మెండుగా ఉండెను. కాని భగవత్సంకల్ప మన్యథా ఉండుటచేత ఆ కోర్కెలు తీరకనే కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనృసింహముగారు కీర్తిశేషులైనారు.

ఆంధ్రదేశమునకు- ముఖ్యముగా రాజమహేంద్రవరమునకు తీరని లోటు కలిగినది. ప్రాతకాలమునకు చెందిన గొప్ప వ్యక్తి అస్తమించినది. వీరి ఆత్మకు శాంతి కలుగుగాక!

— నీలిమేడ —

[కథానిక]

= 'ఆత్రేయ' =

ఒకరోజున మేమంతా "ఇలస్ట్రేటెడ్ వీక్లీ"లో బొమ్మలు చూసుకుంటున్నాము. అంతలో అక్కడికి మా పెద్దమామయ్య వచ్చాడు. "చూడు మామయ్యా! ఈ అమ్మాయి ఎంచక్కా నవ్వుతోందో!" అని మా చెల్లెలు సుశీల ఒక బొమ్మ చూపించింది. మా మామయ్య ఆ బొమ్మని చూశాడో లేదో, అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. పెదవులుమాత్రం నవ్వుతూనే ఉన్నాయి. వెంటనే అతడు అక్కడినుంచి వెళ్లి, వసారాలో కుర్చీలో కూర్చుని మాలతిపందిరివైపు చూస్తో ఏదో ఆలోచిస్తూన్నాడు. నేను దగ్గిరికివెళ్లి, "ఏం మామయ్యా, అల్లా వచ్చేశావేం?" అని అడిగాను. "అబ్బే, ఏం లేదురా, ఏదో జ్ఞాపకంవస్తేను..." అంటున్నాడు. అంత వృద్ధునికి కంట నీరుతిరిగిన విషయం ఏమిటా అని నాకు మరింత కుతూహలం కలిగింది. "చెప్పవూ, మామయ్యా?" అని మరీమరీ అడిగ్గా, చివరికి "అదో కథలే" అంటూ మొదలుపెట్టాడు. మధ్యమధ్య నేనేమైనా అడిగితే అసలు కథే మానేస్తాడేమో అని మాట్లాడకుండా కూర్చున్నాను. మా మామయ్య చెప్తున్నాడు.

"నేను వర్తకంకోసం తరుచు మద్రాసు, బెంగుళూరు, బొంబాయిలమధ్య తిరుగుతూ ఉండేవాణ్ణని మీకు తెలుసు ననుకుంటాను. ఒకసారి ఒక చిన్న స్టేషన్‌దగ్గర బండి ఆగింది. అక్కడ స్టేషనుకు దగ్గరగానే ఒక చిన్న అందమైన యిల్లు కనపడింది. ఇంటికంతా నీలిరంగు వేశారు. వానకూ, ఎండకూ రంగు కొంచెం మాసిపోయి ఉంది. చుట్టూ చిన్న తోట ఉంది.

ముప్పైఐదు, నలభై సంవత్సరాల నాటి మాట. రైలులో కూర్చునే ఆ యింటిని చూశాను. నేనున్న పెట్టెకూడా సరీగ్గా ఆయింటిముందరే ఆగింది. అక్కడినుంచే ఆ యిల్లు నా మనస్సులో బాగా నాటుకుపోయింది. ఇంటిముందర తోటలో ఒక చిన్నపిల్ల బంతితో ఆడుకుంటోంది. వయస్సు సుమారు పదిసంవత్సరా లుంటాయి. పచ్చని దబ్బపండులాంటి రంగు, నల్లని పట్టుకుచ్చుల్లాంటి మెత్తని జుట్టు. ఆకుపచ్చ పరికిణీ కట్టుకుని, గులాబిరంగుగౌను తొడుక్కుంది. జుట్టు నీలిరంగు రిబ్బనుతో కట్టుకుంది. వసంతకాలపు వనలక్ష్మి యేమో అన్నట్టుంది. ఆ బాలిక సర్వావయవాలలోనూ ఆనందతరంగాలు ఉప్పొంగిపోతోన్నట్టూ, ఆమె మూర్తీభవించిన ఆనందదేవత అయినట్టూ తోచింది.

ఆ రోజు అసలు నా మనస్సు స్తిమితంగా లేదు. మా నాన్నకు ఒంట్లో బాగుండలేదు. బొంబాయిలో వర్తక విషయాలలో కొన్ని పేచీలు వచ్చాయనీ, తొందరగా రమ్మనీ టెలిగ్రాము వచ్చింది. మా నాన్న నన్ను వెళ్లి ఆ పని చూసుకుని రమ్మన్నాడు. నేను ఆయనతో ఒకటి రెండుసార్లు బొంబాయి వెళ్లినా, సొంతంగా వ్యాపారం చూడ్డం అదే మొదలు. పైగా, నాన్నజబ్బు విషయమై బెంగ. పిల్లలందరిలోనూ నేనే పెద్దవాణ్ణి. మనస్సు అనేకచింతలతో నిండిపోయివుంది.

అటువంటి సమయంలో ఈచిన్నచిత్రం కాస్సేపు నాబాధంతనీ మరపించింది. ప్రొద్దున్నే కన్నులు తెరవగానే ఎదుట, ప్రకృతినంతనీ తనలో వికసింపజేసుకున్న ఆ చిన్నతోటనీ, ఆ తోటలో వనలక్ష్మిలాగ ఆ బాలికనూ చూడగానే ఎందుకనో ఆ రోజు నేను పట్టినదంతా బంగారం అవుతుందనిపించింది. "ఇటువంటి

ప్రశాంతప్రదేశంలో ఉన్నవారికి ఎంత సుఖంగా ఉంటుందో! వారికి చీకూ చింతా ఉండవలసిన అవసరం ఏమి ఉంటుంది?" అనుకున్నాను. ఈ ఆలోచనలవల్ల ఆ బాలికఆనందం చూస్తే మనస్సులో కొంచెం అసూయ మొలకెత్తింది. ఇదేవిధంగా నేను కూడా అన్ని విచారాలూ మరిచిపోయి విశ్వసౌందర్యంలో తేలిపోతూంటే!

బండి కదిలింది. అదే సమయానికి ఆ నీలిమేడలోంచి ఎవరో "కళ్యాణీ!" అని పిలిచారు. ఆ బాలిక ఆట మానేసి ఇంట్లోకి పరుగెత్తింది.

కళ్యాణి! ఆ పేరుకూడా నాకు ఎంతో మధురంగా వినిపించింది. రైలులో కూర్చుని ఆ నీలిమేడా, ఆ తోటా, ఆ బాలికా, ఆ బంతీ, ఆ పిలుపూ అన్నీ మళ్లీ మళ్లీ జ్ఞాపకం తెచ్చుకోవడం మొదలుపెట్టాను.

కొద్దిరోజులకే మా నాన్న చనిపోవడంవల్ల వర్తకం అంతా నేనే చూసుకోవలసివచ్చింది. అందుచేత చాలా రోజులవరకూ సరుకులూ, రత్నాలూ, డబ్బూ తప్ప నాకు వేరొకచింత లేకపోయింది.

పదిసంవత్సరాల తరువాత మళ్లీ బొంబాయి వెళ్లి తిరిగివస్తున్నాను. నేను కూర్చున్న పెట్టె మళ్లీ నీలిమేడ యెదుట ఆగింది. వెనకటి విషయం జ్ఞాపకంవచ్చింది. ఇప్పుడా మేడరంగు ఇంకా వెలిసిపోయినట్టు ఉంది. ఆ యింటినిగురించి యెవరూ ఆట్టే శ్రద్ధపట్టడం లేదేమో అనిపించింది.

ఆ తోటలో సుమారు ఇరవై సంవత్సరాల తరుణి ఒకావె కూచుని అప్పుడే విచ్చిన గులాబీపూలు దండ కడుతోంది. జుట్టు గులాబీరంగు రిబ్బనుతో కట్టుకుంది. ప్రక్కనే సుమారు పాతికసంవత్సరాల యువకుడు కూర్చుని మాట్లాడుతూ, నవ్వుతూ ఉన్నాడు. ఆ యువతి బుగ్గలలో గులాబీపూలూ, కళ్లలో సిగ్గుదొంతరలూ వెల్లివిరుస్తోంటే, ఆమె నవ్వుతో జవాబు చెపుతోంది. ఆమె తప్పక కళ్యాణే! సందేహం లేదు. అదే శాంతి! అదే ఆనందం!

ఆ దృశ్యం చూసే నా మనస్సు సంతోషంతో నిండిపోయింది. బండి కదలడం మొదలుపెట్టగానే నేను హఠాత్తుగా కిటికీలోంచి బయటికి చూస్తూ చెయ్యి ఊపి, "నమస్తే, నమస్తే, కళ్యాణీ!...గుడ్ బై!" అన్నాను నవ్వుతూ.

ఆ యువతి విస్మయభరితాలైన పెద్దపెద్దకళ్లు నావైపు తిప్పింది. ఆ యువకుడు కూడా ఇటు తిరిగాడు. ఒకరివైపు ఒకరు చూసుకుని వారిద్దరూ ఎందుకో విరగబడి నవ్వుకున్నారు. ఇద్దరూ జేబురుమాళ్లు విసిరి నాకు "గుడ్ బై" చెప్పారు. రైలు వెళ్లిపోతూన్నా, నేనుమాత్రం శాంతీ, ఆనందమూ మూర్తీభవించిన ఆ యువతీయువకులవైపే కిటికీలోంచి తొంగి తొంగి చూస్తూ నా సర్వవ్యథలూ మరిచిపోయాను. చాలా దూరంవరకూ వాళ్ల నవ్వు నా చెవులలో ప్రతిధ్వనిస్తోనే ఉంది. వర్తకవ్యవహారభరితమైన నా మనస్సు కొంచెంసేపు స్వచ్ఛమైన ఆనందంతో నిండిపోయింది.

ఇంకా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. బెంగుళూరు, మద్రాసు, బొంబాయిల మధ్య ఎన్నో సార్లు నేను ప్రయాణంచేశాను. కాని, పగలెప్పుడూ ఆ స్టేషను తగిలే ప్రయాణాలు కావవి. ఎన్నిసార్లు వెళ్లినా, రాత్రి చీకటిలోనో, నిద్రలోనో, రాత్రిరైళ్లు అక్కడ ఆగకపోవడంవల్లనో ఆ చిన్నస్టేషను దాటిపోయేది. ఎప్పుడో ఒక్కసారి అటువంటి అదృష్టం కలిగింది. అప్పటికి కళ్యాణిని తన ప్రియుని సమీపాన చూసి యెన్నిసంవత్సరా లయిందో!...పన్నెండో, పదిహేనో—బాగా జ్ఞాపకం లేదు.

ఈ మాటు రైలు ఆ స్టేషనుదగ్గర ఆగగానే కనిపించిన దృశ్యం—ఆ నీలంగా ఉన్న యింటితోటలో ఒక చిన్న కుర్రాడు గడ్డిమీద దొర్లుతూ ఒక పెద్ద కుక్కతో, దాని తోక పట్టుకుని లాగీ, చెవులకు 'క్లిప్' పెట్టీ ఆడుకుంటున్నాడు. మధ్యమధ్య దాన్ని చూసి కిలకిలా నవ్వుతున్నాడు. అయితే నాకు కళ్యాణి ఒక్కసారి అయినా కనపడదా? నాకు ఎంతో నిరాశ కలిగింది...అంతలో ఆ కుర్రవాడు లేచి చప్పట్లు చరుస్తూ "అమ్మా, అమ్మా! రైలు వత్తింది!" అని అరిచాడు.

అప్పుడు మధ్యవయస్కురాలైన ఒకావె యింట్లోంచి బయటికి వచ్చింది. అదిగో! కళ్యాణే!

కొంచెం లావయింది,-కొంచెం నల్లబడింది. అయితేనేం? ఆమె కళ్యాణే! నేను వెంటనే గుర్తుపట్టాను. ఆమెను చూడగానే నా మనస్సు ఆనందంతో నిండిపోయింది. వెంటనే నే నెంతో గౌరవంతో ఆమెకు నమస్కారం చేశాను. ఆమెకూడా నాకు నమస్కారం చేసింది. కాని, ముఖంలో విస్మయభావం కనపడింది....ఆమె యెప్పుడూ ఒక్కలాగే ఉంది—అదే సౌందర్యమూ, అదే సరళత్వమూ. బండి కదులుతోంది. నా రాకకు జ్ఞాపకచిహ్నంగా నే నొక కమలాఫలం తీసి ఆమెవైపు విసిరాను. అది గడ్డిమీద దొర్లిపోయింది. దాని వెనకే కుర్రాడూ, కుక్కా పరుగెత్తారు.

ఆ తరువాత నా జీవితంలో అనేక విచిత్రసంఘటనలు జరిగాయి. నే నొకసారి వ్యాపారరీత్యా రంగూను వెళ్లివస్తున్నాను. అప్పటికి యుద్ధం చాలా భయంకరంగా సాగుతోంది. దారిలో మా ఓడను జపాను వాళ్లు కొట్టారు. నాకు సముద్రంలో మునగడమూ, ఒక రోజు ఈదడమూ జ్ఞాపకం ఉన్నాయి. ఎక్కడికో దూరప్రయాణం చేసినట్లు కొంచెం కలలాగ జ్ఞాపకం ఉంది. చాలా బలహీనం అయిపోయాను. నాకు బాగా తెలిసేసరికి బొంబాయిలో నా స్నేహితుడైన ఒక వర్తకుని యింట్లో ఉన్నాను. సముద్రంలో కొట్టుకొనిపోగా మిగిలిన కాగితాలలో అతని ఎడ్రసుచూసి అతనికి తెలుపగా, అతడు నన్ను తన యింటికి తీసికొని వెళ్లి చికిత్సచేయించాడు. ఆ సమయంలో నా కా నీలి మేడా, కళ్యాణీ జ్ఞాపకంవచ్చాయా అని నువ్వు అడగవచ్చు. మొట్టమొదట జ్ఞాపకం వచ్చినవే అవి. అప్పుడు నాలో నేనే—"ఈ ప్రపంచం ఎన్నాళ్లో ఎన్నో దేశాలు చూశావు. ఉన్నదానితో తృప్తిపడి ఒకచోట ఉంటే నీ కీతిప్పలు వచ్చేవి కావు! నీ అపరిచితమిత్రురాలైన కళ్యాణిలాగే పావనంగా జీవితం గడపిఉందువే! అదే శాంతి నీకూ దొరికిఉండేది! ఒకవేళ ఆ నీలిమేడలోనే నీకూ ఇంతచోటు దొరకిఉండునేమో! సుఖం అనేది నీ నుదుట వ్రాసిలేదు. ఏం చేస్తాము!" అనుకున్నాను. మృత్యుముఖంలో ఉన్న నన్ను అశాంతి ఆవరించి మరింత బాధపెట్టింది.

చివరికి యెల్లాగో నా మిత్రుని దయవల్ల నా ప్రాణాలు నిలిచాయి. ఇంకపైన వర్తకంమాటే తల పెట్టకూడ దనుకున్నాను.

నా జీవితంలో చివరిసారి బొంబాయి-మద్రాసు దారిలో ప్రయాణం చేస్తున్నాను. ఒక్కసారి కళ్యాణి కనపడి మాట్లాడితే యెంత బాగుండును! ఆమె శాంతి సందేశం నా జీవితంలో ఎంత సుఖాన్ని కలిగిస్తూ వచ్చిందో ఒక్కసారి నేను తెలియజేస్తే ఎంత బాగుండును! రైలు రెండు నిముషాలకంటె ఎక్కువ ఆగదు. ఆ కాస్తలో అసలామె కనపడుతుందో లేదో!

స్టేషను వస్తుందనగానే బండిలోంచి తొంగి తొంగి చూడ్డం మొదలుపెట్టాను. ప్రొద్దుటియెండలో ప్రకాశిస్తూన్న ఆ నీలిమేడను చూస్తే, నా జీవితమూ, సముద్రమూ, ఓడా అన్నీ జ్ఞాపకంవచ్చాయి. రెండిటికీ ఎంత తేడా...ఆమె యింకా యిక్కడే, పూర్వంలాగే శాంతంగా, తృప్తిగా, ఆనందంగా జీవితం సాగిస్తూ ఉండిఉంటుంది. రైలు అక్కడే, ఆ యింటి ముందరే ఆగింది. వరాండాలో ఒక వృద్ధురాలు జుట్టు విప్పుకుని కూర్చుని ఉంది. చుట్టూ చాలామంది పిల్లలు-మనుమలు కాబోలు-ఆడుకుంటున్నారు. ఎంత సుఖం!

కళ్యాణి! ఎవరూ ఆనవాలు పట్టలేరేమో! నేనుమాత్రం గుర్తించగలను...వెనకటివన్నీ మనస్సులో నడిచాయి. అన్ని భిన్నరూపాలలోనూ ఒక్కటే అభిన్నత్వం...ఆ నవ్వూ, ఆ శాంతీ!

నేను ఇంక ఈవైపు రానేరాను. ఇదే తుదిసారి. ఎల్లా ఆమెతో మాట్లాడడం? అవకాశం లేదు? ఏమనుకుంటుందో? అనుకునేందుకు ఏముంది? ఆ దివ్యరూపాన్ని యెప్పుడు యెల్లాగ చూశానో, భావించానో విప్పి ఒక్కసారి ముందు పెడతాను. తుదిసారి సెలవు తీసుకునేందుకు వచ్చానని చెపితే ఏమనుకుంటుంది?... కాని-వైములేదు!...

ప్లాటుఫారం అంతా గందరగోళంగా ఉంది. కనుక్కుంటే ఇంజన్ చెడిపోయిందనీ, గంటవరకూ కదలదనీ తెలిసింది. భగవంతునికి కృతజ్ఞతతో ఒక్కసారి నమస్కరించాను. నీలిమేడవైపు కాళ్లు నడి

వాయి. కాని కణుకుతున్నాయి. ఎల్లాగో ఆ గేటు ముందర నిలబడ్డాను. బంట్రోతు వచ్చి "ఎవరికోసం అయ్యగారూ?" అని అడిగాడు. "అక్కడ కూర్చున్న ఆ వృద్ధురాలితో మాట్లాడాలి" అన్నాను. "లోపలికి దయ చెయ్యండి. అమ్మగారితో చెప్తా"నని బంట్రోతు వెళ్లిపోయాడు. నాగుండెలు అతిత్వరగా కొట్టుకుంటున్నాయి.

ఆమె వచ్చింది. ఇన్నాళ్లయిపోయినా, ఇన్ని మాటలు మాట్లాడా లనుకున్నా, నేను ఒక్కటీ అనలేకపోయాను. ఆమెనే నన్ను పలకరించి "తమ రిల్లాగ మాయిల్లు పవిత్రంచేసిన కారణం..." అంది. "మీరు నన్ను గుర్తుపట్ట లేదా?" అన్నాను. "తమ రెవ్వరూ—" అంది. "నేను మిమ్మల్ని చాలా రోజులనుంచీ బాగా యెరుగుదును. జ్ఞాపకం తెచ్చుకోండి. చిన్నప్పుడు ఒకసారి మిమ్మల్ని ఇక్కడే బంతి ఆడుతోంటే చూశాను. తరువాత మీకు జ్ఞాపకం ఉండిఉంటుంది...ఆ రైలుకిటికీలోంచి మీకు నమస్కారం చేశాను. అప్పటికి మీ వివాహం అయి ఉంటుంది. తరువాత మీ అబ్బాయికి కమలాఫలం..."

వృద్ధస్త్రీ నావైపు భయంతో చూస్తోంది. నేను తాగివచ్చాననుకుందో యేమో! కాని నా వేష భాషలూ, నా వేళ్ల రత్నాల ఉంగరాలూ చూసి కొంచెం సమాధానపడి, "తమరు పొరపాటుపడుతున్నారండి. మే మీయింట్లోకి వచ్చి ఒక్క సంవత్సరం మాత్రం అయింది" అంది.

నాగుండె జారిపోయింది. "అయితే మీపేరు కళ్యాణి కాదా?" అన్నాను. "ఆపేరు గలవా రెవరూ మాయింట్లోనే లేరండి!" అని ఆమె లోపలికి వెళ్లా లనుకుంటోన్నట్టు చూసింది. నాకు ఏదో కలగం టోన్నట్టు తోచింది. లేచి, "క్షమించండి, పొరపాటుపడ్డాను. అయితే,—మీకు పూర్వం ఈయింట్లో యెవ రుండేవారు?" అని అడిగాను. "మాకు ముందా?...ఒక ముసలాయన ఉండేవాడు—చిన్నప్పటి నుండీ పెళ్లి చేసుకోలేదు...అయినా, ఆయన చనిపోయి ఐదేళ్లు అయింది. ఆతరువాత మేం వచ్చేవరకూ ఇల్లు ఖాళీగా ఉంది."...నేను లేచివచ్చేశాను. నా వెనకాల ఆమె భయపడుతూ భయపడుతూ వచ్చి తోటచిన్న గేటు వేసి వెళ్లిపోయింది.

నా తల తిరిగిపోయింది. గుండెమీద ఏదో పెద్ద బరువు పెట్టినట్టు అయింది. ఇందులో ఏదో పెద్ద పొరపాటు ఉండిఉంటుంది. అదేమిటో కనుక్కునేవరకూ నాకు శాంతి ఉండదు.

స్టేషనుకు వెళ్లి, స్టేషను మాస్టర్ని అడిగాను. అతని కేమీ తెలీ దన్నాడు. చాలాకాలంనుంచీ ఆ నీలిమేడకు ఎదురుగానే ఉన్న ముసలివాణ్ణి అడిగితే తెలుస్తుం దన్నాడు.

ముసలివాడు వచ్చాడు. ఎన్నివిధాల ప్రయత్నించినా అతనికి జ్ఞాపకం రాలేదు. "పది పదిహేను ఏళ్ల క్రితం నే నామెను చూశాను. ఒక చిన్న కుర్రాడూ, ఒక పెద్ద కుక్కా...బాగా జ్ఞాపకం ఉన్నాయి." "ఉండండి, ఉండండి, పెద్దకుక్కా?...అవును... కాని, ఆమెపేరు కళ్యాణి కాదే! సరస్వతి. నాకు తెలుసు." నాకు పిచ్చెత్తిపోతోంది.

"అయినా ఉండండి. మా ముసలిదాని కేమైనా తెలుస్తుం దేమో?" అన్నాడు వృద్ధుడు. ముసలిది వచ్చింది. చూడగానే చాలా తెలివైనదనీ, మంచి జ్ఞాపకశక్తి కలది అనీ తోస్తుంది. ముసలివాడు ఆమెకు ఒక్కొక్క విషయమే చెపుతూ వచ్చాడు. "ఓహో! ఆయువతి...నాకు తెలుసును. ఆమెపేరు జమునా బాయి. కొంచెం పొడుగ్గా ఉండేది. ఎప్పుడూ జుట్టు రిబ్బనుతో కట్టుకునేది. ఇక్కడే ఒక వర్తకుని కొడుక్కి ఇచ్చారు. పాపం, అతనితో చాలాబాధలు పడింది. చివరికి వదిలిపెట్టేశాడుకూడా. చాలా..."

నేను వెళ్లివస్తానని చెప్పబోయాను. రైలు ఇంకొక పావుగంటలో కదులుతుంది. "నాకు బాగా జ్ఞాపకం ఉంది. భ్రమా కాదు, ఏమీ కాదు. చిన్న పిల్లప్పుడు చూశాను. ఇప్పుడుకూడా నాకళ్లకు కట్టి నట్టుంది. ఇంకా వసంతలక్ష్మిలాగ, సీతాకోకచిలుక లాగ, నా కళ్లయెదుట ఆడుతోన్నట్టే ఉంటుంది. పేరుకు తగినట్టే ఆమె నిజంగా కళ్యాణే!" అంటూ

వృద్ధునివైపు తిరిగి, "నాకు బాగా గుర్తుంది" అంటున్నాను.

వృద్ధురాలు "ఆమాట ముందే చెప్పకపోయారా మరి? ముందు ఒక పిల్లలతల్లిని గురించి చెప్పారు. తరువాత యువతినిమాత్రం అడిగారు. ఇప్పుడొక బాలికను గురించి మాట్లాడుకున్నారు. బాలిక అయితే నాకు బాగా తెలుసును...కళ్యాణి! అవును. అదే దాని పేరు...ఎప్పటిమాట! నలభైసంవత్సరా లవుతుంది...ముద్దులుమూటకట్టినట్టుండేది పాపం. వాళ్లు మాకు కొంచెం బంధువులే. పదేళ్లయినా నిండకనుండే చచ్చిపోయింది అది!" అని వృద్ధురాలు కళ్లు తుడుచుకుంది. ఇంక నే నక్కడ నిలవలేకపోయాను.

"...పదేళ్లవయస్సులో,—అంటే నేను చూసిన కొద్దిరోజులకే. నేనుమాత్రం నలభైసంవత్సరాలనుంచీ ఆ బాలికనుగురించి కలలుగంటూ, ఆమెనే మనస్సులో వెతుక్కుంటూ ఉన్నాను...కళ్యాణి!"

* * *

మా మామయ్య ఇంక మాట్లాడలేకపోయాడు. నాకూ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

సుశీల ఆ "వీక్లీ"లో బొమ్మలన్నీ కత్తిరించి తన పుస్తకాల అలమారుకు అతికించింది. అది చూసినప్పుడల్లా నీలిమేఘ నాకళ్లకు కట్టినట్టు జ్ఞాపకం వస్తూ ఉంటుంది.



పల్లవి

= శ్రీ విశ్వనాథ శ్రీకృష్ణదేవరాయులు =

పల్లవి కోసమే పలవరిస్తుంటాను,
పల్లవి రాగానె పాట పాడేస్తాను.

పగలెల్ల చెమటోడ్చి
పాటుపడుచూ నేను
మనసులో పల్లవిని
మరచిపోలేను.

పల్లవి కోసమే పలవరిస్తుంటాను
పల్లవి రాగానె పాట పాడేస్తాను.

బ్రతుకులో చీకట్లు
ప్రబలిపోయిన కొలది
ప్రేమతో పల్లవిని
వెంబడిస్తుంటాను.

పల్లవి కోసమే పలవరిస్తుంటాను
పల్లవి రాగానె పాట పాడేస్తాను.

సూర్యుడూ చంద్రుడూ
సాక్షిగా చెబుచుంటి
ప్రీతితో పల్లవికి
ప్రాణమిచ్చేస్తాను.

పల్లవి కోసమే పలవరిస్తుంటాను
పల్లవి రాగానె పాట పాడేస్తాను.

పల్లవి రాగానె
పాట పాడుకొంచు
ఒళ్లు తెలియక నేను
కళ్లు మూసేస్తాను.

పల్లవి కోసమే పలవరిస్తుంటాను
పల్లవి రాగానె పాట పాడేస్తాను.

కిన్నెరసాని పాటలు

❋

= శ్రీ వేమూరి వేంకట రామనాథం =

ఆంధ్రసారస్వతప్రియులలో కిన్నెరసానిపాటలు తెలియనివా రుండరు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారుపన్యాసమునకు పోయి, సభాంతమున నాతని కిన్నెరగానము విననివారును అరుదే. కాని పెంకివాడు, పాడు మనగానే మొదలుపెట్టక, తెగ బ్రతిమాలించుకొనును. "వనిత తనంతతా వలచివచ్చిన..."అన్న సూక్తిలోని అర్థము పూర్తిగ గ్రహించిన వైదికబ్రాహ్మణుడేమో, సభికులను రెచ్చగొట్టి కాని తాను లొంగడు. పైగా ఎన్నో సాకులు! "నాగొంతు బాగుండ"దనును. "ఫరవాలేదు పాడు"మందురు సభికులు. "పాటలు బాగుగా గుర్తులే"వనును. "కావలె నన్న పుస్తక మిత్తు"మందురు. ఇంతటితో అతని సాకులు సభికుల కోలాహలములో తేలిపోవును. అతడు కిన్నెరసానిపాటలు కొన్ని చదివి వినిపించును.

ఆపాట లొక ఆనందము; అవి అతనినోటనే వినుట మఱొక ఆనందము. కవితకొఱకు హృదయము విచ్చుక నిల్చినవా రెంతయో ముదమందుదురు. గానము కొఱకు చెవులు నిక్కపొడుచుకొన్నవారును తృప్తులగుదురు. ఈ మురిపమునకై కనులు తెఱచుక కూర్చున్న యితరులును సంతసింతురు. అతని పాటలో కిన్నెర నడచుటే కాదు, సభికుల హృదయములే చలించును; కిన్నెరనృత్యములే కాదు, సభికులు మైమఱచి ఉయ్యాలలూగుటయు సంభవించును.

ఇంతలో ఒక క్షణము నిశ్శబ్దము. కిన్నెర తెరువాతి కంకణమునకై వేచియున్న ప్రేక్షకహృదయముల కిక ఒకే నిశ్శబ్దమై రాజ్యము. తీగె తెగినవానివలె— కాదు, తెగగొట్టుకొన్నవానివలె—కవి తన ఆసనముపై కూలబడును. సభికు లొక్కసారి బిగించికొన్న నిట్టూర్పులు ఏకశ్రుతిలో నిశ్వసింతురు. అతడు తారక కూర్చుండడు. "ఆఁ...ఇవన్నియు ఎన్నడో చిన్ననాట వ్రాసిన"వనుచు పెదవి విఱుచును.

నిజముగా కిన్నెరసానిపాటలు అతడు చిన్ననాట వ్రాసినవే. వ్రాసి ఇప్పటి కొక పుష్కరము దాటినది. వానితరువాత 'ఋతుసంహారము, నాస్వామి, శృంగారవీథి మొదలగునవి రచించినాడు. నేటికి అంతులేని శ్రీమద్రామాయణకల్పవృక్షమునీద లేఖిని నాడించుచు తదేకధ్యానములో మున్గిపోయినాడు.

అది తొలినాటి కావ్యమే. అయినను తెలుగు వారి కదన్న ఎందుకో యింత తీపి? తరువాత వృత్తము వృత్తమే సమాసముగా రచించిన పద్యము లెన్ని లేవు? హిమాలయమువలె పావనమును, మహాంబుధివలె అగాధమును అయిన భావము లెన్ని పద్యములలో పొదువ లేదు! కిన్నెరవాటికన్న మిన్నలై, ఆనాటి వాగు నేటికి పాయలుపాయలైన నదీమతల్లిగా ఈతని కవిత విజృంభింపలేదా?

కాని కిన్నెరలోని తీపి కిన్నెరదే! ఈమధ్య నామిత్రు డొక డన్నమాటలు గుర్తువచ్చుచున్నవి. తన భార్య వ్రాసిన లేఖనుగూర్చి, "ఆమె నావలె వ్రాయలేదు; పట్టి పసిపిల్లవలె వ్రాయును; అందుకే ఆ వ్రాతలన్న నాకు ముద్దు" అనినాడు. నిజముగ ఇందులో ఎంతయో సత్యమున్నది.

కిన్నెరసానిపాటలు వ్రాసినప్పు డీతనిది అన్వేషణదశ యని చెప్పవచ్చును. అన్ని విధముల అపు డన్వేషణమే! మనకు ప్రస్తుతమైన కవితారంగములో పలుత్రోవలు త్రొక్కి, వివిధశయ్యల నవలంబించి, కవితాసౌందర్యము సంపూర్ణము నొనర్చుకొనుటకు ప్రాకులాడు దినము లవి. ఆదినములలోనే ఆవేశములో పొంగిపోవు 'ఆంధ్రప్రశస్తి' వంటి సంకీర్తనము చేసి

వాడు; రంగమున రక్తికట్టని 'దేవరాజు' వంటి నాటకములను రచించినాడు; మొదలేకాని తుదిలేని 'వేయి పడగల'వంటి అసమాన నవలారాజమును సృష్టించినాడు. ఇట్టి పలుతెఱంగుల అమాయకాన్వేషణలో పొడిపడినవే యీపాటలు. క్రమముగ ఈతని అన్వేషణలబ్ధము రూపొందినది. నేటి కది జటిలముగా, కిన్నెర యంతటి మృదులముగాగాక, 'నాస్వామి' యంతటి క్లిష్టముగా, 'శృంగారవీథి' యంతటి బిగువుగా, శ్రీమద్రామాయణమంతటి అగాధముగా మారిపోయినది.

నేడు కిన్నెరసర్గములో తన భావనాశక్తి నడిపించదు కాని, ఆ ఫణితిలో మృదులత, ఆ మృదులతలో శబలత దానికి ఉండనేయున్నవి. ఇతని నేటి కవితాచైతన్యములో అదొక తొలినాటి స్వప్నరేఖ పెండిలియుండటి చెలిమివంటిది. ఆంధ్రుల కొక తీపి పులకింపు, తేనెల యొలికింపు.

కిన్నెరసాని మాధుర్యములో ఒక విశిష్టసంయోగమున్నది. కిన్నెర కన్నెలోని ఆర్ద్రత్వము, సానిదానిలోని ఆకర్షణ పాల్లువాల్లుగా కిన్నెరలై ప్రవహించినవి. అందుకే, ఈపాటలు పండితులకు పామరులకు, కవులకు గాయకులకు, పెద్దలకు పిన్నలకు రసవంతముగా తోచును. మానవుని వయసు చిత్తము మారినకొలది, యీ ఒకనాటి పోలయే కన్యవలె, ముగ్ధవలె, ప్రౌఢవలె తెనుగువారికి మారుచు కన్పట్టును. ఇది కిన్నెరసాని కున్న ప్రత్యేకత.

౨

వస్తుచిత్రణమున, స్థితిచిత్రణమున ఈతని కొక ప్రత్యేకప్రతిభ కలదు. పెక్కురు భావకవుల వలె, ఆధునిక కవులవలెగాక ఈతడు వ్రాసిన గీతములకు ప్రతిబింబములుగా బొమ్మలు వ్రాయవచ్చును. చిత్రము మనసునకేకాక కన్నులకును గట్టునట్లు చేయుట ఈతని విశిష్ట కవితాలక్షణము. నన్నయ ఎఱ్ఱనలకు లేనంతగా ఇట్టి విలక్షణత తిక్కనకున్న దందురు. ఇది ఈతని కవితలో కూడ ప్రముఖముగా నున్నది.

కిన్నెర మనుజకన్య. కాని యామె నదీకన్యగా మారినది. ఈ రూపపరివర్తనము కనులకట్టి మనసున కంటునట్లుగా వర్ణించినాడు.

"మిన్నులవలె తెల్లని నా
చన్నని మేని పసందులు
కన్నులకును కనిపించెను
చిన్నితరగచాలువోలె
  నీ నవ్వులు నురుగులుగా
  నీ వళులవి తరగలుగా
  నీ కన్నులు మీనులుగా
  నీ కరణిని ప్రవహించెదు.
పరువెత్తెడు నీవేణీ
బంధము పూనితి చేతను
కరమున వేణికి బదులుగ
కాల్వగట్టె నీటిపారలు.
  ఎడమచేత నీ కొంగును
  ఒడిచిపట్టుకొంటి చెలీ
  తడిచేతను కొంగులేక
  తడబడితిని ప్రియురాలా !"

భర్తకౌగిలిలో పెనవేసికొన్న కిన్నెర కౌగిలిలోనే కరిగి వాగైపోవును. భర్త రాయియైపోవును. రాతిసట్టులలో నదులు పుట్టుట సహజము. ఈ నదీత్వము కిన్నెర ఎట్లు పొందినదియు పై గీతములు వ్యక్తము చేయును.

ఇటులే ఇంకను కొన్ని రసవంతమగు స్థితిచిత్రణము లున్నవి. కిన్నెర దుఃఖించుట, గోదావరి కిన్నెర ననునయించుట, కడలి పొంగుట మొదలగునవన్నియు ఉదాహరణములే.

౩

కిన్నెరసాని పాటలలో పునరుక్తి చాలతావుల కన్పించును. కిన్నెరనడకలు, కిన్నెరదుఃఖము వంటి గేయములలో ఇది ముఖ్యముగ కన్పట్టును. ఇది అంతగా భావపునరుక్తి కాదు. ఇది ప్రధానముగా శబ్దపునరుక్తి. ఇట్టిది సాధారణముగా ఈతని రే పద్యకావ్యములోను అగుపించదు. అందులకే ఇందలి పునరుక్తినిగూర్చి ప్రత్యేకముగా పేర్కొనవలసియున్నది.

అసలుపాట లన్నిటిలోను 'పునరుక్తి' యన్న కొలదిగానో గొప్పగానో ఉండును. భావస్ఫురణకై,

రసముపుట్టుటకై ఒకేచరణము పలుమార్లు ఆలపించుట మనకు అనుభవమే. ఇది కృతులవంటి పాటలలో తరచుగా జరుగుచుండును. కాని పల్లెటూరిపాటలలో, కోతపాటలలో, పడవపాటలలో, బొబ్బిలిపాటలలో, ఒకేచరణము ఇన్నిసార్లు మననముచేయుటకంటె ఒకే చరణమువంటి కొన్ని చరణములు కొలదిమార్పులతో ఆలపింపబడును. ఇచటకూడ ఉద్దేశ్యము భావస్ఫూర్తి రసోత్పత్తి.

ఈకావ్యములో ఈపునరుక్తి సార్థకముగానే ఉపయోగింపబడినది. కొన్ని తావులలో ఇది స్థితిచిత్రణమునకు తోడ్పడినది. కొన్నిపట్ల ఏదో బాహుళ్యమును సూచించుటకు తోడ్పడినది. మఱికొన్ని స్థలములలో భావమును స్ఫుటముగా మనసున నాటుట కుపయోగించినది.

కాని యివన్నియు పునరుక్తిలేని పద్యకావ్యములలో కలుగుట లేదా? కలుగును. కాని, యీపాటల తీరే వేఱు. ఇందు పొందుపరచినవి నగిషీలు చెక్కని జానుతెనుగుపదములు, కటువుకాని ముద్దుమాటలు, సరళమైన పాటల వరుసలు. ఈ పరికరములతో భావబాహుళ్యమేదో కల్పింపబూనుట సాహసము. అది పునరుక్తి లేక అసాధ్యముకూడ. శబ్దవైచిత్రిచే, అలంకారప్రయోగముచే, ఛందఃక్లిష్టతచే పునరుక్తి లేకయే చిత్రింపగల్గిన భావబాహుళ్యము కిన్నెరసానివంటి సాలీడుగూడులో పునరుక్తి యుండి పుట్టును.

ఒకటిరెండు ఉదాహరణలు పరికించినచో ఈ పునరుక్తివలని ఫలము తెలిసికొందుము; గోదావరీసంగమములో ప్రతిగేయమును దాదాపు ఒకే మాటల పొందిక గల చరణముతో మొదలిడును. ఈగేయములు చదువగా చదువగా పాఠకుని హృదయములో గోదావరి పొందిన యారాటమువంటి దేదో పుట్టకమానదు. ఇట్టి రసైక్యత యితరమార్గములలోగూడ కల్గవచ్చును. కాని యీ పాటలలో ఇదొక యూతపదమువంటిది, ఒక పల్లవివంటిది:

౧. గోదావరీదేవిగుండె జలజలలాడి
౨. గోదావరీజాలిగుండె గూనయి కదలి
౩. గోదావరీపేదగుండె లోతులు కలగి
౪. గోదావరీజాలిగుండె ప్రేగులు తడిసి
౫. గోదావరీయెడదకోనలను కోతపడి
౬. గోదావరీదేవికోనమనసులో నొరసి

గోదావరీసంగమ మంతయు నింతే; ప్రథమపాదము లన్నియు సారూప్యములే.

మఱొక ఉదాహరణము. 'తవరితవరి, తన కర్మ మింతియే, తన కింక పతితోడి తగులంలేదు' అనుకొని, పతిసుట్టు 'విడలేక విడలేక, చనలేక చనలేక' సాగిపోకయు తిప్పని కిన్నెర, జలదేవతలు వచ్చి బలపెట్టగా ఎట్టకేలకు ఎట్టులో ముందుకు 'సాగినది.' ఈ స్థితిచిత్రణములో 'జలదేవతలు వచ్చి'యను పాదము మూడు గేయములలో చర్వితచర్వణమగును.

ఇటులే కిన్నెరదుఃఖము వర్ణించుచు 'చిన్ని కిన్నెరా సన్నని వెలుగులు' అన్న పాదము పదేపదే వచ్చుచుండును.

ఇవన్నియు పూర్తిగ పాదముపాదము పునశ్చర్వణమైన ఉదాహరణములు. అంతేకాక, పాదములలోని కొన్ని పదములుమాత్రమే పునరుక్తియై, మొత్తముమీద ఏదో యొకటే కవి తిరిగి చెప్పుచున్నట్లు మన చెవికి తోచు గేయములును పెక్కులు గలవు.

"కరగి కిన్నెరసాని వరదలై పారింది
తరుణి కిన్నెరసాని తరకల్లు కట్టింది
పడతి కిన్నెరసాని పరుగుల్లు పెట్టింది.
పడతికిన్నెరసాని విడలేక తిరిగింది
ముగుద కిన్నెరసాని వగచెంది తిరిగింది
వెలది కిన్నెరసాని గలగలా తిరిగింది.
వెలది నీ కిన్నెరా కలగిపోయిందిరా
నాతి నీ కిన్నెరా నలగిపోయిందిరా
పడతి నీ కిన్నెరా బడలిపోయిందిరా.
ఎక్కడెక్కడి మృగములు వచ్చెను
ఎక్కడెక్కడి పులుగులు వచ్చెను
ఎక్కడెక్కడి గాలులు వచ్చెను.
కిన్నెరయేడుపు చూచి పులుగులూ
కిన్నెరదుఃఖము చూచి మృగములూ

కిన్నెరయేడుపు చూచి గాలులూ
ఓదార్పగలే కవియు నేడ్చెనా."

ఈ కావ్యమంతటిలో 'కిన్నెరనడకల' లో, కొంతవఱకు 'కిన్నెరదుఃఖము'లో పునరుక్తి ఎక్కువగా కన్పడును. కొన్నిపట్ల ఇది కొంత విసువు కల్పింపకయు మానదు. కాని యీ విసువులోనే యిందలి కవితాత్మ కొంతవఱకు ఇమిడియున్న దనవచ్చును. అపుడే పుట్టిన కిన్నెరనడినడకలు మెల్లగా, వడిలేనిదిగా ఉండుట సహజము. అపుడే యిలు కొవలిన కిన్నెరయిల్లాలికిని పతిని వదలి కదలలేని విసువుపదములు! వడిగా మూకిన వాతికి అలవాటు లేని నీటినడకలు! అంతేయు వడిలేని, అనిష్టమైన వాతావరణమే! ఇది ప్రతిబింబించు రచనా శైయ్యయు అటులే ఉండవలెను. ఈ పునరుక్తి కొన్నిపట్ల ముగ్ధుగా, రసస్ఫోరకముగా ఉండక, కొంత షడి తగ్గినట్లు విసువుగొల్పునట్లు ఉన్నచో, దీనికి కారణ మిదియని చెప్పికొనవచ్చును.

౪

కవితలో స్ఫురణ యన్న దొక ప్రధానాంశము. అనగా, పాదినిన భావము చదువగనే స్ఫురించుట. ఈ స్ఫురణ భావశబలతవలననేకాక శబ్దధ్వనివలనకూడ జనించును. భీముని గదాఘాతములు 'అమనితీవెల లేనియపూవుల తావుల'వలె ఉన్నవని వ్రాసినచో ఆ భావము స్ఫురింపనే స్ఫురింపదు. ఈ పలుకులోని మృదులతతప్ప గదాఘాతముల గాంభీర్యము తోచదు. భావమును బయలుపరచుటకే శబ్దము పుట్టినది. అటు చేయని శబ్దము భావమునెడ ద్రోహముచేయు నన్నమాట.

కావున భావమున రసవంతముగా స్ఫురింపజేయ వలసిన కవితత్వములో ధ్వని యన్నది యొక ముఖ్యాంగము. ఇది మాటపై ఆధారపడియుండును. మొదటగా శబ్దసమీకరణములో కవి తెలివి కన్పడును. పిమ్మట, ఆశబ్దములను సమ్మేళనపరచుటలో కవిప్రతిభ గోచరించును. తుదిని, ఆశబ్దసంపుటములకు తగిన ఛందము లల్లుటలో కవివిశిష్టత చేటతెల్లమగును.

కిన్నెరసాని ఒక నది. నది యనగానే మన మన సున చేకో లలితస్ఫురణను కల్గును. అవును, జలము మృదులము. నీటినడకలు పాముమెలికలవలె మెలమెల్లగా,ఒదుగులొదుగులుగా,వయ్యారముగా నుండును. తరగల వంపులు మంజులములు. నురుప్రవాహములు మసృణములు. అంతేయు ఏదో మెత్తందనమే! ఇక కిన్నెరను వర్ణించు గేయసంపుటియు మెత్తగా, లలితముగా, తేనెవఱదవలె ఉండకతప్పదు.

కిన్నెరకావ్యములోని శబ్దజాలమే ఒక విశిష్ట సమీకరణము, కలతనిదురలోని వలపుగలల తీపితరకలు మాత్రమే ఏరుకొని కూర్చుకొని కావ్యము నల్లినట్లు కన్పడును. కిన్నెరసానిపాటలలో బరువుపదములు లేవు. సంయుక్తాక్షరములు,ద్విత్వాక్షరములు కొలదిగనేకలవు. ఇంతయేల, ఒత్తుఅక్షరములు మొత్తముమీద ఇరువదికి మించి లేవు. ఇవియు 'ధార', 'ధుని', 'నాధ'వంటి లలితధ్వనులే.

ఇందలి పలుకులలో ఒక విచిత్రము కలదు. భావములోని అక్షరము లన్నియు మంజులముగా ధ్వనింపవు. తెలుగులిపిలోని 'లసర'లు మెత్తగ మ్రోగుట గానరక్తి, కవితాహృదయము కలవారికి తెలియును. కిన్నెరలోని మాటలను పరిశీలించి విడబరచినచో, 'లసర' ధ్వనులు మిక్కుటము లన్నట్లు స్పష్టమగును. 'తెలితలిరుతరగలు నురుగులు తెలుపుమలుపుపూలు చాలు పొరలు తెరలు'వంటి బుల్లిబుల్లి పదములే ఎటు చూచినను కాన్పించును.

ఇంతే కాదు. సహజముగా మృదువుగా మ్రోగు ఈ పదములకు లేటతెనుగుపాటలకు తగినట్లుగా నగిషీలంకూడ చెక్కినాడు. కావుననే పద్యములలో కనరాని శబ్దరూపములు, ముద్దుముచ్చటలకై ఏర్పరచినట్లుగా, ఇందులో విరివిగా ఉన్నవి: తరకల్లు, పరుగుల్లు, ఏడ్చినా యేడ్పులూ, చూపినా దుఃఖమూ. వీని తీరు తెల్లముపాకముపట్టినట్లు!

కాని యీ మెత్తని పదములలోనే ధ్వని సౌందర్యము సర్వమును లేదు. అవ లీపదముల నేర్పుటలో కన్న వానిని కూర్చుటలో సౌందర్యము, మంజులత, కవిత, స్ఫురణ ఉద్భవించును. మెత్తని పదముల నెన్నిటినో కలగూరగంపగా పులిమిపెట్టినచో, వాని తీయం

దనము విరిగి చేదగును. తీపిపాయసము, తీయని మావి రసము, తీయని లడ్డు, తీయని ఫేనియలు కలిపి అల్లునకు పెట్టినచో, అబ్బురముకాదుగదా, అల్లున కుబ్బసము పుట్టగలదు. అవి అమర్చవలసిన పొందికలో పెట్టినచో, అవే అమృతాన్నమైతీరును. నిజమునకు, పలుకుల మెత్తదనముకన్న పలుకుల కూర్పులే ధ్వనుల నొసంగును. కిన్నెరపాటలలో నంత మెత్తనివే కాకపోయినను, జయదేవుని వివిధశబ్దసంకలనములలోని ధ్వనిసౌందర్యము ప్రపంచవిఖ్యాతి నందినదని మన మందర మెఱుగుదుము. సంస్కృతపదభూయిష్ఠమైన నన్నయ సమాససంకలనములోని శయ్యాసౌందర్యమును మన మెఱుంగుదుము.

కావున శబ్దముల అల్లికలోనే కవిప్రతిభ మెండుగా గోచరించును. ఇక కిన్నెరసానిపాటలలో ఉన్నదే యీ అల్లిక జిగిబిగి! ఈ కవికి సహజముగా ఉన్న సమాసక్లిష్టత ఏమయినదో, కతిపయపదసాంకర్యము నిద్రపోయినదో యేమో, లేతవెన్నెలలో సాలీడుగూటి వలె ఈ కావ్యము నల్లినాడు.

ఈ శయ్యకు ఉదాహరణముగా దాదాపు ఈ కావ్యమునంతయు నీయవచ్చును. కాని మఱియొక మాట. మెత్తని అల్లిక యున్నదే మనకు సర్వము కాదు. అది సుందరమే కావచ్చును, కాని జ్వరమువచ్చినవానికి మావిరసము విషమయినట్లు, పదములలోని భావమును స్ఫురింపజేయని మెత్తని అల్లికయు వ్యర్థమే అగును. కూటికి లేక మీసాలకు సంపెగ రాచుకొన్నట్లుండును. కిన్నెరసానిపాటల యల్లికమాత్రము వ్యర్థముగాక, సప్రయోజనమై యున్నది.

భావమును సరిగా స్ఫురింపజేయు పదముల కూర్పున కన్నో ఉదాహరణము లీయవచ్చును. 'తళతళా మెరిసింది, బిరబిరా నడిచింది, బుసబుసా పొంగింది' మొదలయినవి స్వయంవ్యక్తములే. కాని యివి అతిసాధారణోదాహరణములు. కిన్నెరలోని ఔన్నత్యమున కివే పతాకలు కావు.

కిన్నెరనృత్యములో కవి కూర్చిన పదముల యల్లికలు అతని ధ్వనిసౌందర్యమునకు అద్దములవంటివి అన వచ్చును.

"కెరటాలలో నురుస్సు
తెరచాలులో నీటి
పారజాలులో కిన్నె
రటు కదలి యిటు కదలి
చిటితరంగాలతో - పొటితరంగాలతో
నటనాలు మొదలెట్టెనే - క్రొన్నెటి
సుటురులా కదలాడెనే!"

అని ప్రారంభింపగానే పడవ యూగినట్లు, అనగా వాగు ఊగుచు దొరలినట్లు, చటుక్కున స్ఫురించును. ఈ గేయములోని ఇరువదిపాటలలోను నాలుగవ పాదములు 'అటు లాగి యిటు లాగి' 'అటు లొదిగి యిటు లొదిగి' 'అటు పొంగి యిటు పొంగి' 'అటు మెరసి యిటు మెరసి'వంటి 'అటు...ఇటు'లతో నిండి యున్నవి. ఈపాదమే ఊయలఊపువలె ఊగును. దొరసానివయ్యారపు నడక వంపులవలె జరుగును. వాగు సేయు నృత్యమును అట్టిదే. ఇదే ధ్వన్యనుకరణము.

ఈ ఊయలయూపునకు మఱొక త్రోపు! పైపాటలోని మొదటి మూడుపాదములలో 'నురుస్సు', 'నీటి', 'కిన్నెర' అను తుదిపదములకు తరువాతి పాదములలోని తొలిపదములతో అన్వయము. 'కెరటాలలో'లోని 'లో' పైన, అటులే 'తెరచాలులో'లోని 'లో' పైన, అటులనే 'పారజాలులో'లోని 'లో' పైన పాటలో ఒక ఊపు ఉన్నది; రాగములో ఒక నిడుపైన మలిక ఉన్నది. ఈ ఊపుల కడ అలల తుదిపొంగులు ధ్వనించును. ఈ పాదములలోని చక్కందనమును ఇనుమడించి, ధ్వనియందమును ద్విగుణీకరించినవి పదములవిరుపు. ఇది తరగల విరుపువలెనే కుదిరినది. ఛందమునకు సూటిగా పద్యము లల్లువారికి తప్ప సహృదయులగు కవులందరకును ఈ పదములవిరుపు హృదయంగమముగా గోచరించును.

ఇందలి ఛందస్సులుకూడ వివిధముగ ఉండి, వివిధ శ్రుతుల నొసంగి, వివిధధ్వనులతో వివిధస్ఫురణల నిచ్చుచుండుట ఒక్క విశేషము. శార్దూలము, ఆటవెలది యన్న వెట్లు సార్థకముగా నడచునో, అటులే ఇందలి కిన్నెరనడకలలో ఛందము నడచుచుండును. కిన్నెర నృత్యములో అదియు నర్తించును. కిన్నెరసంగీతములో

అదియు గానముసేయును; కదలిపొంగులో అదియు పొంగును; గోదావరీసంగమములో అదొక ఉదాత్తత చేర్చుకొనును; కిన్నెరదుఃఖములో అదియు నేడ్చును; కిన్నెరవైభవములో అదియు ఏదో వైభవము సేకరించుకొనును.

అవును. కిన్నెరబ్రతుకులో ఎన్నో దశ లున్నవి: నడకలు, నృత్యము, సంగీతమువంటివి. పిడుగువడు, విలయమునకు నొక్కే మంత్రమువలె ఇందలి ఛందములన్నియు ఒకేతీరుగ నుండక, ఏ దశకు అనుగుణముగా ఆ ధ్వనులు పుట్టించుచుండుట కవిప్రతిభకు మేలితార్కాణము. కిన్నెర నృత్యముకన్న కిన్నెరసంగీతము ఎక్కువ లలితముగా, మృదువుగా ఉన్నది. ఇది సహజము. ఎంత లలితమయినను అడుగుల సవ్వడికన్న గొలుసుల రవములు మెత్తనివిగదా! ఈ తారతమ్య మీ క్రింది రెండు గేయములలో విశదముగా ప్రతిబింబించుచున్నవి:

కిన్నెరనృత్యములో:

"లయపెంచుతూ మధ్య
లయదించుతూ పాట
రయమెంచుతూ కిన్నె
రటు సోలి యిటు సోలి
తెలినీటిమేనితో-తళిరాకుమేనితో
ఒయ్యారములు పోయెనే-కిన్నెరా
అయ్యారె అనిపించెనే."

కిన్నెరసంగీతములో:

"తొలివెన్నెలచివుళ్ల తెలినిగ్గు విరజిమ్మ
వెలది కిన్నెరపాట విరిసిపోవుట చూచి
తెలుపులో, వెన్నెలా
మలుపులో, రేచాన
సిరివెల్లి పచరించెనో-విరిపూల
సెరతావి తరమెంచెనో."

ఈ తారతమ్యము సహజమే. కవియన్నట్లు, కిన్నెరనృత్యములో 'గణసంగిణాంధఘోంగిణతక్కిణాం మద్దెలల్రవాత' లున్నవి; కిన్నెరపాటలలోమాత్రము 'తళిరాకుకన్న మెత్తని యందె'మున్నది.

కొలదిభేదములతో, మొత్తముమీద, పైవి రెండును మృదుఛందములే. కాని కదలిపొంగులో, అదేమి చిత్రమోకాని, నిజముగ ఛందమునకే యొక పొంగు వచ్చినట్లుండును. 'గాలిపిల్ల లెవోయి ఊదినో' అని మొదలిడగానే, ఈ గేయములలో ఏదో ఆకార్షము, ఏదో మందలింపు స్ఫురించును. ఇందున్నవన్నియు అతిలలితములగు పదములుమాత్రమే కావు. పదముల కలయికయు అంత మెత్తగా లేదు. ఇవి పన్నికలలో ఒత్తిన గేయములు. ఈ క్రిందిగేయము చక్కని ఉదాహరణము:

"ఏనాటి ముసలి యీకదలీ
ఏనాటి పెద్ద యీకడలీ
తిరిగి నలుగురిలోన తిరుగ జేర్చినవాడు
పరగ కౌమమునకై బడలిపోయెనటన్న
తనకేమి పరువూ
కడలిరాజునకూ!"

కిన్నెరసానిపాటలు మెత్తని పాటలేకాక, కిన్నెరను తలపించు పలుకరుపల ఘణుకులు. శబ్దగ్రహణయంత్రమును మెల్లగ కిన్నెరయొడ్డున జరుపుచుపోయినచో ఏధ్వనులు పట్టునదునో, అవియే యీ గేయ సంపుటిలో హత్తుకొనియున్నవి. జలశాస్త్రప్రవీణుడై ఇంగ్లండునుండి తిరిగివచ్చిన తన మిత్రు డొకడివి విని, ఈ కవితో ఒకమా రిట్లులన్నాడట: "మీరు జలశాస్త్రము పఠించినవారా యేమి? ఈధ్వనులన్నియు శాస్త్రము చెప్పునట్లు ఉన్నవి!" యని. అతని మొదటి పలు కసత్యము. రెండవది నిక్కువము. ఈకవి జలశాస్త్రమును పఠింపలేదుగాని అందలి కళనుమాత్రము తనలో జతింపచేసికొన్నాడు. కొండకోనలలో వాగు సాగుచు ఎట్లు మ్రోగునో, తరగవిరుపులో అలల సొలపులో నీటిమ్రోత లెటు లుండునో, శాస్త్రరీత్యా అతనికి తెలియదుగాని, అందలి పాటు లెట్లు మ్రోగునో మాత్రము కవి కని విని యూహించి యనుభూతిచేసికొన్నాడు. ఒకప్పు డీతడే వాక్రుచ్చినాడు—కిన్నెర సంగీతమున కొక ఛందమును నిర్మించుటకుముందు దినములు దినములుగా వాగులవెంట, తోగులవెంట దిమ్మతిరిగి నాడట, ఆధ్వనులు తనలో జతింపచేసికొనుటకు! ఈ పర్యవేక్షణమంతయు తుదకు అతిఫలవంత మయినది.

కిన్నెరసానిపాటలలోని శయ్యాపరిశతను వర్ణించునపుడు, ఇందలి ఒక్క దోసమును పేర్కొనక తప్పదు. మేలిముత్తెముల కోవలో ఒకటిరెండు గ్రుడ్డిముత్తెము లున్నట్లు, ఈ తీపిపాటల శైలిలో అతుకనిగీతములు, చరణములు లెక్కకు తక్కువగా రెండో మూడో యున్నవి. ఈ కొఱతను వెక్కిరించుటకు బదులు, ఇన్ని గేయములలో ఈ రెండో మూడేనా కొనకు దూరమైన వను ఆశ్చర్యము, ఆనందము సహృదయులు పొందవలెను. ఈ కొలదిగేయములు క్రింద ఉదాహరింపబడినవి :

"నేను కోపము నంది
వేఱ్రపక్క నుండగా
వలదన్న కొద్ది నాపదను లొత్తుచు నీవు
తెలది కౌగింటిలో తేర్చుకుంటూ నీవు
నా బొమ్మ తల చేర్చ రారావుకాబోలు.
తలిరాకువంటి మె
తని యొజ్జపెదవితో
తార్చి నామోము వద్దగరావు కాబోలు
నాయొడల్ మిపుల నందపు కుప్ప యని చెప్పి
ఎల్ల తావులను ముద్దిడరావు కాబోలు.
పతివంక చూచుచూ
పడతి కిన్నెరసాని
పోయేటి వేళలో భూమి తనంతగా
తోరమై విరియుచూ త్రోవగా చేసింది
కెరటాలతో చొచ్చుకోదు కిన్నెరసాని."

ఇవి పదములు కూర్చిన పద్యములవలె నున్నవి. కాని పాటలలో పదము లతుకుకొనిపోయినట్లు లేవు. గంతులిడుచుపోవు పిల్లల గుంపులవలెగాక, పంతులుగారు పరీక్షకై కూర్చుండబెట్టు పిల్లల వరుసలవలె ఉన్నవి. కాని యివి బంగారుతీవలో కంచుతీగ కలిపిన రాగిపువ్వులవలె, మిక్కిలి కొలదిమాత్రమే, పైగా అసలులో కలిసిపోవునవే!

కిన్నెరకావ్యము గానలక్ష్మికి సాహిత్యవజ్రహారము. లేక, సాహిత్యలక్ష్మికి మంజులగానభూషణమో! ఇది ఇదమిత్థమని చెప్పలేముగాని, నిక్కముగా ఇది సరస్వతి మనసున కెక్కు మేలివగ. ఏలయన, శారదస్త్రీరూపు వహించిన లలితకవితాసౌందర్యముమాత్రమే కాదు, ఆకృతి గొన్న అనవద్యవీణామాధుర్యముకూడ.

కవిత్వ మనగా గానలలితమౌ భావన యని యొక ఆంగ్లపండితుడు నిర్వచించినాడు. ఈ దృష్టిని కిన్నెరసానిపాట లుత్తమకవిత్వ మని చెప్పకతప్పదు.

౨

కిన్నెరసానిపాట లోక మధురాతిమధురగీతమే కాదు, కవితాసంపన్నముకూడ! భావమాధుర్యము, భావశబలత లేని యితరపాటలవలెగాక, అథమగుణముగా పేర్వడ్డ శబ్దవైచిత్రికి మాత్రమే ఆటపట్టుగాక, ఈ గేయసంపుటి కవితాగుణమును పుష్కలముగా చిప్పిలించుచున్నది.

దీని నిర్మాణములోనే ఒక ప్రకృతిసిద్ధమగు క్రమము కలదు. కిన్నెరవాగు తన ఒడుదుడుకులు, అందములు అన్నియు పతిగుట్టయొద్దనే పుణికిపుచ్చుకొన్నది. రాతియొద్ద నదులు పుట్టు నను సత్యమేగాక, పతివలననే తనకు గతి యున్న నీతియు నిందు వ్యంగ్యముచేసినాడు. ఈ గేయసంపుటిలో కిన్నెర తొలుత వడచును; పిదప నృత్యము చేయును; ఆ పైని సంగీతమునకు కడంగును. నదియు తొలుత మెల్లగా దొర్లును; పిదప ఒడుదుడుకులు పడుచు పోవును; ఆ పైని వడి హెచ్చి నూటిగా పాటలల్లుకొనుచు పరువులెత్తును. పిదప పెద్దనదులలో కలియుట, లేదా కడలిలో కలియుట! ఈ గేయసంపుటికిని, ఈ సమాజనదీశయ్యకును అచ్చమైన సారూప్యమున్నది.

ఈ గేయములోని కల్పనయే (Concept) అపురూపము. కిన్నెర వనిత. పైగా తెనుగుపిల్ల. వనితకు, నదికి మృదులత, రసాకృతి సామాన్యము చేసి వ్రాసినాడు కవి. 'వనితలు నీవలె కఠినలు కనిపించరువేయొందును' అను వ్యంగ్యముతో, 'ఈవు రసాకృతి వగుటను, ఈ వైఖరి ప్రవహించితి' వని నిక్కము వచించును. పడతికిన్నెరలోని రసార్ద్రత ఎప్పుడో తొలకరించినదట; 'మునుపే నీ కన్నులు గని, అనుకొంటిని నీవు నదీ, వనితవు మానవజన్మము, కనిపావని మనసులోన.' తుద కామెనవ్వులు నురుగులైనవి, వగులు తరగలైనవి, కన్నులు మీనులయినవి.

ఇక కిన్నెరపతిని రాతి నొనర్చినాడు. 'నేను శిలాహృదయుండను, పూనదునె ధునీపై ఖరొ' అని విలపించుచు, 'నా యీ దేహ మిదేమొ రాయివోలె నగుచున్నది' అని పలవించుచు గుట్ట యైపోయినాడు. నిజముగ మగవానిలో మఱింత నిశ్చలత, పటువు, కటువు కలవుగదా!

కడలిని కిన్నెరకు కన్నెరికము పెట్ట పొంగెడి విటునిగా చిత్రించినాడు. 'తరుణికిన్నెరఅందమే లోకమయిపోయి, సళపెళా కాగెను. తన శరీరమెల్ల దహియించినట్లుగా తటపటయిపోయెను.' కడలి పొంగుచు, పోరెత్తుచు విటునివలె చెగడుకొల్పుట మన కనుభవమే! ఇదియే చమత్కరించినాడు కవి.

ఇక మిగిలినది గోదావరీమతల్లి. ఈమె 'గొప్ప వంశపురాణి, గొప్పగుణముల జాణ.' పెద్దయిల్లాలు, పండుముత్తైదువు. ఇంటికి పెద్దయై, సంసారము తప్పిన చిన్నిపిల్లను కడుపులో పెట్టుకొని ఓదార్చు అక్కగ, తల్లిగ చిత్రించినాడు. తాను స్త్రీయై తోడిస్త్రీల బాధ తెలిసి సానుభూతి చూపుటయే కాదు, "ఆదేవి మున్న సీతారాము లొకరొకరి చేరుకొను వెడబాటు నెరుగూ, పరుల కష్టాములకు మదిలోన మరుగూ.'"

ఈ గేయములోని నిర్మాణసౌష్ఠవముకన్న, కల్పనాపుష్టికన్న మించి పేర్కొనదగిన ప్రధానగుణము మఱొకటున్నది. భారతీయపురాతనసారస్వతమంతటివలెనే యిదియు 'కాంతాసమ్మితము.' కావ్యమునకు కావ్యమే పరమార్థము కాదు. దానిని మించిన మహదర్థ మేదో యుండితీరవలెను. ఇదే మన సారస్వతముల లోని సార్థకత, ప్రజాప్రయోజనము.

ఈ సార్థకత 'కడలిపొంగు'లో మిన్నుముట్టిన దనవచ్చును. మిగత కావ్యమంత ఒక యెత్తు, 'కడలిపొం' గొకటి ఒక యెత్తు. ఇది ఒక గీతి కాదు, నీతి! ఇందున్నది ప్రియమైన పాట కాదు, హితమైన బోధనము!

ఈకవికి కొన్ని ప్రియభావములు (Pet thoughts) కలవు. ఇందు, కడలి ఎంత పొంగినను చెలియలికట్ట దాటరాదనున దొకటి. ఈభావమునే తరువాత 'చెలియలికట్ట' యను నవలలోకూడ ప్రపంచించినాడు. ఇది కేవలము ప్రకృతిలోని ఒక రీతియే కాదు; అటులే అయినచో ప్రతిమనుజునకు ఈరీతి కన్పడునుగదా! ఇందు అంతర్నిహితమై-ఏదో ఒక మహార్థ మున్నది. అదియే కవిహృదయమున గడ్డకట్టిన భావనాప్రియత. శ్రీ విశ్వనాథవారి అచంచలదృష్టి యిది. దోష మెంత దుడుకైనను, పుడమిని ముంచెత్తు వడి కల్గినను, తుద కాదోషము అడగి శిష్టత విరియును, విరియక తప్పదు; ఇది ప్రకృతిసిద్ధము; దైవలిఖితము. ఇందులకే మన సారస్వతములో దౌష్ట్యమునకు, అవినీతికి, చివఱకు దురదృష్టనిధికికూడ విజయము కల్పింపక, అది విజయకిరీటము దాల్చు నిముసములోనైనను—ఏదోయొక రీతిగ, ఏదోయొక యుక్తితో, ఉపాయముతో, లేక కేవలము దైవకృపచేనైననుసరే—దాని నరికట్టి, తిరిగి అనశ్వరములగు సత్యశివసుందరములకే అంత్యవిజయము చేకూర్చుచువచ్చినారు. ఇదే వాల్మీకిమొదలు మన ఋషులందరి యాదర్శము. ఇదే నన్నపార్యునిమొదలు మన కవులందరి యుద్దేశ్యము. ఇదే సాంఘికప్రయోజనము, కావ్యసార్థకత. అంతేకాని, వర్ణనకు వర్ణనముకోసమై, కావ్యము కావ్యముకోసమై, కళ కళకోసమై సృష్టించుట మన వెలితి కానేకాదు.

ఇక ఈకడలిపొంగును పరిశీలింతము. ఇందు కడలియూ, 'ఏనాటి ముసలి'నో, 'ఏనాటి పెద్ద'నో! 'తన కున్న మరియాద యెంతో, తన కున్న గౌరవం బెంతో, తిరిగి నలుగురిలోన తిరుగనేర్చినవాడు, లోకాలు తప్పత్రోవల పోవునాయేని సర్దిచెప్పగలట్టి సామంతు డీరాజు, తనకుగా దిగెనా తప్పదారులకు! ఉబ్బుట్ట లూగెను, మిన్నెక్కి చూచెను, మసకమసకల కళ్లు విప్పెను, మిరిమిర్రి చూచెను, బొటవ్రేళ్ల నిలిచెను, సళపెళా కాగెను, ఇన్నియేళ్లూ వచ్చి తటపటయిపోయెను. తనకేమి పరువూ కడలిరాజునకు? పైగా 'కళవళింపడెను జగములన్నియు.' అంతటివానికి కూడ ఇంతటి దుర్బుద్ధిపుట్టినది!

మఱి కిన్నెరతీరన్న నో, 'కాని నీటిగుణమ్ము కదలిపోవునెగాని' యన్నట్లు, జరజర పారునేగాని, నిముసమును ఆగిపోలేదు. ఆమెలోపమైనదేమి, ఆమె

దుర్విధియైననేమి ఆమెను కడలివైపే లాగినది. ఇదే ప్రపంచపుతీరు. మానవకార్యముకన్న పెక్కుపట్ల దుర్విధియే ద్రోహముచెంతకు త్రోవలల్లి వెఱ్ఱిమనసును త్రోసుకవెళ్లును.

కాని, ఇటు ఈ వెఱ్ఱిమనసునకు కొంత అనునయము, అటు ఆ దౌష్ట్యమునకు కొంత ఆటంకము! ఇవియు ప్రకృతిసహజములే! ఈ గేయములో కడలిపని యేమయినది:

"వచ్చెవచ్చె నటన్న కడలీ
పొంగెపొంగె నటన్న కడలీ
ఎంత చూచినను అల్లే నిల్చిపోవగా"
"కడలి పొంగిన దంతెకానీ
కడలి యుబికిన దంతెకానీ
కడలి తా చెలియలికట్ట దాటునె యంచు
కడలిమాత్రము బద్ది గడచిపోవునె యంచు
కడగి యనుకొనిరి
బుడుతమానిసులూ."

బుడుతమానిసుల కిది తుదినీతి, సంతృప్తి! దేవుని మ్రింగజూచిన దుష్టతకు, దైవికముగానే పతనమును సంభవించును. శివుని తల ప్రక్కలుచేయగడంగిన భస్మాసురునకు తన తలయే వేయిప్రక్కలై పోలేదా? ప్రకృతిలో దుష్టతకు అంతిమవిధి యదియే!

అటు కడలిపొంగు అఱను; ఇటు 'గోదావరీ నీరు కూడి కిన్నెరనీరు, ఏది ఏదో తెలియనంత'గా మారిపోవును. ఆమెలోని అశిష్టత మంజుల శిష్టత యైపోయినది. మంజుల 'తొల్లింటి సొదురూపము పొంది' సాగినది. అదంతయు ఒక నాటకము. విషమమైపోవు వేళలో సన్నివేశము లన్నియు కిన్నెరకు సుఖాంతములై కిన్నెరవైభవమునకే దారితీసినవి.

కిన్నెర ఒక ముద్దులొలుకు తీపిపాట కావచ్చును. కాని కిన్నెర ప్రధానముగా ఒక నీతి. కిన్నెర ఒక ప్రకృతివిమర్శ. ఇదే దాని ప్రశస్తి, పరమార్థము.

ఇందలి ప్రకృతివర్ణనము ప్రకృతికే మురిపెము కలిగించునంత అచ్చముగా, అందముగా ఉన్నవి. కిన్నెరసానిపాట లన్నియు ప్రకృతివర్ణనములే! ఆంగ్ల మహాకవి మిల్టన్ చేసినట్లు పుస్తకములవలన ఆర్జించిన పాండితితో గాక, కేవలము ప్రకృతిని తిలకించి పులకించి విమర్శించుకొన్న అనుభూతితో ఈకవి వర్ణనములు చేసినాడు. ఈ వర్ణనములోని నిర్దుష్టతకు, విశిష్టతకు 'కిన్నెరవైభవము'లోని గేయములే మహోత్కృష్టమైన యుదాహరణము! "తూర్పులో తెల్లనై తోచిన దుమ్ముకాంత, తొలిమావి లేబూతమూసెను పికీకాంత" అని మొదలు మొదలిడుటలోనే ఏదో విభవము ప్రకృతిలో తొలకరించిన దనిపించును. క్రమముగ, వివిధఘటికలలో, పవలు, రేయి, శుక్లపక్షములో, బహుళములో, వివిధఋతువులలో, కిన్నెర ఎట్లు ప్రవహించినదియు, ఎట్లు కన్పట్టినదియు వర్ణింపబడినవి. చెప్పినది చెప్పకుండ చక్కని యుపమలు గుప్పినా డీ గేయపరంపరలో. మొత్తముమీద ఈ కావ్యమంతయు ప్రకృతికవి పట్టిన అద్దమువంటి దనవచ్చును.

ఈ కావ్యములో ఉపమానాలంకారము బహుళముగా ప్రయోగింపబడినది. ఈ ఉపమానము లన్నియు ఎత్తిచెప్పుట కిది తావు కాదుగాని, యొక్క విషయము చెప్పకతప్పదు. ఇవన్నియు దేశీయములు, 'పదుపుకట్టిన లేళ్ల కదుపులా, కదలు తెల్లని పూలవది వోలె, వదలు తెల్లని త్రాచుపడగలా, వెయ్యావు లొకసారి పిదికిన కైల్లె, పసిపాప పెలవివారిన బోసినవ్వులా'- ఇట్టి సామ్యములు తెనుగువారికి అనుక్షణము కన్నులకు కట్టు మురిపెంపు దృశ్యములు. బుద్ధిబలముచే ఊహించి, ఉపమానసామంజస్యము తర్కించి ఆనందించుటకన్న, చూచుచుండగనే దృశ్యము కన్నులకు కట్టి, ఉపమానము అవగాహనమైపోవును.

ఇక చెప్పవలసినది కిన్నెరలోని తెనుగుదనము. కిన్నెర తెనుగువాగు, కిన్నెర తెనుగుకన్నె, కవికి కిన్నెర కిన్నెరయే తెనుగుందనములోని తీయందనముగా తోచినది. కిన్నెరనడకలు చూచి 'తెనుగుపాటల వెంట తీపిలా తోచిన' దని మురిసిపోయినాడు. ఈమురిపెములో 'ముక్కుతిమ్మనార్య ముద్దుపలుకు', 'అల్లసానివాని యల్లిక బిగి', 'దేశభాషలందు తెనుగు లెస్స' మొదలగు నిక్కంపుమదులన్నియు ధ్వనించి [illegible]తించినవి. ఈ తీపులన్నియు కరిగి వాకలై కిన్నెరయైనవట! కిన్నెర నృత్యముసేయుచు 'తెనుగుపాటలు పాడె'నట.

కిన్నెరకదలిక ఎంత గడుసో చూడుడు. "తెనుగుసత్కవి రాజు పలుకందుకోలేని, చవులూరి చవులూరి జగముల్ల ప్రోవులై కదిలేను కిన్నెర." ఇందలి తెనుగుసత్కవిరాజు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారే! ఆ దెంత గర్వమో తన్నుతా పొగడుకొన్నాడు, కాని ఆ దెంత నమ్రత యో, తనకును మించిన దీకిన్నెరయని మురిసినాడు!

కిన్నెరలోని తెనుగుదనమును పవిత్రీభూతము చేయుచు ముగించిన గేయముతీరు ఎన్నతగినది.

"తెలుగుదైవమ్ము భద్రాద్రిపై నెలకొన్న
రామయ్య అతని దర్శనము చేసే త్రోవ
కాచింది కిన్నెరా
తెలుగుయాత్రికుల కందిచ్చు చల్లనినీడ
పుణ్యాత్మ కిన్నెరా
తెలుగుయాత్రికుల కందిచ్చు చల్లనినీడ
పూతాత్మ కిన్నెరా
తెలుగుదైవమ్ము భద్రాద్రిపై నెలకొన్న
రామయ్య అతని దర్శనము చేసే త్రోవ
కాచింది కిన్నెరా."

౬

కిన్నెరసానిపాటలతో కవిప్రతిభ మింటికెగయుటయేగాక, కవి ముమ్ముందు చేయబోవు మూడు కృతులీ కావ్యమునందే ధ్వనించినవి. అప్పటిది కవికి అన్వేషణదశగదా! వానిలోని భావములు, భావనయు ఒకతీరు కల్పించుకొను దినము లవి. ఇందలి 'కడలిపొంగు'లోని పరమార్థమే క్రమముగా వాని మనసును మథించి 'చెలియలికట్ట' యన్న నవలకు దారితీసినది.

కిన్నెరవైభవములోని ఋతువర్ణనమే యాతని తరువాతి ఋతుసంహారమునకు నాందీవాక్యమైనది. స్వాతంత్ర్యముగా చేసిన యీ క్రిందివర్ణనములో నుండి యెంత చక్కగా ఒక ప్రత్యేకకావ్యము వ్రాయగలడో తాను గ్రహించి పిదప అటులే యొనర్చినాడు.

"తలిరాకు తుదదక్కి తాగెను వసంతమ్ము
కోకిలోగ్ర్యపు సెమలికూతలకు పంతమ్ము
మంచుతెంపులు గాసి మార్చినది గ్రీష్మమ్ము
కొండయంచులనుండి కురిసినది ఉష్ణమ్ము
వడగళ్ళతో వచ్చి పడె వానకాలమ్ము
పుడమిపచ్చికలతో పొంగెను పసాలమ్ము
అంచారెక్కలతోడ నరుగుదెంచె శరత్తు
పంచలందున తెల్పుపడె కొంచెము పరిస్తు
తికదికల్ మంచులో తేలించుకొనె కారు
తెల్లనై తెరగల్లు తేలించుకొనె జేలు
శిశిరాగమము వచ్చి చెట్లయాకులు దూసె
ముసలులై జంతువులు ముడుచుకొని కన్మూసె."

ఇక, కిన్నెరలోని తుదిగేయములో శ్రీ విశ్వనాథవారి శ్రీరామతత్పరత అచ్చుగ్రుద్దినట్లు స్ఫురించినది. ఆ 'తెలుగుదైవమ్ము భద్రాద్రిపై నెలకొన్న రామయ్య' ఈ 'తెలుగుసత్కవిరాజు' హృదయపద్మము నధిష్ఠించి క్రమముగా వీనిచే 'శ్రీమద్రామాయణకల్పవృక్షము'ను విరచింపజేయించినాడు.

ఇవి మూడును కిన్నెరలోని భావిసూచనలు. కవిని పైకొననున్న శేముషీరోచిస్సులు.

తుది—కిన్నెర అనశ్వరదేహి. వనిత వాగై, వాగు పాట అయిపోయినది. ఘనరూపము ద్రవమై, ద్రవము తేజస్సయిపోయినది. ఇక ఇది నాశములేనిది. ఇందుకే కాబోలు, కిన్నెరయే, మనిసిగా

"ఏదారినో చచ్చుటేగదా మరి యిపుడు
లేదు చావో తనవునైనా అనుకుంది
లేదు చావును మగనికైనా."

అని సంతసపడినది. ఇచటకూడ మనల ప్రాచ్య సంస్కృతియే! తనకేకాదు, తన మగనికికూడ అనశ్వరత ప్రాప్తించినదని కిన్నెరసంతోసము, కవిసంతృప్తి!

కళ్యాణి*

[నాటకం]

= శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి =

—: పాత్రలు :—

భీమసింగ్ ... విద్యానగర సేనాని.
జ్ఞానసింగ్ ... భీమసింగ్ తండ్రి.
కళ్యాణి ... భీమసింగ్ భార్య.
ప్రతాపవర్మ ... శత్రుసేనాని.
శక్తిసింగ్ ... శత్రునగరంలో ప్రధాన అధికారి.
భీమసింగ్ సర్దారులు ఇద్దరు; ప్రతాపవర్మ సేవకుడు, యితర సైనికులు.

———:o:———

ఒకటో అంకం

[విద్యానగరాన్ని శత్రువులు ముట్టడించారు. శత్రువుకొత్తిడి ఎక్కువయిపోయింది. అందుతుందనుకున్న సహాయం అందలేదు. విద్యానగరసేనాని భీమసింగ్ అతని భవనంలో ఓగదిలో అతని సర్దారులిద్దరితోనూ కార్యాలోచన చేస్తూవుంటాడు.]

భీమ—పరిస్థితులు విషమించాయి. మహోపద్రవం సంభవించింది. మనసహాయార్థం బయలుదేరిన రెండు మిత్రసైన్యాలూ, మధ్య చిక్కుకుపోయాయి. సహాయం రావడానికి అవకాశమున్న మార్గాలన్నీ శత్రువులు ఆక్రమించుకున్నారు. ఇహ మనకి సహాయం అందటం అసంభవం. మన శత్రువులు పట్టిన పట్టు విడువరు. మన నిస్సహాయత వారికి తెలిసిందా, పగ సాధించారన్నమాటే. ఈ విషమపరిస్థితి సైన్యానికీ, ప్రజాసామాన్యానికీ తెలియదు. కాని వదంతులుమాత్రం ప్రచారమవుతూనేవున్నాయి. నిజపరిస్థితి తెలుసుకున్నప్పుడు ప్రజ ఏం చేస్తారు? ఈ మూడు మాసాల ముట్టడిలో చెప్పరాని కష్టాలు అనుభవించారు. బాధలు ధైర్య స్థైర్యాలతో ఓర్చుకున్నారు. ఈ కరువువల్ల, ఓపలేని కష్టాలవల్ల ప్రజలు భగ్నోన్మత్తులయిపోయినా ఆశ్చర్యముండదు. ఈనాటిదాకా సహాయ మందుతుందేమో నన్న ఆశాబీజమే వారి ప్రాణాలు నిలబెట్టింది. ఈనాడు అదీ నశించినట్టే. శత్రువుని ప్రతిఘటించడానికి మనకి శక్తిలేదు. శత్రుఫిరంగులు ఒక్క ఘడియలో మన దుర్గప్రాకారం నేలమట్టం చెయ్యగలవు. మన నగరమే రూపురేఖలు లేకుండా నాశనమవకతప్పదు.

మొదటిసర్దారు—మా సైనికులదగ్గిర బాణాలు కూడా లేవు. తుపాకీమందు ఎప్పుడో అయిపోయింది.

రెండవసర్దారు—మన ఫిరంగులు మూలబడి అప్పుడే రెండురోజులయింది. కత్తితప్ప మరి ఆయుధం లేదు. ఆ భయంకర శత్రుశతఘ్నులముందు మన కత్తులేం చెయ్యగలవు?

మొదటిసర్దారు—అదుగో! శత్రుఫిరంగిదెబ్బవల్ల కూలిన మన దుర్గప్రాకారభాగం ఈ కిటికీలోనించి కనిపిస్తోంది. యాభైఅడుగుల వెడల్పుప్రాకారం కూలింది. శత్రుసేన నిరాటంకంగా లోపల ప్రవేశించగలదు. నగర సంరక్షణ అసంభవం. ఈనాడు అస్త్రసన్యాసం చేసి, సంధి చేసుకోకా విప్లవం తప్పదు.

భీమ—గడిచిన పదిరోజుల్లోనూ మూడుమార్లు రాయబారులని శత్రుశిబిరానికి సంధిమాటల నిమిత్తం

* మారిస్ మేటర్‌లింక్ వ్రాసిన 'మోనా వానా' అన్న నాటకం దీనికి మాతృక.

పంపించాను. కాని ఒక్కడూ తిరిగిరాలేదు. చివరికి నాతంత్రిణే స్వయంగా పంపించాను. ఆయనకూడా ఇంకా తిరిగిరాలేదు.

మొదటిసర్దారు—వారంరోజులనించీ నగరం శత్రువుల అరిచేతిలో వుంది. నగరప్రవేశానికి ప్రతాపవర్మ ఎందుకు ఆజ్ఞ యివ్వడం లేదో? అతని వ్యూహ మేమిటో?

భీమ—అతని వ్యూహ మేమయినా, మనకిమాత్రం ఇహ ఒక్కటే మార్గం మిగిలింది. ధైర్యంతో మృత్యువుని ముఖాముఖీ ఎదుర్కొని ప్రాణాలు త్యజించసాహసించిన మనలో కొందరం ప్రజలకి నిజపరిస్థితి తెలియజెయ్యాలి. సంధికి మరతు లేమీ రాలేదని వాళ్లకి బోధపడాలి. ఇది బొమ్మలయుద్ధం కాదు. కంఠంలో ప్రాణమున్నంతవరకూ యుద్ధం జరిగితీరాలి. దయాదాక్షిణ్యాల ప్రసక్తి లేదు. మన భార్యాబిడ్డలు......

(మాటమధ్యలో భీమసింగ్ తంత్రి జ్ఞానసింహుడు ప్రవేశిస్తాడు. అతన్ని చూసి భీమసింగ్ ఆనందంతో ఆలింగనంచేసుకుని—)

భీమ—నీకూ నీళ్లు వొదులుకున్నాను. మా అదృష్టంవల్ల తిరిగొచ్చావు. కాలు ఈడుస్తున్నావు: నిన్ను బాధలుపెట్టారా? ఎలా తప్పించుకు బయటపడ్డావు? నిన్ను వాళ్లేంచేశారు?

జ్ఞాన—ఏమీ చెయ్యలేదు. భగవత్కటాక్షంవల్ల వాళ్లు క్రూరులు కారు. నన్ను అతిథిగా భావించి, సత్కరించి, గౌరవించారు. నారచనలన్నీ ప్రతాపవర్మ చదివాడట. వాటి నన్నిటినీ ఎంతో సానుభూతితో విమర్శించాడు. అనేకశాస్త్రాల్లో అతనికి పాండిత్య ముంది. అతనికి అభిరుచి లేని కళ లేదు. ఆ శాస్త్రవ్యాసంగంలో, కళా, సౌందర్య చర్చలో, బయట ఘోర సంగ్రామం జరుగుతోందన్న విషయమే మరిచిపోయాను.

భీమ—నాన్నా! నువ్వక్కడికి వెళ్లినది అతనితో చర్చలుచేస్తూ యుద్ధంసంగతి మరిచిపోడానికి కాదు! ఇక్కడ ప్రజలు ఆకలితో మలమల మాడిపోతున్నారు. ఒక్క నిమిషం కాలాతీతమయితే, ఒక్క అడుగు తప్పటడుగేస్తే ఈ ముప్ఫయివేలమందీ నాశనమయిపోతారు! అతను నీతో ఏం చెప్పాడు? మన శత్రువుల వ్యూహా లేమిటి? ప్రతాపవర్మ ఉద్దేశా లేమిటి? అదిగో! ఆ ఘోష వినిపించడం లేదూ? తిండినిమిత్తం గడ్డిపరకలకోసంకూడా కొట్టుకుంటున్నారు.

జ్ఞాన—నువ్వన్నది నిజం! కాని వసంత మావిర్భవించింది. ప్రాణికోటిమీద ప్రేమచేత పృథ్వి ఉప్పొంగిపోతోంది. కనకనే, మనుష్యులు పరస్పరం పోరాడుతున్నారని మరిచిపోయాను. మీకు ఆనందం కలిగించే అంశాలు వేరే ఉన్నాయి. నా సంతోషాన్ని గురించే నేను మాట్లాడాను. నువ్వన్నదే నిజం. నే తెచ్చిన సందేశం తక్షణం చెప్పివుండవలసింది. ముప్ఫయివేలమందికి ప్రాణదానం చేసే సందేశం తీసుకొచ్చా! కాని ఒక్క వ్యక్తికిమాత్రం ఇది హృదయదారణ మవుతుంది. ఆవ్యక్తి అయినా, ఈసంఘటనలో, ప్రతిష్ఠాదాయకమయిన సన్నివేశం కనిపెట్టవచ్చును. రణరంగంలో సంపాదించగలిగిన పేరుప్రతిష్ఠలకంటె, ముప్ఫయివేలమందికి ప్రాణదానం చేయించిన కీర్తే ఉత్కృష్టమైనదని నాకు తోచింది. ఒక వ్యక్తిమీద ప్రేమ మంచిదే దానివల్ల లభించే సౌఖ్యం వేరు. కాని విశ్వమానవప్రేమ ఉత్తమం. ప్రజాసామాన్యం మెచ్చుకుని, పొగిడే సుగుణాలు మంచివే. కాని మన జ్ఞాననేత్రాలు, ఈ సరిహద్దు లతిక్రమించి చూడవలసిన సమయా లుంటాయి. ఈ సామాన్యసుగుణాల ప్రయోజనం అల్పమని ఒక్కొక్కప్పుడు స్పష్టమవుతుంది. నే చెప్పదలచినది సావధానంగా వినడానికి సిద్ధపడు. లేదా, నాసందేశం పూర్తిగా వినకుండానే, తొందరపడి, తప్పునిర్ణయానికి రావొచ్చును. నిర్ణయం ఆరంభంలోనే జరిగిపోయిందా, సందేశమంతా విన్నతరవాత మనస్సు మార్చుకుందామని బుద్ధిపుట్టినా, మార్చుకోగలిగిన శక్తి మనకుండదు.

భీమ—(సర్దార్లని పొమ్మని సంజ్ఞ చేస్తూ) పొండి.

జ్ఞాన—వొద్దొద్దు. వుండండి. మన అందరి భవిష్యత్తూ ఇప్పుడు నిర్ణయించబోతున్నాం. ఈగది మనం రక్షించబోయే ప్రజలతో నిండిపోతే బాగుండును. రక్షణోపాయం తెలుసుకొచ్చాను; అది నీబుద్ధికి

నచ్చాలిగాని! ఈ క్లిష్టసమయంలో ఒక్క తప్పు చేశామా?......

భీమ—నిన్ను బతిమాలుకుంటాను. సందిగ్ధవచనాలు మానెయ్యి. ఇన్ని మాట లెందుకు? ప్రాణాలకే తెగించినవారం, ఇప్పుడు మమ్మల్ని భయపెట్టగలిగిన విషయ మేమీ లేదు!

జ్ఞాన—సరే. అయితే విను. నేను ప్రతాపవర్మ శిబిరానికి వెళ్లాను. అతన్ని కలుసుకున్నాను. రణరంగంలో మాత్రం కొంత శక్తిసామర్థ్యాలు చూపగల ఒక మదోన్మత్తుణ్ణి, క్రూరుడిని, భోగలోలుడిని చూస్తా ననుకున్నా. ప్రతాపవర్మ అలాటివాడని నాకందరూ చెబుతూవుండేవారు.

భీమ—స్వామిద్రోహి కాడు. అంతే. మిగిలిన రాక్షసగుణాలన్నీ వున్నాయి.

మొదటి సర్దారు—అవునవును. అతని స్వామిభక్తి కళంకంలేనిది.

జ్ఞాన—నే కలుసుకున్న వ్యక్తి నన్ను గురుతుల్యుణ్ణిగా భావించాడు. గౌరవించాడు. విద్యావంతుడు. మేధావి. చెప్పిన విషయం సావధానంగా వినే నిగ్రహశక్తి వుంది. సౌందర్యారాధన తెలుసు నతని నేత్రాలకి. యుద్ధమంటే ఉత్సాహంలేదు సరేకదా, ఏవగించుకుంటాడు. దయార్ద్రహృదయుడు. దాత. తన కర్తవ్యపాలన మాత్రం యావచ్ఛక్తి వినియోగించి చేస్తాడు. శత్రుసేనకి నాయకత్వం వహిస్తున్నాడేకాని, ఆ సేవలో ఇచ్ఛలేదు. విధి అతణ్ణి యుద్ధవీరుణ్ణి చేసింది. అతను ఏవగించుకుంటున్న వీరప్రతిమలకి అతన్ని బానిసని చేసింది. సైన్యం త్యజించి వెళ్లిపోవాలని కోరుకున్నాడుకాని......అతనికి కలిగిన ఒక అతి బలీయమైన కోర్కెనీ తీర్చుకోక మునుపు తన వృత్తి త్యజించడానికి అతనికి శక్తి లేకపోతోంది. సఫలం కాని ప్రేమానలంలో దహించుకుపోయే దురదృష్టవంతులకే ఇటువంటి భయంకరమైన కోరికలు కలిగేట్టుంది.

భీమ—నాన్నా! ఆకలితో మలమల మాడుతున్న ప్రజలు ఈ కాలవ్యవధి సహించలేరన్న మాట మరిచిపోతున్నావు. అతని గుణగణాలు మన కెందుకు? రక్షణోపాయమని ఏదో అన్నావు. ఆమాట చెప్పు.

జ్ఞాన—నిజమే! నేను ఈలోకంలో అత్యధికంగా ప్రేమిస్తున్న ఇద్దరు వ్యక్తులకీ ఇది అమితబాధాకరమే అయినా, సంకోచించడం తప్పే!

భీమ—ఏదయినా సరే! నావొంతు కష్టాలు శిరసావహించి నే అనుభవిస్తా. రెండో వ్యక్తి ఎవరు?

జ్ఞాన—చెబుతా విను. ఈగదిలో ప్రవేశిస్తున్నప్పుడు నాకర్తవ్యం వింతగానూ, కష్టంగానూ తోచింది. కాని ప్రజారక్షణకి ఇదొక్కటే మార్గం తోచడం వల్ల......

భీమ—ఊఁ. కానీ...

జ్ఞాన—మన శత్రువులు మనమీద పాముపగ పట్టారు. మన్ని నాశనంచేస్తేనేకాని వారికి శాంతి లేదు. ఏదో ఒక నెపం పెట్టి, మననగరం సంపూర్ణంగా నేలమట్టంచేసి, యుద్ధనీతికి వ్యతిరిక్తంగా, ప్రజలనందరినీ చిత్రవధ చేయించాలని వారి పన్నుగడ. సైన్యాన్ని ముందుకు నడిపి, నగరం నాశనంచేయించవలసిందని పై అధికారులవద్దనించి ప్రతాపవర్మకి ప్రతిరోజూ ఆజ్ఞలందుతూనేవున్నాయి. కాని ఏవో సాకులు చెప్పి ఈ నాటిదాకా జరుపుకొచ్చాడు.

భీమ—ఎందుచేత? మరి ఇప్పు డేం చేస్తానంటాడు?

జ్ఞాన—మనకి సహాయం చెయ్యడానికి అతను సిద్ధంగా వున్నాడు. అతను స్వయంగా మూడువందల సైనికజనంతో, నాలుగువందల బళ్ల యుద్ధసామగ్రితో మన పక్షానికి తిరిగిపోతానని వాగ్దానం చేస్తున్నాడు.

భీమ—ప్రతాపవర్మే ఇంత ద్రోహానికి పూనుకున్నది!

జ్ఞాన—దానికి కారణం లేకపోలేదు. ప్రతాపవర్మప్రతికక్షులు కొందరు అతనిమీద అసత్యనిందారోపణలు చేస్తూ, పై అధికారులకి రహస్యంగా లేఖలు వ్రాశారు. ఆ లేఖలు ఆధారంగా తీసుకుని పై అధికారులు ఇతని పరోక్షంలోనే విచారణచేసి శిక్షార్హుడని

నిశ్చయించారుట! ప్రతాపవర్మ యుద్ధాన్ని జయప్రదంగా ముగించుకుని తిరిగి వెళ్ళగానే అతనికి మరణదండన విధించాలని నిర్ణయమూ జరిగిందిట! ఈ కుట్రకి సంబంధించిన లేఖలు కొన్ని అదృష్టవశాత్తూ ప్రతాపవర్మకి దొరికాయి. కనక, తన శక్తి ధారపోసి, విజయం సాధించినందువల్ల ప్రయోజనం లేదుసరికదా, ప్రమాదం తప్పదని అతనికి బోధపడింది. కనకనే, మన పక్షానికి తిరుగుతానన్నాడు.

భీమ—ఓహో, అదా సంగతి! ఇప్పుడు స్పష్టమయింది. ఆత్మసంరక్షణకోసం మనని రక్షిస్తానంటాడు. కాని అతనికి నిజంగా ప్రతీకారమేగా కావాలి. కసి తీర్చుకోవా లతను. దానికి అనేక యితరమార్గాలున్నాయే! మన్ని రక్షించడంలో అతని ఉద్దేశమేమిటి? ఇక్కడినుంచి ఎక్కడికి వెళ్ళదలుచుకున్నాడు? అతని భవిష్యత్తేమిటి? ప్రతిగా అతను కోరిన దేమిటి?

జ్ఞాన—మాటలకే శక్తి, క్రూరత్వం వొచ్చే సమయ మిది! రెండు మూడు సామాన్యపదాలు, విధివ్రాతలా, అనుల్లంఘనీయమై, ప్రాణుల్ని బంధించేస్తాయి. నా కంఠస్వరంమీదా, నే చెప్పే విధానంమీదా ఎన్నో వేల జీవుల ప్రాణసంరక్షణ ఆధారపడివుందన్న సంగతి స్ఫురించినప్పుడు నాకు గాభరా పుడుతోంది.

భీమ—ఎందుకు సంకోచం? ఎంత క్రూరవాక్యాలయినా మన ప్రమాదం అధికంచెయ్యలేవు!

జ్ఞాన—ప్రతాపవర్మ దయార్ద్రహృదయుడనీ, యుక్తాయుక్తవిచక్షణ కలవాడనీ చెప్పావు. కాని ఒక్క దుర్మార్గపు ఉద్దేశమైనా లేని దయార్ద్రహృదయుడెవడు? తప్పు చెయ్యని మేధావి ఎవరు? మన బుద్ధి, దయ, న్యాయం, మన కోరికలతో, కామంతో, మన ఆత్మ నావరించిన అంధకారంతో, హోరాహోరి అనుక్షణమూ పోరాడ్డం లేదూ? అనేకసార్లు ధర్మాతిక్రమణ చేసి, నా కోరికలకి నేను లొంగిపోలేదూ? నువ్వుమాత్రం లొంగిపోవూ? ఇది ప్రతివ్యక్తిజీవితంలోనూ వుండే విషమసంఘర్షణే. నీకు ఇప్పుడో మహాదుర్భరదుఃఖం సంభవించబోతోంది. కాని, శాంతంగా ఆలోచిస్తే, దుఃఖించవలసిన సన్నివేశం కాదని నీకే బోధపడుతుంది. నీ సుఖదుఃఖాలు పాటించక, కర్తవ్యపాలన చెయ్యవలసిన తరుణ మిది. దుఃఖం అజ్ఞానజనితం. సుఖదుఃఖాలు సన్నివేశాలలో అంతర్గతమయి లేవు. మన మనస్సులో, మన వైఖరిలో వున్నాయి. నువ్వు ప్రతాపవర్మ సూచించిన షరతు అంగీకరించాలి. లేదా, నేను తిరిగి అతని శిబిరానికి వొచ్చేస్తాననీ, విధించిన శిక్ష అనుభవిస్తాననీ వాగ్దానం చేశాను......అన్నట్టు నీకు ఇంకా అసలుసంగతి చెప్పనేలేదు చూశావా? నిర్ణీతసమయాన్ని కొంచెమైనా పక్కకి నెట్టేద్దామన్న ఆశతో, మాటలమీద మాటలూ, వాక్యాలమీద వాక్యాలూ అల్లుతూ ఎలా కాలయాపన చేస్తున్నానో? నా సంకోచాలతో నీ కపచారం చేస్తున్నానుకాబోలు. విను మరి. నా కళ్ళతో నేను చూసిన సేన, ధాన్యంతో నిండిన బళ్ళు, పశువుల మంద, ఎన్నో వారాలకి సరిపడీన యీ గ్రాసం, మన శత్రువులని హతమార్చి, మనకి విజయంచేకూర్చే యుద్ధసామగ్రి- అన్నీ యీ రాత్రే మన నగరం చేరుతాయి...బలులు...నువ్వు...ఆవిడని...ప్రతాపవర్మశిబి-నికి పంపించినట్టయితే. మారోక్ష దయానికి పూర్వమే తిరిగొచ్చేస్తుంది. కాని విజయసూచకంగా ఆవిడ ఒక్కర్తే, నిరాయుధగా రావాలని కోరాడు!

భీమ—ఎవరు? వెళ్ళవలసింది ఎవరు? అది చెప్పలేదు!

జ్ఞాన—కళ్యాణి!

భీమ—ఆఁ. కళ్యాణా! నా భార్య?

జ్ఞాన—అవును....అమ్మయ్య! చివరికి చెప్పగలిగాను.

భీమ—నా భార్య ఎందుకు? లక్షమంది స్త్రీలు లేరూ?

జ్ఞాన—ఆవిడని ప్రేమించాడు కనక!

భీమ—ప్రేమించాడా? ఎక్కడ చూశాడు? ఎక్కడ చూశాడు? అతను కళ్యాణిని ఎరగనే ఎరగడసలు.

జ్ఞాన—కళ్యాణిని చూశాడు. ఎరుగును. ఎక్కడో, ఎప్పుడో మాత్రం చెప్పలేదు.

భీమ—కళ్యాణి అతన్ని చూసిందా? ఎక్కడ పరిచయమయింది?

జ్ఞాన—కళ్యాణి అతన్ని చూడలేదు. అసలు, చూసినజ్ఞాపకం లేదు.

భీమ—ఎలా తెలుసు నీకు?

జ్ఞాన—కళ్యాణే చెప్పింది!

భీమ—ఏమిటీ!

జ్ఞాన—నేను నీ దగ్గిరికి రాకముందు...

భీమ—ఈ సంగతి నువ్వు కళ్యాణితో చెప్పేవా?

జ్ఞాన—ఆ! సంగతంతా!

భీమ—ఇంత దుర్భర రాయబారం, ఈ నీచాతి నీచమైన నేరం ఆవిడకెరుక చెయ్యడానికి ధైర్యం చాలిందీ!

జ్ఞాన—చెప్పక తప్పిందికాదు.

భీమ—ఏమంది?

జ్ఞాన—ఏమీ అనలేదు. తెల్లబోయింది. వెళ్లిపోయింది.

భీమ—మంచిపని చేసింది. నిన్ను దుర్భాషలాడి, నీ పాదాక్రాంతురాలై వేడుకోటంకంటె అదే ఉత్తమంలా వుంది. అవును. అనడాని కేముంది! ఏమీ లేదు. (సర్దారులతో) రండి. మనకి మరణం తప్పదు కనక, మానహాని లేకుండా నగరసంరక్షణలో ప్రాణాలు విడుద్దాం.

జ్ఞాన—ఇదో విషమపరీక్ష, అని నాకు తెలుసు. కాని దెబ్బ ఎలాగూ తగిలింది కనక, ఓపికతో ఆలోచించు. నీ విధ్యుక్తధర్మ మేదో నిర్ణయించడానికి తగిన వ్యవధి యియ్యి, నీ బుద్ధికి.

భీమ—నా విధ్యుక్తధర్మమా? నా కర్తవ్యం పూర్తిగా తెలుసు నాకు. నీ నీచపుమాటకి ఒక్కటే జవాబు చెప్పవలసిన కర్తవ్యం నాది. ఆలోచనకి వ్యవధి అనవసరం.

జ్ఞాన—కాని ప్రజలందరినీ నీ సౌఖ్యంకోసం బలివ్వడానికి నీకు హక్కుందా అని ప్రశ్నించుకో వాలి! నీ ఒక్కడి క్షేమమే ఈ విషయంమీద ఆధారపడివుంటే, నువ్వు మరణమే కోరుకోవడంలో అర్థముంది. నా అవసానకాలం సమీపించింది. నా అనుభవంవల్ల నేనో విషయం గ్రహించాను. ప్రాణసంరక్షణనిమిత్తం ఎంత పాపం చేసినా తప్పులేదని నా అనుభవంవల్ల గ్రహించాను. ఈ నాడు అనేక వేల జీవాలు నాశనమవడానికి సిద్ధంగా వున్నాయి. అందరూ నీతోటి సైనికులూ, వారి భార్యాబిడ్డలూను. నన్ను నమ్ము. ప్రాణరక్షణలో తులతూగే వీరధర్మకార్యం మరేదీ లేదు. సుగుణాలూ, సత్యసంధత, కృతజ్ఞత, పాతివ్రత్యం, ఒకటేమిటి—మనకు తెలిసిన సమస్తాశయాలూ, ఆదర్శాలూ మానవజీవితంతో పోల్చిచూస్తే, పరమాణువులు. ఈ నాడు నీ యోగ్యత ఒక్కటే. ఈ విషమకష్టాన్ని ధైర్యస్థైర్యాలతో, వీరోచితంగా సహించి, తరించాలనే నా ఆశయం. కాని మరణమే వీరులు కోరదగిన అంతిమత్యాగమని అనుకోవడం పొరపాటు. ఏ త్యాగంవల్ల మనకి ఎక్కువ బాధ, దుఃఖం కలుగుతుందో, ఆ త్యాగమే వీరోచితమైన త్యాగం. అనేక పరిస్థితుల్లో మరణమే సులభం, జీవించడంకంటె!

భీమ—నువ్వు నా తండ్రివేనా?

జ్ఞాన—ఆ. నీ తండ్రి నయినందుకు నాకు గర్వంగానే వుంది. ఈ నాడు నిన్ను ప్రతిఘటించడంలో నన్ను నేనే ప్రతిఘటించుకుంటున్నాను.

భీమ—అవును. నా తండ్రివే! నీకూ మరణం తప్పదు. నేను ఈ నీచపు సంధిపత్రానికి అంగీకరించను. శత్రుశిబిరానికి తిరిగి వెళ్లిపో. విధించే శిక్ష అనుభవించు.

జ్ఞాన—నేను ఓ అసమర్థుణ్ని. ముసలివాడిని. నా అవసరం లేదు ఎవరికీ. ముందు జీవించవలసిన రోజులు ఆట్టే లేవు. శత్రుశిబిరానికి వొస్తానని అందుకనే వాగ్దానం చేశాను.

భీమ—మరి అనవసరప్రసంగం చాలు. తప్పు చేస్తున్నా తండ్రిని కొడుకు నిందించకూడదు!

జ్ఞాన—నీ యిష్టమొచ్చినట్టు నిందించు. నీ హృదయంలోనించి ఆగ్రహవాక్యాలు స్వేచ్ఛగా బయటకు రానీ! కాని కర్తవ్యనిర్ణయశక్తి, దయ నీ హృదయంలో ప్రవేశించనియ్యి!

ధీమ—ఇంక వినను. ఆలోచించు నన్నేమి చెయ్యమంటున్నావో! నీ జ్ఞానం, మృత్యుభయంచేత, నివురుగప్పిపోయింది. మృత్యువు నన్ను భయపెట్టలేదు. ముసలితనంచేతా, అధికగ్రంథపఠనంవల్లా నీ ధైర్యం నిన్ను విడిచిపోకపూర్వం, నాకు ధైర్యం ప్రబోధించిన రోజులు నేనింకా మరిచిపోలేదు. ఈ గదిలో మనమే వున్నాము. నీ దౌర్బల్యం ఇంకెవరికీ తెలియదు. ఈ రహస్యం నువ్వు జీవించబోయే కొద్దిగడియలూ, మా హృదయాల్లో దాచి, కప్పి, రక్షిస్తాం. ఇంక అంతిమ సంగ్రామం విషయమై మాట్లాడుకుందాం!

జ్ఞాన—హృదయంలో కప్పబడిపోయి మాత్రం ఈ రహస్యం వుండిపోదు...నీకు ఆ మహోదగ్రమైన ధైర్యం ఈ నాడు నాలో నీకు కనిపించకపోయినా, నా కర్తవ్య నిర్వహణకి అవసరమయిన ధైర్యం నాకుంది.

ధీమ—ఏమిటో ఆ కర్తవ్యం!

జ్ఞాన—ఈ రాయబారం అంతా చూడాలి. సంధి షరతు అంగీకరించేదీ, లేనిదీ నిర్ణయించేటందుకు నువ్వు ఒక్కడివే న్యాయాధికారివి కావు. న్యాయాధికారుల్లో ఒకడివే నువ్వు. ఎంతమంది జీవితాలు ఈ విషయ నిర్ధారణమీద ఆధారపడివున్నాయో, అంతమందికీ ఈ షరతుస్వభావం తెలుసుకోడానికి హక్కుంది.

ధీమ—చెప్పేది అర్థంకావటం లేదు! ఏమిటి నువ్వనేది?

జ్ఞాన—ఈ గది విడిచిపెట్టి, బయట కాలెట్టగానే ప్రతాపవర్మ చేసిన సూచన ప్రజలకి వెల్లడి చేస్తాను.

ధీమ—అర్థమయింది నీ సంగతి! ఈ తాతాఖానీ మాటలే మనస్థితి ఇంతవరకూ తెచ్చినవి. నీ వయస్సుకి తగిన గౌరవం, మర్యాదా చూపించడానికి అవకాశం లేనందుకు విచారంగా వుంది. మతిచలించిన తండ్రిని రక్షించవలసిన బాధ్యత కొడుకుది. ఈ నగరగౌరవ మర్యాదలు రక్షించవలసిన బాధ్యతా నాదే. (సర్దారులతో) మీ యిద్దరికీ నా తండ్రిని అప్పగిస్తున్నా. మతి స్థిరపడి, మనసు మారేదాకా...ఏమీ జరగలేదు... తెలుసునా...ఎవరికీ తెలియకూడదు. (తండ్రితో) నిన్ను క్షమించాను. లోకంలో ఎవరికీ జంకక, మన స్సాక్షిగా నాకు ధర్మమని తోచినది నిర్వహించమని నువ్వే నాకు నేర్పావు. నీ అవసానకాలంలో ఇది జ్ఞాపకమొచ్చినప్పుడు నన్ను తప్పకుండా క్షమిస్తావు.

జ్ఞాన—నిన్ను క్షమించేటందుకు నా అవసానకాలందాకా ఆగనక్కర్లేదు...ఈ నాడే నా మనస్ఫూర్తిగా క్షమిస్తున్నా. నన్ను బంధించగలవుగాని, ఈ రహస్యాన్ని బంధించలేవు. బంధించడానికి శక్తి లేదు ఎవరికీ. అప్పుడే స్వైర్యవిహారం చేస్తోంది.

ధీమ—ఏమిటంటున్నావు!

జ్ఞాన—ఈ నిమిషాన మన నగరపాలకులు సంధి షరతు చర్చిస్తున్నారు.

ధీమ—నగరపాలకులా? వారికి ఎవరు చెప్పారు?

జ్ఞాన—నేనే! ఇక్కడికి రాకముందు...

ధీమ—అసంభవం. నువ్వు అంత నీచమైన పని చేసుండవు. నా భాగ్యమానం విక్రయించడానికి ప్రయత్నించివుండవు. నేను నమ్మను. నా కళ్లతో స్వయంగా చూసి తెలుసుకునేదాకా నమ్మను. ఈ నాటిదాకా నిన్ను ప్రేమించి, నా ఆదర్శంగా పరిగణించాను. నువ్వు చెప్పినదే నిజమయితేనా...నిన్ను పూర్తిగా అర్థంచేసుకున్నాననుకున్నా!

జ్ఞాన—నిజం తెలుసుకున్నావు. నన్ను నువ్వెరగవు. అందుకు నన్నే నిందించుకోవాలి. నాకు వయస్సు పైబడినకొద్దీ, దానివల్ల ప్రేమనిగురించీ, సుఖదుఃఖాలనిగురించీ నాకు అనుభవమయిన విషయాలూ, నేను నేర్చుకున్న సంగతులూ నీకు చెప్పలేదు.

ధీమ — ఈనాటికయినా నీ నిజస్వరూపం బయలుపడినందుకు సంతోషంగా వుంది. మన నగరపాలకుల నిర్ధారణ తెలుసుకోడం అసాధ్యం కాదు. ఆత్మరక్షణకి మరో వ్యక్తిని బలిస్తే చాలు! ఇలాటి ఆశ మహాధీరులనే లొంగదీస్తుంటే, మన నగరపాలకులూ వెనకముందులు ఆలోచించేది! కాని, వారినికూడా జాగ్రత్తగా వుండమను. నేను ఇంకా త్యాగంచెయ్యాలని కోరడానికి హక్కు లేదు. రాత్రీ పగలూ కష్ట

వచ్చాను. చీమూ రక్తమూ ధారపోశాను. అది చాలు. కళ్యాణి నాది. నా సొత్తు.

జ్ఞాన—దురభిప్రాయపడుతున్నావు. ఎవరి నిర్ణయం వినకుండానే నిందించేస్తున్నావో, ఆ నగరపాలకులు ఈవిషమావస్థలో ధైర్య, నిగ్రహమర్యాదలు ప్రదర్శించారు. ఒక స్త్రీమానాన్ని విక్రయించి, తమ విముక్తి కొనుక్కోడానికి ఇష్టపడలేదు. నేను వారిని వొదిలి, నీదగ్గరకి వొచ్చేసరికి "నగరభవిష్యత్తు మీరే నిర్ణయించండి" అని కోరేనిమిత్తం కళ్యాణికి కబురు చేశారు.

భీమ—ఏమిటీ? అంతధైర్యం వొచ్చిందీ? నా పరోక్షంలో ఆ నీచుడి తుచ్ఛపుకోరిక నాభార్య చెవిని వెయ్యడానికి సాహసించారూ? ఒక్క చూపుతో కందిపోయే లేతవదనమే! "వెళ్లు...నగ్నంగా శత్రుశిబిరానికి వెళ్లి వాడి ఆజ్ఞ శిరసావహించు" అని చెప్పుంటారు. బలవంతం చెయ్యకపోడం నయమే! ఆవిడఅనుమతి అడిగారని చెప్పావు; నాఅనుమతి కోరడానికి సాహసించే దెవడు?

జ్ఞాన—నే కోరలేదూ నీఅనుమతి? నన్ను తృణీకరిస్తే, మిగిలినవారి వొంతు.

భీమ — కానీ......మాఉభయుల తరఫునా కళ్యాణే జవాబు చెప్పుంటుంది.

జ్ఞాన—జవాబు చెప్పుంటుందనీ, ఆజవాబు నువ్వు అంగీకరిస్తావనీ ఆశిస్తున్నాను.

భీమ—కళ్యాణి చెప్పే జవాబే శంకిస్తున్నావూ? మన యింటిలో కాలుపెట్టినదిమొదలు ప్రతినిత్యమూ చూస్తూ, పూర్తిగా ఎరిగిన నువ్వే సందేహిస్తున్నావా?

జ్ఞాన—ప్రతివ్యక్తీ తన స్వభావాన్నిపట్టే ఇతరుల భావాలూ అర్థంచేసుకోగలుగుతాడు. ఆత్మసంస్కారాన్నిబట్టే తన స్వభావమైనా తాను గ్రహించుకోగలుగుతాడు.

భీమ—అందుచేతే నిన్ను ఇంత పాడుగా తెలుసుకున్నది. మరోమారు నా నేత్రాలు మోసపోవటంకంటె పూర్తిగా మూసుకుపోవడమే మేలు.

జ్ఞాన—ఒక దివ్యజ్యోతి నీ నేత్రాలు తెరుస్తుందేమో! నీలో లేని ధైర్యం కళ్యాణిలో నాకు కనిపించింది. అందుచేతే ఆవిడ చెప్పే జవాబు విషయమై నాకు సందేహం లేదు!

భీమ—నీకు సందేహం లేదూ? నాకూ సందేహం లేదని మరిచిపోకు. ఆవిడ చెప్పే జవాబు వినకుండానే ముందుగానే కళ్లుమూసుకుని నిష్పంకోచంగా ఆమోదిస్తున్నా...కాని నేను అనుకున్న జవాబే అది కాకపోతే, మేము ఉభయులమూ ఈగడియదాకా మోసపోయామన్నమాట. మాప్రేమ అంతా అబద్ధమన్నమాట. నే ఆరాధించిన దంతా మృగతృష్ణ అన్నమాట. మాప్రణయసౌధం కూలిపోతుం దన్నమాట.

[పైనించి "కళ్యాణిదేవికి జై" అన్న కేకల ధ్వని మొదట అస్పష్టంగా ప్రారంభించి, క్రమేపీ స్పష్టపడుతుంది. చివరికి ధ్వని మరీ ఎక్కువయిపోతుంది. కళ్యాణి ఒక్కర్తే పాలిన మొహంతో గదిలో కొస్తుంది. మిగతాజనమంతా లోపలికి రావడానికి భయపడుతూ గుమ్మందగ్గిర ఆగిపోతారు. కళ్యాణిని చూచి, భీమసింగ్, ఆనందంతో ముందుకురికి, ఆలింగనం చేసుకుంటాడు.]

భీమ—నిశ్చయం చేశారు? నీతో ఏం చెప్పారు? వొద్దు...చెప్పొద్దు...నీకళ్లలోకి చూడనియ్య...నిష్కల్మషంగా వుంది. వాళ్లు బుద్ధిహీనులు. మన ప్రేమని భగ్నం చెయ్యలేరు. నీకళ్లకేసి చూడగానే, పెదిమలమీదే మాటలు ఇగిరిపోయుంటాయి. నువ్వు జవాబు చెప్పవలసిన అవసరమే వుండివుండదు...కాని యిటు చూడు. ఇక్కడ ఓవ్యక్తి ఉన్నాడు. వయస్సు మళ్లింది. అంధుడు. కనికరించాలి. నీ నేత్రాలు అతనితో సంభాషించవు. మనకి చాలా దూరమయిపోయాడు. మన ప్రేమ అతనికి తృణప్రాయం. ప్రేమ అన్నమాటకి అర్థమున్నా తెలియని వ్యక్తుల ప్రేమలాటిదె మన ప్రేమా అనుకున్నాడు. అతనికి తెలియదు. విప్పిచెప్పాలి...నీ జవాబు అతనికి మాటల్లో విడమర్చి చెప్పు.

కళ్యా—(జ్ఞానసింహుడిని సమీపించి, నమస్కరించి) ఈ రాత్రి వెళుతున్నా.

జ్ఞాన—(శిరం నిమురుతూ) నాకు తెలుసు తల్లీ!

భీమ—ఏమిటే? ఏమిటన్నావూ?

కళ్యా—నే వెళుతున్నా! వెళ్ళి తీరాలి!!

భీమ—వెళ్ళి తీరాలీ? ఎవరి అజ్ఞ యిది?

కళ్యా—ఈ రాత్రి ప్రతాపవర్మశిబిరానికి వెళ తాను!

భీమ—ఓహో! అతన్ని హత్య చెయ్యడానికా? ఇది నాకు తట్టనే లేదుసుమా? అర్థంచేసుకోగలను. శ్లాఘనీయమైనది. శిక్షమయింది.

కళ్యా—అతణ్ణే హత్యచేస్తే, మన నగరసం రక్షణ యెలాగ?

భీమ—నువ్వు వాణ్ణి ప్రేమిస్తున్నావా?... ఎన్నాళ్లనించీ!

కళ్యా—అతన్ని ఎరగను. ఎప్పుడూ చూడ నన్నా లేదు.

భీమ—కాని అతని ప్రశస్తి విన్నావు...అంద రూ చెప్పుకుంటూవుంటే విన్నావు. అవును. విన్నావు.

కళ్యా—ఇప్పుడే ఎవరో అనగా విన్నాను. చాలా ముసలివాడట.

భీమ—కాదు కాదు. నాకంటె చిన్నవాడు. అందగాడు కూడాను. భగవంతుడా! మరేత్యాగం చెయ్యమన్నా పరమసంతోషంతో చేద్దునే! కాని ఇదా? రణరంగంలో గెలిచినంత మాత్రాన ఇంత సాహసం చేసిన అధమాధముడు ఇదివర కెవడైనా వున్నాడా? (కళ్యాణిచెయ్యి పట్టుకుని దగ్గిరకి లాక్కుంటూ) నేను నమ్మను. విన్నది నీధ్వని కాదు. మాతంత్రికంఠమే వినిపించింది. అసలు నేనేమీ విననే లేదు. విన్నా వనుకున్నా. నే ననుకున్నదంతా స్వప్న మేనని చెప్పు. చూడు. ఇప్పుడు నువ్వు మాట్లాడాలి. అందరూ వింటున్నారు. నువ్వు చెప్పవలసిన మాటకి అందరూ ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. అందరికీ తెలిసేటట్టు త్వరగా చెప్పు. మన ప్రేమ పల్లకిచెయ్యి. మన జీవితమంతా శిథిలమై పోకుండా వుండాలంటే. ఈ పీడకల పోనట్టు.

కళ్యా—ఈదుఃఖం భరించడం ఎంత కష్టమో నాకు తెలుసు.

భీమ—(దగ్గిరనించి తోసేస్తూ) ఎంత కష్టమో నీకు తెలుసు? నిన్ను ప్రేమించినవాడిని నేను భరించ గలనోద్దూ? నువ్వెప్పుడూ నన్ను ప్రేమించనేలేదు. నా కిప్పు డర్థమవుతోంది. ఏమి టిదంతా? నన్ను విడిచి వెళ్లిపోడం నీకు ఆనందంగా వున్నట్టుందే? వాడిని ప్రేమిస్తున్నావు కాబోలు. ఇక్కడ సర్వాన్నికారిని ఇంకా నేనే, తెలుసునా? ఎవరు ఏమన్నా చూస్తూ, వూరుకుంటూ వనుకున్నావుకాబోలు. ఈ గదికింద సొరంగ ముంది. నీకు బుద్ధి మళ్లీ, స్థైర్యం తిరిగొచ్చే దాకా అందులో వుందువుగాని. (సర్దారులతో) అన్నాను మాట. ఇది నా ఆజ్ఞ. శిరసావహించండి తీసుకుపొండి.

(సైనికు లెవరూ కదలరు)

కళ్యా—నేను ఇంతగా మీకు చెప్పనక్కర్లేదు'

భీమ—నా ఆజ్ఞ పాలించరూ? నాకంఠం విని పించడం లేదూ? మీకే...అరుస్తున్నా, కదలరేం? ఊహుం. తెలిసింది. అందరికీ భయంగా వుంది ప్రాణాలమీద తీపి. కావలసింది ఎలాగో ఓలాగు బతక డమే. మీ అందరికోసం నేను త్యాగంచెయ్యాలీ? నేనే ఎందుకు చెయ్యాలి! మీఅందరికీ భార్యలు లేరూ? (కత్తి తీసి, కళ్యాణితో) అప్రతిష్ఠకంటె మరణమే మేలని తలిస్తే!...అది తట్టలేదుకాబోలు! ఒక్క దెబ్బ చాలు.

కళ్యా—నామీద మీ కున్న ప్రేమ మిమ్మల్ని ఆపనికి ప్రోత్సహిస్తే...అలాగే కానివ్వండి.

భీమ—ప్రేమ ప్రోత్సహిస్తే...ప్రేమ అంటే అర్థం తెలియనివానివి నువ్వా ప్రేమనిగురించి మాట్లా డ్డమే! నీహృదయంలో ప్రేమకి తావు లేదు. అ దో యెడారి. చివరికి కన్నీటిచుక్కైనా లేదు. నీకూ నాకూ ఏమిటి సంబంధం? నువ్వు తలదాచుకోడానికి ఓయిల్లు చూపించినవాడిని నేను. ఒక్కనిమిషమైనా...

కళ్యా—నాకేసి చూడండి. ఏం చెప్పగలను?... చూడలేరూ?... అనుభవం సంపూర్ణంగా వ్యక్తం

చెయ్యడానికి తగిన మాట లున్నాయా? ఒక్కమాట మాట్లాడితే నా శక్తంతా పోయేటట్టుంది. నా సర్వస్వమూ మీరే. అయినా వెళ్లితీరాలి.

భీమ—(కోపిస్తూ) మంచిదే. తక్షణం పో. నీకు నీళ్లచుక్కలు వొదులుకుంటూ. ఈ క్షణంనుంచీ నువ్వు నాదానివి కావు. వాడి దగ్గరకే పో.

(కళ్యాణి భీమలింగ్ చెయ్యి పట్టుకోబోతుంది.)

భీమ—(విదిలించుకుంటూ) నీ కోమల మృదు హస్తాలతో నన్ను స్పృశించకు. మా నాన్నే నిజం చెప్పాడు. నిన్ను అతనే బాగా అర్థంచేసుకున్నాడు (జ్ఞానంహాంకితో) ఇదుగో నువ్వు తలపెట్టిన కార్యం దీని అంతం చూడు. నువ్వు దగ్గరుండి చెయ్యి పట్టుకుని వాడి శిబిరానికి తీసుకెళ్లు. నేను ఇక్కడే వుండి, మీరు తరలివెళ్లడం చూసి సంతోషిస్తాను. నీమానంతో కొనే సామానులో నాకు భాగం కావాలనకోకండి. నా కర్తవ్యం వేరు. త్వరలోనే అందరికీ తెలుస్తుంది.

కళ్యాణి—(చెయ్యి పట్టుకుని) నాకేసి చూడండి. కళ్లు మరలించెయ్యొద్దు.

భీమ—అయితే చూడు. చూడు నా కళ్లలోకి. అక్కడ రాసున్నది చదువు...పో...నిన్ను చేసగను, చీకటి పడుతోంది. వ్యవధి లేదు. పాపం! వాడు నీకోసం విరహబాధ అనుభవిస్తూ వుంటాడు. వెళ్లు. భయపడుతున్నావు దేనికి? ఆత్మహత్య చేసుకోను! మతి చలించలేదు. ప్రేమ సఫలమయినప్పుడే బుద్ధి జాడ్యం కలుగుతుందికాని ప్రేమ విచ్ఛిన్నమయి పోయినప్పుడు కాదు. ప్రేమ, విశ్వాసం రెండూ కూడా సంపూర్ణంగా అవగాహన చేసుకున్నాను. మరి చెప్పడాని కేముంది? వొదులు కెళ్లు. మాయమవుతున్న ప్రేమని పట్టుకుని బంధించలేవు. బంధం పూర్తిగా తెగిపోయింది...నేను నిన్ను నమ్మిన రోజు లున్నాయి. ఆ నిష్కల్మషమైన నేత్రాలు ... ఆ పెదిమలూ ... (చెయ్యి విదిలించుకుని, కొంచెంసేపు ఆగి) అక్కడికి వెళతావా?

కళ్యాణి—ఆ.

భీమ—తిరిగిరావు.

కళ్యాణి—తప్పకుండా వొస్తాను.

భీమ—ఆసంగతి చూద్దాం లే! (చిరునవ్వుతో) ఆలోచిద్దాంలే...నాతండ్రే నిన్ను బాగా అర్థం చేసుకున్నాడు!...

(కాళ్ల పటుత్వం వొదులుతుంది. గోడకి చేర్లబడతాడు. కళ్యాణి అతనివైపుకి చూడకుండా మెల్లిగా బయటికి వెళ్లిపోతుంది.)

[సశేషము]



ఆంధ్రకల్ప వృక్షము

❀

— శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి —

నా చిన్ననాటి మాట. మా గ్రామంలో ఒక సంపన్న గృహస్థుడు తన గొప్ప తాటితోటను నరికించి, ఆతోటభూమికి కృష్యనుకూలత కల్పించినాడు. ఏమి కర్మమో కాని కొలదికాలమునకే యాతని యింట నమంగళము లనేకములు కలిగినవి. ఊళ్లో పెద్దలంతా "తాటిచెట్టంటే భూలోకకల్పవృక్షం, అటువంటి తాటిచెట్లను ఎన్నింటినో, ఎన్నితరాల నాడు నాటిన వాటినో, నరికించినాడు. చెడ్డాడు." అన్నారు. నేను పదేండ్ల బాలుడను. మా నాయనగారిని "ఇంకా కొబ్బరిచెట్టునో, మామిడిచెట్టునో అంటే అనవచ్చు నేమో కాని తాటిచెట్టును 'భూలోక కల్పవృక్ష'మనడమేమిటి" అని అడిగినాను. ఆనాడు వారు చెప్పిన విషయము నే* ప్రధానపఱచుకొని, యిటీవల దానికి ప్రోద్బలకంగా నాకు గోచరించిన విషయాలనుకూడా చేర్చుకొని యీవ్యాసం వ్రాస్తున్నాను.

పూర్వం ఆంధ్రదేశంలో ప్రతిగ్రామంలోనూ తాటితోపులు ధర్మార్థం తప్పకుండా నాటే సంప్రదాయం ఉండేది. ఊరిపెద్దలు తాటిగింజలు ఎనభై తొంభై యేండ్ల ముసలిప్రాయము కలవానిని వెదకిపట్టుకొని వానిచే నాటించేవారు. ఆ నాటినవాడు నాటిన తాడి కాపుపట్టేలోగా తప్పక చనిపోతాడని ప్రతీతి. నాటిన తాటిచెట్టు పదునైదేండ్లలోపుగా కాపు పట్టదు. నాటినవాడంతదాకా జీవింప వీలులేనివాడుగా ఉండేటందు కంత ముసలివానిని వెదికేవారు. "ముత్తాకి" అంటే మూడు తాడిచెట్ల తరములు చూచినవాడు. వాడు దీర్ఘాయుష్మంతుడు. తన రోజులలో నాటిన తాటిమొలక పెరిగి పండ్లు పండితే, ఆ పండ్లగింజలను మరల నాటితే, అవి పెరిగి పండ్లుపండితే, నాటి విత్తనములను మరల నాటితే, అవి పెరిగి పండ్లు పండడానికి, వాని ననుభవించడానికి మనుష్యుడు దీర్ఘాయుష్మంతుడు కావలెను. మంచిపంటలు పండని, నీటివసతి లేని, యెగుడుదిగుడు నేలలుకూడా తాటితోపులకు పనికివచ్చును. నాటిన తాటిమొలకలకు నీళ్లు పోయనక్కరలేదు. మొక్క లెదిగేదాకా కానైనా కాపు కాయనక్కరలేదు. తక్కువనేలలోనే దగ్గఱదగ్గఱగా ఎక్కువమొక్కలు నాటవచ్చును. విత్తనము నాటినది మొదలుగా కాపుపట్టేదాకాకూడా వానికై ధనవ్యయము ఏమీ చేయనక్కరలేదు. నాటిన తర్వాత రెండుమూడేండ్లనుండి ఆకులు, మట్టలు మొదలగువాని వలని యుపయోగము లుండును. పూర్వకాలమున నొక గృహస్థుడు కొన్ని తాటిచెట్లు కలవాడైతే కట్టుబట్టతప్ప తక్కిన జీవితావశ్యకవస్తువులన్నీ తాటిచెట్ల

---

* ఇటువంటి విషయాన్నే శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారుకూడా కొన్నియేండ్లకు పూర్వము ఆంధ్రపత్రికలో ప్రకటించినట్లు చదివిన జ్ఞాపకము. రెండేండ్ల క్రింద రేడియోలో నేనేదో మాటాడుతూ మంగళసూత్రమునకు 'తాళి'అని పేరుండడము దానిని ఇప్పుడు బంగారముతో చేస్తున్నా పూర్వము తాటియాకుచుట్టతో కట్టడాన్నిబట్టి వచ్చినదనీ, ఈ తాళి కట్టడము ఆర్యాచారము కాదనీ, గృహ్యమంత్రములందు దీనివిషయము లేదనీ, ఇట్లే స్త్రీల చెవులకు భూషలుగా తాటాకుచుట్టలు పెట్టేవారనీ, 'తాటంక'పదము 'తాటాకు'పదభవమనీ, కర్ణభూషలకు 'కమ్మ'అనే పేరుకూడా తాటాకుఅర్థముకలదే అనీ, చెవాకుఅన్నా అదే అనీ ఇత్యాదిగా నే నేదో ప్రసంగించాను. దానినే తర్వాత ప్రకటించినాను. దానిపై మిత్రులొకరు 'తాళి' తాడిపదమునుబట్టి వచ్చినది కాదనీ, తాటంకము 'తాటాకు'నుండి వచ్చినది కాదనీ వారికి తోచిన యుక్తులతో కొంత యేదో వ్రాసినారు. దానికి బదులువ్రాయదలచలేదు.

నుండి సేకరించుకొని జీవయాత్ర గడపుకో గల్గేవాడు. కాపురమునకు నిట్రాడుగుడిసె వేసుకొన్నచో తాడి దూలము నిట్రాడవుతుంది! గోడలు పెట్టి కట్టే యిళ్లైతే తవాసీలు, దూలాలు, స్తంభాలు, కొమరులు, గుజ్జులు, వాసాలు, పెండెలు అన్నింటికీ తాటిమ్రాను పనికివస్తుంది. పైకప్పుకు తాటియాకులు పనికివస్తవి. కట్లు కట్టడానికి తాటినార పనికివస్తుంది. ఇండ్లలో పఱుచుకొనుటకు తాటియాకుచాపలు, సామానులు నిలువచేసికొనేందుకు నానారకాల పెట్టెలు, బుట్టలు తాటియాకులతో చేయవచ్చును. నీళ్లు చేదుకొనుటకు తాటియాకుతో బొక్కెనలను చేయవచ్చును. తాటినార చేంత్రాళ్లు మొదలగు త్రాళ్లు పేనుట కుపయోగపడును. తాటిమ్రానులను రెండుగా చీల్చి నీళ్లుపారే టందుకు దోనెలుగా చేయవచ్చును. ఈనెలుతీసి కోసి కుట్టిన యాకులు విస్తళ్లుగా నుపయోగింపవచ్చును. తాటిముంజెలు, తాటిపండ్లు, తాటి(నిలువచేసిన పేసము) చాప, బుఱ్ఱగుంజు, తాటితేగలు, తాటిబెల్లము, తాటికల్కండ, తాటిపానకము, తాటికల్లు ఆహారపానీయములక్రింద పనికివచ్చును. తాటిపండ్లు శిష్టులు ఆహారముగా నుపయోగింపరాదని నేటివారు కొందఱందురు. కాని దానికి ప్రమాణము నే నెఱుగను. మున్యాశ్రమములలో మునులు తాటిపండ్లను ఫలాహారముగా నుపయోగించువారనుటను కాదంబరిలోని యీక్రిందివాక్యము నిరూపించుచున్నది. జాబాలిమహర్షి యాశ్రమవర్ణనమున "ఉటజాజిరప్రకీర్ణశుష్యచ్ఛ్యామాక ముపసంగృహీతామలక, లవలీ, లవంగ, కర్కంధూ, కదళీ, లికుచ, చూత, పనస, తాళఫల మధ్యయనముఖరవటుజన" మిత్యాది.

తాటిమ్రాని తుండ్లు రాతిరోళ్లపై కుందులుగా నుపయోగపడును. తాటియాకులతో గొడుగులు గావింతురు. తాటి యీనెలు, జవటాలు, జీబులు చీపుళ్లగును. గులకచండ్లు, ఎండుమట్టలు, జీబులు మొదలగునవి యెల్ల వంటచెఱకున కుపయోగపడును. ఈ పేర్కొన్న యుపయోగములెల్ల పామరనాగరకసాధారణమైనవి.

ఇక తాటిచెట్టు ప్రాచీనాంధ్రుల నాగరకతకు జీవరతు. ఆంధ్రుల విద్యావిజ్ఞానములెల్ల తాళపత్రగ్రంథరక్షితములై యున్నవి. తాటియాకులను చక్కగా నీనెలు తీసి చుట్టచుట్టి వేడినీళ్లలో తేలికగా నుడుకనిచ్చి నీడనార్చి నేడు కాగితముల రీములు నిల్వచేసికొన్నట్లు పూర్వులు గ్రంథములు వ్రాసికొనుటకై 'అలేఖము'లను పేర నిలువచేసుకొనేవారు. జాబులను, భారతభాగవతాది గ్రంథములను వ్రాయుటకు నీ తాటియాకుల నుపయోగించేవారు. శతాబ్దములదాకా నీ తాటాకు గ్రంథములు చెడిపోకుండా ఉండేవి. 'జాబు'కు 'కమ్మ' అనే పేరు తాటియాకునుబట్టి వచ్చినదే. ఈ తాటాకులను స్త్రీలు కర్ణాభరణములుగాను, కంఠాభరణములుగాను (మంగళసూత్రము), చేతులలోను జబ్బలలోను మంత్రాక్షరములు గల రక్షాబంధములుగాను పూర్వ ముపయోగించేవారు. 'తాటంక' పదమునకు పాణినిసూత్రములలో నిష్పత్తి లేదు. తర్వాత 'ఉణాది' సూత్రములలో దానికి వింతగా నిష్పత్తి కల్పింపబడినది. నే నీనాడు తిరుపతిలో నుండి యిది వ్రాయుచు నున్న దానినిగూడా యిందు చేర్చుచున్నాను. ఇక్కడ కపిలతీర్థాదిపుణ్యతీర్థములందు సువాసినులకు మూసివాయనము లిచ్చునపుడు ఆ మూసివాయనపు సామగ్రిలో తాటియాకుల చుట్టలనుగూడ ఉంచుదురట! ఆ చుట్టలు కంఠ, కర్ణాభరణస్థానీయములు.

ఇవిగాక యింకనెన్నెని ప్రయోజనములను మన పూర్వులు తాటిచెట్టువల్ల పడసేవారు. తాటిచెట్టు (నేడు కాకపోవచ్చుగాక) పూర్వకాలమున తెలుగువారికి కల్పవృక్షమనుట సంగతమే కాదా?

ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశములో తాటిచెట్టు నిట్లు వర్ణించినాడు.

"వ. అప్పుడు—

శా. కాలాహల్ బుజాతావిచిత్రయుగు భో
గ్రశ్రేణి శోభిల్లఁ బా
తాళం బొక్కట నిర్గమించి వికస
ద్దర్వీకాసంబుతోఁ
గేళిం గ్రాలెడునో యనంగఁ దనవుల్
గృష్ణంబులై యొప్పఁగా
ఫేలమ్మార్గము లైన తాళతరువుల్
కృష్ణుండు వీక్షించుచున్.

మ. క్రమపాకంబునఁ గెంపుతోడి నలుపై
    క్కన్నిక్కటంబైన గం
ధము నెక్కల్ సురభీకరింప రస మం
    తర్గామియయ్యెన్ స్వలిం
గమియం గాలుచునున్న చాద్పున విలో
    కశ్రీతి గావింప హ్రా
ద్యకులై యున్నరి. చూచిరే ఫలము లీ
    తాళద్రుమశ్రేణులన్.

తే. పీని నింపార గోవులు పేను గూడి
రొలమి దొలచు నాస్వాదించు మెంతయేని
వేడ్క యరొయ్యకు రాల్పును వేగ వేగఁ
బ్రాఁకి నీలావు వెరవును భాసితముగ.

క. ఎక్కఁ దడవు తాడుల మొద
లక్కజముగఁ జెట్టియూఁకు నవె యేతికోనం
డెక్కుడుగఁ బండ్లు మీరొ
క్కొక్కని గుడువంగఁ జనుచు నుద్ధతలీలన్.

తే. ఒక్క తరవాయి దొరఁకొని యొకటి నొకటిఁ
బృనుభుజాదండములఁ బట్టి పెలుచ నూఁచెఁ
జెలుక విఱువను నొల్లక యఱక వస్య
హస్తి నిజహస్తమునఁ జెరలాడునట్లు."

తాటిపంటినిగూర్చి శ్రీనాథుని పద్యమొక్కటి:-

గీ. "సంజకెంపును దిమిరపుం జంపు నలుపు
గమియ బ్రహ్మాండ భాండంబు గరము మెఱపె
పరమపరిపాకదశ వృంతబంధ మెడలి
పతనమగు తాటిపంటితోఁ బ్రతిఘటించి."

తాటితోపుల వెలయించుట మహాపుణ్యకార్యముగా ప్రాచీనులు తలుస్తూఉండేవా రనడానికి ఆరున్నూర్ల యేండ్లనాటి శాసనాలు రెండు:—

(6 వాల్యూంలో 258 పేజి)

674 నెం. పిఠాపురము శాసనము:—

"...తల్లి సరణి, మొదలుగాన యీ తాటి తోట్వరు సాంటిరి వారు భూమి ప్రజలకు బుద్ధిన్ని మతిని శేవమున్ను ధర్మమున్ను చెలుకుదురుగాను యీ తాడాకులనే పంచాంగాలు, పురాణాలు శాస్త్రాలు ధర్మకర్తలు వ్రాసి చదువంగాను అందువల్లంతంగాని బుద్ధి మాంటలం జెప్పరాదుగాన సకల ధర్మాలకున్ను తాంటిదృక్షమే మూలము ఈ కలియుగము పుట్టి యొప్పుడు కలియుగధర్మాలు అర్ధమేవర్తించి పెద్దల మన్నింపక తల్లిదండ్రులకు..."

(అదే పేజిలో 675 నెం. శాసనము)

"సీ. నిండె నెవ్వనికీర్తి నిఖిలలోకంబులఁ
    జంద్రికా విస్ఫారసాంద్రగరిమ
ఉండె నెవ్వనియింటఁ బుండరీకాక్షుని
    ప్రాణవల్లభియైన పద్మనయన
పండె నెవ్వనికృపా పాథోధినిలరొల్ల
    ధాన్యసంపూర్ణ వదాన్యయుచు
మండె నెవ్వనికోపమహిమానలంబుచే
    పరివీరగేహంబు లక్షణంబు
అనుచుఁ గొనియాడుదురు నిన్ను నఖిలపథిల
వేమభూపాల కారుణ్య విమలపాత్ర
ప్రబలకర తేజ వాసయ ప్రభుతనూజ
మనుజదేవేంద్రపోతకుమారచంద్ర!

సౌమ్యసంవత్సరం మొదలుగాను పిఠాపురకపు (సీ) మ [అకి] గస్తున్న కుక్కుటేశ్వరం వాడ గయపట్టుగాన యిది పుణ్యభూమి అని "చత్వారిపుణ్య స్థాని దుర్లభాని దురాత్మనామ్, కేదారముక్కుతీర్థంచ ప్రయాగః కుక్కుటేశ్వరః" ఈ పుణ్యస్థలమందును [శివ] లింగమున్ను సూర్య దేవ...యా×లింగమున్ను వారణాసి విశ్వేశ్వర లింగమున్ను గిరిజేవ [తి]ను సహితమైన ప్రతిష్ఠలు అయిదు చేయించి తానుళ్లుకట్టించెను। ద్వాపరయుగము నాండు గొంతిదేవి ప్రతిష్ఠగాన మాధవయ్య నగరు సున్నగుచేయించెను. లక్ష్మీదేవమ్మను ప్రతిష్ఠచేయించి తానగరు కట్టించెను. నాలుగు లక్షలున్ను అఱువై వేలు తాళ్లు నాటించెను. ఇటువంటి శివప్రతిష్ఠలున్ను, విష్ణు ప్రతిష్ఠలున్ను చేయించిన పుణ్యపురుషుడు గాన వాని రక్షి పాతిసేండు చేయును (జ) దేవేంద్రుండెవ్వను - మంగళమహా శ్రీ శ్రీ."

రాజ్యాంగనిర్మాణపరిషత్తు

(The Constituent Assembly)

✽

= శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య =

అఖిలభారతకాంగ్రెసు కార్యనిర్వాహకసభవారు బ్రిటిషుమంత్రిత్రయమువారి తాత్కాలిక ప్రభుత్వమునకు సంబంధించిన సూచనలు దేశమునకు నష్టకరము లగునని భావించి వాటిని నిరాకరించినను, దీర్ఘకాలమునకు సంబంధించిన సూచనలను అంగీకరించిరి. ఈ సూచనలలో లోపములు లేవని వారి భావను కాదు. లోపము లనేకము లున్నను, మొత్తముమీద సూచనలు దేశమునకు లాభకరములుగ పరిణమించు నని వారి అభిప్రాయము. ఇట్లు వా రభిప్రాయపడుటకు ఆ సూచనలలో మన దేశపు భావిరాజ్యాంగను మనమే నిర్మాణముచేసుకొనుటకు కావలసిన అవకాశము ఉండుటయే ప్రధానకారణము. ఈ అవకాశ స్వరూప మెట్టిదో, ఎంతవరకు నిజముగ మనము మన రాజ్యాంగ విధానమును నిర్ణయించుటకు వీలున్నదో ఇచ్చట వివరింపబడును.

బ్రిటిషువారి అధికారము తొలగి, మన దేశమును పాలించుకొను అధికారము మన చేతులలోనికి వచ్చినపుడు ఏ రాజ్యాంగవిధానము ననుసరించి మనము మన దేశమును పాలించుకొనవలయునో నిర్ణయించుటకై ఒక రాజ్యాంగనిర్మాణపరిషత్తు సమావేశము కావలెననియు, అట్టి పరిషత్తునకు ఎన్నికలు ఇప్పుడిప్పుడే జరుగవలెననియు దీర్ఘకాలపు సూచనలలోని ప్రధానవిషయము. మన రాజ్యాంగస్వరూపమును మనము ఏర్పరచుకొనగలుగుటయే స్వరాజ్యమునకు మొదటి లక్షణము. ఈలక్షణము దీర్ఘకాలపు సూచనలలో నుండుటచేత కాంగ్రెసుకార్యనిర్వాహకవర్గమువారు వాటిని ఆమోదించుట సంభవించెను.

రాజ్యాంగనిర్మాణపరిషత్తునందు ౩౮౯ మంది సభ్యు లుందురు. వీరిలో మద్రాసు, బొంబాయి మొదలైన రాష్ట్రములకు సంబంధించినవారు ౨౯౬; తక్కిన ౯౩ సభ్యులు హైదరాబాదు, మైసూరు మొదలైన సంస్థానములకు చెందినవారు. రాష్ట్రములనుండి వచ్చు ౨౯౬ సభ్యులలో ౭౮ మహమ్మదీయులు, ౪ శిక్కులు, ౨౧౦ మహమ్మదీయేతరులు (అనగా హిందువులు, సవర్ణులు, హరిజనులు, క్రైస్తవులు, ఆంగ్లో ఇండియన్లు మొదలైనవారు) ఉండెదరు. సంస్థానములనుండి వచ్చు సభ్యులలో కూడ కొందరు మహమ్మదీయులు, కొందరు మహమ్మదీయేతరులు ఉండగలరు. సభ్యుల సంఖ్య దేశములోని ప్రజలలో పదిలక్షలకొక సభ్యు డను సూత్రమును బట్టి నిర్ణయింపబడినందునను, దేశములో నాల్గవవంతు జనము మహమ్మదీయు లగుటచేతను రాజ్యాంగనిర్మాణ పరిషత్తులో ౯౦ మహమ్మదీయులు, ౪ శిక్కులు, ౨౯౫ మహమ్మదీయేతరులు ఉండెద రని ఊహించవచ్చును. కాంగ్రెసుపక్షమువారు బహుశః జాతీయ మహమ్మదీయులను కొందరిని ఎన్నుకొనుట సిద్ధముగనుక మొత్తము మహమ్మదీయుల సంఖ్య ౯౦కు మించినను మించవచ్చును. అట్టి సందర్భములో మహమ్మదీయేతరుల సంఖ్య కొంత తగ్గగలదు. ఈ స్వల్ప వ్యత్యాసము అంత ముఖ్యముగ గమనింపతగ్గది కాదు.

ఇట్లు ఏర్పడు రాజ్యాంగ నిర్మాణ పరిషత్తును గురించి గమనించవలసిన విషయములు కొన్ని యున్నవి:

(౧) బ్రిటిషువారు మన దేశమునకు ప్రభువులైనది మొదలు ఇప్పటివరకు రాజ్యాంగ విధానమును గురించి వా రప్పుడప్పుడు అనేక చట్టములను చేసి యున్నారు. వాటిలో మొదటి చట్టమును ౧౭౭౩లోను, ఆఖరుచట్టమును ౧౯౩౫లోను చేసిరి. ఈచట్టముల నన్నిటిని ఇంగ్లండులోని పార్లమెంటుసభ చేసెను. ఇవి

మనము చేసుకొనిన చట్టములు కావు. ఇప్పుడు రాజ్యాంగ నిర్మాణ పరిషత్తు ద్వారా చేయబడు చట్టము ఇట్టిదిగాక మనము ఎన్నుకొనిన సభ్యులు గల పరిషత్తుచే చేయబడునట్టిది. ఇందులోని సభ్యులందరు భారతీయులుగ నుందురు. విదేశీయులగు బ్రిటిషువారెవ్వరు ఇందు ఉండజాలరు. ఈవిషయమునుగురించి కొన్ని రోజుల క్రితము కొంచె మనుమాన ముండెను. బంగాళము, ఆసాం మొదలైన రాష్ట్రశాసనసభలలోని బ్రిటిషుసభ్యులు రాజ్యాంగ నిర్మాణపరిషత్తుయొక్క ఎన్నికలలో పాల్గొనెదరేమో అను సందేహ ముండెను. వారు పాల్గొనుట ధర్మము కాదను మహాత్మాగాంధీగారియొక్కయు, కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గము వారియొక్కయు ఆక్షేపణ సమంజసమైన దని మంత్రిత్రయ మంగీకరించుటచేత పరిషత్తునందలి సభ్యులందరు భారతీయులుగ నుందురనుట స్పష్టమయ్యెను.

ఇట్టి పరిషత్తు నిర్మాణముచేయు రాజ్యాంగ విధానము శుద్ధమైన స్వదేశవిధాన మని చెప్పుటకు అర్హమయిన దగును.

(౨) ప్రజాప్రభుత్వ సిద్ధాంతము ప్రచారములోనికి వచ్చిన తర్వాత, ౧౮-వ శతాబ్దపు అఖరు భాగము నుండి ఇప్పటివరకు ఎన్నో నిరంకుశ ప్రభుత్వములు అంతరించినవి. అట్టి ప్రభుత్వముల స్థానమున అమెరికాఖండమందును, ఐరోపాఖండమందును అనేక దేశములలో ప్రజాప్రభుత్వములు నెలకొల్పబడెను. ఈదేశములన్నిటిలో ప్రజాప్రభుత్వ సిద్ధాంతముల ననుసరించిన రాజ్యాంగ విధానములను ఏర్పరచిన సంస్థలు ప్రజలు ఎన్నుకొనిన ప్రజాపరిషత్తులు. కొన్ని దేశములందు ప్రజలు పరిషత్సభ్యులను ప్రత్యక్షముగ (Direct) ఎన్నుకొనుటయు, మరికొన్నిటియందు పరోక్షముగ (Indirect) ఎన్నుకొనుటయు జరిగెను. కాని మొత్తము మీద ప్రజలు ఎన్నుకొనిన పరిషత్తులే రాజ్యాంగ నిర్మాణమును గావించెనని చెప్పవచ్చును. ప్రజాస్వామ్య సిద్ధాంతము పూర్తిగ ప్రచారములోనికి రాకపూర్వము ఎట్లుండినను, అది ప్రచారములోనికి వచ్చిన తర్వాత మాత్రము ప్రజలందరు పరిషత్సభ్యులను ఎన్నుకొనుటలో పాల్గొనుట మామూలయ్యెను. ఏ కొద్దిమంది మాత్రమే ఎన్నుకొనుట ప్రజాస్వామ్య సిద్ధాంతమునకు విరుద్ధమను సూత్రమును అందరు అనుసరించిరి. ప్రస్తుతము మనదేశమున ఏర్పడనున్న పరిషత్తు పూర్తిగ ప్రజాపరిషత్తని చెప్పుటకు తగినట్టిది కాదు. ఇతర దేశములలోని రాజ్యాంగ పరిషత్తులకును, మన పరిషత్తునకును గల ఈ భేదము ముఖ్యమైనది.

మన దేశమున ఏర్పడనున్న పరిషత్తు నిజమైన ప్రజాపరిషత్తు అని చెప్పతగినది కాదని యనుకొనుటకు కారణము సులభముగ గ్రహించవచ్చును.

(అ) ఈపరిషత్సభ్యులను ప్రజలు ప్రత్యక్షముగ (Direct) గాక పరోక్షముగ (Indirect) ఎన్నుకొనుట ఈ కారణముకాదు. బ్రిటిషుమంత్రిత్రయమువారి సూచనలప్రకారము పరిషత్తులోని ౨౯౬ రాష్ట్రీయసభ్యులను ఎన్నుకొనువారు వివిధరాష్ట్రములలోని శాసనసభాసభ్యులు. మద్రాసుశాసనసభలోని ౨౧౫ సభ్యులు మద్రాసు రాష్ట్రమునుండి పరిషత్తుకు వెళ్లవలసిన ౪౯ సభ్యులను ఎన్నుకొనెదరు. ప్రజలే ప్రత్యక్షముగ ఈ ౪౯ సభ్యులను ఎన్నుకొనకపోవుటచేత ఈ పద్ధతికి పరోక్షఎన్నిక పద్ధతి అను పేరు తగియున్నది. కాని శాసనసభలోని ౨౧౫ సభ్యులను ఎన్నుకొనినవారు ప్రజలే అయినందున, అట్టి సభ్యులచే ఎన్నుకొనబడిన ౪౯ పరిషత్సభ్యులుకూడ ప్రజాప్రతినిధులని చెప్పుటకు తగియున్నారు.

(ఆ) కాని ఈసందర్భములో ఒక ఆక్షేపణ గమనించతగియున్నది. శాసనసభలోని ౨౧౫ సభ్యులను రాష్ట్రములోని ప్రజలు అందరు ఎన్నుకొనలేదు. మన దేశమందు శాసనసభ్యులను ఎన్నుకొను హక్కు ప్రజలకందరికిని లేదు. కొందరికిమాత్రమే ఉన్నది. మన రాష్ట్రములో సుమారు ౫ కోట్ల ప్రజ లున్నారు. వారిలో యుక్తవయస్సు వచ్చినవారి సంఖ్య ౩ కోట్లకైన ఉండును. కాని శాసనసభల ఎన్నికలలో పాల్గొను అవకాశము ౫౦,౬౦ లక్షల జనమునకు మాత్రమే ఉన్నది. ప్రస్తుతపు శాసనసభలోని సభ్యులు ౩ కోట్ల ప్రజలచే ఎన్నుకొనబడినప్పుడే వారు ప్రజా ప్రతినిధు లని చెప్పుటకు తగియుందురు. ఇప్పుడు వారి

కట్టి పేరుకు అర్హమైనది కాదు. శాసనసభలు ప్రజలందరి తరఫున మాటలాడతగినవి కానప్పుడు ఈసభలద్వారా ఎన్నుకొనబడు రాజ్యాంగనిర్మాణపరిషత్తునకు ప్రజాపరిషత్తను పేరు ఎట్లు అన్వయించగలదు?

(౨) ౧౯౩౪ నుండి అఖిలభారతకాంగ్రెసు సభవారును, జవహర్‌లాల్ నెహ్రూగారును, ౧౯౩౯ నుండి మహాత్మాగాంధీగారును కోరుచుండిన పరిషత్తు (Constituent Assembly) ఇట్టిది కాదు. దేశములోని వయోజనులందరు—అనగా ఇరవై కోట్ల జనము—ఎన్నుకొనిన పరిషత్తునకు మాత్రమే రాజ్యాంగమును నిర్మాణము చేయు హక్కు, అధికారము ఉండవలెనని వారు ప్రచారముచేయుచుండిరి. ఇప్పు డేర్పడబోవు పరిషత్తు మూడుకోట్ల జనముచే పరోక్షముగ ఎన్నుకొనబడు పరిషత్తు. ఇట్టి పరిషత్తును కాంగ్రెసునాయకులు ఆమోదించుట ప్రజాస్వామ్య సిద్ధాంతమునకు విరుద్ధముగ నుండుటయేకాక కొంత ఆశ్చర్యమునుకూడ కలిగించుచున్నది. కాని వారిట్టి పరిషత్తుద్వారా రాజ్యాంగమును నిర్మింపబూనుటకు కారణము లేకపోలేదు. వయోజను లందరి పేర్లను సూచించు జాబితాలను (Lists) తయారుచేయుటకు సుమారు రెండుసంవత్సరములు పట్టుననియు, అంతవరకు రాజ్యాంగవిషయములను పరిష్కరించకుండుట ప్రమాదకరమనియు, ఏడు సంవత్సరముల క్రింద ఏర్పడిన రాజకీయ ప్రతిష్టంభనమువలన ఇప్పటికే దేశమునకు ఎంతో నష్టము కలిగెననియు వారు భావించి కాలయాపనము చేయక వారిట్టి పరిషత్తును అంగీకరించవలసినవారైరి. మన రాజకీయ కష్టములన్నియు దౌర్జన్య ప్రయోగముద్వారాకాక, రాజీమార్గమున పరిష్కారము చేసుకొనుటయే ఉత్తమమార్గమని వారూహించుట చేతను, బ్రిటిషు మంత్రిత్రయమువారు శుద్ధమైన ప్రజాపరిషత్తును సమావేశపరచుట కష్టసాధ్యమని భావించినందునను వారు తలపెట్టిన పరిషత్తు ద్వారా రాజ్యాంగమును ఏర్పరచుటకు కాంగ్రెసు నాయకులు అంగీకరించిరి. వారి అంగీకారమునకు బలవత్తరమైన కారణములు లేకపోలేదు. కారణము లెన్ని యున్నను మన రాజ్యాంగనిర్మాణపరిషత్తు ఇతరదేశములలోని రాజ్యాంగ నిర్మాణపరిషత్తులవలె ప్రజాపరిషత్తను పేరునకు తగినది కాదని మనము గ్రహించవలెను.

(౩) ఈ సందర్భమున మరొక విషయముకూడ మనము గమనించవలసియున్నది. ఈపరిషత్తునకు సంస్థానములనుండి ౯౩ సభ్యులు వచ్చెదరు. వీరిలో అధిక సంఖ్యాకులు సంస్థానాధీశులచే నియమింపబడినవారుగా నుందురుగాని ప్రజలచే ఎన్నుకొనబడినవారుగా నుండజాలరు. ఈ కారణముచేతకూడ మన పరిషత్తు సంపూర్ణమైన ప్రజాపరిషత్తు కాదని చెప్పవలసియున్నది.

(౪) ఈ పరిషత్తు నిజముగ మన పరిషత్తని అనుకొనుటకు తగినదా అను విషయములో మరి యొక అంశము కూడ గమనింపవలసియున్నది. భరతఖండము లోని ౪౦ కోట్ల జనము "మన"వా రను భావముతో పరిషత్తును ఏర్పరచినప్పుడే దానికి 'మన పరిష' త్తను పేరు సార్థకమగును. కాంగ్రెసు పక్షమునకు చెందిన వారందరిలోను, జాతీయ మహమ్మదీయులలోను ఇట్టి భావము కనుపించుచున్నది. ఇతరవర్గములకు చెందినవారనేకులలో కూడ ఇట్టి భావము లేకపోలేదు. కాని ముస్లింలీగునకు చెందిన మహమ్మదీయులలోను, బ్రిటిషు అధికారులలోను ఇట్టి భావము కనుపించుటలేదు. ఈ కారణముచేత — ముఖ్యముగ బ్రిటిషుఅధికారుల అభిప్రాయము కారణముగ — ౧౯౦౯ నుండి ఎన్నికలలో పాల్గొనువారిని మతమును బట్టియు, జాతిని బట్టియు, వృత్తిని బట్టియు అనేక ప్రత్యేక నియోజక వర్గములుగ విభజించుట మామూలైనది. శాసనసభల ఎన్నికలలో మతమును బట్టి ప్రజలను విభజించుట మన దేశమందు తప్ప మరే దేశమందును కనబడుట లేదు. మతమును బట్టియు, జాతిని బట్టియు, భాషను బట్టియు, సభ్యతను బట్టియు మనలో భేదము లెన్ని యున్నను రాజకీయముగ మన మందరము ఒక్కరమే అన్న భావము ననుసరించి పరిషత్సభ్యు లెన్నుకొనబడినపుడే ఆ పరిషత్తు "మన" పరిషత్తు అగును. కాని ప్రత్యేక నియోజకవర్గముల ద్వారా ఎన్నుకొనబడిన శాసనసభలచే ఎన్నుకొనబడు పరిషత్తునకు ఇట్టి పేరు అన్వయించదు. ఇందులోని సభ్యులు ప్రజాసభ్యులు

కాజాలరు. మహమ్మదీయ సభ్యులు, క్రైస్తవసభ్యులు, ఆంగ్లోఇండియన్ సభ్యులు, హరిజనసభ్యులు, సవర్ణ సభ్యులు అని చెప్పతగినవారుందురు. సంయుక్త నియోజకవర్గముల ద్వారా మనము మన సభ్యులను ఎన్నుకొన గలిగినప్పుడే రాజ్యాంగ నిర్మాణ పరిషత్తు మన పరిషత్తగును. ఇప్పుడు దానికి ఈ లక్షణము వర్తించదు.

(౮) ఇట్టి విపరీతముతో కూడకొనిన పరిషత్తు మనకు లక్ష్యంచుటకు మరియొక ప్రబలకారణ మున్నది. ఫ్రాన్సు, జర్మనీ, ఐర్లాండు, జెకోస్లోవేకియా మొదలగు దేశములలో ప్రజలు మొట్టమొదట విప్లవముద్వారా నిరంకుశప్రభుత్వములను అంతరింపజేసి, తమ నాయకులతో కూడిన తాత్కాలికప్రభుత్వమును అధికారస్థానమునం దుంచి, అట్టి ప్రభుత్వప్రజామోదముగల రాజ్యాంగనిర్మాణపరిషత్తును ఏర్పరచినవారైరి. అనగా అధికారమును హస్తగతము చేసుకొనినతర్వాత పరిషత్తును సమావేశపరచుట ఈ దేశములలో జరిగిన క్రమము. ఇదియే సరియైన క్రమము. ఈ కారణముచేత ప్రజలు, ప్రజానాయకులు వారి ఇష్టానుసారముగ పరిషత్తును ఏర్పరచుకొనగలిగిరి. మన దేశమందు ఇట్టి పరిస్థితులు లేవు. స్వరాజ్యమునకై ఇరవైఅయిదు సంవత్సరములుగ కాంగ్రెసుద్వారా ప్రజలు గొప్ప పోరాటము చేయుచున్నను ఈ పోరాటమం దింకను పరిపూర్ణవిజయము మనకు లభించలేదు. బ్రిటిషువారింకను అధికారములో నున్నారు. వారి అధికారమును శాశ్వతముగ నిలబెట్టజూచు భారతీయు లెందరో ఇంకను దేశమం దున్నారు. ఇప్పుడు ఏర్పడనున్న పరిషత్తులో భారతీయులుమాత్రమే సభ్యులైనను, ఇది మనము ఏర్పరచుకొనిన పరిషత్తు కాదు. బ్రిటిషువా రేర్పరచినది. అధికారమం దుండు బ్రిటిషువారి ఆమోదము లేక ఈ పరిషత్తు పనిచేయజాలదు. రాజ్యాంగనిర్మాణకాలమందు ఇతరదేశములలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వములు (Provisional Governments) ప్రజాప్రభుత్వములు. వాటికిని, రాజ్యాంగనిర్మాణపరిషత్తునకును పరస్పరవిరోధ ముండుట కవకాశము లేదు. మన పరిషత్తుయొక్క స్థితి యట్టిది కాదు. పరిషత్తు రాజ్యాంగమును నిర్మించు కాలములో సర్వాధికారము వైస్రాయి, అతని కార్యనిర్వాహకవర్గము చేతులలో నుండును. వారిని కాదని పరిషత్తు ఏపనిచేయుటకును వీలుండదు. అన్నివర్గములవారికి తృప్తికరమైన రాజ్యాంగమును నిర్మించిన అనంతరము బ్రిటిషువారు తమ అధికారము వదలుకొనునట్లు చెప్పుచున్నారు. అధికారము వచ్చిన తర్వాత ఇతరదేశములలో రాజ్యాంగనిర్మాణమునకు పూనిరి; మన మట్లు చేయక రాజ్యాంగనిర్మాణమునకై ప్రయత్నించుచున్నాము. ఇట్టిప్రయత్నము ఎంతవరకు సఫలమగునో చెప్పజాలము. "Putting the cart before the horse—గుర్రమునకుముందు బండిని ఉంచుట" అను సామెత ఇంగ్లీషుభాషలో ఉన్నది. ఈసందర్భములో ఆ సామెత జ్ఞాపకమునకువచ్చుచున్నది.

(౯) ఇతర దేశములలో ఏర్పడిన పరిషత్తులన్నియు సర్వస్వామ్యము (Sovereign) సంపూర్ణ స్వాతంత్ర్యము గల పరిషత్తులు. మన పరిషత్తునకు సర్వస్వామ్య మున్నదా అను విషయములో కూడ కొంత అనుమానము కలుగుచున్నది. దాని ఇష్టము వచ్చిన రాజ్యాంగమును నిర్మించి అములులో పెట్టుటకు దానికి స్వాతంత్ర్య మున్నప్పుడే అది సర్వస్వామ్యము కలదని చెప్పతగును. అట్టి స్వాతంత్ర్యము దాని కున్నదా? ఈ సందర్భములో రెండు మూడు విషయములను గమనించుట అవసరము.

(౧౦) ఈ పరిషత్తునకు బ్రిటిషు మంత్రిత్రయము మేనెల ౧౬ వ తేదీనాడు గావించిన ప్రకటన మూలము, ఈ ప్రకటనను పరిషత్తు పూర్తిగ అనుసరించవలసిన యెడల పరిషత్తు స్వామ్యము, స్వాతంత్ర్యము లేనిది యగును. ఎంతవరకు, ఏట్టి పరిస్థితులలో ఆ ప్రకటనను పరిషత్తు అతిక్రమించవచ్చును అను విషయములో ఇప్పటికి అభిప్రాయ భేదము లేర్పడినవి. మంత్రిత్రయమువారి వ్యాఖ్యానములు పరస్పర విరుద్ధములుగ నున్నవి. ఈ ప్రకటన సూచనమాత్రమేగాని (Recommendatory) చట్టరూపమైన నిర్ణయము (Award) కాదని వారు ప్రథమమున చెప్పినను, అది నిర్ణయమను ధోరణిలోనే వారు తర్వాత మాట్లాడ సాగిరి.

(అ) ప్రకటన సూచనమాత్రమేగాని నిర్ణయము కాదని వాదించుటకు ప్రకటనలోనే కొన్ని ఆధారములున్నవి. అందులోని ప్రధాన సూచనలను మార్చుటకు "పరిషత్తులో హాజరైన సభ్యులలో అధిక సంఖ్యాకుల ఆమోదమే కాకుండ, ప్రధానమైన రెండు (హిందూ, ముస్లిము) సంఘాల ప్రతినిధులలో అధిక సంఖ్యాకుల విడి విడి ఆమోదము కూడ కావలెను." అని యున్నది. దీనిని బట్టి ప్రకటనను మార్చుటకు పరిషత్తునకు అధికారమున్నమాట స్పష్టము. కాని ఈ అధికారము ఆచరణలో ఉపయోగింపదగ్గ అధికారమని చెప్పుటకు వీలులేదు. ప్రకటనలోని సూచనలలో కొన్ని ప్రధానములయినవి కలవు. భరతఖండము రాజకీయముగ ఒక్కటే ప్రభుత్వముక్రింద ఉండతగినదే కాని హిందూస్థానము, పాకిస్థానము అని రెండు స్వతంత్రరాజ్యములుగ విభజింపబడకూడదు అను సూచన యొకటి. భారతసమితి (Indian Union)ని పాలించుటకై ఏర్పరచబడు ప్రభుత్వమునకు దేశరక్షణ (Defence), విదేశవ్యవహారములు (Foreign Policy), రహదారులు (Communications) అను మూడు శాఖలపై మాత్రమే అధికారముండును. తక్కిన అధికారమంతయు రాష్ట్రప్రభుత్వములదే. రాష్ట్రములకు, భారతసమితికి మధ్యన రాష్ట్రకూటములు (Groups of Provinces) ఉండవలెను అనునది ఇంకొక ప్రధాన సూచన. ఈ సూచనలను మార్చుటకు ఏమైన అవకాశమున్నదా? భరతఖండమును రెండుస్వతంత్రరాజ్యములుగ విభజించుటయే సమంజసమను తీర్మానమును ముస్లిములీగు తరఫున పరిషత్తునకు వచ్చు సభ్యులు ప్రతిపాదించినయెడల అట్టి తీర్మానమునకు మహమ్మదీయేతరసభ్యులలో అధిక సంఖ్యాకులు అంగీకరింతురా? అట్టి తీర్మానము ప్రవేశపెట్టినను ప్రవేశపెట్టకపోయినను ఒక్కటే అనుకదా! వాదప్రతివాదములుతప్ప మరేదైన ఫలిత ముండునా? "మూడు శాఖలపైమాత్రమే సమితిప్రభుత్వమునకు అధికారముండుట యుక్తముకాదు. వీటితోపాటు చెలామణి, బ్యాంకింగు, సుంకములు మొదలగు శాఖలపైకూడ అధికారముండవలెనని మహమ్మదీయేతరులలో అనేకులు అభిప్రాయపడుచున్నారు. అందువిషయమై వారు తప్పక తీర్మానము నొకదానిని ప్రవేశపెట్టుట సిద్ధము. కాని మహమ్మదీయసభ్యులలో అధికసంఖ్యాకులు దానికంగీకరింతురా? హాజరైన సభ్యులలో అధికసంఖ్యాకుల ఆమోదమే కాకుండ ప్రధానమైన రెండు సంఘాల ప్రతినిధులలో అధికసంఖ్యాకుల విడివిడిఆమోదము కావలెనను నిర్ణయము పరిషత్తుయొక్క స్వేచ్ఛకు భంగకరముగ పరిణమించును. అనగా ఈ సూత్రము ననుసరించి రాజ్యాంగనిర్మాణమును చేయబూనుట కారాగృహమున బంధింపబడినవాని స్వేచ్ఛవంటిది.

(ఇ) ప్రకటన సూచనమాత్రమే అయినయెడల ఈ సూత్రముకూడ సూచన అనియే భావించవచ్చును. రెండు ప్రధానసంఘాల ప్రతినిధుల విడివిడిఆమోదము అవసరములేకుండ, హాజరైన సభ్యులలో అధికసంఖ్యాకుల ఆమోదమాత్రముతో వ్యవహారాల నన్నిటిని పరిష్కారముచేయవచ్చునని పరిషత్తు తీర్మానించి, ఆ తీర్మానము ననుసరించి వ్యవహారములను జరుపగలిగిన నాడు పరిషత్తు సర్వస్వామ్యముకలది యగును. కాని హిందువులు వేరు, మహమ్మదీయులు వేరు, వారిది ఒకజాతి, వీరిది మరొక జాతి, ఈ రెండు మతముల వారికి ఎన్నటికి పొత్తు కుదురదని వాదించు ముస్లింలీగు సభ్యులు ఇట్టి స్వామ్యమును ఆమోదింతురా? వారి ఆమోదము లేక పరిషత్తు ఎంతవరకు వెళ్లగలదు? అట్లు వెళ్లినయెడల ముస్లింలీగుసభ్యులు పరిషత్తులో నుండుటకు సమ్మతింతురా? వారు దానిని బహిష్కరించుట తప్పునా? దాని మూలమున ప్రతిష్టంభన ఏర్పడదా?

ఇదంతయు ప్రత్యేకనియోజకవర్గములవలని ఫలము. హిందువుల సహాయ మవసరము లేక మహమ్మదీయులును, మహమ్మదీయుల సహాయము లేక హిందువులును శాసనసభలలో ప్రవేశించుటకు అవకాశ ముండునంతవరకు ఈ ప్రతిష్టంభన తప్పదు. మన దురదృష్టవశాత్తు ఇతరదేశములు దేనిలోకూడ లేనట్టి ఈ ప్రత్యేకనియోజకవర్గములను బ్రిటిషువారు మన దేశములో ప్రవేశపెట్టి సంఘానికి సంఘానికి మధ్యన ప్రబలద్వేషమును వృద్ధిచేసిరి. ఇట్టి పరిస్థితులను ఆధారముచేసుకొని ఏర్పడిన రాజ్యాంగనిర్మాణపరిషత్తు అన్నివర్గములవారికి తృప్తికరమైన రాజ్యాంగమును నిర్మింపగలుగుట కల్ల.

చీటికి మాటికి ప్రతిష్టంభనలతోను, బహిష్కారములతోను అది అస్థిరపడవలసిన స్థితిలో నుండును.

(ఈ) పరిషత్తునకు సర్వస్వామ్యముండదేమో యని అనుకొనుటకు మరొక హేతువుకూడ కలదు. పరిషత్తు తయారుచేయు రాజ్యాంగవిధానము బ్రిటిషువారి ఆమోదమును పొందినగాని ఆచరణలోనికి రానట్లు అగుపడుచున్నది. రాజ్యాంగమును భారతదేశమునకు అప్పగించుసందర్భములో ఉత్పన్నముకాగల కొన్ని విషయాలనుగురించి పరిషత్తునకు, బ్రిటిషుప్రభుత్వానికి మధ్య ఒక సంధి జరుగవలసియున్నదని మే ప్రకటనలో సూచింపబడియున్నది. ఆ కొన్ని విషయాలనగా ఏమో మంత్రిత్రయమువారు వ్యాఖ్యానముచేసినారు. అల్పసంఖ్యాకుల హక్కులు, సంస్థానాధీశుల హక్కులు, దేశరక్షణ ఈవిషయాలలో చేరియున్నవి. ఈవిషయములను గురించి పరిషత్తు చేయు ఏర్పాటులు బ్రిటిషువారికి సంతృప్తికరము లైనప్పుడే రాజ్యాంగము మనకు స్వాధీనమగుటయు, మన దేశమును మనము ఏలుకొనుటయు సంభవించును. ఏ ప్రభుత్వమును తొలగించుటకు మనము ప్రయత్నముచేయుచున్నామో ఆ ప్రభుత్వముయొక్క ఆమోదమును మన పరిషత్తు నిర్మించే రాజ్యాంగము సంపాదించుట ఎంతటి కష్టసాధ్యమో ప్రత్యేకముగ చెప్పనవసరము లేదు. పరిషత్తులో బ్రిటిషుసభ్యు లెవ్వరును లేకపోయినను మనము నిర్మించుకొనిన రాజ్యాంగము ఆచరణలోనికి వచ్చుటకు బ్రిటిషుప్రభుత్వమువారి సమ్మతి అవసరమని చెప్పుట పరిషత్తుయొక్క స్వాతంత్ర్యమును బంధించుటయే.

(ఉ) పరిషత్తుయొక్క సర్వస్వామ్యమునకు లోపము కలిగించు అంశములు మరిరెండు కలవు. ఈ పరిషత్తులో ముస్లింలీగుతరఫున ఎన్నుకొనబడు సభ్యులు సుమారు నూరుమంది పాల్గొనెదరు. వారి అభిప్రాయములననుసరించి కొన్ని సూత్రములు రాజ్యాంగవిధానములో చేర్చబడును. అయినప్పటికిని పరిషత్తు నిర్మించిన రాజ్యాంగమునకు లీగువారు బద్ధులై యుండుటయు ఉండకపోవుటయు ఇష్టమును నిర్ణయించుటకు వీలులేదని లీగుకార్యనిర్వాహకసభవారి అభిప్రాయము. ఇదేవిధముగ సంస్థానముల ప్రతినిధులు పరిషత్తులో పాల్గొనినను, పరిషత్తు నిర్మించు రాజ్యాంగమునకు సంస్థానములన్నియు బద్ధులగుట అవశ్యము లేదు. ఒక్కొక్క సంస్థానము ప్రత్యేకముగ ఆరాజ్యాంగమును విమర్శించి, లాభకరమైనయెడల భారతసమితిలో చేరుటయు, లేనియెడల చేరకుండుటయు జరుగునట! అనగా పరిషత్తువారు కష్టపడి తయారుచేయు రాజ్యాంగము ఇతరుల ఆమోదము లేక ఆచరణలోనికి వెంటనే వచ్చుటకు బదులు బ్రిటిషువారియొక్కయు, లీగుయొక్కయు, సంస్థానములయొక్కయు అంగీకారఅనంగీకారములకు లోబడవలసిన స్థితిలో నుండును. ఇట్టి సందర్భములో పరిషత్తు సర్వస్వామ్యము (Sovereign) కలదని ఎట్లు చెప్పగలము?

ఇన్ని లోపములతో కూడుకొనియున్నను కాంగ్రెసునాయకులు ఈ రాజ్యాంగనిర్మాణపరిషత్తులో ప్రవేశించి, దేశములోని ప్రముఖుల సహాయమున ఆదర్శప్రాయమైన రాజ్యాంగమును నిర్మింప సమకట్టియున్నారు. వారి ప్రయత్నము కొనసాగినయెడల మనము ధన్యులము. కాని కొనసాగునా అను సందేహము మాత్రము విషయజ్ఞులకు కలుగకమానదు.

టిబెట్టు దేశస్థులు : వారి ఆచార వ్యవహారములు

= శ్రీ స్వామి ప్రణవానంద =

పురాణేతిహాసముల యధ్యయనమును బట్టి చూడ టిబెట్టుదేశమునకు కిన్నరఖండ మనియు, కింపురుషఖండ మనియు, త్రివిష్టప మనియు, స్వర్ణభూమి యనియు వేరువేరు నామము లున్నట్టు కనబడుచున్నది. కాని యా దేశపు భాషలో నొకప్పుడది "బోద్‌యుల్", "బోడ్", "బోత్", "టూబోత్", లేక "పో" యని పిలువబడెడిది. అటుపైని విదేశీయులచే "టూబోత్", "టూబట్" అనియు, "టేబేట్" అనియు పిలువబడి తుదకు ప్రస్తుతపు "టిబెట్" అను పేరున బరగుచున్నది. కాని సాధారణముగ టిబెట్టుదేశస్థులు వారి భాషలో "పో" అనియు, "చంగ్‌థంగ్" (ఉత్తర పీఠభూమి) అనియు పిలుతురు. హిందూదేశపు సరిహద్దువాసులగు "భోటియాలు" టిబెట్టుదేశమును "హూణదేశ"మనియు, నా దేశస్థులను హూణియా లనియు వ్యవహరింతురు.

టిబెట్టుదేశ మత్యున్నతమగు పీఠభూమి. పర్వతమయము. హిమాచ్ఛాదితమై కడు శీతలముగ నుండి తీవ్రమయిన గాలులకు తావై యున్నది. ఊషరక్షేత్రము. సేద్యయోగ్యమగు భూమి బహుస్వల్పము. టెంగ్రినారు, లాబునారు మొదలగు పెద్దపెద్ద లవణసరస్సులును, మానససరోవరము, రావణహ్రదము మొదలగు మంచినీళ్ల సరస్సులును, సింధు, బ్రహ్మపుత్ర మొదలగు గొప్ప నదులు నిక్కడ గలవు.

వనస్పతులు

కైలాసప్రాంతములలో రెండు మూడడుగుల ఎత్తు పెరుగు "డమా"పొదలు తప్ప పెద్ద చెట్లేవియు లేవు. కలప లేమిచేతనే టిబెట్టుదేశమున చాలభాగము జనులు యాక్కు ఉన్నితో నేసిన కంబళీగుడారములలో నివసింతురు.

ఈప్రాంతములలో "తుమా" యను చిన్న లత ౧౫,౦౦౦ అడుగుల యెత్తున పెరుగును. ఆశ్వయుజ మాసమున బాగుగ తయారైన దాని వేళ్లను త్రవ్వి చిన్న చిన్న ముక్కలుగ చేసి తమ బిలములలో నెలుకలు శీతకాలపు ఆహారమునకై నిలువచేసికొనును. ఒకరోజంతయు శ్రమపడి త్రవ్వినను నొక పౌను వేళ్లు లభించుట కూడ చాలకష్టము. బీదలగు గొల్లలెలుకల బిలములను వెదకి యా వేళ్లను పోగుచేయుదురు. ఈ వేరు వీర్యవర్ధకము, స్తంభనకారియు నైనది. వాజీకరణమునకు ప్రసిద్ధమైనది. ఆయుర్వేదవైద్య శాస్త్రములలో నుపయోగించు అపూర్వమగు విదారీకందను చెంచులు, కోయలును ఆహారముగ భుజించునట్లే యిచ్చటి బీదగొల్లలు కొందరు తుమా వేరును కొలదిరోజులు భోజనముగ నుపయోగింతురు. ధనవంతులు సంవత్సరాది మొదలగు విశేష సమయములందు దీని నడుకవెట్టి నెయ్యి, పటికపంచదారలు చేర్చి పిండివంటగ భుజింతురు.

జనులు - ఇండ్లు

మానసఖండములోని ప్రజలు మొత్తముమీద బలముగలవారును, పాటుపడి పనిచేయువారును. అనాగరికులు. నిత్యకృత్యములలో చాల మలినముగ నుందురు. కాని లామాలును, ఉద్యోగస్థులును చాల నాగరికులు, మర్యాదగలవారు నైయున్నారు. పదునారు మైళ్ల పొడవు గల పురంగులోయలో నితర ప్రదేశములకంటె

కొంచె ముష్ణముగ నుండుటచే ప్రజ లిండ్లు కట్టుకొని నివసింతురు. ఈ యిండ్లు తరుచు పచ్చి యిటుకలతోను, హిందూదేశపు సరిహద్దులనుండి గొంపోబడిన కొలది కలపతోను నిర్మింపబడును. అవి ఒకటిరెం డంతస్తులు గలిగి మిద్దెలవలె చేయబడును. పైకప్పుమీద తేలిక యైన కలపను, డమాపొదలను వేసి మట్టిని పూయుదురు. కలప లేమిచేతనే టిబెట్టుదేశమున నిండ్లు చాలతక్కువ. దానికి తోడు మూడువంతుల జనము యాక్కు గొఱ్ఱె మేకలను మేపుకొనియే జీవించువారగుటచేత వా రొక లోయనుండి మరియొక లోయకు తిరుగవలసి యుండును. అందువలన చాలభాగము జనులు యాక్కు ఉన్నితో నేసిన కంబళీగుడారములలోనే నివసింతురు. రెం డిండ్లున్నను గ్రామముగ పరిగణింపబడును. పురంగులోయలో కొంతమంది జనులు కొండలలోని గుహాముఖముల యందు ద్వారములనుంచి గోడలను పెట్టి ఇండ్లక్రింద చేసి కొందురు. కొన్ని గుహలు రెండుమూ డంతస్తులు కలిగియుండును.

భోజనము

అక్కడి జనులయొక్క ప్రధాన భోజనము ఎండుది, పచ్చిది, ఉడికినదియు నగు మాంసము, యవల (బార్లీ) పేలపిండి, సమృద్ధియగు పాడిదినుసులు. ఉదయమున, సాయంకాలమున యవల పేలపిండి (సత్తు), మాంసముతో నుడుకబెట్టిన జావను త్రాగుదురు. దీనిని 'థుక్పా' యందురు. హిందూదేశము నేపాళము సరిహద్దులకు సమీపమున నుండుటచే పురంగులోయలోని జనులు గోధుమరొట్టెను, వరియన్నమును తిందురు. వారు చీనా తేయాకు నెక్కువగ వాడుదురు. తేయాకును చాలసేపు మరగనిచ్చి యుప్పును, వెన్నను చేర్చి తరిచి వారివారి స్థితుల ననుసరించి రోజునకు ౩౦ మొదలు ౧౫౦ కప్పులు త్రాగుదురు. యవల పేలపిండిని టీతో కలిపి ముద్దగ జేసి తిందురు. యవల నుడుకబెట్టి దానినుండి "ఛంగు" అను ఒక విధమగు తేలికయైన సారాను తీసి పురుషులు, స్త్రీలు, సన్యాసులు, పిల్లలునుగూడ సేవింతురు. తేనీటిని, ఛంగును చిన్నచిన్న కర్రగిన్నెలతోను, లోపల వెండిరేకు వేసిన గిన్నెలతోను, చైనాకప్పులతోను, విలువగల రాతి కప్పులతోను త్రాగుదురు. పసిపిల్లలకు మొదటిమాసములోనే తల్లిపాలకు తోడుగ నాహారమును పెట్టుదురు. యవల పేలపిండి, పాలు, నెయ్యి, పంచదార వీనిని కలిపి యుడుకబెట్టి, మొదట తల్లి దానిని నోటిలో నుంచుకొని, కొద్దిగ నమిలి, దానిని చెంచాతో దీసి బిడ్డకు పెట్టును.

టిబెట్టుదేశస్థులు మాంసమునకై గొఱ్ఱెలను చంపు విధానము చిత్రముగ నుండును. వారి శాస్త్రములలో జీవజంతువుయొక్క రక్తపాతమును చేయరాదని చెప్పబడియున్నది. కనుక వారు జంతువును ముక్కును, నోరును త్రాటితో గట్టిగ గట్టి చంపుదురు.

డమా యను పొద పచ్చిదియు, ఎండుదియు గూడ నుండును. ఈపొదయు, గొఱ్ఱె పెంటికలు, మేక పెంటికలు, చమరీమృగముయొక్క పేడుపిడకలు నిక్కడ వంటచెరుకుగ నుపయోగింతురు. శీతకాలమున మంచు కరగబెట్టుకొనుటకును, పాలు మొదలగునవి కాచుకొనుటకును ఉదయము మొదలు రాత్రి పండ్రెండు గంటలవరకు నా మేకపెంటికలు మొదలగువానిచేతనే పొయ్యి మండుచుండును.

దుస్తులు

మానసఖండమంతయు సముద్రమట్టమునకు ౧౫,౦౦౦ అడుగులకు పైబడిన ఎత్తున నుండుటచే నతి శీతలముగ నుండును. అందుచే వారు పొడుగయిన డబుల్ బ్రెస్టు ఉన్ని యంగరఖాలను ధరింతురు. నడుమునకు నంగరఖాపైన కాశీకోకను కట్టుకొందురు. మోకాళ్లవరకు వచ్చు "ల్హాం" అను నున్ని చెప్పులను ధరింతురు. వీటినిధరించి దేవాలయపుగర్భాలయములోనికి గూడ పోవుదురు. శీతకాలమున వారు గొఱ్ఱెలయొక్కయు, గొఱ్ఱెపిల్లలయొక్కయు చర్మములతో చేసిన యంగరఖాలను, లాగులను ధరింతురు. స్త్రీలుకూడ నించుమించుగ పురుషులు ధరించు దుస్తులవంటివానినే ధరింతురు. కాని మన దేశమున చెంచులు ధరించు అడ్డచారలు గల బొంతవంటి ఉన్నిగుడ్డను గూడ ముందుభాగమున మెడనుండి కాళ్లవరకు ధరింతురు. వెన్నుపైన బొచ్చు పైకి ఉండునటుల మేకచర్మమును ధరింతురు. పురుషులు

ధారాళముగ నింగ్లీషు ఫెల్టు హ్యాటులను ధరింతురు. ధనవంతులు, ఉద్యోగస్థులు, లామాలు విలువగల దుస్తులను, సిల్కులను ధరింతురు.

వివాహము

ఒక స్త్రీ బహుభర్తలను గలిగియుండుట అచ్చటి యాచారము. జీవనోపాధికి చాల కష్టముగ నుండుట వలన నార్థికసమస్యానివారణార్థ మేర్పరుపబడిన నియమ మిది. కుటుంబములోని సోదరులలో పెద్దవాడు వివాహము చేసికొనును. అతని భార్యయే మిగిలిన సోదరులకుగూడ భార్య యగును. ఇట్టి వివాహములయం దట్టి కుటుంబకలహములు లేకుండ శాంతముగ కాలక్షేపము చేయుదురు. సోదరులందరకు భార్య యొక్కతెయే యైనను కుటుంబపు ఆస్తియొక్క హక్కు అంతయు పెద్దవానిదే. అందుచే టిబెట్టుదేశమున కొన్ని శతాబ్దములక్రింద నెన్నియిండ్లు, కుటుంబములు కలవో నేడును నన్నియే కలవు. ఇచ్చట వివాహము ప్రౌఢులగు వధూవరుల యనుమతిపై జరుగును. వరు డొక కర్రజాడీతో "ఛంగును" (యవలసారా) తీసికొని, వధువుఇంటికుమ్మమున బెట్టును. దానిపై గౌరవార్థము "ఖతకు"గుడ్డను బెట్టును. వధువుగాని, వధువుబంధువులుగాని "ఛంగు" పాత్రను స్వీకరించువరకు వరుడు వధువు ఇంటిలోని బంధుజనుల కందరకు వారి దేశాచారానుసారముగ నాలుకను బయటకు పొడవుగ దీసి యభినందనము చేయవలెను. పాత్రను వధూబంధువులు తీసికొనినచో వివాహమున కంగీకారమునిచ్చిన ట్లెంచబడి వివాహసన్నాహము చేయుదురు. వధూవరుల సంపద ననుసరించి విందులు మొదలగునవి జరుగును. నాలుగైదురోజుల తరువాత వరుడు వధువును ఇంటికి దీసికొని పోవును. మూడురోజులవరకు నా "ఛంగు" పాత్రను వధువుబంధువులు గ్రహింపనిచో వివాహము కుదురదని వరుడు తిరిగి పోవును.

సన్యాసులు, సన్యాసినులును ముండనము చేసికొని యొకవిధమగు ఊదారంగు అంగరఖాను ధరింతురు. గృహస్థులు-పురుషులు, స్త్రీలుకూడ జడవేసికొందురు. స్త్రీలు జుట్టును చాల జడలుగ నల్లుకొందురు. ఫీరోజా, పగడము మొదలగు పూసలదండలను వేసికొందురు. చేతులకు బరువగు శంఖములను ధరింతురు. చెవులకు బంగారపు రింగులను పెట్టుకొందురు.

స్త్రీలు సంఘమున పురుషులతోపాటు సమానమయిన స్వాతంత్ర్యమును కలిగియుందురు.

నమస్కారపద్ధతి

ఎవరికయిన గౌరవమును చూపుటకుగాని, నమస్కారము చేయుటకుగాని టిబెట్టుదేశస్థులు రెండు చేతులను జోడించి కొంచెము వంగి నాలుకను పూర్తిగ బయటికి దీసి "ఖుంజంభో" అనియు, "లా" అనియు నందురు. సాధారణముగ నాచార్యకోటిసన్యాసులు (లామాలు) ఆశీర్వదించువిధానము వచ్చువారియొక్క హెచ్చుతగ్గుల ననుసరించి మారుచుండును. ఆశీర్వాదమును పొందు వ్యక్తిగూడ గొప్ప సన్యాసియే యైనచో నొకరితల నొకరు దగ్గరకు తీసికొని వచ్చి స్పృశింతురు. తా నెక్కువ ప్రేమించువాడయినను, ఎక్కువ అనుగ్రహము చూపవలసినవాడయినను రెండుచేతుల నాతని శిరస్సుపై నుంచును. ఇతరుల విషయములో నొక చేతితోగాని, రెండువేళ్లతోగాని, ఒక వేలుతోగాని యాశీర్వదించును. సాధారణజనులను కర్ర కొక రంగు గుడ్డను గట్టి దానితో వారి నాశీర్వదించును. ఆశీర్వాదమును పొందువానిలోని కాశీర్వదించువాడే యొక శక్తిని ప్రవేశింపజేయుటకుగాను వారిద్దరికిని మధ్య స్పర్శ యుండుటయే యీ యాశీర్వాద విధానము లన్నిటిలో ముఖ్యోద్దేశము.

టిబెట్టుదేశస్థులు ఏ వస్తువునైన నెవ్వరికైన శాశ్వతముగ నీయవలెవచ్చినపుడు, "కైలాసము పైనున్న మంచు కరగనంతవరకును, మానససరోవరములోని నీరింకనంతవరకును ఇయ్యబడిన"దని చెప్పుదురు.

దహన సంస్కారము

సంపన్నులగు సన్యాసుల శవములను దహనము చేయుదురు. బీదసన్యాసులయొక్కయు, గృహస్థుల యొక్కయు శవములను సమీపమున నది యున్నచో దానిలో పారవైతురు; లేదా ముక్కలుగ నరికి రాబందులకైన వేయుదురు. జాతకక్రియలును, నంత్యక్రియలును చాలవరకు హిందూ ఆచారములను బోలియుండును. అవి వ్యక్తియొక్క సంపద ననుసరించి న్యూనాధికములుగ నుండును. శరీరమును దహనము చేసిన తరువాత నా భస్మమును మట్టితో కలిపి లింగముగ జేసి "ఛోర్తేను" అని పిలువబడు సమాధులలో పెట్టుదురు. ఈ ఛోర్తేను హిందూదేశపు "స్తూపము"నకు సరియయినది.



అలాస్కా దుప్పులు

కిరీటి

[కథ]

❀

– శ్రీ కడారు పోలుగురవాచార్య –

[గతసంచిక తరువాయి]

కిరీటిమనస్సు కిదంతా అయోమయంగా, అగాథంగా ఉంది. “చిన్ననాడు కలిసీ మెలిసీ తిరుగుతూ అన్యోన్య హృదయులం అనుకున్న ఆత్మల్ని ఇలా వేరుపరచడంలో తల్లి ఉద్దేశ్యం ఏమిటో?...ఆమె అయినా ఇంత క్రితమెన్నడూ ఇలా. అనిఉండలేదే!...” అని కిరీటిమనస్సు పరిపరివిధాల పరుగులుతీస్తోంది. “ఆహా!...యౌవనం అనే ఒక నూతనరూపం వచ్చి స్వేచ్ఛగా మాట్లాడుకోవద్దనికూడా మమ్మల్నే అటకాయిస్తోందిగదా” అన్న ఊహాప్రపంచంలో పర్యటనం చేయసాగింది కిరీటిమనస్సు!

అతని మనస్సులో తలదాచుకున్న సందేహం తిరిగి ఒక్కసారి విజృంభించి, తలెత్తి చూసింది. దానితో కిరీటిమనస్సు కంపించిపోయింది.

ఈ చికాకుతో “రామూ! చాల్లే ఇక ఆట. ఆ కరకట్టకేసి పోయివద్దామా?” అంటూ చివ్వున లేచి నిలబడ్డాడు.

“చూశావా! నువ్వే ఓడిపోయావు. బదిలీ తీర్పటమే కాదు; పైగా నువ్వు నాకే బాకీపడ్డావు.” అని పకపకా నవ్వుతూ, చప్పట్లు కొట్టుకుంటూ లేచి పోయాడు రామూ.

ఆమాటలూ, ఆనవ్వూ కిరీటిచెవిని పడి ఉండవు. అథవా వినబడినా ఆ ఆలోచనాసముద్రంలో అతని కేరింత లెక్కడ మునిగిపోయినవో!

బావమరదు లిద్దరూ కలిసి వాహ్యాళికి పోతాంటే, రాఘవమ్మ కొడుకుని వెనక్కి పిలిచింది. కొంతటికి ఇద్దరూ కలిసి వెళ్లిపోయారు.

౨

కరకట్టమీద నడుస్తోన్నప్పుడు రామూ కిరీటితో వనజవివాహప్రస్తావన తెచ్చాడు.

“ఆఁ! ఇప్పుడు నా పెళ్లికేంతే రామూ? ఇంకా ఎక్కడ? చదువు పూర్తికావాలిగా!” అనేశాడుకిరీటి.

“మరి వనజను ఇంకా ఎన్నాళ్లని పెండ్లిచేయక చదివిస్తోంటాం? సంబంధాలుకూడా వస్తోనే ఉన్నై. ఏదో నీ కివ్వాలనికూడా అనుకున్నారుగా మరి! అందుకని, నీ సంగతికూడా తేలిపోతే, ఏదోఒక సంబంధాన్ని ఖాయపర్చుకోవాలనే చూస్తోన్నాం...” అన్నాడు రామూ.

కిరీటి కొంతసేపటివరకూ ఏజవాబూ ఇవ్వలేదు. అలానే ఇద్దరూ ఆలోచనలతోనే ఒకరివెనకా లొకరు కొంతసేపు అడుగుల్లో అడుగులు వేసుకుంటూ నడిచారు. దూరంనుంచి హోరు వినబడుతోంది. రొద గాలి వీస్తోంది...నీటిఅలలు వయ్యారంగా, జలజలా పడగెత్తి ప్రాకుతోన్న త్రాచుల్లాగ ఒడ్డుకు వస్తూ, తపతప కొట్టుకుంటూన్నై. అండలండలుగా మట్టిపెళ్లలు..ఒడ్డుకొరగి మధ్యమధ్య ధబేలుమని నీటిలో పడుతూన్న శబ్దం ఆ ప్రశాంతతలో వినబడుతూనే ఉంది.

“నేనూ అదే ఆలోచిస్తోన్నాను.” అన్నాడు కిరీటి కొంతదూరం పోయాక.

“అదే అంటే?” అని తిరిగి ప్రశ్నించాడు, వెనకాలనే నడుస్తూన్న రామూ. కాని జవాబు రాలేదు.

తిరిగి అదే ప్రశ్న ప్రశ్నించాడు రామూ. కాని ఆ మాటలు గాలిహోరులో కిరీటికి వినబడినవో లేదో మరి! జవాబుమాత్రం ఈసారీ లేదు. తిరిగి రామూ ప్రశ్నించనూలేదు.

* * * *

ఆనాటి రాత్రి భోజనాలముందు, "వనజలక్ష్మికి మంచి మనువే వచ్చిం"దని ఉద్దండయ్య వడ్డిస్తూన్న భార్యముఖంకేసి చూస్తూ అన్నాడు.

"ఎప్పుడూ"అని భోంచేస్తూన్న కిరీటి పొలమారుతూ అన్నాడు.

"ఆఁ...ఇవ్వాళనే...కోర్టుదగ్గర రంగయ్యగారని—ఇప్పుడు బెజవాడలోనే ఉంటూన్నారులే!—కనబడి, వనజను చూడటానికి వారంపదిరోజుల్లో వస్తామన్నారు...సరే వస్తే వస్తారనుకో! దానికేంగానీ?—శాపయ్య వారికి కబురుపెట్టాడట! విన్నావా?" అంటూ భార్యమొఖంకేసి చూస్తూ కాసేపు ఊరుకున్నాడు. "దానిమీదటనే; ఆయన ఇవ్వాళ తారసిల్లి యీప్రస్తావన తెచ్చాడు."

"ఎప్పుడు కబురంపేడంటారు? మనకు తెలియనేతెలియదే!"అని ఆశ్చర్యపోతూ అంది.

"మన కెలా తెలుస్తుందీ?...అ దెప్పుడు కబురుపెట్టాడో ఏమో మరి! మీఅన్నయ్య అంటే సామాన్యుడా?" అన్నాడు.

తల్లీకొడుకు లిద్దరూ ముఖముఖాలు చూచుకున్నారు.

"ఆ కుర్రాడు యమ్. బి., బి. యస్. నాల్గేళ్ల నుంచీ చదువుకున్నాడట. మరోరెండేళ్లు చదవాలట!...మంచి స్థితిమంతులు...పెద్ద మొఖాసాకూడా ఉందని చెప్పుకుంటూ ఉంటా"రని చెప్తూ మంచినీళ్లు త్రాగుతూ ఊరుకున్నాడు.

"అయితే ఇంకేం?...లక్ష్మి అదృష్టవంతురాలే"అని కళ్లు తేలేసింది కృష్ణవేణమ్మ.

"ఆఁ, ఆఁ, దానికేం?...లక్షాధికారిణి అవుతుంది"అని ఉద్దండయ్య అంటూనే మధ్యలోనే ఆగిపోయి, "అవునుగాని, వాళ్లు పెద్దపెద్ద సంబంధాలు చేసుకోవాలని తాపత్రయపడుతూంటే—కిరీటి కిమ్మని మన మెలా అడుగుతాం.?" అన్నాడు.

"అడగడాని కేం ఉంది? వాళ్లూ, మనమూ అనుకుంటూన్న విషయమేగదూ"అంది భార్య.

"ఎంత మనమూ మనమూ అనుకున్నా వాళ్లకు మన కివ్వాలనే ఉంటే ఇతరత్రా ఇలా ఎందుకు ప్రాకులాడుతోంటారు?...పోనీ, మనమే అడుగుతా మనుకో! వాళ్లు మనమాట నిలుపుతారనే నమ్మకం నాకుమాత్రం లేదు..."అని ఖచ్చితంగా అన్నాడు ఉద్దండయ్య.

"అంతే నంటారా?"అని తిరిగి అంటూ భర్త ముఖంకేసి చూస్తూ ఉండిపోయింది.

"అయినా పెద్దఎత్తుల్లో పరుగులు తీయాలని చూస్తూన్న వాళ్లు కర్మంచాలక మనకిచ్చినా వాళ్ల కోరికలను మనం నిభాయించుకోగల మంటావా?...... కాకపోయినా వారికి పెద్దపెద్ద కోరిక లున్నప్పుడు మన మడ్డుపడటం ఏమంత భావ్యం? పైగా మన కేమంత గ్రహచారం? అడిగి కాదనిపించుకోవటం! ఒకవేళ వాళ్లంతట వాళ్లే మనల్ని అడిగినా అది నిష్ఠూరం లేకుండా తప్పించుకోవాలనే ప్రయత్నమేగాని రూఢయిన మాట కాదు. అలాంటప్పుడు మనం ఉపేక్షించటమే శ్రేయస్కరం" అని తొణక్కుండా, నిశ్చితాభిప్రాయాన్ని తేల్చేశాడు. ఈ మాటలన్నీ వింటూన్న కిరీటికి తండ్రిమాటలే నిజమేమో అనిపించింది. కాని మనస్సు ఆలోచనలతో బరువెక్కిపోయింది. గబగబా నాలుగు ముద్దల్లో అన్నమంతా మింగేసి లేచి వెళ్లిపోయాడు. ఆవాళనుంచీ కిరీటిహృదయసాగరంలో చిన్న తుఫాను చెలరేగింది.

* * * *

ఆ మర్నాడు మామూలుగా ఉదయంపూట శాపయ్యగారింట్లోకి కిరీటి వెళ్లాడు. అప్పుడే వనజ త్యాగరాజకృతొకటి వీణమీద పాఠం చేసుకుంటోంది. ఆమెముఖారవిందం ఎప్పటిలాగా కళకళ్లాడుతూ కిరీటి నాహ్వానించింది. అత ననుకున్నట్టు ఆమెలో ఎంతో మార్పు కనబడాల్సింది. కాని మామూలుగానే

ఉండటం చూస్తే మొదట్లో అతనికి ఆశ్చర్యం కలిగింది. దివాకరు వనజకూడా ఎప్పటిలాగా ఎంతో చనువుగా మాట్లాడింది... కాని ఆ చెల్లెలిమాటల్లో కొంతంత మార్పు కలిగింది.

"ఏం, కిరీట్! లక్ష్మికి కొక సంబంధం వచ్చిందని అన్నయ్యగారు చెప్పాడా!" అని కిరీటిని అడిగింది రాఘవమ్మ.

"ఏం సంబంధం!" అన్నాడు ముభావంగా.

ఉద్దండయ్యగారు యీవిషయం చెప్పటం మరిచి పోయాడేమోనని అన్నిసంగతులూ చెప్పింది రాఘవమ్మ కిరీటితో. చెప్తూ చెప్తూ "వాళ్లకు ఇరవై ఎకరాల కట్నంమీద చూపు ఉన్నట్టు మీ మామయ్య చెప్తున్నారు. మన కాసంబంధమే కావాలన్న పద్ధతిలో ఇచ్చిక మరి తప్పుతుందా! చెప్పు మరి!" అని తనకు తెలిసిన క్రొత్త విషయంగూర్చి మాట్లాడుతూ ఉంటే, కిరీటి తలవూపుతూ అన్యమనస్కంగా వింటూన్న వాడల్లా "ఔను. అదీ నిజమే!...కట్నాలు చూచుకుని తగ్గితే పను లెలా అవుతాయి!" అన్నాడు గొంతు సంబాళించుకుంటూ.

"అదే నేనూ అనుకుంటూన్నా! ఏదో ఖర్చితం చేసుకుంటే తప్ప వైశాఖంలోనే రామూ, వనజల పెళ్లిళ్లు సరిచేర్చుకోవాలని ఉంది. పిల్లడు ఆ మూడు ముళ్లూగనక కొస్తే పడిపోతే, ఇంతలో ఇక పెళ్లిళ్ల పెరువ ఉండదు మాకు. ఒక గట్టున పడినవాళ్లం మాతాం. ఇక ఎప్పటికో గదా విజయపెళ్లి! అప్పటి కెవ రెలా ఉంటారో తా మెవరో!" అంది.

కిరీటి వెళ్లిపోవటానికని లేచాడు. "తొందరగా తేలిపోతే తీరిపోతుంది నాయనా! వనజను నీకివ్వాలనే అనుకోవటం అయిందిగా మరి. ఎవరైనా నీ తర్వాత నేగా!" అని తిరిగి అంది.

"వస్తా వత్తయ్యా" అని చెప్తూనూ వెళ్లిపోతూన్నాడు. "ఎందుకొచ్చిన పేచీకమాట లివి! మీ అంతర్యం తెలియనంతటి పిచ్చివాడు మాత్రం కాడు యీ కిరీటి" అన్నట్లు అంత విచారంలోనూ నవ్వుచాయలు కనబడ్డా యాతని ముఖంలో. కిరీటి గుమ్మం దాటి పోతూ ఉంటే "అమ్మ కొకసారి రమ్మన్నానని చెప్పు తావు గదూ!" అని వెనక్కి కేకేసి చెప్పింది. 'అలాగే' అన్నట్టు తల తిప్పుకుంటూ గుమ్మం దాటిపోయాడు కిరీటి.

* * * *

తాను తలపెట్టిన పని క్షేమంగామీద జరిగిపోయేటంతవరకూ నిద్రపట్టని స్వభావం రాఘవమ్మది. కూతురు మనువుగురించి చిన్నదగ్గరనుంచీ ఆమె కదే ధ్యాస. అసలు రాఘవమ్మ ప్రోద్బలంవల్లనే రంగయ్యగారితో సంబంధం కలుపుకోవాలని కబురుపెట్టాడు రామ బాపయ్య. రంగయ్యగార్ని మరోసారి కల్సుకుని మాట్లాడి రావటం ఎందుకైనా మంచిదని, ఒకరోజు తెల్లవారు ఝామున తొలికోడి కూయగానే లేచి, ప్రయాణ సన్నాహాల్లో ఉన్నాడు.

నూతిపళ్లెంలో బాపయ్య స్నానం చేస్తోంటే తుండుగుడ్డ నూతి గట్టుమీద వేస్తూ, "ఏమోగాని, నిన్నటినుంచి కిరీటిముఖం అదోమాదిరిగా ఉంది" అంది రాఘవమ్మ.

"ఐతే ఏమంటావు" అన్నాడు బాపయ్య.

"ఆఁ, అనటాని కేముందీ!......చిన్నబుచ్చుకుని ఉన్నాడు పాపం. ఎందుచేతనో మరి"

"చిన్నబుచ్చుకుని ఉన్నాడని నిక్షేపంలాంటి సంబంధాన్ని తన్నుకుని పిల్ల చేతుల్లో పెట్టమన్నావా!" అన్నాడు తీక్ష్ణంగా చూస్తూ.

"అదే నేనూ అనుకుంటూన్నా" అని అంది.

"కాకపోతే—ఆ సంబంధం ఎక్కడ, ఇది ఎక్కడ!—కుర్రాడా! డాక్టరు పరీక్ష గనక ఇచ్చాడా, వేలకు వేలే సంపాదన! మనం చూస్తూనే ఉన్నాంగా! ఆ చంద్రశేఖరం ఎలా మేడలమీద మేడలు కొంటూఉంటాడ! ఇక రంగం అంటావా!... జమీందారీ పోయినా; జమీందార్లతో చేతులు చేతులూ కలిపిన బాంధవ్యాల్లున్న వాళ్లవి. వారిమట్టుకు వారు పెద్ద మొఖాసాదార్లు గదా! అలాంటివాళ్ల చేతుల్లో పెట్టక, నే నెంత పిచ్చివాణ్ణే అయినా, వేడనికంగా అని పిల్ల నిస్తావా ఏమి!" అన్నాడు గాంభీర్యంగా.

"ఔను, అదీ నిజమే మరి! ఎలాగైనా సరే పట్టుపట్టి అలాంటి సంబంధమే చెయ్యాలి. ఇచ్చినా పుచ్చుకున్నా అలాంటిదే అందమూ, చందమూను ... ఎంత మేనరికం అయితే మాత్రం — దానికూడా ఉత్తమం, మధ్యమమూ లేదూ? ఊళ్లో చుట్టరికం ఊసుపోకపోతే చెయ్యమన్నట్టు ... ఎందుకొచ్చిన రంభా రావళ్లు ఇవి" అంది.

"వీగాక మాత్రం ఉద్దండయ్యగారి మాటలకు మెత్తబడేరు" అని హెచ్చరిక చేసింది రాఘవమ్మ. దానికి జవాబన్నట్టు ఫక్కున నవ్వుతూనే ఇంట్లోకి వెళ్లిపోయాడు బాపయ్య. "ఆ మాత్రం నాకు తెలియదు టే పిచ్చిదానా?" అన్న భావాన్ని వెల్లడి పరుచుకుం దానవ్వు.

3

రాజబాపయ్యగారింట్లో జరుగుతూన్న రాద్ధాంత సిద్ధాంతాలన్నీ కిరీటికి ఎప్పటి కప్పుడు తెలుస్తూనే ఉన్నై. వాళ్ల దృఢసంకల్పంకూడా కర్ణాకర్ణికగా తెలిసింది. వనజ పూర్వంలాగ ఇప్పుడు తరుచుగా కనబడటం లేదు. ఎప్పుడైనా కనబడినా వనజ ఎప్పటి మాదిరిగా ప్రశాంతంగా ఉండటం చూస్తోంటే తన కున్నంత జిజ్ఞాసా, తా ననుభవిస్తోన్నంత ఆందోళనా ఆమెకు లేవేమోనని వితర్కించుకుంటూ ఉండేవాడు. "తన మాదిరీబాధ వనజకు లేకపోవటం ఒకవిధంగా చూస్తే కోరుకోతగ్గదే!" అన్న ఆలోచనలు కలుగుతూ ఉండేవి. ఒక నాటి రాత్రంతా ఈ ఆలోచనలతోనే తెల్లవారిపోయింది. — వేసంగి శెలవలు మరో నెలరోజుల కిస్తారనగా ఎప్పుడు శెలవలిస్తారా, ఎప్పుడు వనజను కలుసుకుంటానా అని రోజులు లెక్కపెట్టుకుంటూ ఉండేవాడు. ఒక్కొక్కసారి అయితే తగని చికాకుగాకూడా ఉంటూ ఉండేది. శెలవలు దగ్గరపడుతూన్న కొద్దీ ఆత్రతకూడా ఎక్కువౌతూ ఉండేది ... ప్రాణకంటకంగా ఉన్నట్టు బాధపడుతూ ఉండేవాడు.........తిరిగి తన మనస్సు నిలా సమాధానపరచుకుంటూ ఉండేవాడు: "ఏనా ఏమికష్టపడినా యీ పదిహేను రోజులేగా ... యీ వారం రోజులేగా ... ఈ కాస్త ఓపికగనక పడితే, ఆతర్వాత, అబ్బ!, సరిగ్గా మూణ్ణెల్లు మా ఊర్లో కాలక్షేపం చేయవచ్చు. మళ్లీ వనజను చూడవచ్చు" నన్నే ఆశనే పురస్కరించుకుని ఉల్లాసపూరితు డవుతూ ఉండేవాడు. శెలవ లివ్వగానే ఇంటి కొచ్చి వాలేడు. కొండంత అభిలాషతో ఇంటికొచ్చాడు. కాని, విధి వేరే త్రోవను నడవమని శాసించింది. "వనజ తన దిక ఎలా అవుతుంది?" అనే సందేహమే దృఢపడిపోయింది. ఇదివరలో అతనికి సందేహమే అప్పుడప్పుడూ కలుగుతూ ఉండేది. కాని — ఇప్పుడతనికి అహర్నిశలూ ఇదే చింత. అతని అంతరాత్మ కాభావం స్థిరపడింది. ఏ పుస్తకం తీసి చూసినా, ఏ పని చేయబోయినా ఇవే సంగతులు కళ్లముందు దొర్లుతూ ఉండేవి. ఇవే స్మృతిపథానికి వస్తోండేవి.

కొన్నాళ్లపాటు ఎక్కడికన్నా వెళ్లితేగాని, నలుగురిలోనూ ఉల్లాసంగా తిరుగుతూ ఉంటేగాని మరుపు కలగదనీ, రోజులు గడపటం దుర్లభమనీ అప్పుడప్పుడూ కిరీటి తనలో గొణుక్కుంటూ ఉండేవాడు.

ఇలానే రెండు రాత్రులూ, రెండు పగళ్లూ గడచినై. ఒకనాటి ప్రాతఃకాలమే లేచి చటచటా బాపయ్యగారింటి ముందునుంచి పోతూ పోతూ ముందు వాకిలిలో ముగ్గులు పెట్టుతోన్న వనజను చూసి, గుమ్మంలో అడుగుపెట్టాడు.

"నే వెళ్తున్నాను" అని వనజ నుద్దేశించి అన్నాడు. వంగి ముగ్గులుపెట్టుతూన్న వనజ తల పైకెత్తి చూసింది. కిరీటినీ, అతని దుస్తుల్నీ చూడగానే చకితురాలై అతని కేసి చూస్తూనే నిలబడిపోయింది. అతనూ ఒక్కక్షణం అలానే వనజముఖంలోకి చూస్తూనే "నే వెళ్తున్నాను." అన్నాడు తిరిగి. ఎక్కడికని వాదను అడగాలనుకుందిగాని గొంతు పెగిలిరాందే! ఇంతలో తండ్రి రావటం చూసి తిరిగి తన పని తాను చూసుకుంటూంది.

"ఏం, కిరీటీ! ఇంత ప్రొద్దున్నే ఎక్కడికోయ్ బయలుదేరావ్" అని పలకరించాడు బాపయ్య, అరుగుమీద మూరులోవున్న కిర్రుచెప్పులను క్రింద వేసి తొడుక్కుంటూ.

"ఊరికి కెళుతూన్నా మామయ్యా" అన్నాడు.

"ఏ ఊరికోయ్! ఏం కథ?........సెలవల కొచ్చావ్ కామాలుగా?" అన్నాడు, కాలుస్తూన్న చుట్టనుసి చిటికెన వేలితో రాల్చుతూ.

"ఆఁ, ఏం లేదు ... మా కాలేజి కుర్రాళ్లందరూ నాగార్జునకొండకు చూడాలని పోతూన్నారు ... వాళ్లని గుంటూరులో కలుసు కుందామని."

"సరే - వెళ్లిరా - బండివేళకూడా కావస్తోంది." అంటూనే బాపయ్య గుమ్మం దాటిపోయాడు.

కిరీటి మరోసారి వనజదీనవదనంలోకి చూస్తూనే ముందుకి కదిలివెళ్లిపోయాడు. "అప్పుడే వెళ్లిపోతున్నావేం బావా?"అన్నట్లు ఆమెముఖభావా లతి దీనంగా ప్రాధేయపడుతూఉన్నట్టునై౨. "మరేం చేసేది వనజా?"అన్న ప్రశ్నతో మనస్సును సమాధాన పరుచుకుని ఆలోచనాన్యగ్నుడై కరకట్టకేసి కిరీటి వెళ్లిపోయాడు. అతనికేసి చూస్తూనే ఆమె విస్తుపోయి నిలబడిపోయింది. అతను కనుచూపుమేర దాటిపోయే సరికి, కలతచెందిన హృదయభారంతో ముందుకు వాలిపోయి, ముగ్గు పూర్తిచేస్తోంది వనజ. కాని ముగ్గంతా తప్పుతూనేఉంది. మళ్లీమళ్లీ కన్నీటిచుక్క లా రంగవల్లికల్లో బొటబొటా రాలుతూనేఉన్నై౨. తప్పుతోన్న ముగ్గును చెరుపుతూనే ముగ్గు పూర్తిచే౯ంది. కాని కుంకుపులతో పూర్తిచేసిన ఆ ముగ్గు అందంగా ఉండ మంటే ఎలా ఉంటుంది?...దిగజారిన హృదయ భారంతో, తొట్రుపడుతూన్న కాళ్లతో వనజ ఇంట్లోకి చేరుకుంది.

౪

కిరీటి నాగార్జునకొండకు చేరుకున్నాడన్న మాటేగాని, అతని మనస్సు మనస్సులో లేదు. తోటి స్నేహితులతోపాటు తింటూ, తిరుగుతూ ఉన్నాడన్న మాటేగాని మనస్సంతా ఇంటికేసే పరుగులుతీస్తోంది.

ఆ నాగార్జునకొండమీద శాలివాహనుల కాలం నాటి బౌద్ధచైత్యాలనూ, స్తూపనిర్మాణాలనూ, నాగార్జునాచార్యుని శిల్పనైపుణ్యాలనూ చూస్తూ, ఆంధ్ర సామ్రాజ్యజీర్ణవైభవాన్నీ, ఔన్నత్యాన్నీ, రెండువేల సంవత్సరాల క్రితం గతించిన గాథలనూ స్మరించుకుంటూ నలుదిక్కులా తిరిగి చూస్తోన్నారు. కిరీటి అందరితోపాటు తానూ చూస్తూ, తిరుగుతూ, వింటూ ఉన్నాడు. అందరూ చూస్తోంటే తానూ చూస్తున్నాడు; చెప్పుకుంటూన్న సంగతుల్ని వింటూన్నాడు. అంతేగాని, చూసినది జ్ఞాపకమూఉండటం లేదు; విన్నది గుర్తూఉండటం లేదు. మధ్యమధ్య పరధ్యానంగా చిరస్మరణీయమైన స్తూపాల్ని చూస్తూనే నిలబడిపోతూన్నాడు. అందరికీ పదాతిసైన్యాలూ, అశ్వదళాలూ కనబడుతూన్న స్తూపాలమీద కిరీటికి తన గ్రామం, తన ఇల్లు, తనవనజా కనపడుతూఉన్నై. తోటివారందరూ ఒకందుకు నిట్టూర్పుతూ ఉన్నారు; తానూ మరొకందుకు నిట్టూర్పుతూఉన్నాడు.

ఒకొక్కసారి ... "ఎక్కడికైనా పారిపోతే బాగుండును..."అని రకరకాలుగా కొందరు మన శ్శాంతి లేని సమయాల్లో విసుక్కుంటూఉంటారు. ఏమిటో! వారి ప్రాణం విసిగిపోయి అలా అనుకుంటూ ఉంటారుగాని, నిజంగా ఆలోచిస్తే, వారి మానసిక వ్యథ ఎలా తప్పుతుందీ?...కిరీటికూడా సరిగ్గా ఇలా అశ్రాంతపడే ఇంటినుంచి పరుగెత్తుకొచ్చాడు. కాని అతనికి మనశ్శాంతి ఎక్కడిదీ? నలుగురితో తిరిగైనా మరచిపోతా ననుకున్నాడు. చివర కదీ లేక మన స్సంతా చికాకుగా ఉంటూంది—ఇన్నాళ్లనుంచీ వనజ తన దనుకుని సుఖస్వప్నాలు కంటూ, మహోత్కృష్టమైన లక్ష్యాలతో జీవితాన్ని నింపుకుంటూ, సుఖాంతమైన జీవితయాత్ర చెయ్యాలనే సంకల్పంతో ఉవ్విళ్లూరుతూ ఉండేవాడు. ఇక వనజ పరాయివాళ్ల చేతుల్లోకి పోతోందని తలుచుకుంటూఉంటే రక్తం ఉడికిపోతోంది. "తాను కట్టుకున్న మేడలన్నీ పట్టి గాలిమేడలై కూలిపోతోంటే చూస్తూ ఊరుకోవట మేనా కర్తవ్యం?..." అన్న జిజ్ఞాసలో తగులొక్కని ఇదమిత్థమని తెగించి చెప్పలేక కిరీటి బాధపడ్డాడు. ఇక్కడికు వచ్చినా అవే తలపులు తలలో తిరుగుతూ ఉన్నై. తలపులతో మనస్సుకూడా ఉద్రేకపడుతోంది.

"ఇలా అవటానికి వీల్లేదు. ఏది ఎలా పరిణమించినాసరే, తన మనోభిలాషను బయటపెట్టాల్సిందే! మనస్సులోని మాట మనస్సులోనే మ్రగ్గిపోతే ఏం ప్రయోజనం? ఇది నన్ను నేను మోసపుచ్చుకోవటం కాదూ? నాశ్లేలితో నాకంటినే పొడుచుకోవటం అంటే ఇంతకన్నా వేరె మరొక దారుణం ఉంటుందా?" అన్న ఉద్రేకంతోనే పదవ నాటికల్లా, ఊరూరూ తిరిగి ఇంటికొచ్చి పడ్డాడు! ఈ పది రోజులనుంచీ శైలసంస్కారం బొత్తిగా లేక జుట్టంతా

లేగిపోయి, పీచులా ఉంది. ధూళిధూసరితమైన జుట్టూ, ఎడతెగని తలంపులతో, ప్రయాణబడలికతో లోనికి తోడుకుపోయిన కళ్లూ, నల్లబడిన అతని ముఖమూ చూస్తుంటే పిచ్చివాడిలాగా కనిపిస్తున్నాడు.

౫

కిరీటి ఊరెళ్లిన నాల్గయిదురోజుల్లోనే ఒకనాటి సాయంత్రం పూట స్వయంగా పెళ్లికొడుకూ, అతని తల్లీ వచ్చి వనజను చూసి వెళ్లిపోయారు. ఈ వరుడు కాస్త షోకుపురుషుడే! సూటూ, బూటూ వేసుకుని వయ్యారంగా చటచట నడుస్తూఉండేవాడు. విలాసంగా చేతిరుమాలుతో చిరుచెమటను మాటిమాటికీ తుడుచుకుంటూ మాట్లాడుతూ ఉండేవాడు.

ప్రధానంచేసుకోవటానికి తాము వారం పది రోజుల్లో రాగలమనీ, ఒకసారి బాపయ్యగారొచ్చి మాట్లాడివెళ్లవలసిందనీ వారెళ్లిన మర్నాడే ఉత్తరం వ్రాయించారు.

రంగయ్యగారు వనజను చూసిపోయినా, ఇంతలోనే ఇలా పరిణమిస్తుందనీ, వ్యవహారం ఇలా బిగిసిపోతుందనీ ఎవ్వరూ అనుకోలేదు. ఆ ధీమాతోనే కృష్ణవేణమ్మగాని, మరొకరుగాని ఉపేక్షించడానికి హేతువైంది.

రంగయ్యగారేగనక తమ సంబంధాన్ని స్థిరపరచుకోవటం అంటూ ఒకటి రూఢిపడినప్పుడే, ముఖాముఖీ ఉద్దండయ్యగారితోనే సంప్రదించి, నెమ్మదిమీద స్వస్తివాక్యాలు అల్లవచ్చుననుకునీ, దాని కింకా చాలా నిర్ణీతకాలం ఉందనీ ఉద్దేశపడే రాజబాపయ్య కూడా ఇంతవరకూ ఉదాసీనత వహించాడు.

ఎవరి మనస్సులలోని ఉద్దేశ్యాలు వారిలోనే ఉండిపోయినై. పైకయితే తేల్చి అడగలేదుగాని, రాఘవమ్మమాత్రం యీ విషయాన్ని తన ధోరణిలో అప్పుడప్పుడూ ధ్వనింపజేస్తూనే వచ్చింది. ఈ కార్య సానుకూల్యానికి ఇంకా కాలవ్యవధి ఎంతో ఉందనీ, ప్రస్తుతం తొందరపడవలసిన అవసరం అంతగా లేదనీ, ఆ తరుణం వచ్చినప్పుడే ఆలోచించుకోవచ్చుననీ ఎవరి మట్టుకు వారు తటస్థంగా ఊరుకున్నారు......ఒక విధంగా—కేవలం ఊరుకున్నారూ అనలేం. కాని—. ఇంత త్వరలో ఇలా తమ ఉద్దేశ్యాల నన్నింటినీ తలక్రిందులు చేసేస్తూ, రంగయ్యగారు ప్రధానం చేసుకోవటానికి ఇంత స్వల్పకాలంలోనే తూగుతారని ఎవరూ అనుకోనైనా అనుకోలేదు.

ఉన్నట్టుండి యీ పదిరోజుల్లో జరిగిన పరిణామానికే బాపయ్య ఆశ్చర్యపడుతూ, వారు ప్రధానం చేసుకునేటందుకు సమ్మతిని తెలిపేసరికి ఉబ్బితబ్బిబ్బైపోయి, ప్రక్క తిప్పుకోలేక పోయాడు. పూర్వం అనుకున్న మాటలనైనా గుర్తుకుతెచ్చుకుని చివరకు లాంఛన పూర్వకంగానైనా, ఉద్దండయ్యకూ తనకూ ఉన్న ఆంతరంగిక స్నేహాన్నయినా పురస్కరించుకుని వ్యవహరించవలసినవాడైకూడా ప్రధానం చేసుకోవటం వరకూ వ్యవహారం కొండ జారిపోతున్నా, తన నిశ్చితాభిప్రాయాన్ని చెప్పటానికికూడా బాపయ్యకి అవకాశం చిక్కలేదు.

ఇదంతా జరిగిన రెండుమూడు రోజులకే కిరీటి తిరిగి ఇంటికొచ్చాడు. భోజనాలూఅవీ అయ్యాక విశ్రాంతిగా కూర్చున్న సమయంలో "వనజప్రధానం ఇవ్వాళేంట" అని తల్లి కృష్ణవేణమ్మ, ఈ వారం పదిరోజుల్లో జరిగిన సంగతులన్నీ ఒక్కొక్కటే చెప్తూ, ఈమాటా చెప్పింది...ఈవార్త వినేసరికి దారిలో ఊహించుకుని వచ్చిన ఊహలన్నీ కూడా చెల్లాచెదరై, విచ్ఛిన్నమైపోయినై. కొంతసేపటివరకూ ఒక్క మాటయినా నోటి వెంబడి వచ్చింది కాదు. కొంతసేపటికి మనస్సు సంబాళించుకుని "నాకు చెప్పలేదేం అమ్మా!" అన్నాడు.

"ఔను, నీ కెలా తెలుస్తుంది? నాకైనా ఇవ్వాళే ఉదయమేగా అన్నయ్య చెప్పింది!" అని తిరిగి తల్లి అనేసరికి కిరీటి ఏమీ అనలేకపోయాడు... ఇక తల్లిని ఏమీ అడగనేలేదు.

ఒక పర్యవసానానికి వచ్చాక, కిరీటి తన ఆంతరంగికంలోని ఆశయాన్ని తల్లి చెవిని వేశాడు. తలిదండ్రులకు ఇంతకుక్రితం తెలియని విషయం కాదది! కిరీటి నోటివెంబడి వినకపోయినా వనజాకిరీటుల అన్యోన్యత వారికి తెలిసిన విషయమే. తెలిసినా సామాన్య దృష్టితోనే ఊరుకున్నారు. ఊరుకున్నా, ఉద్రేకపూరితుడైన కిరీటి వాగ్ధోరణి వినేసరికి తల్లికి ఆశ్చర్యమే కాదు, దుఃఖంకూడా కలిగింది. ఇక బాపయ్యను అడగక తప్పదని భార్యాభర్తలు ముఖముఖాలూ చూచుకుని తమ కర్తవ్యాన్ని కూడబలుక్కున్నారు.

ఆలోచనలతో, ఆత్రతతో ఏమీ పాలుపోక కాలుగాలిన పిల్లి మాదిరిగా కిరీటి తన గదిలో పచార్లు చేస్తున్నాడు.

సరిగ్గా ఇదే సమయంలో అక్కడ వనజ తన గదిలో కూర్చుని పాతపాఠాలు తిరగేస్తూ ఉంది. మధ్య మధ్య పైట చెంగుతో కళ్లు తుడుచుకుంటూనే ఉంది. ఎడతెగని దుఃఖతరంగాలతో మనస్సు కలవరపడుతూ ఉంది.

ఆవాళ సాయంత్రం బండికే తనకు కాబోయే అత్తగారు వస్తుంది! ప్రధానంచేసుకుని వెళ్లిపోతుంది. ఇక తనను చూసి ఫలానావారి కోడలనీ, ఫలానావారి భార్య అనీ చెప్పుకుంటారుగదూ! ఇక, భర్త అనే ఒక మానవవ్యక్తి తనమీద అధికారాన్ని సంపాదిస్తాడు కామోలును! అత్తవారిల్లంటూ ఒకటి ఏర్పడగానే ఇంకెక్కడి స్వగ్రామం? తనకూ తన గ్రామానికీ ఇక ఋణానుబంధం తెగిపోయినట్టేనా!" అన్న ఊహలూ, ఆలోచనలూ ఆమె మనస్సులో తలెత్తుతూ ఉన్నాయ్.

తన భావిజీవితాన్ని ఊహించుకుంటూ ఉంటే గుండె తరుక్కుపోతోంది. తన మనస్సులోని మాట మనస్సులోనే మరుగుపడిపోయింది. అది కాస్తా తనలోనే, తన అంతరాత్మలోనే క్రుంగి, జీర్ణించిపోవాల్సిందే కాని బయటకి పొక్కటానికైనా వీల్లేదు. మాట పెదవిదాటిందా పృథ్వి దాటే మాటే తథ్యం. దాని వల్ల కార్యసానుకూలం అవనీ, అవకపోనీ తానుమాత్రం బ్రతికినంతకాలమూ అభిమానంతో తలెత్తుకు తిరగలేదు. ఆమె ఆశయాలని విని, ఆవేదనను గ్రహించి సానుకూలపరిచేటంతటి ఓర్పు సంఘంలో లేదు. సరి కదా! చివరకు విని సహానుభూతినైనా తెలిపేటంతటి ఉదారమైన వాతావరణంకూడా సంఘంలో లేందే! తాను సిగ్గువిడిచిచెప్పినా, ఏం ప్రయోజనం ఉంది? నిజంగా ఇలాంటి అభిమానవతులకు ప్రేమ ఉభయత్రా చావే! చావుకయినా కాస్తంత కనికరం ఉందేమో ననిపిస్తోంది! ప్రేమను బయట పెట్టినా — అభిమానంతో యావజ్జీవితం నలుగురిలోనూ తలెత్తుకు తిరగలేదు; తనలో మథ్య పెట్టుకున్నా దుర్భర హృదయవేదనతో క్రుళ్లి కృశించిపోవాల్సిందే గదూ? కాని బయటపడి అభిమానంతో తల బ్రద్దలై చచ్చే దానికంటే, మథ్య పెట్టుకునైనా హృదయదౌర్బల్యంతో క్రుళ్లి కృశించిపోటమే ఉచితమేమో?... అన్న తలంపులూ, మనోసంకల్పాలూ పుట్టుకొస్తూనే ఉన్నై. వ్యాకులిత హృదయంతో, నిరాలోచనా సక్తమైన నేత్రాలతో, శూన్యదృక్కులతో ఆకాశం లోకి చూస్తూ కిటికీలోనే కూర్చుండిపోయింది. దూరం నుంచి కట్ట కట్టుకుని, బార్లు తీరి వస్తూన్న కొంగలు, ఎండపొడలో తెల్లగా మెరుస్తూ, దగ్గరకు వస్తూ వస్తూనే, భాసమానమైన కిరణకాంతుల్లో కలిసిపోయి, లేవనిపిస్తూ ఉన్నై.

ఇంటిల్లిపాదీ రంగయ్యగారి భార్య రాకకోసం ఎదురు చూస్తోన్నారు. వనజ తల్లిదండ్రులూ, అన్నగారూ ఉరుకులూ, పరుగులూ తీస్తూ ప్రధానానికన్నీ అమర్చుకుంటూ ఉన్నారు. ఆమె రాకకోసం ఎదురు చూసి చూసి రాఘవమ్మ కళ్ళయితే కాయలే కాచి పోతూ ఉన్నై.

దీపాలుపెట్టే వేళకల్లా రంగయ్యగారి పరివారంలో ముఖ్యులంతా బిలబిలా బండి దిగారు. వనజ ఇంతవరకూ వ్యాకులపడుతోన్నా, ఇక చేయతగ్గది కనబడక, ఎన్నాళ్ళనుంచో తనతో పెంపొందించుకుంటూ వచ్చిన కోరికల నన్నింటినీ, మహదాశయాల నన్నింటినీ అణచుకుని, హృదయంమీద పెద్దబండ పెట్టుకుని, అత్తగారి ఎదుట గాంభీర్యంగా కూర్చుంది.

ప్రధానం యథావిధిగా జరిగిపోయింది.

౬

ఆ మర్నాటి ఉదయాన్నే, రాజబాపయ్య తీరిగ్గా ఉంటూన్న సమయం చూసి, కిరీటి పడుతూన్న మనస్తాపమంతా ఆయనతో ఉద్దండయ్య ఏకరువు పెట్టాడు. వింటూన్నప్పటి బాపయ్య ముఖభంగిమలను ఉద్దండయ్య గ్రహించుకుంటూ, చెప్పవలసిన రీతిగా నచ్చచెప్పాడు. కాని, ఉద్దండయ్య ఎంత దూరాలోచనాపరుడై ప్రసంగిస్తూ ఉన్నా, ఎంత సౌలభ్యతతో సంప్రదిస్తూ ఉన్నా...ఆయన చెప్పుతూన్నదంతా ఒక చెవిలోనుంచి వింటూ రెండో చెవిలోనుంచి వదిలేస్తూ ఉన్నాడు...ఆలోచించి ఆలోచించి చివరకిలా అన్నాడు:

"బావా! ఇవన్నీ నాకు తెలియని విషయాలు కావుగాని, ప్రధానంకూడా అయిపోయిన తర్వాత ఇప్పుడేమనుకుంటే ఏం ప్రయోజనం ఉంది? ఐన ప్రధానాన్ని కాదని ఏ ముఖం పెట్టుకుని వాళ్లతో చెప్పేది?...పైగా — పెద్దమనుష్యులతోటి వ్యవహారం మాయె! ఈ ప్రధానం నెరవేరక ముందైతే, కిరీటి కిష్టం నాకూ సంతోషమైన విషయమే! నాకు మాత్రం మీకంటే ఆప్తులెంకెవరున్నారు బావా!?" అని

స్నేహపూరిత కంఠంతో చెప్తూ చెప్తూ ఒక్కక్షణం ఊరుకున్నాడు. ఉద్దండయ్యకూడా ఏ మనటానికీ పాలుపోక అలానే చూస్తూ ఉండి పోయాడు.

"బావా, ఇన్నాళ్ళయిందిగాని, ఒక్కనాడైనా నీమాటను కాదని త్రోసిపుచ్చిన పాపాన్ని పోయానా? ఇన్నాళ్లకు!...నిజంగా — నీమాటను కాదని చెప్పటానికి నాకు నోరుకూడా రావటం లేదు బావా?" అని ఉద్దండయ్యతో తిరిగి బాపయ్య అన్నాడు. ఇక అంతటితోనే ఆప్రస్తావన ఆగిపోయింది. తన మాటను తప్పక అంగీకరిస్తాడనీ, ఎన్నటికీ ఇలా కాదని త్రోసి చేయడనీ ఉద్దండయ్యకొక గట్టి నమ్మకం ఉండేది. కాని ఈ దఫాతో ఆ నమ్మకంకూడా అడుగంటి పోయింది. అభిమానంతో తల తిరిగినట్లయి, కిరీటిమీద కోపంకూడా వచ్చింది.

ఖచ్చితంగా ముఖంమీద ఇలా తెగేసి చెప్తూ ఉంటే, ఈ ప్రస్తావనిక ఎత్తుకోవటమే సమంజసం కాదని ఉద్దండయ్య ఇక ఆప్రమేయానికే పోదలచుకోలేదు.

ఐతే, ఈ విషయం ఇంకా కృష్ణవేణమ్మ చెవి వరకూ రానేలేదు. మధ్యాహ్నంపూట భోజనాలూ అవీ అయ్యాక తీరిగ్గా ఉన్న సమయంలో ఒకరింటి కొకరు కథూ పోతూ ఉండేవారు. అవాళ కృష్ణవేణమ్మ బాపయ్యగారింటికి వెళ్లింది. మాటల సందర్భంలో "మాడు వదినా!...కిరీటి వనజనే పెళ్లిచేసుకోవాలని ఎంత సంబరపడుతూ ఉన్నాడో?...నువ్వయినా కాస్త అన్నయ్యతో చెప్పరాదూ?" అని శాంతస్వరంతో అంది కృష్ణవేణమ్మ.

"ప్రధానంకూడా అయిన పిల్ల నెలా అడుగుతున్నావ్ వదినా?" అని రాఘవమ్మ అంది.

"ఎప్పటినుంచీ మనం కిరీటికి అనుకుంటున్నాం గనక అడిగాను వదినా, లేకపోతే నేమాత్రం అంటానా చెప్పు?"

"నిజమే. మరి...అయిన ప్రధానాన్ని ఇప్పుడెలా తప్పించటం?...మీ అన్నగారే ఇలా అంటూంటే, ఇంక నే నేం చెప్పేదీ?...నే నీ మాటగనక ఎత్తితే నామీద విరుచుకుపడతారు వదినా!" అని రాఘవమ్మ అంది. వీరి సంభాషణనంతా ప్రక్కగదిలోనుంచి వనజ వింటూనే ఉంది. వనజసఖి శారదకూడా ఆ గదిలోనే ఉంది. శారద వయస్సులో చిన్నదైనా, ఎదుటివారి అంతరంగికాన్ని ఇట్టే గ్రహించుకోగల సూక్ష్మజ్ఞానం ఆమెకుంది. తన మనస్సులో ఎంత ఉంటుందో అంతా బయటపెట్టే స్వభావం శారదది! వీరి మాటలన్నీ వింటూన్న శారద, తన కున్న చనువునంతా ఈ విషయంలో వినియోగపరుచుకుని మాట్లాడకుండా ఉండలేకపోయింది.

"పిన్నిగారూ! మీ రలా అంటే నేనిక చెప్పలేనుగాని, కిరీటి కివ్వాలని మీ కున్నదంటే ఏ పెద్దమనిషీ కాదంటాడూ? చెప్పండి?...మీకు నిజంగా ఇవ్వాలనే ఉద్దేశ్యమేగనక ఉంటే ఈ ప్రధానా లెక్క అడ్డా పిన్నిగారూ?" అని మందహాసం చేస్తూ శారద అంది. దానితో రాఘవమ్మకు ఒళ్లంతా భగ్గున మండి పోయినట్లయింది. కాని, వస్తూన్న ఆవేశాన్ని కాస్త సంబాళించుకుని, "మునుపూ, ముందూ అయిన ప్రధానాల్ని తప్పించుకోవటం మా ఇంటా వంటా లేవు శారదా!" అంది కుపితస్వరంతో.

"మీ ఇంట లేవుగాని, మా ఇల్లొకటే, మీ ఇల్లొకటేనా వదినా?" అని కృష్ణవేణమ్మ అంది. శారద తనలోనే చిన్నవవ్వు నవ్వుకుంది. "పిన్నిగారూ! మీకు కోపం వస్తే నే చెప్పలేనుగాని, పెద్దపెద్ద కట్నాలిచ్చి, పెద్దసంబంధాల్ని తేవాలని తాపత్రయపడటం, అల్లుళ్లు పెద్ద ఉద్యోగాలు చేసి పెద్దగా సంపాదించాలనీ, మనమ్మాయి ధనవంతురాలవాలనీ కోరుకోవటం— ఇవన్నీ ఏ విధంగా చూసినా, చివరకల్లా పిల్ల సుఖ సౌఖ్యాలకే కదూ?" అని రాఘవమ్మకళ్లల్లోకి చూస్తూ అంది.

"ఇందులో కోపం రావటాని కేం ఉందీ?...ఉన్నమాట అంటేగదమ్మా మరి!"

"చివరకు ఇవన్నీ ఉండికూడా ఆత్మకు శాంతన్నదే ఉండకపోవచ్చును. ఆత్మసుఖం ఉండికూడా ఇవన్నీ లేకనూ పోవచ్చు. నిజంగా, వనజా కిరీటుల కున్న ఆంతరంగిక అన్యోన్యతను చూసి మనం సంతోషించాల్సిన పని!...కాని—..."

"ఇప్పుడు వనజకుమాత్రం భోగభాగ్యాల కేం లోటు?...వారూ శ్రీకంటే అనేకరెట్లు ఆస్తిపాస్తు లున్నవారు" అని రాఘవమ్మ తన మనస్సులో అనుకుంది ... ఈ మాటేగనక పైకన్నట్టయితే, "భోగభాగ్యాలు కావు, మన్నా!" అని శారద తప్పక తన లోనూ అనుకునేది.

"చూశారా పిన్నిగారూ!... చిన్నప్పటినుంచీ మీరూ మీరూ వేడుగ్గా అనుకున్న మాటలుకూడా ఈ రసాభాసకు కొంత కారణమే! యుక్తవయస్సు వచ్చి, నవయౌవనంలో ఉన్న మనస్సు అనేక డొంకలు తిరిగి వస్తూన్న సమయంలోకూడా—ఇంట్లో తిరుగుతూన్న మేనత్త మేనమామ బిడ్డల్ని చూసి, వారికిలాంటి సంబంధాల్ని అంటగట్టుతూ ఉంటారు కదూ? కర్మవశాత్తూ అందులో ఏ ఒక్కరికైనా ఆ ప్రాయంలో మమత కల్గవచ్చు! లేదా ఆ ఉభయులకూ ప్రేమబంధం ఏర్పడవచ్చు!...అంతవరకూ బాగానే ఉంటుంది... చివరకు కార్యరంగంలోనికి దూకేసరికి ఈనాడు మీరు చేసినట్లుగా ఏ పరాయివాళ్లో వచ్చి తన్నుకుపోతారు ...గద్ద కోడిపిల్లను ఎత్తుకుపోతోంటటం చూసి, తల్లి రెక్కలల్లార్చుకుంటూ విలపించాల్సిందేగాని ఏం చెయ్యగలదూ?...అలాగే, ఆ ఒక్కరో, లేక ఆ ఉభయులో వ్యాకులంతో క్రుంగిపోవాల్సిందేకదూ?... నేనన్నానని కాదుగాని ... కొంతవరకు మీ రనుకున్న అప్రస్తుత సంభావణల ఫలితమే కాదూ మీకూ మాకూ ఈవివాదాలకు హేతుభూతమైంది? రాఘవమ్మగారూ! మీరు నన్ను కోప్పడినాసరే, ఇంతలోనే నాకేమీ చిన్నతనం రాదుగాని, ప్రేమబంధంతో కలిపి కట్టబడిన వనజాకిరీటి మనస్సులకు ఈ ప్రధానం ఒక అడ్డా పిన్నిగారూ!" అని అవ్యక్తమైన స్వరంతో అంది శారద.

"ఇవన్నీ నాకేం తెలుస్తవి తల్లీ! వారిష్టం!... మధ్య నాకెందుకీ చెడ్డరికం?" అని ఆఖరిమాట అనేసింది రాఘవమ్మ. ఇక అంతటితోనే ఆప్రసంగం కట్టుబడి పోయింది.

ఇవన్నీ ప్రక్కగదిలోంచి వనజ వింటూనే ఉంది. కిరీటిమీద తన కేదో అనిర్వచనీయమైన అధికారం ఉందని అప్పుడప్పుడూ ఆమె గర్విస్తూ ఉండేది! ఏనాడయితే తనను చూడటానికని పరాయివాళ్లను తన తండ్రి ఆహ్వానించాడో, ఆరోజునే ఆమె నెత్తిని పెద్ద పిడుగు పడినట్లయింది. ఇన్నాళ్లనుంచీ తనలో ప్రతిష్ఠించుకుంటూ వచ్చిన సర్వాధికారాన్ని కూడా వదులుకోవలసి వస్తుందని గ్రహించే, ఆమెహృదయం తహతహలాడిపోయింది. అవిరళమైన ఆవేదనతో అల్లాడిపోయింది. ప్రధానం కాస్తాకూడా అయిపోయిన తర్వాత ఆశ నిరాశచేసుకుని, హృదయాన్నొక రాయిగా మార్చుకుని కన్నీరు కార్చుతూనే ఎంతో గంభీరంగా ఒక నిశ్చితాభిప్రాయంతో తిరుగుతూ ఉండేది. కాని ఉద్దండయ్యగారి ప్రయత్నం చెదిరి పడేసరికి కునికిపోతూన్న ఆశాజ్యోతి రెపరెపలాడుతూ తిరిగి తేజోవంతమైంది. ఒక్కొక్కప్పుడు దీపం ఆరిపోయేముందు రెపరెపలాడుతూ ఇలా తేజోవంతమవటం కూడా ఉంది! ఇంతవరకూ ఆశాపూరితమైన మనస్సుతోనే వారి ప్రసంగాన్ని వింటూ కూర్చుంది. చివరకు ఈ ప్రయత్నంకూడా విచ్ఛిన్నమైపోయిందని తెలుసుకునేసరికి కాస్త ఆగిఉన్న హోరు తిరిగి ప్రచండమై వీచసాగింది. దానితో ఆమెఆశాజ్యోతికూడా చప్పున ఆరిపోయింది. ఇక వెలగదు. చమురూ, వత్తీ—అన్నీ ఉన్నై ఆ ప్రమిదలో... కాని, జ్యోతిమాత్రం వ్యర్థమైపోయింది! కిరీటికూడా తనకుమల్లే క్లేశపడుతున్నాడని ఆమె రూఢి పరుచుకునేసరికి కుమిలిపోతోన్న హృదయాగ్నిని తిరిగి రగుల్కొల్పినట్లయింది! హృదయం దహించుకుపోతోంది.

వీరి సంభాషణ వింటూన్నకొద్దీ గతించిన గాథంతా కళ్లకు కట్టినట్లయి, గడచిన దినాల్ని వెదుక్కుంటూ ఆమెమనస్సు పిచ్చిపిచ్చిగా పరుగులు తీస్తోంది. జారుతోన్న అశ్రువుల్ని తలవంచి తుడుచుకుంటూ ఉంటుంటే, తన మెడలో జిగజిగ మెరసి పడుతూన్న రాళ్లగొలుసు — తన అత్తవారు పెట్టింది — ఒక ఉరితాడులాగా కనబడింది. ఆ ఒక్కొక్క రత్నానికీ తేనెతుట్టెల పట్టిక లెన్నయితే ఉంటవో, ఆమెకూ అంతులేని అన్ని ఆలోచనలూ, సంభవాసంభవములైన ప్రశ్నలూ, సమాధానాలూ కలుగుతూనే ఉన్నై.

ఇన్నాళ్లనుంచీ తమ మనస్సుల్లో ప్రతిష్ఠించుకుంటూవచ్చిన అధికారమూ, ఆదరమూ, ప్రేమా — సర్వస్వానికీ ఇక వారు తిలోదకాలు వదులుకోవాల్సిందే గదూ?.........నిస్సందేహంగా అవన్నీ తుడుచుకుపోవాల్సిందే! కారణం?...?...ఇదిగో! కళ్లకు కనబడుతూన్నై ఈనగలే ప్రబలసాక్ష్యం! తమలో పుట్టి, తమలో పెరిగి అంతరంగంలో ఐక్యమైపోయిన ప్రేమకుకూడా ఈమాత్రపు విలువైన బాహ్యసాక్ష్యం లేకనేకదూ తాము ఓడిపోయింది? క్రియారూపంలో కనబడుతూన్నై. ఈ ప్రధానానికి ఇచ్చినంత విలువ, ఉన్నంత చెలామణీ వీరి అంతరంగిక ప్రేమకుకూడా లేకపోయిందే! ఇవేనా లోకలక్ష్యాలు? ఇవేకదూ మన మాధవమ్మకాలా, అత్యాచారలూను?" అని వనజమనస్సు కంపించిపోయింది. మెడలో ఉన్న

ఆ గొలుసు భారమై, గుండెమీద పెద్ద రాయి పెట్టినట్లయి, హృదయాన్నే అణచివేస్తున్నట్టు ఆమె బాధపడుతోంది.

౨

క్రమంగా రెండుమూడు మాసాలిలానే గడచినై. తర్వాత, ఒకరోజు ఉదయాన రాజబాపయ్యగారు కొడుకువివాహం చేసుకుని బ్యాండుసన్నాయీలతో, నౌబత్‌ఖానా, బాకారండోళ్లతో, తాషామర్ఫాలతో వియ్యాలవారి ఊరంతా దద్దరిల్లచేసి క్రొత్తకోడలితోపాటు సుఖంగా తిరిగి తమ ఇంటికి చేరుకున్నారు. ఇక వనజవివాహానికి సరిగ్గా రెండు రోజుల వ్యవధే ఉంది.

తన్ను పెళ్ళికూతుర్ని చేసిన రోజునే ప్రప్రథమ నమస్కారం కిరీటి బావకే చెయ్యటం ఉచితమని వనజ తలచింది. కాని అవకాశం చిక్కలేదు. అందుచేత, వివాహం అయ్యేముందైనా కిరీటిపాదాలమీద పడి ఏడవాలనీ, తనహృదయం విప్పి అనేక సంగతులు చెప్పుకోవాలనీ ఆమె సంకల్పించుకుంది. అందుకని, ఇవ్వాళనే తాను కిరీటిని చూడాలనికూడా స్థిరపరుచుకుంది.

సూర్యాస్తమయమైంది. ప్రొద్దుగుంకినా ఆకాశంపై కేసరువర్ణంమాత్రం విడిచిపెట్టలేదు. అప్పుడే సంధ్యచీకటులు ఇండ్లలో నలుపై పులా ఆవరించుకుంటూన్నై. వనజ దృష్టినిగిడ్చి ఇంట్లో ఎవరైనా తన కెదురుపడతారేమో అన్న అదుర్దాతో అటూ ఇటూ కాస్త నిదానించిచూసింది. ఎవ్వరూ ఎక్కడా కనబడకపోయేటప్పటికి వనజ కిరీటిగదిలోకి నిరాటంకంగా ప్రవేశించింది. కర్మం చాలక ఎవరైనా ఆమె కెదురుపడినా, ఇక ఆమెమాత్రం భయపడదని తత్కాలపు ముఖలక్షణాలనుబట్టి ఇట్టే గ్రహించవచ్చు.

ఆగది నాల్గుమూలలా చీకటినీడ లాడుతూ ఉన్నై. గదిలో ఎక్కడ ఏమున్నదీ సరిగ్గా కనబడటం లేదు. కాని కిటికీప్రక్కగా కుర్చీవేసుకుని మౌనంగా కూర్చునిఉన్న కిరీటిమాత్రం ఆ కనుచీకటిలో కనబడుతూనేఉన్నాడు. షోడశకళాపరిపూర్ణుడై తూర్పు దిక్కున పొడమాపుతోన్న చంద్రునికేసి చూస్తూ, శూన్యదృక్కులతో కిరీటి అలానే ఉండిపోయాడు. వనజ నిశ్శబ్దంగా పోయి కుర్చీ నానుకుని నిలబడింది. అప్పటికీ కిరీటి పరధ్యానంగానే ఉన్నాడు; ఆమె వచ్చినసంగతే తెలియదు. కిరీటి ఇట్లా అన్యమనస్కంగాఉండటం ఆమె ఇదివరకెప్పుడూ చూడలేదు. అతని భుజంమీద చెయ్యేసి, "ఏం బావా! ఇలా చీకట్లో కూర్చున్నారేం?" అని వనజ స్నేహపూరితకంఠంతో అడిగింది.

చప్పున కిరీటి వెనక్కి తిరిగిచూసి, "ఎవరూ! వనజా!" అన్నాడు.

"ఆఁ, నేనే బావా!"

కిరీటి మొదట చకితుడైపోయి, వనజముఖంలోకి చూశాడు. అతనికి ఆశ్చర్యంలో ఆశ్చర్యం కలిగింది.

"ఏం ఇలా వచ్చావేం?" అని తొట్రుపడుతోన్న గొంతుతో అడిగాడు.

"చూసిపోదామని—" అని వనజ దృఢస్వరంతో అన్నది.

కిరీటి నిరాలోచనాసక్తమైన దృష్టితో వనజ ముఖంకేసి చూస్తూ ఉండిపోయాడు.

"అలా ఉన్నారేం బావా!" అని వనజ, కిరీటి ముఖలక్షణాలను పరిశీలిస్తూ, వ్యాకులితమానసయై అడిగింది.

"ఏం, ఎలా ఉన్నావ్?......బాగానే ఉన్నావే!" అని లేని ఉత్సాహాన్ని తెచ్చుకుంటూ అన్నాడు. ఆక్షణంలో అతను పడిన అవస్థ చూసి వనజకు నవ్వుకూడా వచ్చింది. "నీమనస్సు నాకు తెలియనిదా బావా! నాదగ్గరేనా నీదాపరికం?" అన్న భావాన్ని వ్యక్తపరుచుకున్న దాచిన్న నవ్వు!

సుధాకరుని అమృతకిరణాలు కిటికీగుండా వనజ ముఖంమీద పడుతూ ఉన్నై. ఆ వెన్నెలవెలుగుల్లో వనజముఖారవిందాన్ని, ప్రకాశవంతమైన ఆకళ్లనూ కళ్లారా చూస్తూ, "ఏం వనజా! ఇలా వచ్చేవేం?" అని మళ్లీ కిరీటి మొదటి ప్రశ్ననే వేశాడు. ఆశోత్తేజత పొంది కళకళలాడే అతని కళ్లల్లోకి వనజ చూడలేకపోయింది. ముగ్ధమానసయై తల వంచుకు నిలబడింది.

కొంతసేపయ్యినతర్వాత "నే నెలా బ్రతికేది బావా?" అని గద్గదస్వరంతో అన్నది. ఈమాటలు కిరీటి చెవిని బడేసరికి అతని కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినై. రక్తప్రసరణ ఒక్కసారిగా నిలిచిపోయినట్లు అతని శరీరమంతా దుర్బలమై, కంపించిపోయింది.

"నీనుంచి దూరమై నే నెలా జీవించేది? దుర్భరమైన ఈ జీవితం ఎలా ముగుస్తుందా అనే సాహసానికి ధైర్యం చాలటం లేదు బావా! ఈమనస్సు నెలా శాంతపరచేది?" అని వనజ రోదనస్వరంతో అంటూనే, కిరీటి పాదాల్ని ఆధారంచేసుకుని క్రింద చదికిలబడింది.

చప్పున వనజ రెండుచేతులూ పట్టుకుని, "ఇదేమిటి వనజా!" అన్నాడు కిరీటి. వనజ కిరీటిపాదాలపై తలపెట్టి "ఆశీర్వదించు బావా! నా మనస్సు చెదిరిపోతోంది" అని ఏడుస్తూ అన్నది.

కిరీటి స్తబ్ధుడై కూర్చుండిపోయాడు.

"నే పరాయిచోటుకు పోతోన్నా. నన్ను మరువకండేం బావా?" అని వనజ అతిదీనంగా ప్రాధేయపడింది.

"ఎంతమాటన్నావు, వనజా!" అన్నట్టు అతని కళ్లు భావాల్ని స్ఫురింపజేసుకున్నై. అంతేగాని నోటితో చెప్పనైనా చెప్పలేకపోయినై.

అలా కొంతసేపు ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. వనజ కనుకొలకులనుంచి కన్నీరు కారుతోంది. ఆమెమనస్సులో ఒక సందేహం క్రొత్తగా స్థావరమేర్పరచుకున్నది. ఈ ఒక్క విషయంమాత్రం తన అంతర్యంలోనుంచి బైటపెట్టలేక, ఉచ్చున చిక్కిన పక్షిలాగా ఆమెమనస్సు గిలగిలా కొట్టుకుంటూన్నది. చివరకు తెగింపుచేసి, ఇలా బైటపడింది:

"ఎలా చూడదలచుకున్నావ్ బావా? ఇక... ఈ దీనురాల్ని...సోదరిగా—" అని చెప్పుతూ చెప్పుతూ పయిటచెంగుతో ముఖాన్ని కప్పుకుని ఏడవసాగింది.

ఆమె అడిగిన ప్రశ్ననూ, ఉద్దేశ్యాన్నీ కూడా కిరీటి గ్రహించుకున్నాడు. ఇవ్వాళా నిన్నా అతను వనజమనస్సుకు అలవాటుపడింది! "సోదరివి ఎలా అవుతావు?" అని కిరీటి అన్నాడు మందహాసం చేస్తూ. కిరీటిమాటల్లో, ఆ గొంతులో ఉన్న ధ్వనినిబట్టి వనజ సగంసగం లీలగా అర్థంచేసుకుని, అప్రతిభురాలై, "అదే!—" అని మెల్లగా అంటూ ఆగిపోయింది.

చాలాసేపటివరకూ కిరీటి ఏమీ మాట్లాడలేదు. తర్వాత వనజముఖంకేసి అట్టే చూస్తూ, "వనజా!" అని శూన్యహృదయంతో పిలిచాడు. అతనేం చెప్పుతాడోగదా అని, తన సమాధానంకోసం నిరీక్షిస్తూ, కిరీటిపాదాల సన్నిధినే వనజ కనిపెట్టుకు కూర్చుంది.

కాని కిరీటి అసీ పసీ లేదు. తిరిగి ఆలోచనలో పడ్డాడు. ముఖమంతా అరచేతిలో ఇముడ్చుకుని, ఒక్క క్షణమాత్రం బాహ్యదృష్టిని ఆపుచేసి, వైవాహిక, సాంఘిక ప్రదేశాలు దాటి, దృష్టిని ఐహికానుషక్త, మానసిక ప్రదేశాలవరకూ పోనిచ్చి తన సమాధానంకోసమని ప్రతీక్షించాడు. తర్వాత చెయ్యితీసుకుని, స్థిరభావంతో వనజముఖంలోకి చూస్తూ, "వనజా! నిన్నూ, గతించిన మనగాథనూ ఎన్నటికీ నే మరచిపోలేను; సోదరిగా భావిస్తారా అని సువ్యక్తిగేమాట ఉందే అది కేవలం అజ్ఞానులై ప్రవర్తించి పశ్చాత్తాప పడిన వారికి చెందిన మాట. అది అప్రస్తుతం. ఇక మనవంటి వారి విషయంలో నే అంటావా?...అది కాగితాల మీద, ఇంకా ఇప్పటిప్పుడు తెరలమీద, ఇంకా కొందరి ప్రగల్భకోటిలోనూ కనిపించి, వినిపించేదే తప్ప మనలాంటి భగ్నహృదయాల్లోమాత్రం కనిపించదు వనజా! నా ఆత్మీకుల అనుభవాన్నించి నేను విన్నదీ, చూసిందీ ఇదే! చివరకు నా స్వానుభవంలో నా మట్టుకు నేను తెలుసుకున్నదికూడా ఇదే!!" అని చెప్పుతూ ఆగిపోయాడు. "అయితే ఇంతకీ మీరేమంటారు?" అన్నట్టు ఉత్సుకతతో వనజ కళ్లు విప్పారినై. శాంతిదృఢస్వరంతో మళ్లీ కిరీటి ఇలా అన్నాడు:

"నువ్వు నన్ను ఏ విధంగానైనా అనుకోగాని, మధురభరితమైన నీ ప్రియవచనాల్నీ, నీ ప్రేమరూపాన్నీ ఎన్నాళ్లనుంచో నా మనస్సులో చిక్కబట్టుకున్నాను. ఇవ్వాళ ప్రేమబంధం తెగినంతమాత్రాన్ని నా హృదయంలో చిరవక్యత పొందిన ప్రేమ ఎలా నశిస్తుంది వనజా! నువ్వు ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా, నా అంతరంగంలో నీ రూపాన్ని ప్రత్యక్షం చేసుకోగలను. చీకట్లోనూ, వెలుగులోనూ, చివరకు గాఢాంధకారంలోనైనాసరే నీ రూపాన్ని ఇట్టే ఊహించుకోగలను. వనజా!...ఇదంతా ఒక్క మాటలో చెప్పాలంటే—నువ్వు నా కెప్పుడూ ఒకే విధంగా కనబడ్డావు. కనబడుతోన్నావు ... ఇకముందుకూడా అంతే! వనజా! నీకిది బాధాహేతువయితే ఇక చెప్పను...నన్ను మన్నించు వనజా! నిజంగా నేను దుర్బలమనస్కుడనని ఎవరైనా అభిప్రాయపడతారేమో! కాని ఈ ఒక్కవిషయంలో మాత్రం నావంటి వాళ్ల మాటకి మారూ ఉంటారనిమాత్రం వారు ముందుగా తెలుసుకోవలసి ఉంటుందని నే కోరతాను."

కిరీటి చెప్పుతూన్నదంతా వింటూ మౌనంగా కూర్చుండిపోయింది వనజ. ఆమెమనస్సులో ఇప్పు

జేయున్నదీ నేను సరిగ్గా చెప్పలేను. అసలు నాకు తెలియనే తెలియదు! కాని ఆమె ముఖభంగిమల్ని బట్టి కిరీటితో ఏకీభవిస్తున్నదేమోనని మాత్రం ఊహిస్తూ ఉన్నాను.

వనజమాత్రం "అంతేనా బావా!" అని గద్గద స్వరంతో అంటూనే, అతని కాళ్లను చుట్టవేసుకుని, అతని ఒడిలో తల ఉంచి పొర్లుకొస్తోన్న దుఃఖతరంగాల్ని గుమ్మరిస్తోంది...

కిరీటి అంతరంగంలో విస్ఫోటకంలాంటి మహత్తరశక్తి ఏదో ప్రవహించి—ఇన్నాళ్లనుంచీ తనలో తమాయించుకుంటూవస్తోన్న దుఃఖభారం పొంగి పొర్లి అశ్రుధారలై వనజ శిరస్సుపైనుంచి పారుతోన్నై. ఎన్నాళ్లనుంచో తనలో పోషించుకుంటూవచ్చిన కోరికలూ, కాంక్షలూ, మహోత్కృష్టమైన సిద్ధాంతాలతో ఆత్మైక్యజత పొందిన కిరీటి హృదయమే క్లేశంతో కరగి, నీరై, కన్నీటి కాల్వలై వనజకురుల్లో చేరుకుపోతూ ఉన్నై.

వనజకూడా ఇదేస్థితిలో అశ్రుధారలతో కిరీటి పాదాలకు పూర్ణాభిషేకం చేస్తోంది! నిజంగా అవి ఆమెలో నిర్మించుకున్న ఊహాహర్మ్యాలూ, సుఖస్వప్నాలూ, మనశ్శాంతులూ — ఒకటేమిటి? సర్వస్వమూ కరిగి కన్నీటికాల్వలై కిరీటి పాదాల మీదనుంచి ప్రవహిస్తూ ఉన్నై.

అలానే చాలాసేపటివరకూ ఇద్దరూకూడా దుఃఖావృత మనస్కులై ఉండిపోయారు. ఎవరైనా తమ స్థితిని అప్పట్లో చూస్తే ఏమనుకుంటారో, ఏం ప్రమాదం వస్తుందో అన్న భయం వారిలో మృగ్యమై పోయిం దాసమయంలో!

తర్వాత కొంతసేపటికి ఈ యోగసమాధినుంచి కిరీటి తెప్పరిల్లి, చూసి, తన ఒడిలో వాలిఉన్న వనజముఖం పైకెత్తి కన్నీటితో తడిసి ముద్దలైన వనజ ముంగురులను చెవిపైకి తప్పిస్తూ "వనజా!" అని ముఖం మీద ముఖం పెట్టి ఎంతో ఆదరంగా పిలిచాడు. కిరీటి అలా రెండుమూడు దఫాలు పిలవగా కొంతసేపటికి ఱెప్పలు విప్పి చూసింది వనజ. ఇంతవరకూ తాను కిరీటిఒళ్లో తలపెట్టుకున్నట్లు తెలుసుకుని సిగ్గుపడింది. చప్పున లేవాలని ప్రయత్నంకూడా చేసింది.

ఇంతలోనే "లే, వనజా! లే! వచ్చికూడా చాలాసేపయింది" అని స్నేహంగా పిలుస్తూ, వనజ బాహుద్వయాన్ని తన రెండు చేతులతో పట్టుకుని లేవనెత్తేసరికి అతని ఆధారంతోనే వనజ పైకి లేచి నిలబడింది. ప్రక్కనే గోడకు చారబడి, చెక్కిళ్ల మీదకు జారుకొస్తోన్న కన్నీటిని తుడుచుకుంటూ మెదలకుండా నిలబడిపోయింది. ఆమె తల, ఒళ్లు, బట్టా కన్నీటితో తడిసి ముద్దలయిపోయినై.

కిరీటి గొంతు సవరించుకుని మళ్ళీ ఇలా చెప్ప సాగాడు: "—ఇవన్నీ ఎంత నిజమైనా ఎవరికి?—పైగా నీకర్తవ్యం అనేది ఒకటున్నదిగా! ఇక నువ్విలా కలవరపడిమాత్రం ప్రయోజనం? అందుకనే... ...నాసుఖానికి అర్పించాలనుకున్న నీ జీవితాన్ని పరులకు సుఖసౌఖ్యాలు చేకూర్చటంలో సమర్పించు వనజా! ప్రేమించి, ప్రేమింపబడిన నీ కిది అసాధ్యమైంది కాదు. సరే!...ఇక నువ్వు వెళ్లిరా! చాలా ఆలస్యంకూడా అయింది" అని కిరీటి లేచబడ్డాడు.

వనజకళ్లు నీటితో నిండిపోయినై. ఆమె ముందుకు వంగి కిరీటిపాదాల్ని తాకబోతోంటే, అతను ముదిత మనస్కుడై, "అదేమిటి వనజా!" అంటూనే తానూ వంగి చప్పున ఆమె రెండుచేతులనూ తన చేతుల్లోకి తీసుకుంటూ, ఆమెశిరస్సును ఓష్ఠాలతో స్పృశిస్తూ, "ఎందుకు ఇంతఆశ్చర్యపడతావు? వెళ్లిరా... నువ్వు అభిమానిని వని నాకు తెలుసు! అదే నిన్ను రక్షిస్తుంది!" అని ఆశీర్వదించాడు.

చీరచెరగుతో కళ్లు ఒత్తుకొని, వెళ్ళొస్తానని కళ్ళతోనే చెప్పి, సుమ్లానవదనంతో వనజ ముందుకు కదిలింది...ఆమె వెళ్ళిపోతోంటే—చీరచెరగు గాలిలో పైకిలేచి, రెపరెపా కొట్టుకొంటూ, పడగవిప్పుకుని పరుగులుతీస్తోన్న నాగుబాములాగా కనబడింది. కిరీటి ఆమెకేసి చూస్తూనే కూర్చుండి పోయాడు.

*　　　*　　　*

భగవంతుని సృష్టిలో ప్రతిజీవికి ఏదో ఒక కొరత ఉంటూనే ఉంటుంది. అది భగవంతుడు చెయ్యాలనే చేసులారా చేస్తోంటాడో, లేక తన కతీతమయే వదిలిపెట్టుతూ ఉంటాడో మరి తెలియదు!

ఆమర్నాటిరాత్రే రంగయ్యగారి జ్యేష్ఠపుత్రునితో వనజవివాహమూకొస్తా యథావిధిగా జరిగింది.

అంపకాలూ అవీ అయేసరికి తెలతెలవారుతోంది. జగన్నాటకానికి రంగస్థలమే ఒక్కమాటుగా పడమటినుంచి తూర్పుకు మార్చబడుతోంది. ఇక

అపూర్వసౌరభశ్వాసలో ఆకాశగంగపైకి ప్రాకరు
డొచ్చే పను గుంటూరా సమీపిస్తోంది. పొట్టకోసం
దెస్సైడే గలపలబారి పోతోన్నారు. పక్షులు కిలకిలా
రావంతో తమతమ గూళ్ల నుంచి ఎగిరిపోతోన్నై.

అలాంటి సమయంలో పెళ్లివారి గంధెన్న బళ్లు పటాటోపంగా తిరుపనుఖం పట్టినై.

తా నిక నిర్వహించాల్సిన వారికర్తవ్యాన్ని గుర్తించి, తన కత్యార్యమైన కర్తవ్యాన్ని ఒక్క మాటుగా నెత్తిని వేసుకుని సవజ తనవాళ్లలో వాదం పెట్టింది. కళ్లల్లో కిరీటి ముఖమే పొంగిట్టింది. పరోక్షంగా ఉండి తనను చూస్తోన్న కిరీటిమీదగా దైవదశాత్తూ అపేక్షింటబడ్డాడు. కలువరేకుల్లాంటి కళ్లు విప్పి ఒకమాటు సవజ కిరీటికేసి చూసింది.

సజనమంతా కంట తడిపెట్టుకుంటూ ఆమెను సాగనంపారు.

కిరీటి కొంతసేపటిదాకా చూస్తూ ఉండిపోయాడు. మన స్సంతా సవజమయమైంది. చివ్వర అతడు తన గదిలోకి చేరుకుని, "పరుపుపై వాలి వహించి అపేక్షితాన్ని సుఖాంతం చేసుకోవాలన్న మాతభాగ్యలక్ష్మీ! నిజంగా—అందుకు నే అర్హుణ్ని కాలేకపోయాను. దగాను గా! సర్వమునా ఆ పెంట మనస్సాంగి నిచ్చి, రక్షించు! అదే నా అజన్మవాంఛ! ...ఇంతకుముందెన్నడూ, ఇంత త్రికరణశుద్ధిగా నిన్ను నే తలచి ఉండలేదు. ఇదిగో! ఇప్పుడే త్రికరణాన్ని ను" అని భగవంతుని సంబోధించి కిరీటి కాసేపు మూతలుపడినై. కనుకొలుకులనుంచి అశ్రుబిందువులు గండస్థలం రాలినై. ఇంతకుముందెన్నడూ ఇంత స్వచ్ఛమైన అశ్రుబిందువులు రాలలేదు! కాసేపటికి కిరీటి మనస్సంతా సవజమయమైంది. మేనాలో కూర్చుని తనకేసి చూచినప్పటి సవజ ముఖబింబము అతని కళ్లలో మెలగసాగింది. కాసేపు సవజ ఏడుస్తూఉన్నట్టూ, మరి కొంతసేపు నవ్వుతూఉన్నట్టూ, "బావా!" అని ఒకసారి పిలిచినట్టూ, ఇంకో సారి కేలపై ఎన్నెన్నో సంగతులు పలికిస్తూ, గానామృతాన్ని ఒలికిస్తూ, ఆమె కళ్లముందే ఈ వైపది......

*"అందరి వినుము గుణు ధ్యానరాగంబున
అతివ నిల్చుకొని పాంథుడ్,
చెందుము దుఃఖము, వచ్చనా, తిరుగను,
చిత్తము జితతో గ్రుంగక్"

అని గీతానందంగా పాడుతూఉన్నట్టూ ఆ పెళ్లోకసంస్వరం అతని కింకా వినబడుతూనే ఉంటుంది.

* శ్రీ రావూరి వెంకటాద్రి అప్పారావు బహద్దూరు గారు తెనిగించిన గీతగోవిందంనుంచి.



బ్రిటిష్‌ప్రభుత్వంవారి క్రొత్త రాజ్యాంగపథకం

❋

[వా. వెం.]

బ్రిటిష్‌వారి అధికారం తొలగి, మనకు స్వరాజ్యం లభించినప్పుడు ఎట్టి విధానాన్ని అనుసరించి మనము మన రాజ్యాంగాన్ని నిర్మాణం చేసుకొనవలె ననువిషయంలో కాంగ్రెసువారికిని, ముస్లింలీగువారికిని రాజీ కుదరకపోవుటచేత బ్రిటన్‌నుండి మన రాజ్యాంగసమస్యలను పరిష్కరించుటకు వచ్చిన మంత్రిత్రయము స్వయముగ ఒక పథకమును తయారుచేసి మే నెల ౧౬ తేదీ ఆపథకమును ప్రకటించిన విషయము అందరూ ఎరిగినదే. ఈ పథకమును పునాదిగ చేసుకొని, దానిపై మన రాజ్యాంగభవనమును నిర్మించుకొనినయెడల మన దేశము అన్నివిధములుగ బాగుపడు నని వారు సూచించియున్నారు. ఎంతవరకు మన మీ పథకమును అనుసరించి వెళ్లవచ్చునో ఇచ్చట కొంత విమర్శింపబడును.

౧. మంత్రిత్రయమువారి తొలిసూచన

ఈ పథకములోని మొదటి సూచన కేపు మొదలు హిమాలయములవరకును, బంగాళాఖాతము మొదలు అరేబియాసముద్రమువరకును వ్యాపించియుండు భరతఖండమంతయు ఒకే ప్రభుత్వమునకు లోబడియుండుట శ్రేయస్కరమనునది. ఇట్టి సూచన వారు చేయవలసిన అగత్యము ఎందుకు ఏర్పడినదో చదువరులకు తెలిసియేయుండును. ౧౯౪౦-వ సం.నుండి జిన్నా నాయకత్వమున ముస్లింలీగువారు భరతఖండాన్ని హిందూస్థానము, పాకిస్థానము అని రెండు స్వతంత్రరాజ్యములుగా విభజించిననేగాని దేశములోని సాంఘికసమస్యలు పరిష్కారముకాజాలవనియు, అట్టి విభజనకై తాము అన్నివిధములనైన కార్యములను చేయ సంసిద్ధులై యున్నట్లు చెప్పుచువచ్చిరి. ఇప్పటికికూడ వారు వారి వాదమును వదలుకొన్నవారు కారు. పూర్తి హక్కుల సహితమైన పాకిస్థానమును స్థాపించుకొనుటయే తమ యుద్దేశమని చెప్పుచునేయున్నారు. వారి వాదము గెలిచిన యెడల నూరు సంవత్సరములుగ ఒకే ప్రభుత్వమునకు లోబడియుండినట్టియు, అనాదిగా చక్రవర్తి క్షేత్రమని ప్రఖ్యాతిగాంచినట్టియు, మన దేశము రెండు ముక్కలై అనేకనష్టములు అనుభవింపవలసిన స్థితిలోనికి వచ్చును. దేశమును రెండు రాజ్యములుగా విభజించుటవలన కలుగు నష్టముల నన్నిటిని మంత్రిత్రయమువారు ఆలోచించి, అట్టి విభజన యుక్తము కాదని తీర్మానించి, భరతఖండమంతయు ఒకే ప్రభుత్వమునకు లోబడిన సమితిగ (Union) నుండవలెనని నిర్ణయించిరి.

౨. పాకిస్థాన్ వాదము

మన రాజ్యాంగభవనానికి ఇది గట్టి పునాది యనుటలో అతిశయోక్తి ఏమియు లేదు. ఈసూచనను మన మెంతమాత్రమును గర్హించకూడదు. కొద్దివారములలో సమావేశముకానున్న రాజ్యాంగనిర్మాణపరిషత్తు ఈ నిర్ణయమును ఆధారముచేసుకొని తక్కిన పనులను పూనుకొనవలెను. ఇట్టి నిర్ణయమును తా మెందుకు చేసినదీ మంత్రిత్రయమువారు వారి పథకమందు వివరించియున్నారు. (౧) హిందువులు, మహమ్మదీయులు రెండు ప్రత్యేకజాతులకు సంబంధించినవారనియు, వేషమందును, భాషయందును, మతమందును, సభ్యత

యందును, ఆచారములందును ఈ రెండుజాతులవారికి సాదృశ్య మేదియు లేదనియు, దేశమంతయు ఒకే ప్రభుత్వమునకు లోబడుట యనిన మహమ్మదీయులు తమకు పరాయివారగు హిందువుల పరిపాలనకు లోబడుట యగుననియు, అందుచేత హిందువులు అధికసంఖ్యాకులుగ నుండు రాష్ట్రములను కలిపి హిందూస్థానరాజ్యముగ స్థాపించి, మహమ్మదీయులు అధికసంఖ్యాకులుగ నుండు రాష్ట్రములను కలిపి మరియొక రాజ్యముగ ఏర్పరచుటయే నిజమైన స్వరాజ్యమనియు పాకిస్థాన్ వాదములోని సారము. ఈ వాదము మిక్కిలి ఆక్షేపణీయమని యనుకొనుట కనేక కారణములున్నవి. ప్రస్తుతపు పంజాబు, సరిహద్దురాష్ట్రము, సింధు, బెలూచిస్థానము, బంగాళము, అస్సాం అను ఆరింటిని కలిపి పాకిస్థానముగ ఏర్పరచుట జిన్నాగారి నిశ్చయము. కాని ఈ రాష్ట్రపు జనములో మొత్తముమీద నూటికి ౪౨ రు మహమ్మదీయేతరు లున్నారు. వారిపై తక్కిన ౫౮ రు మహమ్మదీయులు పరిపాలించుట జరుగును. అధికసంఖ్యాకులగు హిందువులు అల్పసంఖ్యాకులగు మహమ్మదీయులపై పరిపాలించుట న్యాయవిరుద్ధమైనచో, ఆ పాకిస్థానములో అధికసంఖ్యాకులగు మహమ్మదీయులు అందులోని అల్పసంఖ్యాకులగు మహమ్మదీయేతరులను పాలించుటకూడా న్యాయవిరుద్ధమని చెప్పక తప్పదు. విభజనచేసి జనగణన ననుసరించి పైన చెప్పబడిన రాష్ట్రములలో మహమ్మదీయేతరులు నివసించు జిల్లాలన్నిటిని వేరుచేసి, పాకిస్థానమునందు కలుపుటకు బదులు హిందూస్థానములో చేర్చుట న్యాయము. కాని ఈ సూచనను జిన్నా అంగీకరించుట లేదు. ఈ జిల్లాలను వేరుచేసినయెడల తత్ఫలితముగ ఏర్పడు పాకిస్థానము చాల చిన్న రాజ్యమగుననియు, స్వతంత్రముగ నిలబడుటకు కావలసిన వసతులు అందుండవనియు, అందుచేత మహమ్మదీయేతరు లుండు జిల్లాలనుకూడ పాకిస్థానములో చేర్చవలసిన దనియు జిన్నాయొక్క వాదము. అనగా మహమ్మదీయుల కేది న్యాయమో అది మహమ్మదీయేతరులకు న్యాయము కాదని అతని సిద్ధాంతము. కాని ధర్మమందును, న్యాయమందును దృష్టిగలవా రెవ్వరు ఇట్టి సిద్ధాంతమును అంగీకరించజాలరు. (౨) దేశమును హిందూస్థానమనియు, పాకిస్థానమనియు రెండు స్వతంత్రరాజ్యములుగ విభజించినంతమాత్రాన ప్రస్తుతము దేశములో ఏర్పడ్డ సాంఘికసమస్య పరిష్కారము కాజాలదు. అప్పటికికూడ హిందూస్థానమందు ౨ కోట్ల మహమ్మదీయులు అల్పసంఖ్యాకుల వర్గమునకు చేరియుందురు. వారి గతి ఏమి? వారందరిని పాకిస్థానములోనికి తరిమివేయుటయా, పాకిస్థానములోని మహమ్మదీయేతరులను హిందూస్థానములోనికి తరిమివేయుటయా ఆచరణయోగ్యమగు సూచన కాజాలదు. (౩) మహమ్మదీయులు మాత్రమే అధికసంఖ్యాకులుగ నుండు ప్రాంతములను మాత్రము కలిపి పాకిస్థానరాజ్యమును ఏర్పరచినయెడల ఆరాజ్యమునందలి ఆర్థికవసతులు మిక్కిలి అల్పములుగ నుండును. ఆ ప్రాంతములలో లోహములు విస్తారము దొరకవు; పరిశ్రమలను స్థాపించుటకు కావలసిన సదుపాయములు తక్కువ. కరాచీతప్ప గొప్ప రేవుపట్టణము లేనేయుండదు. కలకత్తాలోని జనములో అధికభాగము హిందువులగుటచేత ఆ పట్టణముకూడ హిందూస్థానములో చేరవలసియుండును. ఇట్టి పరిస్థితులలో పాకిస్థానమందలి ప్రజల ఆర్థికస్థితి బాగుపడుట కష్టసాధ్యము. ఇంతేకాక, మహమ్మదీయులుగాని, హిందువులుగాని స్వరాజ్యము కోరుట సామాన్యప్రజల ఆర్థికపరిస్థితులను చక్కబరచుటకుగదా! స్వరాజ్యములో కొందరు ప్రముఖులకు అధికారపదవులు లభించుటయే ప్రధానోద్దేశము కాదుగదా! దారిద్ర్యపిశాచమును వదల్చుకోలేనప్పుడు పాకిస్థానమువలన మహమ్మదీయు లనుభవింపగల సౌఖ్యమేదియు లేదు. (౪) భరతఖండమంతయు ఒకే ప్రభుత్వమునకు లోబడియున్నయెడల పరాయివారినుండి దేశమును రక్షించుకొనుటకు కావలసిన సైన్యము, నౌకాదళము, ఆకాశవిమానములు, ఆయుధములు మొదలగువాటిని సమకూర్చుకొనుట కష్టతరము కాదు. అట్లుగాక దేశము రెండురాజ్యములుగ విభాజితమైనప్పుడు పాకిస్థానపు రక్షణకు కావలసిన సైన్యాదులను సమకూర్చుకొనుట ఆరాజ్యమును పాలించువారికి సాధ్యము కాని పని. ప్రస్తుతము పర్షియా, అఫ్ఘనిస్థానము మొదలైన మహమ్మదీయ రాజ్యములకు ఎట్టి గతి పట్టుచున్నదో ఆగతియే దానికి పట్టును. ఏ రష్యారాజ్యమో దానిని మ్రింగుట తప్పదు. దానిమూలమున

హిందూస్థానమునకు కూడ అధికమైన ప్రమాదము సంభవించును. మన శత్రువులు బ్రిటిషువారి అధికారమును తొలగించుట మాత్రమే కాదు. స్వరాజ్యమును సంపాదించి, దానిని నిలబెట్టుకొనుటయే మన ఆదర్శము. దేశమును విభజించుట ఈ ఆదర్శసిద్ధిని దూరము చేయునటువంటిదే. గనుక ఏదృష్టినిబట్టి చూచినను పాకిస్థాన్ వాదము ఆక్షేపణీయమని గట్టిగ చెప్పవలసి యున్నది. అందుచేత మంత్రివర్గ పథకములోని 'భారతసమితి' సంస్థాపనమును మన మంగీకరించుట శ్రేష్ఠము.

౩. స్వదేశ సంస్థానములు

భారతసమితి సంస్థాపనములో మరియొక విశేషముకూడ నున్నది. ప్రస్తుతము రాజకీయముగా మన దేశము రెండు భాగములుగ విభక్తమై యున్నది. ఒక భాగమును—మద్రాసు, బొంబాయి, బంగాళము మొదలైన రాష్ట్రములతో కూడిన భాగమును—బ్రిటిషువారు ప్రత్యక్షముగను, స్వయముగను పాలించుచున్నారు. మైసూరు, హైదరాబాదు మొదలైన సంస్థానములతో కూడిన భాగమును పరోక్షముగ ఆయా సంస్థానాధీశుల ద్వారా పాలించుచున్నారు. ఇప్పుడు భారతీయులు కోరుచున్న స్వాతంత్ర్యము బ్రిటిషు ఇండియాయొక్క స్వాతంత్ర్యము మాత్రమే కాదు. భారతదేశము మొత్తముయొక్క స్వాతంత్ర్యము మనవారు వాంఛించుచున్నారు. సంస్థానములపై బ్రిటిషువారు పరోక్షముగ చెలాయించు అధికారము తొలగినగాని దేశమునకంతకు సంపూర్ణ స్వాతంత్ర్యము లభించదు. అనగా సంస్థానము లన్నియుకూడ వారి ప్రత్యేకతను వదలుకొని, భారతసమితిలో చేరవలసియున్నది. సంస్థానము లట్లు చేరనిపక్షమున పాకిస్థాన్ మూలమున దేశమున కెన్ని చిక్కులు సంభవించునో అంతకంటె మూడురెట్లు అధికమైన చిక్కులు సంస్థానముల మూలమున సంభవించుట తప్పదు. సంస్థానములను రక్షించుట తమ బాధ్యత యని బ్రిటిషువారు ఊహించి అందుకై వాటియందు బ్రిటిషు సైన్యములను ఉంచినయెడల ఈ సైన్యముల మూలమున రాష్ట్రములతో కూడిన భారతఖండమునకు ప్రమాదము సంభవించక మానదు. అట్లుగాక, తమ బాధ్యత అవసరము లేదని యెంచి బ్రిటిషువారు సంస్థానములనుండికూడ తొలగిపోయినయెడల ఒక్కొక్క సంస్థానము ఒక్కొక్క పాకిస్థానమయి దేశముయొక్క బలహీనతకు, స్వాతంత్ర్య భంగమునకు కారణమగును. మంత్రివర్గమువారు దీనిని గ్రహించియే, బ్రిటిషు పాలనమునందున్న భారతదేశము, స్వదేశ సంస్థానములు కలిసిన భారతసమితి ఒకటి ఉండవలెనని వారి పథకములో నిర్ణయించిరి. సంస్థానములు చేరినను చేరకపోయినను బ్రిటిషు రాష్ట్రములనన్నిటిని కలిపి సమితిని ఏర్పాటుచేయుట సాధనీయము కాదు. సంస్థానములుకూడ ఇందు కలియవలెను. ఇట్టి సమితిని సంస్థాపించుటయే మన రాజ్యాంగ విధానమునకు నిజమయిన పునాది.

౪. సమితియొక్క అధికారము

మంత్రివర్గ పథకములోని రెండవ నిర్ణయము ఇట్లేర్పడిన సమితియొక్క అధికారమునకు సంబంధించినది. ప్రస్తుతము దేశమునంతను పాలించుచుండు కేంద్రప్రభుత్వమునకు ౧౯౩౫ లో చేయబడిన చట్టము ప్రకారము సుమారు ౪౦ శాఖలపై సర్వాధికార మున్నది. గవర్నరు జనరలుయొక్క సమ్మతిని పొంది, రాష్ట్ర ప్రభుత్వములకు చెందని మరికొన్ని శాఖలపైకూడ అధికారమును సంపాదించుటకు వీలుకలదు. ఇట్లు నమోదుచేయబడిన ౪౦ శాఖలు దేశమున కంతకు సంబంధించిన సామాన్య వ్యవహారములు. దేశరక్షణ, విదేశాంగ వ్యవహారములు, చెలామణి, బ్యాంకింగ్, సుంకములు, ఇనుపదారులు, పోస్టు, టెలిగ్రాఫ్, రేడియో, నౌకాదళము మొదలైనవన్నియు వీటిలో చేరియున్నవి. దేశమంతటను ఏ వ్యవహారములు ఒకే విధానము ననుసరించి జరిగిన యెడల ప్రజల యోగక్షేమములు వృద్ధికాగలవో అట్టి వ్యవహారము లన్నియు కేంద్ర ప్రభుత్వముయొక్క అధీనమందుండవలెనను సూత్రమును బట్టి ఈ ౪౦ శాఖల జాబితా తయారుగావింపబడెను. ఇదియే సరియైనమార్గము. సమాఖ్య(Federal)రాజ్యాంగములు గల యునైటెడ్ స్టేట్సు, కనడా, ఆస్ట్రేలియా, సోవియట్ రష్యా మొదలగు రాజ్యములందు కూడ ఈ సిద్ధాంతమే అనుసరించియున్నారు. భారతఖండమంతయు ఒకే ప్రభుత్వమునకు లోబడిన సమితిగ ఏర్పడినంత

మాత్రమున విస్తారార్థ ముండెను. ఆ ప్రభుత్వమునకు ప్రధాన విషయము లన్నిటిపైనను సర్వాధికార మున్నప్పుడే అట్టి సమితి దేశమునకు ఉపకరించును. పేరునకు మాత్రమే ప్రభుత్వమై, అధికారము లేనిది యైన ఇట్టి సమితి ఉన్నను లేకపోయినను ఒకటే.

మంత్రిత్రయ పథకములో నిర్ణయింపబడిన సమితి ప్రభుత్వమునకు (Central Goveroment of the Union) 3 శాఖలపైన మాత్రమే అధికార ముండునదెనట! విదేశ వ్యవహారములు, దేశరక్షణము, రహదారులే ఈ 3 శాఖలు. ఇదిగాక ఈ 3 శాఖల నిర్వహణమునకు అవసరమైన ధనమును సంగ్రహించుటకు కూడ సమితి ప్రభుత్వమున కధికార మున్నది. సుంకములు, రైల్వేలు, బ్యాంకింగు, పోస్టు, టెలిగ్రాఫ్ మొదలైన వ్యవహారములలో దీనికి ఏలాటి అధికారము ఉండదు. దీని అధీనములో లేని సమస్త వ్యవహారముల మీద రాష్ట్రప్రభుత్వములకే అధికారము. ఒక రాష్ట్రమున ఒక విధమైన చెలామణి, మరియొక దానియందు మరియొక విధమైన చెలామణి ఉండవచ్చును. ఒక రాష్ట్రములో మారు రూపాయి మరియొక దానియందు మారకపోవచ్చును. ఒక రాష్ట్రము నుండి మరియొక రాష్ట్రములోనికి పోవు సరకులపై సుంకములు విధింపబడవచ్చును. ఒక రాష్ట్రములోని జనము మరియొక దానిలోనికి వెళ్లు విషయములో అనేక ప్రతిబంధకములు ఏర్పడగలవు. దేశమంతటియొక్క ఆర్థికసౌభాగ్యమును దృష్టిలో ఉంచుకొని, దానికనుకూలమైన శాసనములను కేంద్ర ప్రభుత్వము చేయుటకు వీలుండదు. దేశము అనేక రాజ్యములుగ విచ్ఛిన్నమైనప్పుడు ఎట్టి ప్రమాదము, నష్టము సంభవించునో అట్టి ప్రమాదము, నష్టము అధికారహీనమైన సమితిప్రభుత్వమూలమున తప్పక సంభవింపగలవు. బ్రిటిష్ ప్రభుత్వమువారి పథకములోని లోపములలో ఇదియే ప్రధానమైన లోపము. ఇది తొలగినగాని మనకు నిజమైన స్వరాజ్యము సంప్రాప్తము కాజాలదు. సమితిప్రభుత్వముయొక్క అధికారములను విస్తరింపజేయుటకు రాజ్యాంగనిర్మాణపరిషత్తు అనల్పమైన ప్రయత్నమును చేయవలసియున్నది.

౫. సంకుచితాధికారమునకు కారణము

సర్వాధికారయుతమైన కేంద్రప్రభుత్వమును నూరుసంవత్సరముల క్రిందట భారతఖండములో స్థాపించి, దానివలన కలుగు లాభముల నన్నిటిని అనుభవించిన బ్రిటిష్ ప్రభుత్వమువారు అధికారహీనమైన ప్రభుత్వమును సమితిపై స్థాపింప నిర్ణయించుట ఆశ్చర్యకరమైన విషయము. దీనికి కారణము లేకపోలేదు. అధికారసహితమైన సమితిప్రభుత్వము స్థాపితమగుట జిన్నాకుగాని, ముస్లింలీగునకుగాని ఎంతమాత్రము ఇష్టములేదు. దేశమంతయు ఒకే సమితి యగుటయు, ఒకే ప్రభుత్వమునకు లోబడుటయు వారికి బొత్తిగా ఇష్టములేదుకదా! వారు కోరిన పాకిస్థానమును నిరాకరించుటవలనను వారెంతో అసంతుష్టులైరి. వారిని సంతుష్టిపరచుటకు సమితిప్రభుత్వమునకు అల్పాధికారమును కల్పించుట తప్ప వేరుమార్గము కనిపించలేదు. సమితిప్రభుత్వమునకు అధికమైన అధికార ముండకూడదని జిన్నా వాదించుటకు గల కారణమును సులభముగ గ్రహించవచ్చును. సమితిని పరిపాలించు శాసనసభయందును, కార్యనిర్వాహకశాఖయందును హిందువుల సంఖ్య మహమ్మదీయుల సంఖ్యకంటె అధికముగ నుండును. దేశమందంతట నుండు హిందువుల సంఖ్య మహమ్మదీయుల సంఖ్యకంటె ఎంతకాలము అధికముగ నుండునో అంతకాలమువరకు ఇది తప్పని విషయము. సమితిప్రభుత్వము మనగా హిందూప్రభుత్వమనియే జిన్నాయొక్క మతము. ఈ మతమును మార్చుకొనుట అతనికి సాధ్యముకాని పని. ఇట్టి మతమును వదలనంతవరకు సమితిప్రభుత్వమునకు అధికారము అల్పముగ నుండుటయే శ్రేయస్కరమని అతడు భావింపక తప్పదు. సమితికి చెందని శాఖ లన్నిటిపై రాష్ట్రప్రభుత్వముల కధికార ముండును. కొన్ని రాష్ట్రములందు మహమ్మదీయుల సంఖ్య అధికముగ నుండుటవలన వాటిలో మహమ్మదీయ ప్రభుత్వము లేర్పడగలవు. సమితి ప్రభుత్వముయొక్క అధికారము ఎంత తగ్గినయెడల అంత ఎక్కువగ రాష్ట్రప్రభుత్వముల అధికారము వృద్ధియగును కదా! జిన్నా దృష్టిలో హిందువులు, మహమ్మదీయులు దాయాదులు; వారి మధ్యన దాయాదిపోరు తప్పదు. అధికారమే వారి

పంచుకొనవలసిన దాయము. ఈ పంపకములో హిందువుల వంతు అధికమైనకొలది మహమ్మదీయుల వంతు తగ్గిపోవును. గనుక వారి వంతు అధికము కాకుండ చూచుట మహమ్మదీయుల విధి. సమితి ప్రభుత్వమనిన హిందు ప్రభుత్వమనియు, దాని అధికారము వృద్ధియగుట అనిన హిందువులకు చెందు దాయభాగము వృద్ధియగుట అనియు జిన్నా భ్రమపడుటచేతను, అతనిని అసంతృప్తిపరచుటకు మంత్రిత్రయమునకు ఇష్టము లేకపోవుటచేతను అధికారశూన్యమైన సమితి ప్రభుత్వమును స్థాపించుటకే మన రాజ్యాంగమునకు గట్టి పునాది యని వారు సూచించుట సంభవించెను. కాని ఇది సరియైన సూచన కాదు. రాజ్యాంగ నిర్మాణ పరిషత్తువారు ఈ సూచనను అనుసరించకూడదు. ౧౯౩౫ చట్టము క్రింద ఏట్టి అధికారము కేంద్ర ప్రభుత్వమునకు చెందెనో అట్టి అధికారము రాబోవు సమితి ప్రభుత్వమునకుండునట్లు పరిషత్తువారు రాజ్యాంగ విధానమును సవరణచేయవలసి యున్నది.

దాయవిభాగపు దృష్టితో రాజ్యాంగ సమస్యలను పరిశీలించుట మూలముననే ఇట్టి ప్రమాదములు తప్పవు. అధికారము సంపాదించుటయు, దానిని విస్తరింపజేసుకొనుటయు పరమావధి యని అనుకొనకూడదు. అధికారము సాధనము మాత్రమే. దాని మూలమున సాధించవలసినది ప్రజల యోగక్షేమము. దీనిని సాధించుటలో హిందువులని, మహమ్మదీయులని మతభేదములను పరిగణించుట అసందర్భము. ప్రభుత్వపు దృష్టిలో మానవులందరు సమానులన్న సిద్ధాంతము ఎల్లప్పుడు దృష్టియందుంచవలెను. హిందువులును, మహమ్మదీయులును మతమున మాత్రమేగాక ఒకే తల్లిదండ్రులకు పుట్టిన అన్నదమ్ముల మధ్యన ఎంతో భేదమున్నది. ఒక మనుష్యుని వలె మరియొకడుండడు. కాని ఈ భేదములన్నియు బాహ్యములు. సుఖదుఃఖములు, ఆకలి, దప్పి మొదలగువాటిని కలుగు బాధలు — ఈ విషయములందు అందరూ సమానులే. పుత్రవియోగమువలన మహమ్మదీయునకెంత ఆవేదన కలుగునో అంతటి ఆవేదన హిందువునకు కలుగదా? ఈ స్వభావ సమత్వ దృష్టితో రాజ్యాంగ విషయములను పరిశీలించవలెను.

యుండగా, జిన్నా దీనికి భిన్నముగా ప్రవర్తించుట వలనను, అతనిని తృప్తిపరచుటకు మంత్రిత్రయము కృషిపడుటవలనను, అధికారములేని సమితిప్రభుత్వము ఏర్పడునట్టి ప్రమాదము మనకు సంభవింపనున్నది. దీని నుండి మనము తప్పక తప్పించుకొనవలెను.

౬. లిఖితాధికారము - అలిఖితాధికారము

సమితికి చెందని అధికారము లన్నియు రాష్ట్ర ప్రభుత్వములకును, సంస్థానపు ప్రభుత్వములకును చెందవలెననుట పత్రకములోని ౩-వ సూత్రము. దీనిని రాజ్యాంగ పరిషత్తువారు అంగీకరించవచ్చును. ఇందులో ప్రమాద మెట్టిదియు లేదు. కేంద్రప్రభుత్వమునకు ఏ ఏ అధికారము లొసగబడెనో ఆ అధికారము లన్నియు దానికి సంక్రమించిన తర్వాత తక్కిన అధికారములు రాష్ట్రప్రభుత్వములలో సంక్రమించుట యందు అసలు భేదమియు లేదు. దీనిని గురించి వాద ప్రతివాదములు చేయుట అనావశ్యము. ఒకప్పుడు ఈ విషయమై ఇట్టి వాదము లుండినమాట వాస్తవమే. ఇప్పటికిని దీనిని గురించి వాదములు లేకపోలేదు. ఈ వాదస్వరూపమేదియో కొంచెము తెలుసుకొనుట అవసరము.

సమాఖ్య రాజ్యాంగము లన్నిటిలో రాష్ట్ర ప్రభుత్వములకు కొన్ని విషయములందు స్వాతంత్ర్యమును, సమితి (కేంద్ర) ప్రభుత్వమునకు మరి కొన్ని విషయములందు స్వాతంత్ర్యమును ఉండుట ఒక విశేషము. ఏక (Uoitary) రాజ్యాంగములలో ఇట్లుగాక, రాష్ట్రప్రభుత్వము లన్నియు కేంద్రప్రభుత్వము ననుసరించి నడవలసియుండును; అధికారమంతయు కేంద్రప్రభుత్వ మొక్కదానికే. తనకు గల అధికారములలో ఇష్టము వచ్చినమేరకు రాష్ట్రముల ప్రభుత్వములకు ఇచ్చుటకు కేంద్రప్రభుత్వమునకు హక్కు కలదు. సమాఖ్యరాజ్యాంగములలో ఇట్లు జరుగదు. మూలశాసనము (Fundamental Law) రాజ్యాంగ నిర్మాణశాసనమందే ఏ అధికారములు సమితిప్రభుత్వమునకు చెందినవో, ఏ రాష్ట్ర ప్రభుత్వములకు చెందవలెనో నిర్ణయముండును. ఈ నిర్ణయమును మార్చుటకు సమితిప్రభుత్వమునకు

హక్కు లేదు. ఈ అధికారవిభజనము ఒక్కొక్క సమాఖ్య రాజ్యాంగములో ఒక్కొక్కవిధముగ చేయబడియున్నది. సమితిఅధికారములు ఫలానివి అని లిఖించి, తక్కిన (అలిఖితఅధికారములు, లేక శేషించిన అధికారములు- **Un-enumerated Powers, Residuary powers**) అధికారములు రాష్ట్రములకు చెందినవని చెప్పుట ఒక విధము. రాష్ట్రప్రభుత్వముల అధికారములను రాజ్యాంగ (మూల)శాసనమున లిఖితములుగ జేసి, శేషించిన అలిఖిత అధికారములు సమితిప్రభుత్వమునకు చెందిన వని చెప్పుట మరియొక విధము. సమితిప్రభుత్వముయొక్కయు, రాష్ట్రప్రభుత్వములయొక్కయు అధికారములను లిఖితములజేసి, శేషించిన అలిఖితాధికారములను సమితి ప్రభుత్వమునకో, లేక రాష్ట్రప్రభుత్వములకో సంక్రమించునట్లు చేయుట మరియొక విధము. ఇందులో ఏవిధమును అనుసరించినను అధికారము లన్నిటిని (అ) లిఖితములు, (ఆ) అలిఖితములు, లేక శేషించినవి అని రెండువర్గములక్రింద విభజించుట ప్రతి సమాఖ్యరాజ్యాంగమునకు సహజలక్షణము.

అధికారములు లిఖితములైనయెడల అవి ఏవో కొన్ని విషయములకుమాత్రమే చెందినవి అగును. ఆ విషయములు పదో, ఇరవైయో, ముప్పైయో ఏదో ఒక నిర్ణీతసంఖ్య ననుసరించియుండును. ఏప్రభుత్వముయొక్క అధికారములు ఈవిధముగ లిఖితములగునో ఆప్రభుత్వముయొక్క అధికారము నిర్ణీతసంఖ్యను దాటలేనిది యగుననియు, శేషించిన అలిఖితాధికారములు గల ప్రభుత్వముయొక్క అధికారము విశాలముగ నుండు ననియు, సమితిని బలపరచుకొనదలచినవారు శేషించిన అలిఖితాధికారములను దానికి చెందునట్లు చేయవలె ననియు, రాష్ట్రప్రభుత్వములను బలపరచదలచినవారు అలిఖితాధికారములను వాటివశము చేయవలెననియు ఒకవాద మున్నది. కాని ఈ వాదములో సత్యము లేదు. అధికారముల సంఖ్యనుబట్టి ప్రభుత్వముల బలాబలములు నిర్ణీతములగునుగాని అలిఖితాధికారములనుబట్టి కాదు. ఇది కొంత క్లిష్టవిషయము. పూర్తిగ విమర్శించుట కిచ్చట అవకాశము చాలదు. కాని పైన ఉదహరించిన వాదములో సత్యమున్నదను భ్రమ మన నాయకు లనేకులలో నంకురించు కారణముచేత, సమితి ప్రభుత్వము బలవత్తరముగ నుండవలె నని సామాన్యముగ వాదించుట హిందూనాయకుల స్వభావ మగుటచేతను, రాష్ట్రప్రభుత్వములు బలవత్తరములుగ నుండవలెనని మహమ్మదీయనాయకులు వాదించుచుండుట చేతను హిందూనాయకులు శేషించిన అలిఖితాధికారములు సమితి ప్రభుత్వమునకు చెందవలెననియు, మహమ్మదీయనాయకు లవి రాష్ట్రప్రభుత్వములకు చెందవలె ననియు వాదించుట మామూలయ్యెను. లిఖితాధికారములు విశాలములైనపుడు శేషించు అధికారము స్వల్పముగ నుండుటచే ఈ అధికారము ఏప్రభుత్వమునకు సంబంధించినను ఇబ్బందిలేదు. ఏప్రభుత్వముయొక్క అధికారము అధికముగ నుండవలె నని మనము ఉద్దేశించుచున్నామో ఆ ప్రభుత్వముయొక్క అధికారములను లిఖితప్రాయముగ ఉదహరించి మన యుద్దేశమును కొనసాగించు కొనవచ్చును.

భరతఖండ పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వమునకు మంత్రిత్రయ పథకములో సూచింపబడిన ౪ అధికారములే కాకుండా మరి కొన్ని అధికారము లుండుట అవశ్యకము. ఆ అధికారములను లిఖితములజేసి మన ఉద్దేశమును కొనసాగించుకొనవచ్చును. అట్టి సందర్భములో అలిఖితాధికారము ఏ ప్రభుత్వమునకు చెందవలయు ననువిషయము అంత ప్రధానమైనది కాకపోవును. గనుక పథకములోని ౧౫ వ పారాలోని ౩, ౪ క్లాజులలోని సూచనలను మన మంగీకరించుటలో నష్టమేమియు లేదు.

౭. సమితి శాసనసభ

మన ఏర్పరచుకొనబోవు భారతసమితికి ఒక కార్యవర్గము, ఒక శాసనసభ ఉండవలెననుట ౪-వ సూత్రము. రాష్ట్రప్రతినిధులతోను, సంస్థాన ప్రతినిధులతోను ఇది ఏర్పడవలసియున్నది. ఈసూత్రముకూడ అంగీకరించదగినదే. సమితికి చెందిన వ్యవహారములు మూడో నాలుగో అగుటచేతను, ఈకొద్ది వ్యవహారములను పరిష్కరించుటకు ఒక కార్యవర్గము మాత్ర ముండిన చాలు ననియు, ప్రత్యేకశాసనసభ అనవసరమనియు వాదించువారు

కొందరు కలరు. ముఖ్యముగ ప్రస్తుతము ఇట్టి వాదమును ముస్లిములీగువారు, తదభిమానులు చేయుచున్నారు. కాని ఈవాదము సబబైన వాదము కాదు. దేశరక్షణ, విదేశాంగ వ్యవహారములనుగురించి అనేకచట్టములను చేయవలసిన అవసరము లేకపోయినను, రహదారులు, పన్నులు, చెలామణి మొదలగు విషయములను గురించి తరుచుగా క్రొత్తశాసనములను చేయవలసిన అవసరమున్నది. సమితిప్రభుత్వమునకు గల అధికారములు విశాలములు కావలసియున్నవని పైన వాదింపబడియున్నది. ఇవి విశాలములు కానికొలది శాసనసభయొక్క ఆవశ్యకత ఎక్కువగును. కనుక రాజ్యాంగనిర్మాణ పరిషత్తు సమావేశమైనప్పుడు ముస్లింలీగు పక్షముల శాసనసభ అవసరము లేదను తీర్మానమును ప్రవేశపెట్టినయెడల అట్టి తీర్మానమును వీగిపోవునట్లు చేయుటయే కర్తవ్యము. అదిగాక ప్రత్యేకశాసనసభలు లేనియెడల కార్యవర్గములోని మంత్రులు నిరంకుశులగుట తప్పదు.

౮. సంయుక్తనియోజకవర్గములు

ఈ సూత్రవిషయములో గమనించవలసిన విశేషమిది యొకటిమాత్రమే కాదు. శాసనసభ ఏ విధానము ననుసరించి ఏర్పడవలెను? రాష్ట్రములనుండి వచ్చు ప్రతినిధులను ఇప్పటివలె ప్రత్యేక(మత)నియోజకవర్గములద్వారా ఎన్నుకొనవలెనా? లేక ఇతరదేశములన్నిటిలో జరుగుచుండునట్లు సంయుక్తనియోజకవర్గముల ద్వారా ఎన్నుకొనవలెనా? సంస్థానప్రతినిధులు ప్రజలచే ఎన్నుకొనబడవలసినవారా, లేక సంస్థానాధీశులచే నియమింపబడవలసినవారా? ఈవిషయము లన్నిటిని రాజ్యాంగనిర్మాణపరిషత్తు చక్కగ ఆలోచించి విమర్శించి పరిష్కరించవలసియున్నది. ప్రజాప్రభుత్వ సిద్ధాంతముల ననుసరించి మనము మన రాజ్యాంగాన్ని నిర్మాణము చేసుకొనుట మంచిదని బహుజనాభిప్రాయము. ఇందుచేత శాసనసభకు వచ్చు ప్రతినిధులందరు—సంస్థానములనుండి వచ్చువారుకూడ—ప్రజలచే ఎన్నుకొనబడినవారుగ నుండవలెను. నిరంకుశప్రభువులచే నియమింపబడినవారుగ నుండరాదు. నియోజకవర్గములన్నియు ప్రత్యేకములుగాక సంయుక్తములుగ నుండుట ఆవశ్యకము. ఈ విషయములో ప్రత్యేక నియోజక వర్గములు కావలెనని వాదించు ముస్లింలీగువారికిగాని, డాక్టరు అంబేద్కరుయొక్క అనుచరులకుగాని లొంగిపోవుట ప్రమాదకరము. పరిపాలకులు పరిపాలితులచే ఎన్నుకొనబడినవారుగ నుండవలయుననుట ప్రజాస్వామ్య విధానమునకు ప్రాతిపదిక. శాసనసభలలోని మహమ్మదీయ సభ్యులు మహమ్మదీయజనముకొరకు వర్తించు శాసనములు చేయుటయందు మాత్రమే పాల్గొనుట లేదు. భారతీయులందరు లోబడవలసిన శాసనముల చేయుటయందు పాల్గొనుచున్నారు. ఇట్లే హిందూసభ్యులు హిందువులు మాత్రమే లోబడవలసిన శాసనముల నిర్మాణమందేగాక, భారతీయులందరికి అనువర్తించు శాసనముల నిర్మాణమందు పాల్గొనుచున్నారు. ఇట్టి సందర్భములో శాసనసభలోని ప్రతి సభ్యుడు భారతీయులందరితో కూడిన నియోజకవర్గముచే ఎన్నుకొనబడుటయే ధర్మము. అప్పుడుగాని భారతీయులందరిపై అధికారము చెలాయించుటకు అతనికి అర్హత యుండదు. ప్రజాస్వామ్యమునకు సంయుక్త నియోజక వర్గములు ప్రధానాంగము.

దీనియొక్క ప్రాధాన్యము పూర్వముకంటె ప్రస్తుతము మరింత అధికమని ఈ విషయము పథకములోని ౧౯-వ సూత్రమునుబట్టి స్పష్టమగుచున్నది. సమితియొక్క శాసనసభలో ప్రవేశపెట్టబడు తీర్మానములలో మత సమస్యలకు చెందిన విషయము లేవైన యున్నప్పుడు అట్టి తీర్మానముల ఆమోదమునకు సభలోని అధికసంఖ్యాకుల ఆమోదమే కాకుండా మహమ్మదీయ ప్రతినిధులలో అధికసంఖ్యాకులయొక్కయు, హిందూ ప్రతినిధులలో అధికసంఖ్యాకులయొక్కయు అంగీకార మవసరమని పథకములోని ౧౯ వ సూత్రము. ఇట్టి సూత్ర మిదివరకు బ్రిటిషువారు అనుసరించి యుండలేదు. అల్పసంఖ్యాకులగు మహమ్మదీయుల మతమునకు అధికసంఖ్యాకులగు హిందువులు ఏదైన ప్రమాదము కలిగింతు రను అనుమాన ముండుటచే ఈ క్రొత్త సూత్రమును వారు సూచించుచున్నారు. కాని ఏది మతసమస్య ఏది కాదు అను విషయమును తేల్చుట చాల కష్టము. ఆహారము, భాష, వేషము, చదువు, కట్టు, వ్యవహారము—ఇవన్నీ కూడా మతసము

స్వత్వాలని వాదించువారు లేకపోలేదు. ప్రాచీనకాలమందు మతమును మానవజీవితమునకు సంబంధించిన రాజకీయ ఆర్థిక సాంఘిక వ్యవహారములనుండి వేరుపరచియుండినది లేదు. ప్రతివిషయమును మతవిషయముగ పరిగణించుచుండినవారు. ఇట్లని ఇప్పుడుకూడ ఈ వ్యవహారములన్నిటికి మతముతో ముడిపెట్టి, వీటికిసంబంధించిన తీర్మానములు మతవిషయక తీర్మానములని ఉపవాదము చేయువారిప్పుడు ఉన్నారు. మత సంస్కరణ విషయమందు వెనుకబడియున్న మహమ్మదీయులలో ఇట్టి అభిప్రాయము మరింత తీవ్రముగ నున్నది. భారత సమితి యందుండుటయే ఇష్టములేని ముస్లిములీగు ప్రతినిధులు సమితిశాసనసభలో ప్రవేశించి, ప్రతివిషయము మత విషయమను ఉపవాదమును లేవదీసి, ప్రతిబంధనలను కల్పింప ప్రయత్నించుచుండుటలో ఆశ్చర్యమేమియు లేదు. ఇట్టి సందర్భములలో సంయుక్తనియోజకవర్గముల ద్వారా ప్రతినిధుల నెన్నుకొను పద్ధతి యున్న యెడల కొంతవరకు ఈ మత దురభిమానము తగ్గుటయు, ప్రతిబంధనలకు ఎక్కువ అవకాశములు లేకుండుటయు సంభవించును. భారతీయు లందరు రాజకీయముగ ఒక్కరే అన్న పునాదిపై రాజ్యాంగభవన నిర్మాణమునకు మనము పూనవలెను.

౯. కార్యవర్గము

సమితిపరిపాలనకు కార్యనిర్వాహకవర్గ మొకటి ఉండవలెనని మాత్రమే మంత్రిత్రయము సూచించిరికాని ఆవర్గము ఎట్లు ఏర్పడవలెనను విషయమును రాజ్యాంగ నిర్మాణపరిషత్తువారు నిర్ణయింపవలసియున్నది. దీనిని గురించి అభిప్రాయభేదము లనేకము లున్నవి. ఇంగ్లండులోని మంత్రుల నియామకపద్ధతిని అభిమానించువారు కొందరున్నారు; అమెరికన్ పద్ధతిని అభిమానించువారు కొందరు; స్విట్జర్లాండుపద్ధతిని ప్రశంసించువారు మరికొందరు. ఈ మూడుపద్ధతుల గుణదోషములను పరిషత్తువారు చక్కగ విమర్శించి, మన పరిస్థితులకు తగిన పద్ధతిని నిర్ణయించవలెను.

౧౦. రాష్ట్రకూటములు

"కార్యవర్గములతోనూ, శాసనసభలతోనూ కలసిన కూటములుగ ఏర్పడుటకు రాష్ట్రములకు స్వాతంత్ర్య ముండవలెను" అనునది మంత్రిత్రయపథకములోని ౬-వ సూత్రము. ఇది యొక క్రొత్తసూత్రము. దీనిని గురించియే కాంగ్రెసునాయకులకును, మంత్రిత్రయమునకును అభిప్రాయభేద మతితీవ్రముగ నున్నది. ముస్లింలీగువారు ఈవిషయమున కాంగ్రెసుతో ఏకీభవించుటలేదు. ఇందులో నున్న కొత్తచిక్కేమిటో, ఎందుకై కాంగ్రెసువారు దీనిని ఆక్షేపించుచున్నారో తెలుసుకొనవలెను.

బ్రిటిష్‌వారు మన దేశమునకు పరిపాలకులైనది మొదలు ఇప్పటివరకు మన పరిపాలనవిధానమున రాష్ట్రములు, కేంద్రము అను రెండు అంతస్తులే ఉంటూ ఉన్నవి. ఇప్పుడు ఈసూత్రము మూలమున ఈ రెంటికిని మధ్య "రాష్ట్రకూటము" అను మరియొక అంతస్తు ఏర్పడుచున్నది. దేశములోని రాష్ట్రముల నన్నిటిని 3 కూటములుగ మంత్రిత్రయమువారు ఏర్పరచిరి. మొదటి కూటమున మద్రాసు, బొంబాయి, సంయుక్తరాష్ట్రము, బీహారు, మధ్యపరగణాలు, ఒరిస్సా అను ౬ రాష్ట్రములు చేరును. ఇవన్నియు హిందువులు అధికసంఖ్యాకులుగను, మహమ్మదీయులు అల్పసంఖ్యాకులుగను ఉండు రాష్ట్రములు. రెండవ కూటమున పంజాబు, సరిహద్దురాష్ట్రము, సింధురాష్ట్రము చేరును. వీటియందు మహమ్మదీయులు అధికసంఖ్యాకులుగను, హిందువులు అల్పసంఖ్యాకులుగను ఉన్నారు. మూడవ కూటమున బెంగాల్, అసాం రాష్ట్రములు చేరును. వీటిలో బెంగాలునందు మహమ్మదీయులు అధికసంఖ్యాకులుగను, అసాంనందు హిందువులు అధికసంఖ్యాకులుగను ఉన్నారు.

రాష్ట్రములను ఈవిధముగ 3 కూటములుగ ఏర్పరచుట అనవసరమైన ఏర్పాటు. కొన్ని వ్యవహారములను పరిష్కరించుటలో రెండుమూడు రాష్ట్రము లెప్పుడైన కలిసి పనిచేయవలసిన ఆవశ్యకము కలుగవచ్చును. తుంగభద్రాప్రాజెక్టు విషయములో మద్రాసు హైదరాబాదులు కలిసి పనిచేయవలసివచ్చెను; కాని ఇంతమాత్రాన, అన్ని విషయములలో ఈ రెండు ప్రాంతములు కలిసియుండవలెనని చెప్పుట అసంగతము. ఇదేవిధముగ ఈమధ్య మాచ్‌ఖండు ప్రాజెక్టు విషయములో ఒరిస్సా మద్రాసు రాష్ట్రములు కలిసి సంప్రతింపవలసివచ్చినంతమాత్రాన ఇతర విషయములలో

కూడ ఇరి తమ ప్రత్యేకతను కోల్పోయి, శాశ్వతముగ కలిసిపోవలయు ననుట అసందర్భము. గనుక ఎప్పుడో, ఎందుకో ఒకవిషయమునకు రెండుమూడు రాష్ట్రములు కలియవలసియుండునని ఈవిధముగ రాష్ట్రకూటముల నిప్పుడే ఏర్పరచుట అనవసరము. ఇది ఈ సూచన విషయమై మొదటి ఆక్షేపణ. రెండవ ఆక్షేపణ ఈ ఏర్పాటు ఐచ్ఛికముగాక నిర్బంధమైనది. ఇష్టమున్న రాష్ట్రములు తమ కిష్టమువచ్చిన కూటములో చేరుటకు బదులు ఇష్టమున్నను లేకపోయినను అవి వాటికిగాను ఏర్పరచబడిన కూటములో చేరవలసియున్నవి. సరిహద్దురాష్ట్రమువారికి పంజాబు, సింధువులతో కలిసి రెండవకూటముండుట బొత్తిగా ఇష్టము లేదు. అసాము వారికి బంగాళమందు కలియుట అంగీకారము కానేకాదు. మదరాసునకు బీహారు సంయుక్త రాష్ట్రములతో కలిసియుండవలసిన అగత్యము లేనేలేదు. ఐచ్ఛికముగ ఏర్పడవలసిన కూటములను నిర్బంధముగ ఏర్పరచుటయే ఈ సూచనకు రెండవ ఆక్షేపణ.

ఇంతకంటె బలవత్తరమైన ఆక్షేపణ మరియొకటి ఉన్నది. ఈ కూటముల ఏర్పాటు పరోక్షముగ పాకిస్థానమును స్థాపించుటగాని మరొకటి కాదు. పాకిస్థానమునకు పునాది మతము. ఒకేమత మనుసరించువారందరు ఒకే స్వాతంత్ర్య రాజ్యముగ ఏర్పడవలెననియు, ఒకమతము ననుసరించినవారు వేరొక మతమును అనుసరించినవారిపై రాజ్యాధికారము వహించ కూడదనియు పాకిస్థాన్ వాదమునకు ఆధారము. మంత్రిత్రయమువా రేర్పరిచిన 3 కూటములకు కూడ నిదియే ఆధారము. దేశమును హిందూస్థానమనియు, పాకిస్థానమనియు ౨ రాజ్యములుగ విభజించుట కిది ప్రాతిపదిక. ౧౯౦౬లో ప్రత్యేక నియోజకవర్గముల నేర్పరచుటచేత కాలక్రమమున హిందూమహమ్మదీయుల మధ్యన ద్వేషభావము అంకురించి వృద్ధియైనట్లు ఇప్పుడు తలపెట్టిన 3 కూటముల మూలమున హిందూస్థాన, పాకిస్థానములు కొంతకాలమునకు సంపూర్ణముగ స్థాపితములై భారత సమితి వినాశమునకు తోడ్పడగలవు. కోట్లకొలది భిన్న మతములవారు నివసించు భరతఖండమున మతమును బట్టి రాజ్యాంగములను నిర్మించుట కంటె అనుచితము వేరొకటి లేదు. గ్రామములందు, పట్టణములందు ఇరుగుపొరుగున భిన్నమతములవా రుంటున్నారు. వారు కలిసి వ్యవహారములను పరిష్కరించుకోవలసిన సందర్భములో ద్వేషించుకొనునట్లు చేయుట అన్యాయము, అధర్మము.

ఇందులో కూడ ఏపాటి న్యాయమును మంత్రిత్రయమువారు అనుసరించియుండలేదు. హిందువులు అధికసంఖ్యాకులుగ నుండు అసాంరాష్ట్రమును బెంగాలులో కలుపుటకంటె అన్యాయము మరియొకటి ఉండదు.

అనవసరమైనట్టియు, నిర్బంధమైనట్టియు, పాకిస్థానమునకు బీజరూపమైనట్టియు, భరతఖండవిభజనకు దారితీయునట్టియు ఈరాష్ట్రకూటముల ఏర్పాటు రద్దు కావలసియున్నది. ఇందువిషయమై రాజ్యాంగనిర్మాణ పరిషత్తులో ముస్లింలీగుప్రతినిధులకును, ఇతరప్రతినిధులకును తీవ్రమైన వాదోపవాదములు తప్పవు. ఫలిత మెట్లుండునో చూడవలసియున్నది.

౧౧. రాజ్యాంగనిర్మాణపరిషత్తు

రాబోవు భారతసమితియొక్క రాజ్యాంగమును నిర్ణయించుటకు ఒక ప్రత్యేకరాజ్యాంగనిర్మాణపరిషత్తు ఏర్పడవలె ననుట మంత్రిత్రయపథకమందలి ౭-వ సూత్రము. ఈపరిషత్తుయొక్క స్వరూపము ఇదివరకు ౧౦,౧౨ సంవత్సరములుగ కాంగ్రెసునాయకులును, ఇతరజాతీయవాదులును కోరుచుండిన స్వరూపము కాదు. దేశములోని ౪౦ కోట్ల వయోజనము ప్రత్యక్షముగనో, పరోక్షముగనో ఎన్నుకొనిన ప్రతినిధులే రాజ్యాంగనిర్మాణపరిషత్తునందు సభ్యులుగ నుండ నర్హులు. ప్రజాస్వామ్యసిద్ధాంతము ననుసరించి రాజ్యాంగమును నిర్మాణముచేయుటకు అట్టిపరిషత్తుకే యోగ్యత కలదు. ఇప్పు డేర్పడబోవు పరిషత్తు అట్టిది కాదు. దీనిని ఎన్నుకొనువారు ప్రజలందరు కారు. ౧౯౩౫ చట్టప్రకారము శాసన సభలను ఎన్నుకొను హక్కు 3 కోట్ల జనమునకుమాత్రమే ఉన్నది. పరిషత్తులోని సభ్యులు ఈ 3 కోట్లయొక్క ప్రతినిధులే కాని, ప్రజలందరియొక్క ప్రతినిధులు కారు. ఇది గాక పరిమితసభ్యుల నెన్నుకొను రాష్ట్రశాసనసభలు ప్రత్యేకనియోజకవర్గములద్వారా ఏర్పడిన శాసనసభలు.

వీరిలో అనేకులయందు తాము మహమ్మదీయు లనియు, క్రైస్తవులనియు భావము ఎక్కువగ నున్నదేగాని భారతీయుల మను భావము తక్కువ. ఇట్టి సంకుచిత భావముతో పరిషత్తుకు వెళ్లువారు దేశసౌభాగ్యమునే పరమలక్ష్యముగ పెట్టుకొని పనిచేయుట ఎట్లు సంభవించును? ఇట్టివారితో కూడుకొనిన పరిషత్తులో సాంఘికసమస్యలనుగురించిన వాదోపవాదములు ప్రబలునేగాని భారతీయులందరికి ఉపచరించగల రాజ్యాంగ నిర్మాణము జరుగుట కష్టసాధ్యము. ఒకే భావముతోను, ఒకే ఆదర్శముతోను పనిచేయగల సభ్యు లున్నప్పుడే రాజ్యాంగనిర్మాణపరిషత్తు సార్థకనామధేయము కలదియగును. మన పరిషత్తున కట్టి లక్షణము లేదు. ఈ కారణముచేత వివిధవిషయములకు ప్రతిష్టంభనలు, సహాయనిరాకరణములు సంభవించుచున్న భయము కలుగుచున్నది. ౧౭౮౯ లో ఫ్రాన్సుదేశమున గొప్ప విప్లవము సంభవించినప్పుడు నిరంకుశప్రభుత్వమును వినాశముగావించి క్రొత్తరాజ్యాంగమును నిర్మించుకొనుటకు పూర్వము ప్రత్యేకవర్గములుగ ఏర్పడి పనిచేయుచున్న శాసనసభలో ఈ ప్రత్యేకవర్గములు రద్దుగావింపబడెను. అప్పుడుగాని జాతీయదృష్టితో రాజ్యాంగము నేర్పరచుట వీలుకాదయ్యెను. ఈదృష్టాంతమును మనము మరవకూడదు.

కొద్దివారములలో సమావేశముకానున్న రాజ్యాంగనిర్మాణపరిషత్తులో మరికొన్ని లోపములుకూడ నున్నవి. ఈ పరిషత్తునకు సర్వస్వామ్యముగాని, సర్వస్వాతంత్ర్యముగాని లేదు. ఇది ఏక్రమమును అనుసరించి పనిచేయవలెనో మంత్రిత్రయమువారే నిర్ణయించియున్నారు. ఆ క్రమమును మార్చుకొనుటకు పరిషత్తున కధికార మున్నదా అను విషయమై సందేహము కలదు. రాష్ట్రములయొక్కయు, రాష్ట్రకూటములయొక్కయు రాజ్యాంగములను నిర్మించుటకు ఈ పరిషత్తున కధికారము లేదు. ఈనిర్మాణమును ఆయాకూటములకు చెందిన పరిషత్సభ్యులుమాత్రమే చేయవలసియున్నది. రాష్ట్రము లన్నిటికి ఏట్టి పరిపాలనవిధాన ముండవలెనో నిర్ణయించు అధికారము పరిషత్తునకున్నగాని అన్నిరాష్ట్రములలో ఒకేవిధమైన రాజ్యాంగ మేర్పడుట దుస్సాధ్యము. కొన్ని రాష్ట్రములలో ప్రత్యేకనియోజకవర్గములు, మరికొన్నిటిలో సంయుక్తనియోజకవర్గములు, కొన్నిటియందు బాధ్యతాయుతప్రభుత్వవిధానము, మరికొన్నిటియందు మరియొకవిధానము ఏర్పడవచ్చును. ఆసాంరాష్ట్రపరిపాలనవిధానమును బెంగాలు రాష్ట్రమువారు నిర్ణయించుటయు, సరిహద్దు సింధురాష్ట్రముల విధానమును పంజాబువారు నిర్ణయించుటయు జరుగును. పరిషత్సభ్యులందరు కలిసి తీర్మానించవలసిన విషయములను ఏ కొద్దిమందో తీర్మానించుట ధర్మవిరుద్ధము. గనుక ఇంతకంటె ఉత్తమమైనట్టియు, సర్వస్వామ్యము కలిగినట్టియు రాజ్యాంగనిర్మాణపరిషత్తు మనకు ఏర్పడినప్పుడే సౌష్ఠవమైన రాజ్యాంగమును మనము నిర్మించుకొనగలవార మగుదుము. అట్టి తరుణము ఇంకను మనకు లభించలే దని చెప్పవలసియున్నది.

౧౩. ఇంగ్లండుఇండియాలమధ్య ఒడంబడిక

పరిషత్తు నిర్మాణముచేసిన రాజ్యాంగ విధానము ననుసరించి ఏర్పడబోవు స్వరాజ్య ప్రభుత్వమునకు సర్వస్వాతంత్ర్య ముండునా యను విషయమై కూడ సందేహ మేర్పడుచున్నది. పరిషత్తునకును, బ్రిటిషు ప్రభుత్వమునకును మధ్య ఒక ఒడంబడిక కుదిరినగాని బ్రిటిషువారు వారి అధికారమును క్రొత్త ప్రభుత్వమువారి పరము చేయరని మంత్రిత్రయ పథకములోని ౨౨ వ పారాలో సూచింపబడియున్నది. ఈ ఒడంబడిక స్వభావ మెట్లుండవలెనో బ్రిటిషువారింకను స్పష్టపరచలేదు. ఈజిప్టుతోను, ఇరాక్‌తోను, ఐర్లాండుతోను ఇంతకు పూర్వము ఇట్టి ఒడంబడికలను బ్రిటిషువారు చేసుకొనియున్నారు. ఈఒడంబడికలు ఆ యా దేశముల స్వాతంత్ర్యమునకు ప్రతిబంధకములుగ ఏర్పడిన వను విషయము ఆదేశముల ఇటీవలి చరిత్రను చదివినవారందరికి తెలిసియున్నది. ౧౯౩౬ లో ఈజిప్టుతో బ్రిటన్ చేసుకొన్న ఒడంబడిక రద్దయినగాని ఈజిప్టునకు నిజమైన స్వాతంత్ర్యము లభించదని ప్రస్తుత మీవిషయమై రాయబారములు జరుగుచున్నవి. గనుక ఒడంబడిక విషయమై పరిషత్తువారు బహుజాగరూకతతో మెలగవలసియున్నది.

ఈ విమర్శవలన మంత్రిత్రయ పథకములోని గుణదోషములు స్పష్టమైనవని నమ్ముచున్నాను.



విమర్శనము

ధర్మదీక్ష

కర్త: ముదివర్తి కొండమాచార్యులు గారు. ప్రకాశకులు: ఎ. వి. నాయుడు అండ్ సన్స్, ట్రంకురోడ్డు, నెల్లూరు. క్రౌను సైజు ౮౮ + ౧౬. వెల ౧-౪-౦.

ఇది తత్త్వప్రబోధముతో గూడిన ఖండ కావ్యము. తమ కవిత్వమును ధర్మదీక్షకె వినియోగించు కొనిన కవులు అరుదుగ నుందురు. ఇది కవిగారి ప్రథమ ప్రయత్నమే యైనను, పరిణతరచనా కౌశలముతో వర్ధిల్లుచున్నది. పాఠకులకు ఆ సంగతి చెప్పినగాని తెల్లము కాని తీరున నున్నది.

పుస్తకము కవరుమీద నున్న బుద్ధునిబొమ్మ లోపలి ముద్రణాదులును, కవిగారి కళామయ హృదయమునే తెలియబరచుచున్నవి.

*　　*　　*

శ్రీ సాయిగురుచరిత్రము

అనువాదకుడు: శ్రీ దోమా వెంకటస్వామిగుప్త గారు. ప్రకాశకులు: ఆల్ ఇండియా సాయిసమాజము, మైలాపూరు, చెన్నపురి. డెమ్మీసైజు, ౬౬ పుటలు. వెల ౧౦ అణాలు.

భక్తిసారామృత, లీలామృత, సంతకథామృతములను గేయగ్రంథములనుండి గ్రహింపబడిన సంకలన గ్రంథమునకు ఇది ఆంధ్రవచనానువాదము. శ్రీ సాయిభక్తులకు ఇది మనోరంజకమైయున్నది.

శ్రీ నిర్వికల్పానందస్వామి,

*　　*　　*

సౌత్ ఇండియన్ జర్నల్ ఆఫ్ ఎకనమిక్స్

మేనేజింగ్ ఎడిటర్ : బారు గోవిందరావు గారు. సంవత్సర చందా : వ్యక్తులకు రు. 8-0-0; సంస్థలకు 10-0-0. కార్యస్థానం గుంటూరు.

రాజకీయములకూ, ఆర్థిక విషయములకూ గల సంబంధం ఇదీ అని ఖచ్చితంగా చెప్పేందుకు సాధ్యం కాదు. రాజకీయవిధానాలు ఆర్థిక అవసరాలనుబట్టి నిర్ణయం కావడంవల్ల రాజకీయాలకంటే ఆర్థికవిషయాలే ప్రధానమౌతూన్నవి. రాజకీయ సమస్యలను అవగాహన చేసుకోవాలంటే అందుకు సంబంధించిన ఆర్థిక విషయాలను తెలుసుకోవాలి. ఇటీవల మన దేశంలోనూ విద్యార్థికు లీవిషయాలను శ్రద్ధతో పరిశీలించుచూ ఉన్నారు. అందులకీ ఆంగ్ల పత్రిక ఉపయోగపడగలదు. సంవత్సరానికి నాలుగుపర్యాయములు (మూడుమాసాల కొకదఫా ఈపత్రికను ప్రచురించుటకు పాలకవర్గంవారు నిర్ణయించారు. ప్రథమ

సంచికలో మాణెక్‌లాల్ కపూర్ గారి 'ట్రూత్ ఎబవుట్ ఇకనమిక్స్' అనే వ్యాసం, హైదరాబాద్ సహకారోద్యమం గురించి ఎ. ఐ. ఖురేషీ వ్యాసం, ప్రజాఋణ సమస్యలను పరిశీలిస్తూన్న జె. కె. మెహతాగారి రచన, రూపాయి విలువను స్థిరపరచడం ఎలాగ-అనే విషయమై కుమారప్పగారి సూచనలు ముఖ్యంగా ఎన్నతగి ఉన్నవి.

దక్షిణాదిన ఉన్న ప్రముఖ అర్థశాస్త్రనిపుణుల సలహాసంఘం సూచనలతో, గోవిందరావుగారి దీక్షతో ఈపత్రిక అభివృద్ధిచెందగల దనుటకు సందేహం లేదు. ఆంగ్లమునకుతోడు తెనుగునను ఈపత్రికను ముద్రించుటకు ఏర్పాట్లుచేసినచో ఇంకా ఎక్కువసేవచేయ వీలగును.

* * *

సుభాష(చంద్ర)బోస్ అంతర్ధాన గాథ

(బోస్ జియా ఉద్దీన్‌గా ఉన్నప్పుడు)

ప్రచురణ: కల్చరల్ బుక్స్ లిమిటెడ్, పెరంబూరు, మద్రాసు. వెల రూపాయిన్నర.

1941 జనవరిలో కలకత్తాలోని స్వగృహంలో ఉన్నట్టేఉండి అమాంతం అంతర్ధానమైపోయిన సుభాష చంద్రబోసు ఆవలిస్తే పేగులు లెక్కపెట్టగల భారత ప్రభుత్వ గూఢచారుల కళ్ళల్లో దుమ్ముచల్లి, మారు వేషంతో, మారుపేరుతో భారతదేశపరిహద్దులు దాటి, ఆఫ్ఘనిస్థానం చేరి, అక్కడి ఇటలీరాయబారి సహాయంతో బర్లిన్ చేరిన వైనం విశదీకరించే గ్రంథం ఇది.

ఆఫ్ఘనిస్థాన్ రాజధానీనగరమైన కాబూలులో వ్యాపారం చేసుకుంటూ, ఆరోజులలో బోసుబాబుకు అక్కడ 48 రోజులు ఆశ్రయమిచ్చి, ఆయన బర్లిన్ ప్రస్థానానికి తోడ్పడిన శ్రీ ఉత్తమచంద్ రచించిన గ్రంథానికి ఈ పుస్తకం తెలుగుసేత.

బోసుబాబు కలకత్తాలో బయలుదేరి బర్లిన్ చేరేవరకూ ఎట్టికష్టాలను, అగచాట్లను అనుభవించారో, ఏ ఏ అడ్డదారులలో నడిచారో, ఎన్ని ఆటంకాలను గడిచారో, అసలు ఆయన ఏ ఉద్దేశంతో దేశం వదిలి

పెట్ట సంకల్పించారో శ్రీ ఉత్తమచంద్ బోసుబాబు మాటలలోనే గ్రంథస్థం చేశారు.

మాతృదేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వాన్నీ త్యాగంచేసిన ధీరుడు సుభాసచంద్రబోస జీవితంలో ఈ ప్రస్థానప్రకరణం నిజంగా ఒక అద్భుత ఘట్టం. ఈ ఘట్టాన్ని గ్రంథస్థంచేసి బోసుబాబు దేశభక్తినీ, ఆయన ధైర్య, సాహస, పరాక్రమాలనూ ఈ తరంవారూ, ముందుతరాలవారూ కూడా గర్వంతో చదివి తెలుసుకోగల అవకాశం కలిగించిన ఉత్తమచంద్ అభినందనార్హుడు.

ఈ తెలుగుపుస్తకంలో అక్కడక్కడ సుభాస చంద్రబోసు ఛాయాచిత్రాలు కూడా పొందుపరుపబడినాయి. ముఖపత్రంమీద హరిపుర కాంగ్రెస్ నాటి బోస్ బాబుబొమ్మ వేసి, దిగువన 'బోస్ జయావృద్ధిస్' గా నున్నప్పుడు, అని అచ్చువేయడం పాఠకులను కొంచెం చిక్కులలో పెడుతుందనుకుంటాము. మొత్తంమీద అందరూ కొని చదవవలసిన పుస్తకం.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., G. T., Madras. Editor—S. Sambhu Prasad.